RNI No. APTEL/2003/12253

# భావవీణ

సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

**Journal of Literary, Culture & Language Study**

Vol : 17 Issue No. 2 Monthly February 2020 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC CARE - Journal
Arts & Humanities
Sl.No. : 35



## యద్దనపూడి సులోచనారాణి




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Literary, Culture & Language Study**

(సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)



Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.



**Vol. 17 - Issue. 2 - February 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# యద్ధనపూడి సులోచనారాణి

తెలుగు నవలా ప్రపంచాన్ని ఐదు దశాబ్దాలపాటు ఏలిన సాహిత్య సామ్రాజ్ఞి యద్ధనపూడి సులోచనారాణి ఆమె నవలా ప్రస్థానం భాగ్యనగరంలో ప్రారంభమైంది. మానవ సంబంధాల్ని, స్త్రీ, పురుష అనుబంధం, మహిళల స్వాభిమానం వంటి అంశాల ఇతివృత్తంగా వినూత్నశైలిలో వచ్చిన యద్ధనపూడి నవలలకు తెలుగునాడు నలుచెరల అశేషాభిమానులు ఉన్నారన్న సంగతి అందరికీ తెలిసిందే.

మధ్యతరగతి అమ్మాయిల ఊహలు, అంతరంగానికి, ఆశలకు, స్వాభిమానానికి యద్ధనపూడి నవలలు అద్దం పడతాయని నాటి పాఠకులు భావించేవారు. గృహిణుల్లోనూ పాఠకాశక్తిని పెంపొందించిన ఘనత ఆమెకే దక్కుతుందని చెప్పవచ్చు.

1957లో హైదరాబాద్‌వాసి అయిన నరసింహరావుతో వివాహానంతరం కృష్ణా జిల్లా నుండి భాగ్యనగరంలోకి అడుగుపెట్టిన సులోచనారాణి నగర జీవితానికి అలవాటుపడటానికి తొలినాళ్లలో కొంత సమయం పట్టింది. తొలినాళ్లలో కథలు రాసిన ఆమె ప్రభాత దర్శక రచయితలైన బాపు రమణలతో పాటు జ్యోతి పత్రిక వ్యవస్థాపకుడైన రాఘవయ్యగారి ప్రోత్సాహంతో నవలా రచనను ప్రారంభించారు. ఆమె రాసిన అన్ని నవలల్లో భాగ్యనగర వీధులు, ట్యాంక్‌బండ్ ఉంటాయి. పబ్లిక్ గార్డెన్స్‌తోపాటు నగరంలోని ప్రముఖ పార్కుల్లో నాయికా, నాయకుల ప్రేమ ఊసులుంటాయి.

మానవ సంబంధాల ఇతివృత్తంగా విభిన్న రచనాశైలితో పాఠకలోకం మనస్సును దోచిన నవలలు సులోచనారాణివి. సులోచనారాణిలో మరోకోణం కూడా దాగుంది. ఆమె వయస్సు మళ్ళిన ఒంటరి మహిళల కోసం 'విన్' పేరుతో వృద్ధాశ్రమాన్ని నెలకొల్పారు. దాదాపు ఏడేళ్లపాడు ఆశ్రమాన్ని నిర్వహించారు కూడా. అనారోగ్య సమస్యలు తలెత్తడం వల్ల తన ఆత్మీయులకు హోమ్ బాధ్యతను అప్పగించారు. అదేవిధంగా వీధిబాలలు, మురికివాడల్లోని పిల్లలకోసం తన ఇంటి ఆవరణలోనే కొద్దిరోజులపాటు ప్రత్యేక పాఠశాలను కూడా నిర్వహించారు. 'పరాశర' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా అనాథ బాలల వసతి గృహాలు, వయోధికుల ఆశ్రమాలకు సరకులతోపాటు ఆర్థికసాయాన్ని అందించేవారు.

గొప్ప రచయిత్రిగా పేరు, ప్రతిష్టలున్న యద్ధనపూడి సులోచనారాణి పత్రికలు, టెలివిజన్‌లకు ఇంటర్వ్యూలు ఇచ్చిన సందర్భాలు చాలా తక్కువ. అందుకు కారణం తనకు మాట్లాడటం పెద్దగా ఇష్టముండదని పలు సందర్భాల్లో ఆమె స్వయంగా వెల్లడించారు. ఆర్భాటాలు, ఆడంబరాలు ఆమె ఎరుగరు. గంభీరంగా పనిచేసుకుపోవడమే ఆమె ప్రవృత్తి. సులోచనారాణి వృత్తి మాత్రం అందమైన, ఆహ్లాదకరమైన రచనలతో పాఠకులను మంత్రముగ్ధులను చేయడమే.

ఆకాశాన్నంటే మధురమైన ఊహలతోసాగే ఆమె నవల ఒకనాటి యువతరాన్ని ఉర్రూతలూగించింది. ఆమె ఏది రాసినా, ఎక్కడ రాసినా అది పాఠకుల్ని పట్టుకొని తనవెంట లాక్కొనిపోవడమే దాని పని. భౌతికంగా ఆమె మనకు దూరమైనా వారి రచనల ద్వారా ఎప్పుడూ పాఠకుల హృదయాలలో చిరస్థాయిగా నిలచిపోతారనటంలో ఎటువంటి సందేహం లేదు.

\- సంపాదకవర్గం

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | శ్రీ లలితా సహస్ర నామ భావ దీపికా వ్యాఖ్య యోగ విశేషాలు | - అవ్వారు అనురాధ | 6 |
| 2. | తెలుగు సాహిత్యంలో - అచ్చ తెలుగు కృతులు | - బానోతు స్వామి | 9 |
| 3. | పి.వి. సునీల్‌కుమార్ "ప్రారంభం" నవల సామాజిక దృక్పథం | - డకర వెంకట రమణ | 14 |
| 4. | "సింగరేణి కథలు - శ్రమ జీవనం" | - బానోత్ వెంకటేశ్వర్లు | 17 |
| 5. | గరిమెళ్ళ సాహిత్యం - సూక్తులు | - డా॥ బూసి వెంకటస్వామి | 19 |
| 6. | సాహితీ లోకంలో దేవులపల్లి రామానుజ రావు | - జె. శంకర్ | 22 |
| 7. | ఆత్రేయ - ఎన్జీవో నాటకంలోని వాస్తవికత | - డా॥ చిలకా అనిత | 25 |
| 8. | మార్గదర్శకమైన మాస్టార్జీ సాహిత్యం | - ముత్తారెడ్డి రాజు | 28 |
| 9. | వ్యక్తి స్వేచ్ఛకు సమాజ శ్రేయస్సుకు అంతస్సూత్ర వారధి 'నీల' | - డా॥ స్వర్ణలత గొట్టిముక్కల | 31 |
| 10. | రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ జీవితం - సాహిత్యం | - డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి | 36 |
| 11. | తెలంగాణ కథా సాహిత్య వైశిష్ట్యం | - జె. లక్ష్మీనర్సయ్య | 41 |
| 12. | జానపదుల వైద్యంలో వంటింటి దినుసులు | - డా॥ పి. జయచంద్రుడు | 44 |
| 13. | పఠాభి పదప్రయోగ వైచిత్రి | - డా॥ పి. విజయకుమార్ | 47 |
| 14. | ప్రపంచీకరణ యుగం - పదునెక్కిన స్త్రీ వాదం | - డా॥ తరపట్ల సత్యనారాయణ | 50 |
| 15. | జాషువ - విప్లవ భావాలు | - డా॥. వి. కృష్ణవేణి | 55 |
| 16. | రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా సాహిత్య సమాలోచన | - జి. శ్రీమతి | 59 |
| 17. | రెండు దశాబ్దాల రాయలసీమ పద్య కవిత్వం (1980-2000) | - కొక్కు నరేష్ | 63 |
| 18. | గురజాడ అప్పారావు - వేశ్యపాత్ర చిత్రణ | - కొండయ్య కోసూరు | 66 |
| 19. | శైవసంబంధిత జాతరలో ప్రతిబింబించే గ్రామీణ సంస్కృతి | - యం. నాగమ్మ | 71 |
| 20. | తెలుగు నేలపై పరిఢవిల్లిన బౌద్ధ సంస్కృతి | - మామిడి మౌనిక | 76 |
| 21. | సుందరకాండము - సహాయక స్త్రీ పాత్రలు | - పి. జయప్ప | 82 |
| 22. | పరీక్షణం - ఒక పరిశీలన | - పోల్కం రాములు | 86 |
| 23. | స్త్రీ హక్కుల వైవిధ్యం - 'ఈ' పత్రికా సాహిత్యం | - ఆచార్య కొలకలూరి మధుజ్యోతి | 92 |
| 24. | టి.జి.ఆర్. ప్రసాద్ గారి కథలు - నామ సార్థకత పరిశీలన | - యస్. రాధిక & - డా. పి. శ్రీనివాసులు | 96 |
| 25. | జనాదరణ కోల్పోతున్న - జానపదుల వైద్యం | - సాలి రాజా | 99 |
| 26. | గిరిజన సంప్రదాయ జాతర - మేడారం | - శెల్కలపెల్లి రాజు | 103 |
| 27. | మానవ జీవితం - కుటుంబ ప్రాధాన్యత | - యస్. స్వరూపరాణి | 108 |
| 28. | ఐతా చంద్రయ్య గారి హాస్యకథలు విశ్లేషణ | - తోట శారద | 110 |
| 29. | "సై సై... జోడెడ్లాబండి" (నాటకం) - ఒక పరిశీలన | - చెంచు రామారావు | 113 |
| 30. | రాణీసంయుక్త - పరిశీలన | - డా॥. పఠాన్ ఖాశిం ఖాన్ | 116 |
| 31. | ప్రపంచీకరణ దుష్ఫలితాలపై ఉద్యమించిన ఉప్పలధడియం | - డి. ప్రమీల | 119 |
| 32. | సహజ సుందర సంబంధాలు కరుణాకర్ కథలు | - జె. రజిత | 122 |
| 33. | సామాజిక సమానత్వాన్ని కాంక్షించిన అక్క మహాదేవి | - డా॥ ఎమ్.ఎమ్. వినోదిని | 125 |
| **34.** | **పాలమూరు సాహిత్య సింధువు** | **- డా॥. మఠపతి మాంతయ్య** | **129** |
| **35.** | Techniques in Reading | - B. Rohini | **132** |

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# శ్రీ లలితా సహస్ర నామ భావ దీపికా వ్యాఖ్య యోగ విశేషాలు

- **అవ్వారు అనురాధ,** పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగము, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము, గుంటూరు.

పరాశక్తి స్వరూపిణి శ్రీ లలితాదేవి. ఈమె భౌతిక రూపం, తత్సౌందర్యం మున్నగు విశేషాలు సహస్ర నామావళిలో 1 నుండి 84 నామాల వరకు వివరించ బడ్డాయి. ఇంతటితో అమ్మవారి వర్ణనం పూర్తి కాలేదు. అమ్మవారి సూక్ష్మ, సూక్ష్మతర, సూక్ష్మతమ రూపాలు న్నాయి. సూక్ష్మరూపం మంత్రమయం. సూక్ష్మతర రూపం యోగమయం. కనుక లలితాదేవీ రూపం భౌతిక రూపం, మంత్రమయ రూపం, యోగమయ రూపం అని త్రివిధాలుగా ఈ స్తోత్రం పేర్కొనింది ..ఉపాసకులు వాళ్ల వాళ్ల స్థాయినిబట్టి, సాధనాబలాన్ని బట్టి ఈ మూడింటిలో ఏ రూపాన్నయినా ఉపాసించవచ్చు. అమృతరూపిణి అయిన జగన్మాతను ఎలా అర్చించినా సిద్ధించేది అమృతమే!

యోగమంటే - కలయిక అనేది స్థూలార్థం. జీవాత్మల కలయిక ఆధ్యాత్మిక దృష్టిలో యోగం. అంతే కాదు పతంజలి మున్నగువాళ్లు యోగమంటే చిత్తవృత్తి నిరోధనం, సమ్యక్ జ్ఞానోపాయం, చిత్తశుద్ధి, ఆత్మానుభవం, ఆరూఢ స్థితి, మనోనాశవాసనాక్షయాలకు అనుకూలమైన పురుష ప్రయత్నం ప్రాణామాయం, జీవాత్మ పరమాత్మల ఐక్యం, సిద్ధియోగాలు మున్నగు అర్థాలు చెప్పారు. ధ్యానము అని కూడా అర్థముంది.

ప్రాణాయామం ద్వారా జీవాత్మను పరమాత్మతో చేర్చి, బ్రహ్మానందాన్ని యోగి అనుభవించే విధానంలో అమ్మవారి యోగ శరీర ప్రకృతిని గూర్చి సాధకుల కోసమై ఈ స్తోత్రంలో చక్కగా వివరించబడింది.

అమ్మవారిని ఉపాసించే మార్గాలు నాల్గు విధాలుగా పెద్దలు సూచించారు. 1) సమయాచారం, 2) కౌలాచారం, 3) దక్షిణాచారం, 4) వామాచారం.

ఇందులో సమయ దక్షిణాచారాలు కొంత దగ్గరగా ఉంటాయి. కౌలవామాచారాలు కొంత దగ్గరగా ఉంటాయి. కౌలుల ఆచారం కౌలాచారం. కులమంటే మూలాధార చక్రం. ఇచ్చటి కుండలినీ శక్తికే ప్రాముఖ్యమిచ్చి పూజించేవాళ్లు కౌలులు. సమయమంటే వైదికమైన అంతర్ముఖ పూజ. హృదయ కమలమధ్యంలో శ్రీ చక్రాన్ని (దేవిని) భావించుకొని, అన్ని ఉపచారాలూ మానసికంగానే అర్చిస్తారు.

**వామదక్షిణాచారాలు :**

వామమంటే తమతమ వర్ణాశ్రమాలచే విధించబడిన అగ్నిహోత్రాది కర్మలు. స్మార్త కర్మలు. మంత్రసిద్ధమైన కర్మలు. వామాచారంలో ఆయా కర్మల్లో ప్రధానంగా అంగాలుగా ఏయే దేవతలుంటారో, ఆయా స్థానాల్లో వాళ్లకు ప్రాముఖ్యం ఇవ్వకుండా, తాను ఉపాసించే దేవతనే అంతటా భావిస్తారు. అంటే ఆయా దేవతల్ని సూచించే పదాలకు పిదప విశేషవాచకంగా (నామ వాచకంగా) అన్ని మంత్రాల్లోనూ తన దేవతా వాచకపదాన్నే ఉంచాలి. వామమార్గంలో భైరవీ, భైరవ దేవతలు ముఖ్యులు. స్త్రీ మంత్ర దేవతలకు ముందు "భైరవీ" అనీ, పురుష వాచక మంత్ర దేవతలకు ముందు "భైరవ" అనీ, చేర్చి భైరవీభైరవులే - ఆయా దేవతలుగా ఉన్నారని భావించాలి.పితృ తర్పణాల్లో కూడా భైరవీభైరవ శబ్దాలు విధిగా ఉంటాయి. ఉదా॥ సూర్యునికి అర్ఘ్యమిచ్చేటప్పుడు 'మార్తాండ భైరవాయ నమః" అని చెప్పాలి. "తృప్యతాం బ్రహ్మ భైరవీః", "తృప్యతాం భైరవీ మాతః", "పితః భైరవః తృప్యతాం" అని చెప్తారు. వీళ్లకు సర్వమూ భైరవియే! భైరవుని వామాంగం (ఎడమ) భైరవి. వామ భావంతో త్రిపురా భైరవినే ఆరాధిస్తారు. గనుక వామాచారులు దక్షిణ మార్గాన్ని (కుడి = పరమేశ్వర మార్గాన్ని) విడిచి, వామ (ఎడమ = భైరవ) మార్గంతో దేవిని ఆరాధించడం వల్ల ఇది వామమార్గమయ్యింది. ఈ మార్గంలో దేవ, ఋషి,

పితృ ఋణ విముక్తి లేకుండడం వల్ల పాతకం కల్గుతుంది. ఇది తాంత్రిక విధానం. ఈ మార్గంలో మోక్షం ఆలస్యం! ఋణవిముక్తి లేనందున మోక్షానికి ప్రతిబంధకం ఏర్పడుతుంది. ఇందులో భౌతికమైన భోగాలపై ఆశ ఎక్కువ. పంచ యజ్ఞాలు ఇందు ఐచ్ఛికం (చేసినా, చేయకపోయినా ఒక్కటే) ఈ ఆచారుడు ప్రతి పనిలో తన్ను త్రిపురా భైరవిగానే భావించుకొంటాడు. తాను చేసేవన్నీ త్రిపురా భైరవియే చేస్తూందని భావిస్తాడు. కనుక స్త్రీకామసుఖాలు, స్వేచ్ఛా ప్రవర్తన, భూతప్రేత పిశాచాది వశీకరణ విద్యలు మున్నగునవి అవలంబిస్తాడు. ఇహంలో స్వేచ్ఛా భోగాలన్నీ అనుభవించి, సర్వమూ దేవియే అనే భావం ఉన్నందున అంత్యంలో ఆలస్యంగా ముక్తి పొందుతాడు. దీన్నే "భైరవీ మార్గ"మంటారు.

ఈ మార్గంలో శాస్త్ర విహిత కర్మానుష్ఠానం అప్రధానం. కనుకనే పెద్దలు వామమార్గాన్ని నిరసించారు.

### దక్షిణ మార్గం :

ఇది పూర్తిగా వేదోక్తం. శాస్త్రీయం. ఋషుల్నీ, దేవతల్నీ, పితృ దేవతల్నీ, మనుష్యుల్నీ, జీవ రాశినీ పంచ యజ్ఞాల చేతనూ, స్నానదానాదులచేతనూ ఋణ విముక్తికై శాస్త్రం ప్రకారం రహస్యంగా పూజించే విధానం ఇది. ఇందులో సర్వ దేవతా భక్తి సమన్వయం ఉంటుంది. తాను ఉపాసించే దేవతకు ఇతర దేవతలు అంగాలుగా ఉన్నారని భావిస్తారు. సకల కర్మలూ, మంత్రాలూ మొదలైనవన్నీ ప్రధాన కర్మ మంత్రాదులకు అంగాలు. ఇందులో మోక్ష ప్రతిబంధకత్వం లేదు. మోక్షప్రాప్తిలో ఆలస్యం లేదు. స్వేచ్ఛా స్త్రీ కామభోగాలుండవు. సచ్ఛీలత ఉంటుంది. తాంత్రిక విధానాలుండవు. ఋణత్రయ పాపం ఉండదు. ఇందులో ఆయా కర్మాదుల్లో వాటివాటి దేవతలకు ప్రాధాన్యం ఉంటుంది. ఇది శీఘ్ర మోక్షప్రదం. ఐహికి భోగాపేక్ష శాస్త్రం విధించిన హద్దులోనే ఉంటుంది. వీరి దృష్టి మోక్ష ధనం పైననే! ఇందు ఆరాధ్యలు - శారదాది దేవతలు. ఇందలి కర్మలన్నీ పుణ్యమయాలు. వామ పూజకు విరుద్ధమైంది కనుక (వామ = ఎడమ, దక్షిణ = కుడి) దీన్ని 'దక్షిణాచార' మన్నారు.

అమ్మవారిని 'దక్షిణాదక్షిణారాధ్యా" అని (923) ఒక నామంతో నుతించడం జరిగింది. దక్షిణ + ఆరాధ్యా = పండితులతో, పామరులతో ఆరాధించబడేది. దక్షిణ (వేద) మార్గంచేకానీ, అదక్షిణ = వామమార్గంచే కానీ ఆరాధించబడేది. సృష్టిస్థితిలయాదులకు నిమిత్త ఉపాదానం కావడం వల్ల 'దక్షిణ'. గోలోక నివాసినియైన 'సుశీలా' అనే పేరుగల దక్షిణాదేవి రాధాదేవి వల్ల శాపగ్రస్తురాలై, లక్ష్మీ దేవీ శరీరంలో చేరి, లోకంలో అదృశ్యురాలయింది. దక్షిణారాధనం లేని యజ్ఞాలు ఫలవంతాలు కావు. (హతో యజ్ఞస్త్వదక్షిణః) కనుక దేవతలు ఈ విషయాన్ని బ్రహ్మదేవునికి విన్నవించారు. అతడు దక్షిణాదేవి లక్ష్మీ దేవీ శరీరంలో ఉండడం తెలుసుకొని, ఆమెను తెచ్చి, దేవతలకు అర్పించాడు. యజ్ఞపురుషుడు ఆమెను అర్చించి, ఆమెతో కూడి ఉంటాడు. పిదప యజ్ఞాలు యథావిధిగా జరిగాయి. ఇట్టి దక్షిణాదేవీ స్వరూపిణి అమ్మవారే! కనుక దక్షిణలతో, దక్షులైన పండితుల్తో, యజమానుల్తో ఆరాధించబడేది అనీ అర్థం.

యజ్ఞాలలో ఋత్విక్కులకు సమర్పించే దక్షిణ కేవలం ధనాదికంకాక అది సాక్షాత్పరదేవతా స్వరూపమైన యజ్ఞ ఫల రూపం! దేనివల్ల దేవతాప్రాప్తి అవుతుందో అట్టి ముఖ్య సాధనం అయిందంతా దక్షిణయే! చతుర్విధ పురుషార్థాలూ దక్షిణయే! యజ్ఞ పురుషునికి దక్షిణాదేవి పత్ని. జ్ఞాన యజ్ఞంలో మతియే దక్షిణ. దక్షిణ ఇవ్వడం వల్లనే పరమేశ్వరీ ఆరాధనం పరిసమాప్తం అవుతుంది. యాగ సంపూర్ణ ఫలప్రాప్తికి దక్షిణ ఇవ్వడం ప్రముఖకృత్యం ఋత్విక్కులు సంతోషించడం వల్ల అమ్మవారు సంతోషిస్తుంది. దక్షిణదేవి తాంబూలం దేవతలకు గానీ పురోహితులకు కానీ, గురువులకు కానీ అర్పించరాదు.

దక్షిణ కుడి, అదక్షిణ = ఎడమ - కాగా ఇడా పింగళా నాడుల సంచారాత్మకమైన కుండలినీ శక్తి రూపంతో యోగులచే ఆరాధింపబడుతుంది కనుక 'దక్షిణాదక్షిణా

రాధ్యా'! పెద్ద, చిన్న అనే భేదం లేకుండా అమ్మను అందరూ ఆరాధించి, తరించవచ్చు. అమ్మ సర్వారాధ్య కదా!

ఇలా 'దక్షిణాచారం' అనే మాటలో ఇన్ని విశేషార్థాలు న్నాయి. కనుక అమ్మవారి పూజలో దక్షిణాచార మార్గమే శ్రేయస్కరం!

వామాచారులు బాహ్య పూజకు ప్రాముఖ్యమిస్తారు. మద్యమాంసాదులు నివేదిస్తారు. భక్తితో ఏమిచ్చినా దేవి స్వీకరిస్తుంది కదా! పరాశక్తి అగ్ని రూపిణి. అగ్నిలో ఏది అర్పించినా అది తన నామ రూపాలు కోల్పోయి - భస్మంగానే మార్తుంది. అట్లే అమ్మవారి పూజలో భక్తితో ఏ మార్గాచారాలు, ఏమి అర్పించి, ఎలా పూజించినా అమ్మవారు నిత్యశుద్ధయై స్వీకరిస్తుంది. పూజకుల్లో లోపాలుండవచ్చుగానీ, దేవిలో లోపాలుండవు. అందుకే నేటికీ ఈ వామాచార పూజ చాలాచోట్ల ఆచారంలో ఉంది.

సమయాచారులు పూర్తిగా వైదికమైన మానసిక పూజా పరులు. అంటే అంతర్ముఖ సమారాధ్యులు. ఇందులో దీక్ష, శ్రద్ధ, ఏకాగ్రత ముఖ్యం. శరీరమందలి మూలా ధారాది షట్చక్రాలతోడి శ్రీ చక్ర రూప సమన్వయం ఇందలి లక్ష్యం. మంత్రానికీ, మంత్ర దేవతకూ, దేవతకూ, ఉపా సకునికీ చక్కని ఏకత్వ భావనాసిద్ధి - ఇందలి ముఖ్యాంశం. ఇందులో మధ్య మాంసాది నివేదన ఉం డదు. ఇందు పూర్ణ దీక్షలో చిట్టచివరకు మనలోని కుండలినీ శక్తిని సహస్రారంలో ఉండే పరమ శివునితో చేర్చి, అటు నుండి మరలా మూలాధారానికి చేరే సమయం దాకా నిరీక్షించడం ఉంటుంది. కనుక సమ యాచారం ఇది అంతుర్ముఖారాధనం.

ఇట్టి అంతర్ముఖమైన ఆరాధనలో అమ్మవారికి మక్కువ ఎక్కువ. షట్చక్రాలలో దేవిని మానసికమైన ఉపచారాల్తో పూజించి, సహస్రారం చేర్చి ఆనందించడం ఇక్కడి విశేషం. అమ్మవారు 'అంతర్ముఖసమారాధ్యా, బహిర్ముఖసుదుర్లభా'' (870, 871 నామాలు).

అమ్మవారు ఆత్మాభిముఖులైన చిత్తవృత్తి గల వారిచే ఆరాధింపదగింది. ఇంద్రియాల్ని బహిర్ముఖాలు గావించి, ఆరాధించే వాళ్లకు బాహ్యరూపం గోచరిస్తుందే కానీ, అసలైన ఆత్మ స్వరూపం గోచరించదు. అమ్మ పరమాత్మక కనుక అమ్మను ఆత్మతోనే ఆరాధించి, సాక్షాత్కరించు కోవాలి. అంతర్ముఖులైన వాళ్లు నిరంతరం జగన్మాత సమీపంలోనే ఉంటారు. ఆత్మకూ, ఆరాధించే దేవతకూ, ఏకత్వాన్ని భావించు, సత్త్వగుణ ప్రధానంగా మిక్కిలి శ్రద్ధతో, నిష్ఠాబుద్ధితో తమ యందే ఉపచారాలన్నీ - జ్ఞానరూపాలై, ఆధ్యాత్మిక భావనతో తనలోనే ఆత్మేశ్వరిని ధ్యానిస్తూ తనకు సంబంధించిన సుగుణ గుణ భావాల్తో, షట్చక్రాల్తో కూడిన నాడీ మండలాన్ని సమన్వయపరుస్తూ, ఉద్వేగం లేకుండా, మిక్కిలి ప్రశాంతంగా జరిగే ఆరాధనా రూపంలో అంతర్భవిస్తుంది. కాగా చిత్తవృత్తిని అమ్మవారి వైపు మళ్లించి, ఆరాధించడం - అంతర్ముఖ సమారాధనం. ఇది మనో భావనా రూపమైన ఆరాధన, ఇందులో బాహ్య వస్తువులుండవు.

ఎంతకాలం బహిర్ముఖారాధనం చేసినా ఏదో ఒక నాటికి ఈ అంతుర్ముఖ సమారాధనా స్థితికి చేరినపుడే సాధన సంపూర్ణ ఫలవంతం అవుతుంది.

అంతర్ముఖత్వం సిద్ధించినా బాహ్య పూజ మాత్రం మానరాదు. శ్రీ శంకర రామకృష్ణాదులు అంతర్ముఖ సిద్ధులైనా బహిర్ముఖ పూజను మానలేదు కదా!

అమ్మవారు సమయాచార తత్పర. ప్రాణశక్తిని మూలాధారం నుండి సహస్రారాన్నీ, మరల సహస్రా రాన్నుండి మూలాధారాన్నీ చేర్చే యోగం - సమయాచారం. ఇది అంతర్ముఖారాధనం.

వేదోక్త మార్గంలో వర్ణాశ్రమాచార ధర్మనిష్ఠులై అమ్మను ఆరాధించడం కూడా సమయాచారమే! అమ్మవేద మాత, వేద రూప, వేదాంతవేద్య, వేద మార్గ తత్పర కనుక సమయాచార మంటే ఆమెకు విశేష ప్రీతి.

ఈ విశ్లేషణను బట్టి సమయాచారంలో - వేదోక్త విధాన పూజ, అంతర్ముఖమైన యోగనిష్ఠాషట్చక్రాదికమైన పూజ అనే రెండు విధాలూ ఉన్నాయి.

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# తెలుగు సాహిత్యంలో - అచ్చ తెలుగు కృతులు

- **బానోతు స్వామి,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయము, వరంగల్, తెలంగాణ.

పాల్కురికి సోమన "వృషాధిపశతకం"లో "బలుపోడ తోలుగ చీరయును".. అనే పద్యాన్ని పరిశీలిస్తే, సోమన, 'బసవపురాణం'లో, నన్నె చోడుడు కుమార సంభవంలో జానుతెనుగుకు, ఈ పద్యంలోని భాషను మనం అచ్చ తెలునుగనవచ్చు. మూలఘటిక కేతన 'అచ్చ తెలుగు' అనే పదాన్ని సృష్టించాడు. అల్లసాని పెద్దన తెలుగు సంస్కృత కవితా రీతులను 32 పాదాల ఉత్పల మాలికలో 16 పాదాలు అచ్చ తెలుగు కవితా ధర్మాలను వివరిస్తాయి. ఈ ఉత్పల మాలికను చూచే అడిదం సూర కవి "కవి జనరంజనము'లో పై కవితా ధర్మాలనే చెప్పాడు. తెలుగు భాషకు తొలి వ్యాకరణ గ్రంథంగా పేర్కొనబడిన "ఆంధ్ర భాషా భూషణం'లో కేతన తెలుగు భాషా పదాలను తత్సమము, తబ్భవము, అచ్చ తెలుగు దేశ్యము, గ్రామ్యము అని అయిదు భాగాలుగా వర్గీకరించాడు. దేశ్యాన్ని 'దేశీ తెనుగులు దేశ్యంపు తెనుగులు' అని రెండుగా విభజించి ఉదాహరణో వివరించాడు.

కేతన మార్తన్నే అనుసరించిన విన్నకోట పెద్దన 'కావ్యాలంకార చూడమణి' లో తెలుగు మాటలను తత్స మము, తర్భవము, సహజాంధ్ర దేశభవము, దేశ్యోద్భ వము, గ్రామ్మము అని అయిదు భాగాలుగా వర్గీకరించాడు. దేశ్యాన్ని దేశీ తెలుగులు దేశ్యంపు తెనుగులు"అని రెండుగా విభజించి ఉదాహరణతో వివరించాడు.

కేతన మార్తన్నే అనుసరించిన విన్నకోట పెద్దన "కావ్యాలంకార చూడమణి' లో తెలుగు మాటలను తత్సమము, తద్భవము, సహజాంధ్ర దేశభవము, దేశ్యోద్భవము, గ్రామ్యము అని అయిదు విధాలుగా వర్గీకరించాడు. పరవస్తు చిన్నయసూరి బాలవ్యాకరణంలో "తెలుగునకు వర్గములు ముప్పదియాఱు' అని అచ్చతెలుగు కావ్యాల్లోని భాషా వర్ణలనే చూపించి "త్రిలంగదేశ వ్యవహార సిద్ధం బగు భాష దేశ్యంబు" అని నిర్వచించాడు. చిన్నయసూరి చెపిన సూత్రానికి అనుగుణంగానే అచ్చ తెలుగు కావ్యాలలో వాడిన భాష కన్పిస్తుంది తత్సమాలు, గ్రామ్యాలు తప్ప మిగిలిన పదజాలమంత 'అచ్చతెలుగు'గా లాక్షిణుడు గుర్తించాడు. ఆదిభట్ల నారారాయణడాసు అచ్చ తెలుగును దేశ్యం అనే అర్థంలో నాటుతెలుగు" అని వ్యవహరించారు. అచ్చ తెలుగులో ఖండకావ్యం శతకం, వ్యాసం, కథ, నిఘంటువులు, నాటకాలు వెలువడ్డాయి. వీటన్నిటినీ కలపి 'అచ్చ తెలుగు సాహిత్యం' అంటారు పొన్నెకంటి తెలగన రచించిన "యయాతి చరిత్రము' మొట్టమొదటి కావ్యం అని కవుల జీవిత చరిత్రలు రాసిన చరిత్రకారులన్నారు.

శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతా కళ్యాణము(1600) మురిగంటి సింగరాచార్యులు సీతాకళ్యాణము మూడాశ్వాసాల కావ్యం. ప్రథమాశ్వాసంలో దశరథ మహారాజు వసిష్టని అనుమతితో ఋష్యశృంగుని తీసుకరావటానికి వార వనితలను పంపటం, వారతన్ని తీసుకురావటం వరకు ఉంది. ద్వితియాశ్వాసంలో రావణ దుశ్చర్యలు, ఇంద్రాదులు విష్ణువును వేడటం,ఆయన దశరధపుత్రుడై జన్మించడం, తాటకవధ, అహల్యాపం వరకు ఉన్నాయి. తృతీయాశ్వసంలో జనక పట్టణం, విశ్వామిత్రుడితో రామ లక్ష్మణుల ఆగమం, శివ ధనుర్భంగం, సీతాస్వయవరం, పరుశరామ ప్రతిఘటనతో కావ్యం పూర్తి అవుతుంది. చివరిభాగంలో పదిపద్యాల్లో మిగిలిన రామకథ అంతా సంగ్రహంగా చెప్పబడింది.

అచ్చతెలుగు రామాయణము(1630) కూంచి మంచి తిమ్మకవి ఆశ్వాసాంత గద్యంలో తిమ్మయనామధేయ ప్రణీతంబైన యచ్చ తెలుగు రామాయణమును మహా కావ్యమందు బాలకాండము సర్వమేకాశ్వాసము" అంటు తన కావ్యాన్ని మహా కావ్యంగా చెప్పుకోన్నాడు. ఈ

కావ్యంలో అష్టాదశ వర్ణనలున్నాయి. కావ్యేతిహాస లక్ష ణాలు సంపూర్ణంగా వున్నాయి. ఈ అచ్చ తెలుగు రామా యణము'' వాల్మీకి రామాయణం చదివితే ఎలాంటి పుణ్యం కలుగుతుందో అదే విధంగా పుణ్యం కలుగు తుందంటాడు తిమ్మకవి.

శుద్ధాంధ్ర ఉత్తర రామాయణము (1872) కూచిమంచి తిమ్మకవి తెలిగింపగా మిగిలిన రామాయణంలోని ఉత్తరకాండమే 'శుద్ధాంధ్రోత్తర రామాయణమే' అనే పేరుతో రచించాడు పురుషార్థ ప్రదాయినీ పత్రిక'' ఈ కావ్యంలోని కొన్ని పద్యాలను ప్రకటించి 1872మే నెలలో దీనిని గూర్చి సరసమైన పండిత కవిత్వం అని రాసింది. ఇందులో తొలి భాగము మాత్రమే ప్రకటింపబడింది. రెండవ అధ్యాయం ఎందువల్లనో పూర్తికాలేదు.

## భారత కథాత్మికలు యయాతి చరిత్రము (1500 - 1600) :

పొన్నేకంటి తెలగనార్యుడు అచ్చతెలుగులో మొట్ట మొదటి ప్రయత్నంగా ''యయాతి చరిత్రను'' రచించారు. ఇబ్రహీం కుతుబ్‌షా దగ్గర మీర్ జామ్లాగా పనిచేసే ''అమీన్ ఖాన్'కు అంకితం ఇచ్చారు. ''యయాతి చరిత్రకు'' మూలం మహాభారతంలోని ఆది పర్వంలోని కథ. దేవయాని శర్మిష్ఠల వివాహమాడటం వరకే కథ చెప్పి, దేవయాని శర్మిష్ఠల వన విహారాల జలక్రీడలు, యయాతిని గూర్చిన వాళ్ళ వివహం వర్ణనల, చంద్ర మన్మధాది దూషణాలు, పరిణయం, దంపతుల ప్రథమ సమాగమం,సూర్యోదయ అస్తమయాది వర్ణనలు మొద లైన వాటిలో తెలిగిన ''యయాతి చరిత్రను'' శృంగార ప్రబంధంగా తీర్చిదిద్దాడు. ఈ మార్పుకు కారణం ఈ రచనా కాలపు సమాజ పరిస్థితే.జైన, బౌద్ధ, నాస్తిక ధర్మాలు దేశంలో వ్యాపించిన కాలంలో ఆస్తిక ధర్మంపై ఆసక్తిని కలుగజేయటమే ప్రధానోద్దేశ్యంగా నన్నయ రచన చేశాడు. తెలగన కాలం నాటికి మహమ్మదేయ సర్దారులు కేవల శృంగారలోలులై వుండటంవల్ల, రాయల కాలం నుండి శృంగార కావ్యాలను ఆదరణ లభించటం వల్ల తెలగన గ్రంథం శృంగార ప్రబంధంగా రచించారు. ఇలా ''యయాతి చరిత్రము''అచ్చ తెలుగు కావ్యాలలో మొదటిదై, తరువాతి కవులకు ఆదర్శ పాత్రమైంది.

శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషదము(1870) కందు కూరి వీరేశలింగం పంతుల 1870లో చదువుకునే రోజు ల్లోనే ఈ గ్రంథాన్ని రచించాడు. అచ్చ తెలుగు గ్రంథము లను పొన్నెకంటి తెలగనార్యుడను, కూచిమంచి తిమ్మ కవియు మాత్రమే రచించారు. నిర్వచన గ్రంథమును ఒక్క తిక్కన సోమయాజి రచించెను. నిరోష్ఠ్య గ్రంథముల నిద్దరు కవులు మాత్రమే చేసిరి. ఈ మూడు విధములైన గ్రంథాలకు సమీకరింపచేసి ఒక గ్రంథంగా రచించాలని మొదట రచించిన పద్యములను తీసి వేసి ''శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధ'' మనుపేర గ్రంథరచన చేసి ముంగించారు. ఇది ''మూడాశ్వాసాల'' గ్రంథం నియమా లధికం కావటం వల్ల దమయంతి. దయాదాతుడు, దీయనుడు అనే పేర్లను చెప్పాల్సి వచ్చినపుడు రాసిన పద్యాలు వీరేశలింగంకే తృప్తిని కలిగించలేదు. అందువల్ల గ్రంథాన్ని ప్రచురించేటపుడు పాదాంతరాలుగా వేరే పద్యాల్ని 'నోటులో'' చూపాడు ఆయన. ప్రాచీన కాలంలో ''యయాతి చరిత్ర' కు ఉన్న ప్రసన్నతో ఆధునిక కాలంలో కందుకూరి రచనలకు ఉంది.

రసిక జన మనోరంజనము (1871): ఇది కూడా కందు కూరి రచన ''రసికజన మనోరంజన' ను పెర ''చిత్రాం గదా'' పరిణాయము''లో చూపిన తెలుగులో ఇటువంటి ప్రబంధము వెరొకటి లేదని మెచ్చుకొన్నారు. ఇందులో నాలుగు ఆశ్వాసాలు కలవు. ఈ కావ్యము చేమకూర వేంకటకవి ''విజయవిలాసము'ను మించాలనే పట్టు దలతో రాసినట్లు అందులోని కదైక దేశమునే గ్రహించి కావ్యంగా కూర్చటంలోను, తెలుగు తీయదనాన్ని చమత్కారాన్నీ తన కవితలో మేళవించుటలోను స్పష్ట మవుతుంది.

శుద్ధాంధ్ర భారత సంగ్రహము (1872): వీరేశలింగం పంతులు రాసిన ఈ గ్రంథం 'సభాపర్వం'లో కొంతభాగం ''ఆంధ్రభాషా సంజీవని' పత్రికలో మొదటగా ప్రకటించ

బడింది. ఆయన దృష్టి వచన రచనవైపు వెళ్ళడంతో దిన్ని ఆపేశారు. కాని కొల్లా వేంకట సుబ్బరాయశెట్టి, గురు స్వామి శెట్టి సోదరులు కోరటం వల్ల తానీ గ్రంథాన్ని పూర్తి చేసి వారికంకితముగా ప్రచురించినట్లు పీఠకలో తెల్పారు. వీరిలో చెన్న పట్నాన్ని సహజసుందరంగా వర్ణించాడు కవి. ఇది ''మూడాశ్వాసాల కావ్యం' ఉత్తర గ్రహనం వరకు ప్రథమాశ్వాసం, ఉపపాండవుల మరణానంతరం అశ్యత్థామ ఆశ్రమ ప్రవేశం చేయటం వరకు ద్వితీయా శ్వాసం, ధర్మరాజు స్వర్గానికి వెళ్ళటంతో తృతీయాశ్వాసం, కావ్యం ముగుస్తాయి. సంగ్రహ భారత మవటంతో ఇందులో గొప్పవైన వర్ణనలేం వుండవు. సంగ్రహమైనా చక్కగా గ్రంథితమైందనటానికి అభిమన్యువధ ఘట్టం చూస్తే చాలు.

శృంగార శాకుంతలము(1940) భారతంలోని దుష్యంతో పాఖ్యానాన్ని కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని ఓడించి రసవంతంగా శృంగార రస ప్రధానంగా ఈ ప్రబంధాన్ని రాశాడు కేశీరాజు సీతారామయ్య. ఈ కావ్యం నాలుగాశ్వాసాలు కలది. హస్తినాపుర వర్ణన, ఆటవికుల ఆగమనం, మృగయామాత్ర ప్రథమాశ్వాసంలోనూ, మృగం వెంట దుష్యంతుడు కణ్వాశ్రమానికి రావటం, చెలులతో మిన్న శకుంతలను చూడటం కణ్వశిష్యుని ద్వారా శకుంతల వృత్తాంతం తెలుసుకోవటం, పర్ణశాలకు వెళ్ళేటపుడు బెబ్బులి రాకతో ఆగటం ద్వితీయా శ్వాసంలోనూ, యక్షరక్షణ, శకుంతలతో కలయికతో ఉంగరమిచ్చి హస్తినకు వెళ్ళటం తృతీయాశ్వాసంలోనూ, కణ్వుడు తిరిగి రావటం, శకుంతల నభినందించటం దుర్వాసశాపం భరతుని జననం, శకుంతలను అత్త వారింటికి పంపటం దుష్యంతుడు నిరాకరించటం, ఆకాశ వాణి, అంగుళీయక దర్శనం, శాపనివృత్తి, భరత పట్టాభి షేకం, రాజనీతి బోధలు, చతుర్థాశ్వాసంలోనూ ఉన్నాయి. పీఠికలోనే చెప్పుకున్నాడు. వ్యాస, కాళిదాస కథల్ని ఓడించి నట్లు.

### భాగవత పురాణ కథాత్మలు నీలాసుందరీ పరిణయము(1690) :

కూచిమంచి తిమ్మకవి రాసిన ఈ ప్రబంధం మూడో శ్వాసలది. దేనికి మూలం ఎఱ్ఱాప్రెగడ, ''హరి వంశము'లోను, పోతన 'భాగవత' దశమస్కంథంలోను ఆచార్య సూక్తి ముక్తావళిలోను కన్పిస్తుంది.

హరివంశంలో కాలనేమి పుత్రులు కుంభకుడి ఇంట వృషభాలై పుట్టి చెలరేగిన తరువాత, కృష్ణుడు నందాదులతో అతడి ఇంటికి వెళ్ళాడు. నందుడు గిబ్బల నడిచిన వాడికి 'నీల నిస్తానని చెప్పటంతో, కృష్ణుడు ఎద్దుల గేట డగించి, 'నీలతో', నందాదులతో తన పల్లెకు వెళ్తాడు. భాగవతంలో కోసల దేశపు రాజైన నగ్నజిత్తు, తన కూతురు నాగ్నజితుని వివాహఘట్టానికి వాడికోమ్ములు కలిగి వీరగ్రంథం సోకి మదనుత్తాలైన గొవృషభలను పెడింటిని కూల్చినవాడు తగిన వాడని చాటిస్తాడు. కృష్ణుడు ఈ పందెంలో నెగ్గి నగ్నజితుని వివాహమాడ్తాడు. ఆచార్య సూక్తి ముక్తావళిలో కావేరీ తీరంలోని నిచ్చూపుర రాజు ధర్మవర్మ్మడి కూతురు - నీలాంశతో పుట్టిన ఆమె-ఉద్యాన వన ప్రజలలో వేటకువచ్చిన శ్రీరంగపతిని (విష్ణువును) కామిస్తుంది. ధర్మవర్మ్మడు ఈ విషయాన్ని శ్రీరంగపతితో నివేదిస్తే ఆయన అనుగ్రహించి నీలను వివాహమాడాడు. ప్రసిద్ధమైన ఈ ప్రబంధం చక్కని జాతీయాలతో యాద వుల వేషభాషలను వెల్లడిస్తుంది. మిధిలానగరపు కాపు పెద్దలిలా వున్నారు.

### పద్యకావ్యాలు-భాగవత పురాణ కథాత్మకాలు :

సర్వమధురము (1756) ఈ కావ్య రచయిత ములుగు పాపయారాధ్యుడు ఆయన అనేక సంస్కృత గ్రంథాల్ని, తెలుగులో మిశ్ర కావ్యాల్ని సర్వనుధురము మొదలైన అచ్చతెలుగు పుస్తకాల్ని రాశాడని తాడెపల్లి వెంకటప్పశాస్త్రి ఉపోద్ఘాతంలో రాశాడు. సుపాణినీ పరిణయము (1810) సంబరాజు రామచంద్రకవి కృతమిది. వట్టెము చెన్నకేశవ స్వామికి అంకితమిచ్చారు. శుద్ధాంధ్ర నిర్వచన రుక్మిణీ పరిణాయ (1890) ఈ కావ్య రచయిత వైకరి సుందర

రామయ్య ఇది ఏకాశ్వాస కావ్యం. ఇరవై ఎనిమిది పేజీల్లో 138 పద్యాలు వున్నాయి. పోతన భాగవత దశమస్కంధంలో 'రుక్మిణి కళ్యాణాన్ని' ఆదర్శంగా పెట్టుకొని రచన సాగించాడు. అయినా పర్వకవులను స్తుతిస్తూ పోతనను పేర్కొనలేదు. శుద్ధాంధ్ర హరిశ్చంద్ర చరిత్రము (1840) రాయవరపుగవ రాజు ఈ కావ్యరచయిత అభినవ సరస్వతి పత్రికాధిపతి జానపాతి పట్టాభిరామశర్మ పరిశోధించి ప్రచురించాడు.

సత్యవిజయము (1896) అయ్యనకోట పార్థసాంథిశెట్టి రాసిన ఈ కావ్యం 'హరిశ్చంద్రకోపాఖ్యనం' చివరకు సత్య జయిస్తుంది. కాబట్టి సత్యవిజయం' అని పేరు పెట్టాడు. శుద్ధాంధ్ర నిర్వచన సత్యావివాహము(1900) కావ్యకర్త అస్టావధాని జంగహినుమయ్య చౌదరి దేనికి పిఠిక రాసిన శేసాద్రి రమణకవులు 'కావ్యము కథాంశమున కంటే వర్ణనాంశమునకే ప్రాముఖ్యత గలదు ఆనందోదయము (1902) కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి రచన ఇది. ఆశ్వాసాంత గద్యంలో ఆధునాత నోభయ కవి మిత్ర'' అనే విశేషణాలన్ని రాసుకున్నాడాయన కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి దేశ్‌ముఖ్ అయిన పోలేపల్లి వేంకట రాజేశ్వరరావుకు అంకితమిచ్చాడు. కవి తన కావ్యాన్ని మొదటగా ఆయన పత్రిక 'కతావతి' లో కావ్యం రెండోశ్వాసాలు ప్రకటింపబడ్డాయి. వేదాంతపరంగా వున్న '' జడభరత పాఖ్యానం'' ఈ కావ్యంలోని ఇతివృత్తం.

'అచ్చ తెలుగుకుజ్జా కృష్ణ విలాసము' (1907) ఈ గ్రంథాన్ని నల్లంతిఘళ చక్రవర్తుల తయాలలక్ష్మీ నృసింహాచార్యులు 1907 నాటికే రచించి 1932లో ప్రకటించాడు. విద్వాన్ ముదిగొండ వీరేశలింగ శాస్త్రి దీనికి పీఠిక రాశాడు. కుబ్జా వృత్తాంతం భాగవంతోనూ గర్గ భాగవతంలోను ఉంది. అతి చిన్నదైన ఈ కథను తీసుకొని సమయోచితంగా సన్నివేశాలను కల్పించి శృంగార ప్రబంధంగా రాశాడుకవి. శ్రీకృష్ణుడి స్వర్శతో సుందరిగా మారిన కబ్జా వర్ణన నాయికా వర్ణనకు తగివుంది.

శుద్ధాంధ్ర నిర్గర్య నిరోష్ఠ్య కేకయ రాజనందన చరిత్రము దీనిని కూడా తంయాల లక్ష్మీ నరసింహచార్యులు రచించాడు. మూడాశ్వాసములు గల కాగితపు ప్రతి, అముద్రితం ఆపద్య. అచ్చతెలుగు పార్వతీ పరిణయము (1910)మూడాశ్వాసములు ఈ ప్రబంధాన్ని గురజాడ పూర్ణచంద్రకవి రచించాడు. మిగతా చాలామంది అచ్చ తెలుగులో కావ్యాలు రచించాడు.

## గద్యవిభాగము :

ఈ విభాగములో కథలు వ్యాసాలు, పీఠికలు కలవు. ఈ సవునీతికథలనుండి వంద కథలనేరుకొని పిల్లలకోసం నీతి పద్యాలతో పాటు నాటు తెలుగులో ఆదిభట్ల నారాయణదాసు చిన్న చిన్న కథలు రాశాడు. అదే విధంగా ఆదిభట్ల నారాయణదాసు అప్పుడప్పుడు పత్రికల్లో రాసిన వ్యాసాలు తన గ్రంథాలకు రాసిన పీఠికల సంకలనమే ''వ్యాసపీఠము'' ఇందులో విమర్శనాత్మక వ్యాసావళి, సృజనాత్మక వ్యాసావళి అనే రెండు భాగాల్లో 43 వ్యాసాలున్నాయి. అందులో 43 నాటుతెలుగులో రాసినవి. వేల్పుముచ్చట. ఎచ్చరిక, మంచిబ్రతుకు, మానిసులు నాటు తెలుగు, ఋక్సంగ్రహము, భగవద్గీత, విష్ణుసహస్రనామము, లలితాసహస్రనామము, ఆయుర్వేదము, ఉమరుకైయాము మచ్చలు, నేను-లోకము, గౌరప్ప పెండ్లి ఆరంభంలో నన్నయ, తరువాత తిక్కన, శివకవులు, మూడవదశలో తెలగనాందులు ఈ శతాబ్దంలో నారాయణదాసు వంటి వారు కొత్త పుంతల తెలుగు భాషను నడిపించారు.

ప్రాద్రెనుగు కమ్మ (1913) వ్యావహీరిక భాషా వశ్యకతను స్పష్టం చేయటానికే గిడుగు రామమూర్తి పంతులు. గ్రంథిక వ్యావహారిక భాషా పదాలు చెలరేగిన రోజుల్లో 1913 ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలో అనుబంధంగా ఈ లేఖను ప్రచరించాడు. నాటు తెలుగు మాటలనే గ్రాంథిక పద్ధతిలో రాస్తే ఎంత అసహజంగా ఉంటుందో తెల్పటానికి ఉద్దేశించిన లేఖ ఇది.

## నిఘంటువులు :

చౌడప్ప సీసములు(17వ శతాబ్దములు) కవి చౌడప్ప రచించినట్లుగా భావింపబడే ఈ నిఘంటువులో 3ల సీసపద్యాలున్నాయి. దీనిలో శుద్ధ దేశీయ పదాలకే కాక,

అరబ్బీ, ఫారసీ, ఉర్దూ భాషాపదాలకు కూడా అర్థాలు ఇయ్యబడ్డాయి. నిఘంటువు మొదట్లో రెండు కూడా పద్యాలున్నాయి. 'కప్పుమెయిజేని' పేరిట ముప్పయి సీస పద్యాలు ఆంధ్రంలో చెప్పానని (ప.2) కవి అన్నాడు.

శ్రీవేంకటీశ్వరాంధ్రము (1650-1720) ఈ పద్యని ఘంటు రచయిత ప్రబంధరాజు వేంకటేశ్వర విజయ విలాసాది గ్రంథకర్త గణపవరపు వేంకటకవి. స్వర్ణలక్షణ శిరోమణి అనునాంధ్ర నిఘంటువు నందు అని గద్యంలో చెప్పటం వల్ల అది దేని నామాంతరమని తెలుస్తుంది. రచయిత అమరకోశాన్ని దృష్టిలో పెట్టుకొని తన నిఘం టువు వర్గాలుగా విభజించాడు. దీనిని దేవతాప్రకరణం, మానస ప్రశంస, స్థావర నిర్ణయం తిర్యగ్జాతి భేదం నానార్థ వర్ణ నిరూపణం గల ఏకోల్లాసంగా రచయిత రాశాడు. ఇరవై నాల్గు పుటల గ్రంథంలో 129 సీస పద్యాలున్నాయి.

ఆంధ్రనామ సంగ్రహము (1680) ఈ పద్య నిఘం టువును కాశీ విశ్వనాధుడికి అంకితంగా రచించినవారు. పైడిపాటి లక్ష్మణకవి అమరకోశాన్ని అనుసరించిన వర్గవిభజన వుంది. దేవవర్గులో 42 పద్యాలు, మానవర్గులో 83, స్థావర వర్గులో 37, తిర్యగ్వర్గులో 20, నానార్థవర్గులో 29 పద్యాలు వున్నాయి. వావిళ్లవారు టీకను రాయించి ఆయా పదాలకు కఠినమైన చోట్ల వ్యారణాంశాలు చేర్చారు. ఆడిదం సురకవి దీనికే శేషనిఘంటువును రాశాడు. దీంతో పాటు 1966లో వావిళ్ళవారు ''ఆంధ్ర నామ సంగ్రహమును ప్రకటించారు.

ఆంధ్రనామమశేషము (1750-1980) ఆడిదం సుర కవి, కోటివెంకనార్యుడు ఆంధ్ర భాషార్ణవము (1760) రామాయణం కృష్ణయ మంత్రి రచించిన దేశ్య నాయార్త కోశము(1837) లక్ష్మీనారాయణీయము (1870), కోట లక్ష్మీ నారాయణశాస్త్రి, మేల్ నుండి కడలి(1875) మారెపల్లి రామచంద్ర శాస్త్రి, సాంబనిఘంటువు (1890) కస్తూరి రంగకవి, వైకృత దీపిక (1900) బహుజన పల్లి సీతారామా చార్యులు. మరొన్నే అచ్చతెలుగు నిఘంటువులు కలవు

నాదృష్టి యందు వచ్చిన అచ్చతెలుగు కావ్యాలు, పద్య కావ్యాలు, నిఘంటువులు వన్నంత, కన్నంత తెలియ వచ్చినంతగా వివరించాను. ఇంకా నా దృష్టికిరాని అచ్చ తెలుగు కావ్యాల్ని తెలుగులో ఎన్నో ఉన్నాయి. వారివారి సరస్వతీ సమర్పనకు నమస్కరిస్తూ లభించే కావ్యాలను తదుపరి వ్యాసంలో పరిచయం చేయగల్గుతానని భావిస్తూ ముగింపు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకళ్యాణము (1600) మరింగంటి సింగరాచార్యలు
2. అచ్చతెలుగు రామయాణం (1690) కూచిమంచి తిమ్మకవి
3. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషదము(1870) కందుకూరి వీరేశలింగం
4. నీలాసుందరీ పరిణయము (1690) కట్టమంచి తిమ్మకవి
5. ఆందనామ సంగ్రహము - పైడి పాటి లక్ష్మణకవి
6. వేంకటానాంధ్రము- గూపవరపు వేంకటకవి
7. చౌడప్ప సీసములు-కవి చౌడప్ప

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# పి.వి. సునీల్‌కుమార్ "ప్రారంభం" నవల సామాజిక దృక్పథం

- ఉకరి వెంకట రమణ, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

పి.వి. సునీల్ కుమార్ గారు పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడిలో పుట్టారు. పెనుగొండలో పెరిగారు. తణుకు, విశాఖపట్టణం, హైదరాబాదులలో విద్యాభ్యాసం గడిచింది. ఇతను "ప్రారంభం", "సయ్యాట", "క్షుద్ర" అనే 3 నవలలోపాటు సుమారు '50' కథలు రాశారు. 2014లో ఢిల్లీ తెలుగు అకాడమీ పురస్కారం, 2015 లో తానా పురస్కారం (వాషింగ్టన్)లోను అందుకున్నారు. 2017లో తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభ పురస్కారం లభించింది.

చాలా మంది రచయితలు చాలా నవలలు వ్రాశారు. జీవితానుభవాలలోని సారాన్ని నవలలుగా రాసినవారిలో పి.వి. సునీల్‌కుమార్‌గారు ఒకరు. వీరు ఆంధ్ర ప్రదేశ్ అడిషినల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ADGP) గా పని చేస్తున్నారు. పోలీస్‌శాఖవారు ప్రచురించే "సురక్ష" మాస పత్రికకు సంపాదకులుగా ఉన్నారు. ఆంగ్ల, తెలుగు భాషలలో మంచి ప్రావీణ్యం కలవారు, మంచి వక్త, గొప్ప సాహితీవేత్త.

## నవల :

సాహితీ ప్రక్రియలన్నింటిలో ఎక్కువ ప్రజాదరణ పొందిన సాహిత్య ప్రక్రియ నవల. ఇతర సాహితీ ప్రక్రియలన్నింటిని అంటే కథను, కవిత్వాన్ని, వ్యాసాన్ని, నాటకాన్ని, పాటను ఇట్లా అన్నింటిని తనలో ఇముడ్చుకోదగిన శక్తి నవలకు మాత్రమే ఉంది.

కవిత్వం మీద వచనం చేసిన తిరుగుబాటే నవల ఆవిర్భావానికి కారణం అంటాడు వల్లంపాటి వెంకట సుబ్బయ్య. రాచరిక వ్యవస్థ అంతమైపోవడం ప్రజాస్వామ్య ప్రభుత్వాలేర్పడడంలాంటి విప్లవాత్మక మార్పుల కారణంగానే నవలలాంటి ఒక నూతన ప్రక్రియ ఆవిర్భవించింది. నవలకు నిర్వచనమేమిటని ప్రశ్నిస్తే చాలా నిర్వచనాలున్నాయి. "వాస్తవిక జీవితాన్ని గూర్చిన కాల్పనిక కథ" అని ఒక్కమాటలో నవలను నిర్వచించి చెప్పవచ్చు. "నవల సమకాలీన జీవిత వాస్తవికత మీద ఆధారపడ్డ కల్పనాత్మక వచన సాహిత్య ప్రక్రియ" అని కూడా నవలను నిర్వచించవచ్చు. నవల కథాత్మకమైనది. ఇందులో సంఘటనలు సాటి వాస్తవ జీవితానికి ప్రాతినిథ్యం వహిస్తాయి. సునీల్‌కుమార్‌గారు తన జీవితానుభవాల నుండే రచనలు చేశారు. వారి రచనలు గురించి పలువురి అభిప్రాయాలు.

"భారీ వాక్యనిర్మాణం, చదవడానికి కష్టంగానూ, అర్థం చేసుకోవడం క్లిష్టంగానూ ఉంటుందని తన నవలలో తేలికైన, పొందికైన, అందమైన, సహజమైన, సొగసైన, వాక్య నిర్మాణాన్ని అందించారు పి.వి. సునీల్‌కుమార్".

**- వేమూరి బలరామ్, ఎడిటర్, స్వాతి వారపత్రిక.**

"ఇంతకు పూర్వం జనాకర్షణా, జనహితమూ కలగలిపిన రచయితలు చలం, రావిశాస్త్రి. బీనాదేవి, వడ్డెర చండీదాస్ ఉన్నారు. మళ్ళీ వారి కోవలో చేరిన ఈ తరం రచయిత సనీల్‌కుమార్".

**- సతీష్ చందర్, ప్రముఖ రచయిత, కవి, సంపాదకులు.**

"సునీల్‌కుమార్ రచనాశైలినీ రావిశాస్త్రిలా ఉంటుంది. పతంజలి వచనంలా ఉంటుంది".

**- జగన్నాథశర్మ, సంపాదకులు, నవ్య వీక్లీ.**

"ప్రారంభం" నవల 13-05-2011న స్వాతి సపరివార పత్రికలో సీరియల్‌గా ప్రారంభమైంది. సునీల్‌కుమార్ గారి "ప్రారంభం" నవల ఎంతో బాగా రాశారు. వాక్య నిర్మాణం చాలా సులభంగా ఉంది. పాఠకులకు కావలసింది అలాంటి రచనలే. నవలలో శైలీ, శిల్పం, ఇతివృత్తంలోని మలుపులు. ఒక్కొక్క పాత్ర, ఆపాత్ర వెనుక జరిగిన సంఘటనలు అద్భుతంగా రాశారు. ఇప్పుడు టి.వీ. సీరియల్స్ చాలా క్రేజ్ ఉంది. ఒకప్పుడు వార, దిన, మాస పత్రికలలో వచ్చే సీరియల్స్ అంటే పాఠకులకు ఎంతో

క్రెజీ ఉండేది. సీరియల్ చదువుతుంటే తర్వాత ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ పెరిగేది. అలాంటి ఉత్కంఠ "ప్రారంభం" నవలలో కనిపిస్తుంది. ప్రారంభం నవల స్వాతి సపరివార పత్రికలో వచ్చినప్పుడు పాఠకుల స్పందన అద్భుతం, అమోఘమైనదిగా చెప్పుకోవచ్చు.

ఈ నవలలో అనేక సందర్భాలలో ఎమోషన్, ఉత్సుకతను పెంచే విధంగా ఉన్నాయి. ప్రతి వారం చక్కని క్లైమాక్స్‌ను అందిస్తూ సస్పెన్స్‌తో సీరియల్‌ను కొనసాగించారు రచయిత. అగ్రహారం నుండి హైటెక్ సిటీ దాకా, సంప్రదాయం నుండి హైటెక్ కల్చర్ దాకా కథా వస్తువును నవరసాలతో నడిపించిన తీరు ప్రశంసనీయమని ఎడిటర్ వేమూరి బలరాం గారు అంటారు.

ఈ "ప్రారంభం" నవలలోని పాత్రలన్ని విభిన్నమైనవి. ఆ పాత్రలన్నీ మనచుట్టూ ఉన్న సమాజంలో నిత్యం కనిపించేవే అనిపిస్తుంది. పాత్రలు సజీవంగా నడుస్తాయి. ఒక్కొక్కపాత్ర ఒక్కొక్క ప్రత్యేకతను కల్గి ఉంటుంది. ఈ నవలలో పోలీస్ అధికారి ఇన్వెస్టిగేషన్‌తో ప్రారంభమవుతుంది. రచయిత కూడా పోలీస్ అధికారే గనుక ఆ ఘట్టం అత్యంత సహజంగా సాగిపోతుంది. ఇన్వెస్టిగేషన్ ఇట్లా ఉంటుంది. కేసులల్లో ఇంత లోతుగా పరిశీలన చేస్తారా? అని సగటు పాఠకుడు ఆలోచించేలా ఉంటుంది. ఒకవైపు సరదా సరదా మాటలతోనే మరో వైపు కేసుకు సంబంధించిన ముఖ్యమైన అధారాలను పట్టుకోవడం అనేది సీరియల్‌లో రచయిత కనబర్చిన ప్రతిభను గీటురాయిగా చెప్పవచ్చు. నిజ జీవితంలో వారి సిన్సియారిటికి ఇది ఒక నిదర్శనంగా చెప్పుకోవచ్చు. కాని సునీల్‌కుమార్‌గారు ప్రారంభం నవలలో ఎంతో సున్నితమైన పాత్రల్ని చాకచక్యంగా నడిపిస్తారు. ఒక పోలీసు ఆఫీసర్‌కి ఇంత సున్నితమైన మనసుంటుందా? అనే ఆశ్చర్యాన్ని పాఠకుడు పొందుతాడు. అందుకే సునీల్‌కుమార్‌గారు సీరియల్ రాసినపుడు తన వృత్తి ఎక్కడా పేర్కొనవద్దని సూచించారని ముందుమాటలో తెలిపారు. అంటే రచనకు ఉద్యోగం హోదాతో వచ్చే పేరు నిజమైనది కాదనీ, పాఠకుల స్పందనను బట్టి వచ్చే పేరు శాశ్వతమైనదని అతని అభిప్రాయం. ఈ "ప్రారంభం" నవల దివ్య అనే అమ్మాయి హత్య కేసులో మొదలైతుంది. ఆ తర్వాత విచారణలో ఆమె చుట్టు ఉన్న రాజేంద్ర, సుధాకర్, రామం, ప్రీతి, ఇంద్రాణి మొదలుగా అనేక పాత్రలు వారివారి పుట్టుపుర్వోత్తరాలతో పాఠకుల ముందు కదలాడుతాయి.

ఈ నవలలో స్త్రీ జీవితాల్లో పురుషులు ఎట్లా వారి జీవిత గమనం గమ్యం సాగుతుందో కనబడుతుంది. ముఖ్యంగా మధ్యతరగతికి చెందిన కుటుంబాలు, పేదవాళ్ళ జీవితాలు ఎటువంటి సాంఘిక, సామాజిక సంబంధాలతో ముడిపడి ఉంటాయో ఈ నవల వాటికి అద్దంపట్టి చూపిస్తుంది.

"పుర్రెకో బుద్ధి, జిహ్వాకో రుచి" అని రాజేంద్ర ద్వారా అనిపించి, ఒక్కొక్క పాత్ర ఒక్కొక్క రకం. విభిన్న రకాల వ్యక్తులు, పలురకాల మనస్తత్వాలు వివిధ కోణాలలో ఆవిష్కరిచారు సునీల్‌కుమార్‌గారు.

రామ్, రాజేంద్ర, నారాయణ, సుధాకర్ ప్రధాన పాత్రలుగా కొనసాగిన ఈ నవలలో ముగ్గురు ఒకే ఊరిలో పుట్టి పెరిగి ఒకే వాతావరణంలో చదివి ఒకే ప్రాంగణంలో పనిచేస్తున్నారు. పింగళి శ్రీరామచంద్రమూర్తి రామ్‌గా పిలవబడే రామం సున్నిత మనస్కుడు చిన్నతనం నుండీ అణకువ గల పిల్లాడిగా పేరుతెచ్చుకున్నాడు. ప్రహ్లాద శాస్త్రీ, తులసమ్మల బిడ్డ అయిన రామ్‌కు మంచి పేరు గౌరవం ఉన్నాయి.

మంచి అయినా చెడు అయినా పాఠశాల వయస్సులో చటుక్కున ఆకర్షిస్తుంది అనడానికి నిదర్శనం రామ్ జీవితంలోని సంఘటనలు. తనపేరును "మంగాయావు"గా చెప్పుకొనే మంగారావు, రాజేంద్రల పరిచయం వారి మాటలు రామ్‌ను ఆకర్షితుడ్ని చేసాయి. 'ర' పలకడం రాక 'య'గా పలుకుతూ రంగారావు మాట్లాడే మాటలు భలే నవ్వు తెప్పిస్తాయి. కుర్రకారుకి పెద్ద అడ్డా అయిన సాయులూ గాడి హోటల్ కేంద్రంగా పెద్ద ప్రేమగురువు (మంగారావు) చిన్న ప్రేమగురువు (రాజేంద్ర) రామ్‌కి ప్రేమ పాఠాలు చెప్పి అతని చేత అభ్యాసం చేయిస్తారు. తండ్రి పేరు ప్రతిష్ఠలు వంశగౌరవం కూడా అతడు ఆలోచించక

ఆచారిగారి అమ్మాయి ఇంద్రాణి వెంట పడటం ఖచ్చితంగా స్నేహ ప్రభావం అని చెప్పవచ్చు. కాని రామ్ ఇష్టపడిన ఇంద్రాణి చిన్న వయస్సులోనే అమ్మాయిలు పరిపక్వతతో ఆలోచిస్తారు అనడానికి, ప్రతీకగా నిలిచింది.

ఇంద్రాణి రామ్‌కు బ్రతుకుపాఠం నేర్పుతుంది. "మనం సంపాదించిందే మనది అవుతుంది. మనకు సంక్రమించి వారసులదే అవుతుంది" అనడం ఆమెలోని ఆలోచనా విధానానికి నిదర్శనం. మంచి మలుపుకు మేలు కొలుపు ఇంద్రాణి పరిచయం. ఇష్టం అంతే ఫలానా వయస్సులోనే కలగాలని లేదు. అది ప్రేమ కాదు అన్న విషయాన్ని అతనికి తెలియజేసి సంస్కారవంతురాలు అని అనిపించుకుంది ఇంద్రాణి.

నువ్వు స్కూల్ ఫస్టురావాలి రామం. నీ తెలివి తేటలు వృధాకాకుడదు అంటూ అతనిని లక్ష్య సాధన దిశగా ప్రేరేపించడం. అతను స్కూలు ఫస్టు వచ్చాక మనసులోకి గర్వం రానివ్వకు, ఇంకా ఎదైనా సాధించాలి అనుకో అంటూ ఉపదేశించడం ఆమె వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనం. జేమ్సు, సుధాకర్ రామ్‌కి మంచి స్నేహితుడుగా అతని కష్టసుఖాలను, గోప్యాలను తనలోనే దాసుకుంటూ మంచి స్నేహితుడనిపించుకున్నాడు. అయితే రామ్ యొక్క నిజమైన వ్యక్తిత్వం సుధాకర్ విషయంలో సుస్పష్టంగా కనిపిస్తుంది. కులానికి కాదు గుణానికి, మతానికి కాదు తెలివైన మనసుకి విలువనిచ్చే వ్యక్తిగా రామ్ మనకు కనిపిస్తాడు. కులం, డబ్బు అండ చూసుకొని కళాశాలలో మిగిలిన స్నేహితులతో కలవక ఒక గ్యాంగ్‌ని నడుపుతూ దళిత పిల్లలను గేలిచేసి, హింసించి ఆనందం పొందే క్రూరమైన, నీచమైన మనస్తత్వానికి చిహ్నంగా రాయుడు కనిపిస్తాడు. ఇందకు పూర్తి భిన్నంగా సుధాకర్. నాకు కులాల మీద నమ్మకం లేదు. మనషులలో రెండే కులాలు మంచి వాళ్ళు, చెడ్డవాళ్ళు కదా! స్నేహానికి ప్రధానం మనిషి కులంకాదు అన్నప్పుడు అతనిలోని అభ్యుదయ భావాలు కనిపిస్తాయి.

ఇంద్రాణికి పెళ్ళి అయిపోయింది అన్న విషయం తెలుసుకున్న రామానికి దుఃఖం ఆగలేదు. కన్నీళ్ళ రూపంలో వస్తున్నప్పుడు ఆ ఉద్రేకానికి రామం శరీరం, తల కంపించాయి. క్రుంగిపోతూ పాపయిలా రోదించినప్పుడు అతడని అపే ప్రయత్నం చేయలేదు సుధాకర్. భుజంపై చేయి వేయగానే అతనికి కొండంత అండగా అనిపించింది. గోదారి వరదలా కొట్టుకుపోతున్న వాడికి మోకు దొరికినట్లుయింది.

నవ్వు ఎవరితోనైనా పంచగలము. కానీ కొందరి ముందే ఏడ్వగలం. ఎవరితో దుఃఖాన్ని పంచుకొంటామో వారి మన నిజమైన స్నేహితులు అనే విషయాన్ని తెలియజేయడం జరిగింది.

సునీల్‌కుమార్‌గారి ఛాయలు ప్రవృత్తిపై కూడా ప్రభావం చూపాయి అని చెప్పవచ్చు. వివిధ భావాలు కలిగిన వ్యక్తులు మధ్యసాగిన సంభాషణలు పాఠకులను ఆకట్టుకున్నాయి. సామాజిక అంశాలు కుటుంబ విలువలు స్నేహం, ప్రేమ, శృంగారం సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలు. అంతర్జాల మాయాజాలాలకు దిగజారుతున్న నైతిక విలువలకు దర్పణంగా ఈ నవలను ఆవిష్కరించడంలో సునీల్‌కుమార్‌గారు సఫలీకృతులయ్యారని చెప్పవచ్చు.

❀❀❀

# “సింగరేణి కథలు - శ్రమ జీవనం”

- బానోత్ వెంకటేశ్వర్లు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయము, వరంగల్, తెలంగాణ.

సింగరేణి గనులు తెలంగాణ యందలి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్నాయి. సింగరేణి సాహిత్యం వివిధ ప్రక్రియాల్లో ఆవిష్కరింపబడింది. నల్లకలువలు లేదా కోల్ బెల్ట్ కథలు, సింగరేణి బతుకులు (కథలు), బండకింది బతుకులు, బొగ్గు పొరల్లో వంటి నవలలకు గాను కవిత్వం రూపంలో పాటల రూపంలోనూ, “సృజన” “అరుణతార” వంటి పత్రికలలో ఎన్నో కథలు ప్రచురించబడ్డాయి.

గని కార్మికుడిగా వ్యక్తి గుర్తించబడడం అంటేనే అతని జీవితానికి పారిశ్రామిక సంబంధాలతో అనుబంధం ఉందని భావించడం జరుగుతుంది. గని కార్మికుని జీవితాన్ని పారిశ్రామిక సంబంధాల ఆధారంగా విమర్శ చేయగలిగితేనే విలువలను సరిగా అంచనా వేయడానికి వీలు అవుతుంది. వ్యక్తి గని కార్మికుడిగా మారడానికి కారకమైన నేపథ్యపు శక్తుల్ని గిర్తించడం కార్మికుడిగా అతడు వృత్తి యందు ఎదుర్కొన్న సమస్యలు, సంక్షిష్టతలు, సంఘర్షణలు, తత్ఫలితంగా ఏర్పడిన అశాంతినే, అది అతని కుటుంబ సామాజిక జీవితం మీద చూపించిన ప్రభావాన్ని అవగాహన చేసుకుంటేనే సింగరేణి గని కార్మిక జీవితం సమగ్రంగా అర్థం అవుతుంది.

వృత్తియందు పనిచేసేచోట ముఖ్యంగా బొగ్గుగనులలో కార్మిక జీవిత రక్షణకై 1952లో మైన్స్ (సేఫ్టీ) యాక్ట్ వచ్చింది. దానిలో భాగంగా కార్మికులు పనిచేసే సంస్థలలోనూ, కార్మిక కుటుంబ వాడలలో సంక్షేమ కార్యక్రమాల అమలును 1926లో వచ్చిన ట్రెడ్ యూనియన్ యాక్ట్, 1947లో వచ్చిన ఇండస్ట్రీయల్ డిస్‌ప్యూట్ యాక్స్ (పారిశ్రామిక వివాదాలు) మొదలైనవి ఎన్ని వచ్చినా వీటిలోని లోపాలు ప్రతినిధులలో నిజాయితీ లేని తనం కలిసి వెరసి కార్మికుల మానవ హక్కులనే కాలరాస్తున్నాయి. గనిలోకి ప్రవేశిస్తూనే అతనికి జీవితం ఎంత ప్రమాదాల అంచున ఉన్నదో అర్థం అవుతుంది. ఇక్కడ భూమి పంట తీస్తూ బొగ్గును ఉత్పత్తి చేసేచోట, రూఫ్, గోఫ్‌ని సరిగా చెక్ చేయకపోతే బండపడి శరీరం నుజ్జు నుజ్జయే ప్రమాదం ఏర్పడే చోటు అది.

మనిషి జీవతంలో ఒక కార్మికుడుగానే గాక, ఆడపిల్ల తండ్రిగా కూడా రాజం దోపిడికి గురి అయినట్లు తుమ్మేటి రఘోత్తమ రెడ్డి “పెండ్లి” కథ ద్వారా తెలుస్తుంది. “పెండ్లి” కథలో యాజమాన్యపు వైఖరి పితృస్వామ్యం కంటే ప్రమాదకరమైనది అని రచయిత చెప్పడం గమనార్హం. రాజం ఇంట్లో కూతురు పెండ్లికి వచ్చిన వియ్యాల వారు దొరతనం చూపిస్తూ కట్న కానుకల కోసం పీక్కుతింటారు. పల్లెటూళ్లో గొడ్లుకాసి ఆ తర్వాత బాయి పనికి వచ్చి 20 ఏండ్లు కష్టపడి పనిచేసి మెడికల్ అన్‌ఫిట్ అయి వచ్చిన రిటైర్‌మెంట్ డబ్బులన్నీ కూతురు పెండ్లికి ఖర్చు అయిపోతాయి. బొగ్గగని పనితో శరీరపు సత్తువుపోతే చివరికి వచ్చిన రిటైర్‌మెంట్ సొమ్ముకూడా వియ్యాల వారు ఎత్తుకుపోయి జీవితంలో శూన్యాన్ని మిగిల్చరని భావిస్తాడు. కార్మికుడిగా, తండ్రిగా రాజం దోపిడికి గురి అయినట్లు పెండ్లికథ ద్వారా అర్థమవుతుంది.

సింగరేణి శ్రమజీవులను గురించి వారు ఉండటానికి ఇల్లులేని వారికోసం తుమ్మేటి రఘోత్తమరెడ్డి రచ్చించిన మరోకథ “నీడకోసం” ఇందులో వీరయ్య అనే కోల్‌ఫిల్లర్ కొడుకు నారాయణ. నారాయణ కూడా బదిలీ ఫిల్లర్‌గా పనిచేస్తూ ఉంటాడు. అయితే నారాయణకు అదే విధీలో చివరింటి అమ్మాయితో పెళ్ళి జరిగినా భార్యను కాపురానికి తీసుకురాలేక పోతున్నాడు. దానితో భార్యా భర్తలిద్దరూ తిట్టుకోవడం, కొట్టుకోవడం రివాజుగా మారింది. భార్యను కాపురానికి తెచ్చుకోలేని అశక్తతను చింతిస్తూ రాత్రిపూట వీధుల్లో తిరుగుతూ గడుపుతుంటారు. ‘పాన్’ని అలవాటు చేసుకుంటాడు. ఒకరోజు కొడుకుకోసం వీరయ్య ఆ పాన్‌షాప్ దగ్గరకు వెళ్ళి అక్కడకు వచ్చిన మరొక కార్మి

కునితో తన సమస్యను చెప్పేసరికి, ఇల్లులేని కార్మికులందరూ కలిసి తెల్లారే రైల్వేట్రాక్ పక్కన కంపెని భూమిలో గుడిసెలు వేసుకుంటూ నారాయణ భార్యను కాపురానికి తెచ్చుకుంటాడు. కంపెని వాళ్ళు పోలిసులకు చెప్పేసరికి పోలీసులువచ్చి గుడిసెలు పీకేసి, అడ్డువచ్చినందరినీ అరెస్టు చేస్తారు. వారిలో రాజలింగాన్ని పోలీసులకు డబ్బులిచ్చి విడిపించుకుంటారు. కాని మిగిలిన వారిని వదలనందుకు అందరిని కలిసి కంపెనీవాళ్ళు, పోలీసు వాళ్ళ జులుంని అణచి వేయాలనుకొని సి.కా.స. లో చేరి వారిని ఎదుర్కోవాలనుకుంటారు.

నీళ్ళ సమస్యను గిరించి "నీళ్ళతగవు" కథలో తుమ్మేటి రఘోత్తమ్ రెడ్డి వివరించారు. కార్మికుని భార్యయైన సమ్మక్క మాదిగోనికి నిప్పుకరువైనట్లు, బాయిపనోడికి నీళ్ళుకరువు అనుకుంటూ తెల్లారి లేస్తూనే కుండలు పట్టుకొని బయల్దేరింది. కార్మికులు ఉన్న చోట నీళ్ళ పంపు లేదు. కార్మికుల భార్యలు ఎదురుగా ఉన్న కంపెనీ క్వార్టర్లలోకి వెళ్ళి నీళ్ళు తెచ్చుకొని పబ్బం గడుపుకుంటారు. అయితే ఒకరోజు ఒక అదికారి ఇంట్లో పంపుకు ట్యూబ్ పెట్టి పూలతోటకి నీటిని వదిలిపెట్టడం చూచి ఆ ట్యూబ్‌ను తీసి కార్మికుని భార్య మంచినీళ్ళు పట్టుకుంటే ఆ ఇంటి కుర్రాడు వచ్చి పంపు క్రింద పెట్టిన కుండలను పగులకొట్టాడు. దానితో సమ్మక్కకు కోపంవచ్చి కుర్రాడిని తిట్టింది. అది చిలికి చిలికి గాలివానగా మారి అటు అధికార వర్గం మధ్య ఇట్టు కార్మిక వర్గం మధ్య ఘర్షణగా పరిణమించింది. అప్పటి నుండి అధికారుల క్వార్టర్స్‌లో కార్మికులను నీళ్ళుపట్టుకోనీయక పోయే సరికి కార్మికుల భార్యలు బొగ్గుగని దగ్గరున్న పంపు దగ్గరకు వెళ్ళి నీళ్ళు తెచ్చుకుంటారు. అధికారులస్తే అందరూ కలిసి గుడిసెల దగ్గర పంపులు వేయమని భర్తలచేత దరఖాస్తులు పెట్టించినా ఫలితం లేకపోయేసరికి కార్మిక కుటుంబ స్త్రీలు ఏజెంటు వెళ్ళే దారిలో బైఠాయించేసరికి ఏజెంటు పంపులు పెట్టిస్తామని హామి ఇస్తాడు.

కొంతమంది కార్మికుల భార్యలు పంపునీళ్ళ వసతిని సాధించుకున్న వైనం వేలాది కార్మిక కుటుంబాల స్త్రీలలో ఉత్తేజం తెప్పించిందని అక్కడి వారు భావించడం జరిగింది. తెల్లవారిన తరువాత పంపునీటి చప్పుడు విని కార్మిక కుటుంబ స్త్రీలు విజయ గర్వంతో కళ్ళు ప్రకాశించాయి.

బండకింత బతుకులు - కైతికాల పోశెట్టి - స్వగతాల సంపుటి (అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమ్ రెడ్డి) అంతర్మధనం సాహిత్య సృజనకు ఆధారం అయితే అధికారాన్ని ఎదుర్కొని బతుతలేనప్పుడు బహిరంగముగా బయటకు చెప్పలేని మనోభావాలకు వ్యక్తిగతంగా ఒక్కరుగా తనకుతానే ఉండి బహిర్గతమయ్యే అంతర్వేధనమ్ స్వగతాలు. ఇందులో ఆత్మీయత, స్వీయానుభావాలకు ప్రాధాన్యత ఉంటుంది. కాబట్టి సృజన కారుని ప్రవృత్తి సహజ సిద్ధంగా ఉంటుంది. ఆవేదన, అసంతృప్తులు వృత్తి పరమైనపుడు తాను ఆ వృత్తిలో మమేకమైనపుడు ఆ స్వగతాలు జాతీయతా ముందుకు నోచుకుంటాయి. అందుకే తెలంగాణ మాండలిక భావజాలంతో బొగ్గుబావులలో బండకింద తమ బతుకులకు స్వగతాల తోరణాలతో సాహిత్య సృజనశక్తితో ఆత్మార్పణ చేసుకోవడం ఇందులో కనబడుతుంది. కైతికాల పోశెట్టి బొగ్గుగావి కార్మికుల మనోభావాలకు ప్రతినిధి. అందుకే ఏకత్వంలో - బిన్నత్వం కలిసిన ఈ స్వగతాలు సంఘర్షణలకు మూలాలు. బొగ్గును ఉత్పత్తి చేసే శ్రామికుల జీతాలు రకరకాలుగా వ్యాపార రూపంలో ఉండే పెత్తందారుల, ధనవంతుల చేతిల్లోకి వెళ్ళిపోవడమనే విధంగా కార్మికుల ఆర్థిక స్థితిని అర్థం చేసేవి ఈ స్వగతాలు.

సింగరేణి గని కార్మికుడు అంటే సూర్యుడు దర్శించలేని చీకటి భూగర్భంలో బొగ్గుతోలుచు విగ్రహం అనీ, అవిశ్రాంత యోధుడని, అనారోగ్య పీడితుడనీ, నిరంతర ప్రమాధాల అంచున శ్రమకోర్చి భూదేవి బిడ్డడుగా బయట పడి నీలి పంట నందించేవాడని అర్థం అవుతాడు. ఈ కార్మిక శక్తియే రైళ్ళు నడవడానికి, ఫ్యాక్టరీలు పని చేయుటకు, విధ్యుత్‌శక్తిని పొందటానికి, తద్వార మానవ జీవన ప్రమాణ స్థాయిని పెంచగలిగేవిగా, దేశ సౌభాగ్యానికి మూల ఇంధనమైనదిగాను, అర్థం చేసుకోవడానికి సింగరేణి వృత్తులు అద్దం పడుతుంది. ✿

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# గరిమెళ్ళ సాహిత్యం - సూక్తులు

- డా॥ బూసి వెంకటస్వామి, శాఖాధిపతి, తెలుగు విభాగం, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు.

## పరిచయం :

జాతీయ కవి గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడు గ్రామంలో 1893లో జన్మించారు. ఈయన తల్లి సుంకమ్మ తండ్రి వెంకటనరసింహం. బాల్యంలో గరిమెళ్ళ సత్యనారాయణ గారికి రామకృష్ణమ్మ అను వ్యవహారిక నామం ఉండేది. గరిమెళ్ళ సత్యనారాయణ ప్రాథమిక విద్య వారి స్వగ్రామమైన ప్రియాగ్రహారంలో సాగింది. విజయనగరం, మచిలీపట్నం, రాజమహేంద్రవరం మొదలైన ప్రాంతాలలో గరిమెళ్ళ సత్యనారాయణ ఉన్నత చదువులు చదివారు. స్వాతంత్ర్య పోరాటంలో గరిమెళ్ళ సాహిత్య ప్రభావం తెలుగు ప్రజలపై ఎక్కువగా ఉందని చెప్పటంలో అతిశయోక్తి లేదు.

## గరిమెళ్ళ జీవితం :

గరిమెళ్ళకు బాల్యప్రాయంలోనే తన మేనమామ కుమార్తెతో వివాహం జరిగింది. గరిమెళ్ళ సత్యనారాయణ బి.ఏ. పట్టా పొందినవెంటనే గంజాంజిల్లా కలెక్టరువారి కార్యాలయంలో గుమస్తాగాను ఆతర్వాత విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగాను ఉద్యోగం చేశారు. మొదటినుండి గరిమెళ్ళ సత్యనారాయణ స్వేచ్ఛాజీవులు. 1920 డిసెంబర్ కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో సహాయనిరాకరణ తీర్మాణం ఆమోదించబడింది. మన స్వాతంత్ర్యాన్ని హరించివేసిన బ్రిటీష్ ప్రభుత్వానికి సహాయం చేయకూడదని ఆ ఉద్యమం ఆశయం. ఉరకలు వేసే ఉత్సాహంతో విద్యాధికులు, విద్యార్థులు ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. ఉద్యమం బలం పుంజుకోసాగింది. మహాత్మాగాంధీ శంఖారావం గరిమెళ్ళ సత్యనారాయణ వీణులకు విందు చేశాయి. వీరావేశంతో గరిమెళ్ళ సత్యనారాయణ ఆ ఉద్యమంలోకి దూకాడు. సహజంగానే స్వేచ్ఛాప్రియుడైన గరిమెళ్ళ గాంధీతో స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో 'మాకొద్దీ తెల్ల దొరతనం' అనే గొప్ప గేయం రచించారు.

గాంధీజీ ప్రోత్సాహంతో స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న గరిమెళ్ళను ఆంగ్లేయులు ఒక సంవత్సరంపాటు జైలులో బంధించారు. జైలునుండి విడుదలైన అనంతరం స్వాతంత్ర్య విప్లవగేయాలు నలుగురిలో గొంతెత్తి పాడటం మొదలుపెట్టారు. ఆ గేయాలు ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి. ఆ ప్రజలు కూడా తిరిగి వాటిని పాడసాగారు. ఇదంతా చూసిన ప్రభుత్వ అధికారులు గరిమెళ్ళపై మళ్ళీ రాజద్రోహం నేరంమోపి రెండు సంవత్సరాల కఠినకారాగార శిక్షకు గురిచేశారు. ఆయన శ్రీకృష్ణ జన్మస్థలంలో ఉండగా 1925 జనవరి నెలలో గరిమెళ్ళ తండ్రి వెంకటనరసింహం గారు చనిపోయారు. అయినా, గరిమెళ్ళ ఆంగ్లప్రభుత్వానికి క్షమాపణ చెప్పుకొని బయటికి రాలేదు. వారి అంతిమ సంస్కారాలు కూడా అందుకోలేకపోయారు. స్వాతంత్ర్య కాంక్షా దీక్షలు ఆయన ఆత్మాభిమానం అటువంటిది. చెరశాల నుండి విముక్తుడై గరిమెళ్ళ తన స్వస్థలానికి వెళుతుంటే ఎందరో ఆదర్శపూర్వకంగా ఆయనకు సన్మానాలు చేశారు. తదనంతరం ఆయనకు భార్యా వియోగం కూడా కలిగింది.

## గుణగణాలు :

గరిమెళ్ళ అనగానే ఆయన అకుంఠిత దేశభక్తి ప్రధానంగా స్ఫురణకురావడం పరిపాటి. ముమ్మూర్తులా ఆయన దేశభక్తుడు. రూపుగట్టిన అచ్చమైన దేశభక్తి. నిజమైన దేశభక్తుడు కనుకనే, కటికపేదరికం అనుభవించినా, పదవిలోవున్న కాంగ్రెస్‌వారుగాని, నాయకులుగాని తనను ఆదరించకపోయినా, మాకొద్దీ నల్లదొరతనం అనే గేయాన్ని వ్రాసి తన దేశభక్తిని చాటుకున్నాడు. చివరకు ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా దేశభక్తుడిగానే

కన్నుమూశారు. పేదరికం అన్ని అనర్థాలకు ఆలవాలమైనా, ఆయన పేదరికంతోనే యమయాతనలు పడ్డారు గానీ పదవులు ఆశించలేదు. అంత స్వతంత్ర ప్రవృత్తి ఆయనది!

గరిమెళ్ళతో బాగా పరిచయంగల వ్యక్తులలో టేకు మళ్ళ కామేశ్వరరావుగారు ఒకరు. రాజమహేంద్ర వరంలోనేకాక మదరాసులో కూడా ఆయన్ని తరచుగా కలుసుకునేవారు. గరిమెళ్ళ వేషధారణనే కాక ఆయన గుణగణాలనుకూడా కామేశ్వరరావుగారు ఇలా అభివర్ణిం చారు. ''ఆయన నలుపు అని చెప్పదగిన ఛాయ, మామూలు మనిషికంటే కొంచం ఎత్తరి. మోటుగా కనబడ తారు. పెద్ద నుదురు. ఒత్తైన క్రాపింగు, పెద్దకళ్ళు, గంభీరమైన చూపు. ఖద్దరును ధరించేవారు. బహు మితభాషి. మనం ఎన్నో ప్రశ్నలను వేస్తేగానీ సమాధానం రాదు. మాట్లాడడం మొదలుపెడితే అడ్డులేని వాగ్ఝరి. పెద్ద కంఠస్వరం. ఉద్రేకంతో మాట్లాడతారు.

గాంధీజీ సిద్ధాంతాలలో ఎనలేని విశ్వాసం కలవారు గరిమెళ్ళ. కనుకనే ఆయన మహాత్ముని నిర్మాణ కార్యక్రమంలోని వివిధాంశములు గురించి చక్కని గేయాలు వ్రాసి ప్రచారం చేశారు. మహాత్ముణ్ణి గురించి కూడా పెక్కుగేయాలు వ్రాశారు.

## గరిమెళ్ళ సాహిత్యం :

1921లో గరిమెళ్ళ 'స్వరాజ్య గీతములు' పుస్తకం వెలు వడింది. 1926లో ఖండకావ్యాలు, 1923లో హరిజనుల పాటలు మొదలైనవి వెలువడ్డాయి. 1926నాటికి భక్తిగీతాలు, బాలగీతాలు, మాణిక్యము, నూతన జాతీయ గీతాలు, అర్థత్రయ సర్వస్వము మొదలైన రచనలు గరిమెళ్ళ కలంనుండి వెలువడ్డాయి. గరిమెళ్ళ చాలాసార్లు జైలుశిక్ష అనుభవించారు. ముఖ్యంగా తిరుచ్చిరాపల్లి జైలులో ఉండేరోజులలో ఆయన యస్.యస్. కృష్ణస్వామి అయ్యంగార్, హాలాస్యం అయ్యంగార్ల వద్ద తమిళం నేర్చుకున్నారు. తత్ఫలితంగా తిరుక్కురళ్ వంటి అనర్ఘ రత్నాన్ని తెలుగు చేయగలిగినంత తమిళభాషా సాహిత్యం అలవరచుకున్నారు. గరిమెళ్ళ సత్యనారాయణగారు కన్నడ భాషా జ్ఞానాన్ని వృద్ధిచేసుకుందామని రాజమహేంద్ర వరంలో అప్పుడప్పుడూ టేకుమళ్ళ అచ్యుతరావుగారి ఇంటికి వెళ్ళేవారు. ఆతర్వాత కన్నడభాషపై స్వల్పంగా పట్టుసాధించి గరిమెళ్ళ సత్యనారాయణ 'తల్లికోట' అను కన్నడ నాటకాన్ని తెలుగులో అనువదించారు.

జాతీయకవిగా చిరయశస్సు గడించిన గరిమెళ్ళ సత్య నారాయణ వ్యాసరచయితగా కూడా ప్రసిద్ధుడే. ఆయన లేఖిని నుండి ఎన్నో వ్యాసాలు వెలువడ్డాయి. భారతి, ఆనందవాణి, కృష్ణా పత్రిక, త్రిలింగ, ఢంకా మొదలైన పత్రికలు వాటిని ప్రచురించాయి. గరిమెళ్ళ సత్య నారాయణ ఎన్నో రాజకీయ వ్యాసాలు వ్రాశారు. ఆ వ్యాసాలు త్రిలింగ, కృష్ణ మొదలైన పత్రికలలో వెలువడ్డాయి. ఆనాటి రాజకీయ వ్యాసాలలోకాంగ్రెస్‌పక్ష దృష్టితో ఆయన వ్యాసాలు రాశారు. ఆనాటి రాజకీయ లోకంలో గాంధీజీ ప్రముఖులు. గాంధీ సిద్ధాంతాలు, సూక్తులు అంటే గరిమెళ్ళ సత్యనారాయణకు మక్కువ ఎక్కువ.

## గరిమెళ్ళ సూక్తులు :

స్వాతంత్ర్యపోరాట సమయంలో గరిమెళ్ళ సత్య నారాయణ సూక్తులు ప్రజల హృదయాలలోనికి చొచ్చుకు పోయాయి. గరిమెళ్ళ దేశభక్తుడు, గాంధీజీ అనుచరుడు కావటం వలన గరిమెళ్ళ గీతాలు దేశభక్తికి ప్రబోధాత్మ కంగాను గాంధీజీ సందేశప్రధానంగానూ కనిపించాయి. గరిమెళ్ళ కవి కనుక ప్రచారాంశాలు సైతం ఆయన చేతిలో కమ్మని సూక్తులుగా అందాలుదిద్దుకున్నాయి. గరిమెళ్ళ సూక్తులలో ప్రజలను ఆకర్షించిన ప్రధానమైనవి -

'పడిన వృత్తులను పైకి తీయుదము
పంచమ జాతిని జనులారా మన పక్షము గొందము
మత మనగను మన యంత్యోన్నతికే'

కుల, మతాల మధ్య తారతమ్యాలు ఉండరాదని, భారతీయులందరు కలసిమెలసి ఉండి స్వాతంత్ర్యం సాధించుకోవాలని ఈ సూక్తి ప్రధానోద్ధేశ్యం.

ప్రేమ చేతనే పగతుని గెలుతుము
రక్త పాతములు రాక్షస మతమగు

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


సత్యమహింసలు జనులారా మన శస్త్రాస్త్రములు
శాంతము తగునో జనులారా అది శ్రేయమన్నింటికి

గరిమెళ్ళ కంఠంనుండి వెలువడిన ఈ సూక్తితో అహింసావాది అయిన మహాత్మాగాంధీ ప్రభావం ఉంది. శత్రువుని ప్రేమతోనే జయించాలని రక్తపాతాలు చేసే వారు రాక్షసులని, సత్యం, అహింసలు మాత్రమే మానవులకి ఆయుధాలుగా ఉండాలని ఈ సూక్తిలో ప్రధానోద్దేశ్యం.

ఏది యెట్టున్నను కార్యము కొనసాగించాల్సిందే
విరమించ వలెనన ఉద్దేశ్యము లేదు

సహాయ నిరాకరణ ఉద్యమం సమయంలో ప్రజలను స్వాతంత్ర్యపోరాటానికి సన్నద్ధంచేయటానికి ఈ సూక్తిని గరిమెళ్ళ సత్యనారాయణ ఉపయోగించారు.

కూలిపోతున్నది కూలిపోతున్నది
మూల మట్టము తోటి కూలిపోతున్నది ప్రభుత్వము
కూకటి వేళ్ళతో కూలిపోతున్నది మూర్ఖ ప్రభుత్వము

గాంధీజీ అధ్యక్షతన దేశమంతా జరిగే సహాయ నిరాకరణ ఉద్యమం తర్వాత ఆగ్లేయుల ప్రభుత్వం కూలిపోతుందని గరిమెళ్ళ సత్యనారాయణ తెలుగు ప్రజలకు ఈ సూక్తిద్వారా పిలుపునిచ్చారు.

**ముగింపు :**

స్వాతంత్ర్యపోరాట సమయంలో మహాత్మాగాంధీజీ ప్రభావంచేత ఆంగ్లేయుల పాలననుండి భారతీయులను స్వేచ్ఛాజీవులుగా మార్చేందుకు ఆంధ్రరాష్ట్రంలో స్వాతంత్ర్యరచనలు చేసిన ప్రధానమైన వ్యక్తి గరిమెళ్ళ సత్యనారాయణ 'మాకొద్దీ తెల్లదొరతనం' అంటూ తెలుగు ప్రజల హృదయాలను ఆకర్షించి, వారిని స్వాతంత్ర్య పోరాట వీరులుగా తీర్చిదిద్దటంలో గరిమెళ్ళ సత్యనారాయణ అగ్రగణ్యులు. గాంధీజీ సిద్ధాంతాలు, సూత్రాలను అమితంగా ప్రేమించే గరిమెళ్ళ సత్యనారాయణ తెలుగు జాతీయ కవులలో ఎన్నటికీ చిరస్మరణీయులే.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. కామేశ్వరరావు, టేకుమళ్ళ - నా వాఙ్మయ మిత్రులు, చిత్తూరు, 1996.
2. రాధాకృష్ణశర్మ, చల్లా - గరిమెళ్ళ సాహిత్యం, 1989.
3. శ్రీరామమూర్తి, మల్లెల - మృతవీరుని స్మరణ (కావ్యం), 1982.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# సాహితీ లోకంలో దేవులపల్లి రామానుజ రావు

– జె. శంకర్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

దేవులపల్లి రామానుజ రావు గురించి చర్చించడం అంటే తెలుగు వారి సాంఘీక, సాహిత్య, సాంస్కృతిక, చారిత్రిక, వైజ్ఞానిక ప్రగతి గురించి ప్రశంసించడమే. రామానుజ రావు గారు తెలంగాణ, ఆంధ్రాలోనే కాదు భారత దేశంలోని ప్రముఖ మేధావులతో, రాజనీతిజ్ఞులతో, విద్యావేత్తలతో, సాహితీ మూర్తులతో, కవి పండితులతో సన్నిహిత సంబంధాలున్నాయి. చరిత్రకు, సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలకు నెలవైన ఏక శిలానగరంలో పుట్టి, సాహిత్య, సాంస్కృతిక సంస్థల సాన్నిహిత్యంతో కవిగా, రచయితగా, పాత్రికేయులుగా, సంపాదకులుగా, ఉద్యమ నాయకులుగా చివరకు రాజకీయనాయకులుగా అనేక రకాలైన బాధ్యతలను నిర్వర్తించి తెలుగు నేలను సస్య శామలం చేశారు.ఈ క్రమంలోనే 1929 నుండి 1979 వరకు గల అర్థ శతాబ్దపుజ్ఞాపకాలను"యాభై సంవత్సరాల జ్ఞాపకాలు"గా తను విన్నవి,కన్నవి తన అనుభవాలుగా పాఠకులకు అందించారు.ఈ అర్ధ శతాబ్దపు జ్ఞాపకాలు అనేక రంగాలకు, ఉద్యమాలకు, వ్యక్తులకు సంబంధించినవి. ఈ జ్ఞాపకాలు భావి చరిత్రకు పునాదియై, నవతరానికి ప్రబోధమై నేటి తెలంగాణ రాష్ట్ర సాధనకు స్ఫూర్తి అయింది. ఇట్టి స్ఫూర్తిని మరో మారు స్మరించుకుందాం.

భారత దేశ చరిత్రలో 19 వ.శతాబ్దం తుది సగం,20 వ.శతాబ్దం మొదటి సగం చరిత్ర నిర్మాణం జరిగిన కాలం. 552 సంస్థానాలు మినహా భారత దేశం అంతా బ్రిటీష్ పాలనలో ఉంది. ఆనాటి తెలంగాణలోని 23 జిల్లాల్లో 10 జిల్లాలు అప్పుడు హైదరాబాద్ రాష్ట్ర సంస్థానంలోని నిజాం పరిపాలన క్రింద ఉంది.

నిజాం నిరంకుశ పాలనలో హైదరాబాద్ రాష్టం అంతా అల్లకల్లోలంగా ఉంది, అనుమతి లేనిదే ప్రజల శ్రేయస్సు కాంక్షించే పనులు జరుగడానికి వీలు లేదు. వాక్ స్వాతంత్ర్యం, సమావేశ స్వాతంత్ర్యం, ప్రాథమిక నియమాలు కఠినంగా ఉండేవి. 'గష్తినిషాన్ - 53' అనే ఘోరమైన ఉత్తర్వు ఒకటి ఉండేది. ఈ ఉత్తర్వునే ఒక మారు సురవరం ప్రతాపరెడ్డి గారు 'వాక్ నిబంధన శాసన శృంగార తాండవ శేషమని' వర్ణిచడం వల్ల నిజాం నిరంకుశ రణ రక్కసి ఎలా తాండవ మాడిందో అగుపడుతుంది. నవాబు జన్మ దినం నాడు కొంత మందిని ఆహ్వానించే వాడు ఆ సందర్భంలో హాజరైన వారు కనీసం ఒక 'అష్రఫీని' (బంగారు నాణెం) అయిన సమర్పించుకొవాల్సిందే లేదంటే దౌర్జన్యమే[2]. నవాబు ప్రతి వారిని అరే, తురే ధోరణితో మాట్లాడే వాడని నవాబు అహంకారాన్ని తెలియజేశాడు.

ఆ రోజల్లో నిజాం ప్రభువుకు 'సుల్తాన్ - ఉల్ - ఉలూమ్'అనే బిరుదు ఉండేది. అనగా అన్ని విద్యలకు ప్రభువని. ఈ ప్రభువు పాలనలో ఉన్న ప్రజల మాతృభాషా వికాసం నాడు సున్నా.అల్ప సంఖ్యాకులు మాట్లాడే భాష అధికారిక భాష. వారి విద్యకు సకల సౌకర్యాలు.

"తొంబదితో పది సమమను తురకలెక్కది యెన్నాళ్ళు
పోలీసుటండను దౌర్జన్య శక్తుల పోషణ పొందేదెన్నాళ్ళు
నల్లగొండలో నాజీ శక్తుల నగ్ననృత్య మెన్నాళ్ళు"

అని కాళోజీ ఆ రోజుల్లో ప్రశ్నించాడు.

ప్రత్యక్షంగా నిజాం సొంత ఎలుబడి కింద ఉన్న 'సర్ఫె ఖాస్' (హైదరాబాద్) ప్రాంతంలో ఒక హైస్కూల్ లేకుండేదన్న సంగతి ఆరోజుల్లో అందరికి తెలిసిన సత్యం. ఇటువంటి పరిస్థితుల్లో జీవించిన తన వంటి వారికి ఎన్నో జ్ఞాపకాలున్నవి అని రామానుజ రావు గారు చెప్పుకున్నారు.

కొన్ని సంవత్సరాలకు స్వాతంత్ర్యం వస్తుందనగా నిజాం అహంకార ధోరణి విపరీతంగా పెరిగి, భారత స్వాతంత్ర్యోద్యమం పట్ల వ్యతిరేకత, బ్రిటీష్ వారు

వెళ్లిపోతే స్వతంత్ర రాజును కావాలనే కోరిక అందు కొరకు ఉర్దూలోనే చదువాలనే మొండి పట్టుదల, ఇస్లాం మతం అనుసరించే వారు మిగతవారికన్న గొప్ప అనే భావన. ఈ అభిప్రాయానికి అనుగుణమైన ఆచరణ, ఇవన్ని ఆయనలో కరడుగట్టి ఉన్నది. వీటిని సాధించడానికి రజాకార్ వ్యవస్థని పురికొల్పాడు. ఉర్దూ భాషాభివృద్ధికి ఉస్మానియ విశ్వవిద్యాలయం వంటి విద్యా సంస్థలను ప్రోత్సాహించిన నిజాం, ఉర్దూ భాషా పారిభాషిక పదాల నిర్మాణానికి ఉపక్రమించాడు. కానీ అవేవి అధిక సంఖ్యాక ప్రజల ముందు నిలబడ లేదు. గాలీబ్, ప్రేమ్‌చంద్ వంటి వారి సాహిత్యమే మిగిలింది. ముఖ్దూమ్ వంటి మహాకవి ఆవిర్భవించినప్పటికి నిజాం ప్రోత్సాహించిన వారు మాత్రం కాదు, నిజాంను వ్యతిరేకించిన వారు. ప్రజల భాషను ఈ కాలంలో పూర్తిగా అణగదొక్కారు. ఆంధ్రోద్యమ నాయకులు కలుసుకున్నప్పుడు పరస్పరం ఉర్దూలో మాట్లాడుకోవడం నాకు జ్ఞప్తికి ఉన్న సత్యం అని తన జ్ఞాపకాన్ని ఈ సందర్భంగా వ్యక్త పరిచాడు.

ఆ రోజుల్లో తెలుగు వారిని గురించి కొందరు కవులు రాసిన మాటలు గమనించదగ్గవి

"ఏ భాషరా?నీది ఏమి వేషమురా?
ఈ భాష యీ వేష మెందుకోసమురా?"[5] అని
మందలించగా
మరొకరు "హలీయంచును, గాలిబంచును సదా
ఎఖ్బాలెపోషాయరిన్
చాల చాల నఫీసులుట్టిపడ మాషాల్లా రచించెన్
గదా" అని తెలుగువాని చిత్త వృత్తిని చిత్రించాడు.

ఐ.సి.యస్ లో ప్రవేశించి,పెద్ద ఉద్యోగాలు చేసిన ఒక విద్యాధిక యువకుడు

"ఒక వంక ఆంగ్లేయ సుకుమారి యిచ్చగింపుల తోడ
వల పింపదలచుచుండ
ముసుగులో దాగిలిమూతలాడుచు ఉర్దూ
భాషా వనిత వలల్ బరచుచుండ"

ఆనాటి అన్య భాషా వ్యామోహన్ని రమ్యంగా వెల్లడి చేసినాడు. అందు చేతనే ఆంధ్రుడు తౌరక్యాంధ్రుడుగా మారిపోయారని సురవరం ప్రతాపరెడ్డి గారు ఉద్ఘాటించిన సందర్భాన్ని రామానుజ రావుగారు తెలియజేశారు.

ఆ రోజుల్లో హైదరాబాద్ నగరాన తెలుగువారి సాంస్కృతిక కార్య కలాపాలకు శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయమే అడ్డాగా ఉండేది.1901 సంవత్సరంలో ఈ గ్రంథాలయం కొమర్రాజు లక్ష్మణ రావు ప్రోత్సాహం, మునగాల రాజు, రావిచెట్టు రంగారావు మొ॥న పెద్దల సహాయంతో ప్రారంభమై తెలుగు వారిని జాగృత పరిచింది. సురవరం ప్రతాప రెడ్డి, ఆదిరాజు వీరభద్ర రావు గార్ల తోడ్పాటుతో భాషానిలయం అభివృద్ధి చెందింది. ఈ నిలయ రజోత్సవం కావ్యకంఠ గణపతిశాస్త్రి గారి అధ్యక్షతన జరిగి తెలంగాణలోని కార్యకర్తలను సమీకరించి గ్రంథాలయోధ్యమ వ్యాప్తికి ప్రోత్సహించారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో అనేక సాహిత్య, సాంస్కృతిక ఉపన్యాసాలు జరిగేవి. 1904లో రాజరాజ నరేంద్ర భాషా నిలయం వరంగల్‌ల్లో స్థాపించారు. గౌలీ గూడలో బాల సరస్వతీ గ్రంథాలయం, నాంపల్లిలోని వేమన గ్రంథాలయం ఆ రోజుల్లో తెలుగు వారి చైతన్యాన్ని జాగృతం చేసిన సంస్థలు. గాడిచర్ల హరి సర్వోత్తమరావు, విశ్వనాథ సత్యనారాయణ, మల్లంపల్లి సోమ శేఖర శర్మ మొ॥లైన కవి పండితుల ఉపన్యాసాలు శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో విన్నాముఅని స్మరించుకున్నారు.

శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం రెసిడెంటల్ బజార్‌లో ఉండేది. ఈ ప్రాంతం బ్రిటీష్ వారి ఆధీనంలో ఉండేది కాబట్టి నిజాం నిర్భంధాలు ఇక్కడ ఉండేవి కావు. మాడపాటి హన్మంత రావు గారి ఆంధ్ర కుటీరం కూడా ఈ పరిసర ప్రాంతంలో ఉండేది. కాబట్టి కవి పండితులు ఎవరు వచ్చినా ఆంధ్ర కుటీరంలోనే సమావేశాలు జరిగేవి. ఆ రోజుల్లో హైదరాబాద్‌లో కొన్ని చిన్న చిన్న దర్బార్‌లు ఉండేవి. అందులో ఒకటి సురవరం ప్రతాపరెడ్డి కార్యాలయం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు ఇక్కడి ఉపన్యాసాలతో ఉత్తేజం పొందేవారు. నాంపల్లి గౌరీ శంకరమ్మ, డా॥ పి.వి.రమ ణయ్య మొ॥న వారు భాషా సేవకు కృషి చేశారు. అట్లే

మందమూల నర్సింగారావు గారిది మరొక దర్బార్ ఆయన 'రయ్యత్' అనే ఉర్దూ పత్రిక నడిపి హైదరాబాద్‌లో గొప్ప జాగృతిని కలిగించారు. రాజా బహదూర్ వేంకట రామారెడ్డి గారు పోలీస్ కమిషనర్ పందవి విరమించి నిజాం ప్రభువుతోను, ఇటు ప్రజలు, ప్రజా ప్రతినిధులతోను సత్సంబంధం కలిగి రెడ్డి విద్యార్థి వసతి గృహం, గోల్కండ పత్రిక, శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, ఆంధ్రోద్యమం మొ॥న సంస్థలకు పరోక్షంగా సహకరిచారు. భాగ్యరెడ్డివర్మ హరిజనోద్ధరణ చేపట్టి ఒక పత్రికను నడిపెవారు. చాదర్ఘాట్ వద్ద ఒ స్వగృహం ఉంది. ఇందు ఇప్పటికి బాలికల పాఠశాల నడుపబడు తున్నది. శ్యాం రావు, వీర వామననాయక్ గార్లు సంఘ సంస్కరణ, జాతీయోద్యమాలకు పట్టుగొమ్మగా ఉండి హైదరాబాద్‌కు కాంతినిచ్చారు. ఆదిరాజు వీర భద్ర రావు గారు చాదర్ఘాట్ హైస్కూల్లో తెలుగు పండితులుగా ఉండి శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయానికి, కొమర్రాజు లక్ష్మణ్‌రావు గారి 'విజ్ఞాన సర్వస్వ' నిర్మాణానికి, ఖండవల్లి లక్ష్మీరంజనం గారి 'సంగ్రహ విజ్ఞాన కోశ' నిర్మాణానికి, ఆంధ్రోద్యమ వ్యాప్తికి, సాంస్కృతిక వికాసానికి కృషి చేశారు.

ఆంధ్రోద్యమం మొట్ట మొదట సాంస్కృతిక ఉద్యమంగానే మొదలైంది. వివేకవర్ధిని కళాశాల ఆవరణలో విద్వాంసుడు, కార్వే విశ్వవిద్యాలయ స్థాపకుడైన కార్వే అధ్యక్షతన 1921 న జరిగిన సమావేశంలో మహారాష్ట్రులు, కన్నడులు, తెలుగువారు పాల్గొన్న ఆ వేదికపై టేక్ మాల్ రంగా రావు అనే న్యాయ వాది తెలుగులో ఉపన్యాసాన్ని ప్రారంభించగా సభికులు ఆయన ఉపన్యాసాన్ని సాగనీయ లేదు. ఆ సందర్భంలో తెలుగు వారంతా ఒక్కటై"ఆంధ్రజన సంఘం"ను స్థాపించారు. ఈ సంఘం ఆదర్శములన్ని సాంస్కృతిక ఆదర్శములే. ఈ సంఘమునకు జీవ గర్ర మాడపాటి హన్మంతరావు గారు. తెలంగాణలోని సమస్త జాతీయ వికాసానికి మూల పురుషులు. క్రమంగా 'ఆంధ్ర జన సంఘం' 'ఆంధ్ర మహా సభ' గా మారి ప్రజల హక్కులకై పోరాడే సంస్థ అయింది. తరువాత క్రమంలో ఆంధ్ర మహా సభ రెండుగా చీలిపొయి 1. జాతీయ మహా సభ 2. కమ్యూనిస్టు మహా సభలై గురుతర బాధ్యతలను నిర్వర్తించాయని రామానుజరావు గారు చేప్పుకొచ్చారు.

ఆ రోజుల్లో ప్రజలను మేల్కొల్పిన ఉద్యమాలు నాలుగని 1. ఆంధ్రోద్యమం-ఇది రాజకీయోద్యమంగా మారినది. 2. గ్రంథాలయోద్యమం-తెలంగాణ అంతటిని మేల్కొల్పింది. 3. ఆర్య సమాజ ఉద్యమం-జాతిని జాగృత పరిచింది. 4. పత్రికారంగం-తెలుగుపత్రిక, నీలగిరి పత్రిక, గొల్కోండ మొ॥న పత్రికలు నిద్రాణమై ఉన్న జాతిని చైతన్య పరచడానికి చారిత్రాత్మక మైన కృషిని కావించినవి. ఈ సాంస్కృతిక సంస్థలు, పత్రికల చరిత్ర మహెూజ్వలమైన అధ్యాయమని జ్ఞప్తి చేశారు.

"ఏ ప్రపుల్ల పుష్పంబుల ఈశ్వరునకు
పూజ సేసితినో ఏను పూర్వ మందు
కదల యేని పూర్వ జన్మ కలుగుగాక
మధుర మధురమైన తెలుగు మాతృభాష" అని రావు గారు తెలుగు భాషా, సాహిత్య, సంస్కృతుల పట్ల ఎనలేని అభిమానం చాటుకున్నారు. ఏ మార్గం వారినైనా నొప్పించకుండా తన మార్గంలో నిశ్శబ్దంగా పయనించే తిరుగులేని, ఎదురు లేని పథికులు. నిజాయితి, నిస్వార్థ సేవా పరాయణత రావు గారి గుణ సంపద. జాతీయ, నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నౌకలకు కర్ణదారులై విజయ పథాన నడిపిన అనన్య సామాన్యుడు. వీరు ఒక వ్యక్తి కారు, కొన్ని సంస్థల్ని పిండివడబోస్తే వచ్చిన చైతన్య శక్తి.

## ఆధార గ్రంథాలు :

1. దేవులపల్లి రామానుజరావు - యాభై సంవత్సరాల జ్ఞాపకాలు (1929 నుంచి 1979), ప్రచురణ సాహితీ బంధు బృందం, చైతన్య సాహితి, హనుమకొండ, వరంగల్. 1980.
2. దేవులపల్లి రామానుజ రావు - తెలంగాణలో జాతీయోద్యమాలు.

# ఆత్రేయ - ఎన్జీవో నాటకంలోని వాస్తవికత

- **డా॥ చిలకా అనిత,** తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

'మనసు'కవి మన'సుకవి'గా తెలుగు వారి మనస్సులో శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకొని ఆత్రేయ కలం పేరుగా అప్రతిహత రచనా పరంపరతో తెలుగు సాహిత్యానికి సొగబులద్ది సుమధుర పరిమళాలను వెదజల్లుతూ ఒకచిన్న కలం పేరుతో పెద్ద పేరు సంపాదించిన ఆత్రేయ అసలు పేరు కిళాంబి వెంకట నరసింహాచార్యులు. ఈయన 1921లో నెల్లూరు జిల్లా మంగళంపాడులో జన్మించారు. గుమస్తాగా, పత్రికా ఉపసంపాదకుడిగా పనిచేస్తూ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళాడు. నాటకాలు విరివిగా వస్తున్న కాలంలో సామాజిక స్పృహ కలిగి తనవంతుగా అనేక నాటకాలు రాసిన నేపథ్యం ఆత్రేయ గారిది. కప్పలు, భయం, విశ్వశాంతి, ఈనాడు, ఎన్జీవో, వాస్తవం, పరివర్తన లాంటి ఎన్నో నాటకాలను సమాజ పోకడలలో భాగంగా ఈయన కన్నులకు కట్టినట్లు రాశారు. ఈయన రాసిన నాటకాల్లో పేరెన్నికగన్న నాటకం 'ఎన్జీవో' ఇది ఈయన కీర్తి ప్రతిష్టలను ఉన్నత శిఖరాలపై ఉంచింది అనుటలో ఎటువంటి సందేహం లేదు. ఇది సగటు సామాన్యుని జీవితం కాబట్టి ఈ నాటకం తెలుగు నుండి హిందీ, కన్నడంలోకి కూడా అనువదించబడింది. ఈ నాటకంలో అద్దె ఇంటి అగచాట్లు, వరకట్న సమస్య, మధ్యతరగతి వ్యక్తుల మనస్తత్వాలు, సర్దుబాట్లు, అహం మొదలైన అంశాలను ఈ నాటకంలో వ్యంగ్యంగా చెప్పారు. దీనికి మొట్టమొదట 'అద్దెకొంప' అని 'గుమస్తా' అని పేరు పెట్టారు. ఆత్రేయ గారు ఈ నాటకం గురించి "ఇది నా తృతీయ కావ్యపుష్పం, ఎన్జీవో అన్న పేరేగాని మధ్యతరగతి కుటుంబాలు అందులోను పట్నవాసుల అగచాట్లు, మనస్తత్వం, ప్రెస్టేజీ పేరిట పడుతున్న ఆర్థిక, సాంఘిక బాధలు చిత్రించడానికి ప్రయత్నించాను" అని చెప్పారు.

పూరిపాకలో ఉన్నవాడు ఉన్నదాంట్లోనే తృప్తిగా బ్రతుకుతాడు. ధనవంతుడికి ఏమి కొదవ ఉండదు. ఎటొచ్చి మధ్యతరగతి మందభాగ్యులకే ఇబ్బందులు. చాలీచాలని కొంపల్లో సమస్యల సుడిగుండంలో తుమ్మితే ఊడిపోయే ముక్కు చందాన మధ్యతరగతి సమస్యలను మనముందు ఆత్రేయ ఆవిష్కరించారు.

ఈ నాటకంలో గవర్నమెంటు ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తున్న రంగనాథం మధ్యతరగతిలో పుట్టిన నిర్భాగ్యుడు. సాలెగూడు లాంటి సమస్యల వలయాలలో నుండి బయటపడలేక బ్రతకడానికి నానా అవస్థలు పడే పాత్రకు ప్రతినిధిగా చెప్పుకోవచ్చు. ఇందులో రామనాథం భార్యగా సీత, డాక్టర్‌గా రంగనాథం స్నేహితుడు. ధనిక-బీద తారతమ్యాన్ని విమర్శించేపాత్రలో గోపి యొక్క సోషలిస్టు భావాలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. రంగనాథం తండ్రి ముసలాయన, శేఖర్, గుప్తా మొదలైన పాత్రలు ఇక్కడ మనం గమనిస్తాము. సమస్యలను మాత్రమే కాకుండా దాని వెనకనున్న ఫాల్స్ ప్రిస్టేజి, మూఢ నమ్మకాలు, అజ్ఞానం లాంటి ఎన్నో అంశాలను చూస్తాము.

రంగనాథానికి వచ్చే చాలీ చాలని జీతంలోనే భార్య, ఇద్దరు బిడ్డలు, తండ్రి, తమ్ముడు గోపి, చెల్లి ఇంత మందిని పోషించాలి. అలాగని వారందరూ ఉండడానికి లంకంత కొంప, కారు, అద్దె ఇల్లు. అది ఇల్లా అంటే అదీకాదు. ఇల్లుగా మార్చబడిన మోటారు షెడ్డు. అద్దె 30 రూపాయలు ఇంటి ఓనరు గుప్తా లౌక్యం తెలిసిన వాడు. ఎలక్ట్రిక్ లైట్లు వేయిస్తానని వేయించడు. కుళాయి బాగు చేయిస్తానంటాడు చేయించడు. మురుక్కాలువ మూయిస్తానని మూయించడు. అటువంటి వాడి దగ్గర బండెండు సంసారంతో జీవితాన్ని ఈద సాహసిస్తాడు రంగనాథం. ఇక్కడ కేవలం అద్దె కొంపల్లో ఉండే మధ్యతరగతి జీవుల కష్టాలనే కాదు కనీసవసతులు కల్పించకుండా నెల నెల ఖచ్చితంగా అద్దె వసూలు చేసే దోపిడి దారుల మనస్తత్వాన్ని కూడా చూపారు రచయిత. కుటుంబమంతా ఒకే పెద్ద గదిలో ఉండాలి. అందువల్ల పెళ్ళీడు

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

కొచ్చిన చెల్లిని తన మేనమామ వద్ద ఉంచుతాడు రంగనాథం.

తన తండ్రికి పక్షవాతం అయినా విధిలేని పరిస్థితిలో వరండాలోనే పడుకోబెడతారు. చుట్టూ మురుగు కాలువలు ఉన్నందున రంగనాథం పిల్లలిద్దరికి దగ్గు, జ్వరం. వారిని పక్కింటి వాళ్ళని బ్రతిమలాడి ఆ ఇంట్లో పడుకోబెట్టక తప్పని పరిస్థితి. ఆ ఇంటిని దొరకపుచ్చు కోవడానికి కనాకష్టమైపోయింది. ఇన్ని రోగాలుకు కారణం అద్దె కొంపే. తలదాచుకోడానికి నీడ కోసం ఇటువంటి ఇంట్లో ఉండడానికి సగటు మధ్యతరగతి జీవులు ఉం డడం అనివార్యమైంది. కనీస వసతులు కూడా కల్పించని యజమానులను నిలదీస్తే దౌర్జన్యాలకు కూడా వెనుకాడని పరిస్థితి.

అనేకమైన షరతులకు ఒప్పుకొని ఇంటిని దక్కించు కోవడం సాధారణమైన విషయం కాదు. ముప్పై రూపా యలు అద్దె చెల్లించినా రసీదు మాత్రం పది రూపాయలకే ఇవ్వడం కుళాయి లేకపోవడం, తోటలో పిల్లల్ని తిరగనివ్వకపోవడం, రాత్రి పది కాగానే లైట్లు ఆర్పి వేయడం, బ్రహ్మచారులకు ఇల్లు ఇవ్వకపోవడం లాంటి షరతులను పెట్టిసామాన్యులను నిలువు దోపిడికి గురిచేసే ధనిక వర్గ దోపిడి స్వభావాన్ని తెలిజేస్తుంది.

సగటు ఎన్జీవోకు ఆఫీసే ఇల్లు. ఆఫీసే పెళ్ళాం బిడ్డలు. ఇంటికొచ్చినా ఆఫీసుపనే. పేరుకే ఆఫీసరు పైన పటారం లోన లోటారం అంటారు రంగనాథం స్నేహితుడైన డాక్టరు. ఈ సన్నివేశంలో రంగనాథం, డాక్టర్‌ల మధ్య నడిచిన సంభాషణలో మధ్యతరగతి జీవుల జీవితం బరువెక్కిన వైనాన్ని స్పష్టం చేశారు. డాక్టర్ దృష్టిలో రంగ నాథం ఇల్లు ఒక పశువుల పాక. అంతేకాకుండా ముందు చూపులేకుండా పిల్లల్ని కనడం వారి యొక్క బరువు బాధ్యతలను ఎలా పెంచాలనే ఆలోచనలేదని అని అంటూ రేపు వాళ్ళు మీ ప్రాణానికి ఉసురుమంటూ ఈ వెధవ బ్రతుకు ఎందుకురా ఏ నుయ్యో గొయ్యో చూసు కోడానికా'' అని డాక్టరు అన్నమాటలు నాటకం చదువు తున్న ప్రతి ఒక్కరిని ఆలోచింపచేస్తాయి.

పూరిపాకల్లో ఉన్న పేదవాడిని చూసి వాడికన్నా నేనే నయం సంబరపడిపోయే సగటు మానవుడు మధ్య తరగతి వారికి పోటీగా పూరిపాకల్లో ఉన్న వాడు బ్రతికితే మధ్యతరగతి మనిషికి ఓర్వలేని తనం ఏర్పడడం మాన సిక బలహీనతలో భాగంగా అనవసర బేషజాలకు పోవడం - రోజు రోజుకి కాళ్లు చేతులు చచ్చుబడిపోతున్న రంగ నాథం భార్య రాసిచ్చిన మందులు కొనుక్కునే స్థోమత లేక "వారొచ్చే సరికి ప్రతి రోజు తొమ్మిది పది అవుతుంది కొట్లన్నీ కట్టేస్తున్నరట'' అని డాక్టర్‌తో అబద్ధం చెప్పడం వాస్తవానికి మందులు కొనే స్థోమత లేకపోయినా అహం ఒప్పుకోలేదు. తాను అబద్ధమాడుతున్నానని తెలిసినా మనస్సు చంపుకోవాల్సిన స్థితి మధ్యతరగతిది.

ఇంటికొచ్చిన వారికి కూర్చోమని ఆనవాయితీగా అనడం తప్ప నిజానికి కూర్చోడానికి కుర్చీలుండవు. కాఫీ తాగుతారా? కాఫీ ఇచ్చావా లేదా అని రంగనాథం గద మాయింపు మధ్యతరగతి యొక్క ఫాల్స్ ప్రిస్టేజి ఏ స్థాయిలో ఉంటుందో తెలుసుకోవచ్చు. డబ్బుల్లేక పోయినా పస్తులుంటానికి సిద్ధపడతారు కాని ఏదో ఒక పని చేసి నాలుగు రాళ్ళు సంపాదించాలనుకోరు. అన్నింటి కన్నా పరువు, ప్రతిష్టలకు అగ్రతాంబూలం ఇస్తారు. మధ్య తరగతి మందభాగ్యులు.

పండ్లపొడి అమ్ముకోవడం నేరమైనట్లు గోపిపై రంగ నాథం "ఎంత వెధవ బతుకు బతుకుతున్ను బస్ స్టాండుల వద్ద పళ్ళపొడి పొట్లాలమ్మే గతి పట్టదులే'' అని నోరు పారేసుకున్నవైనం. ''నేను బ్రతికుండగా ఇదెక్కడి అప్రతిష్ట'' అని అన్న ముసలాయకి ఎదురుతిరిగిన గోపి "మనం పస్తులుండాలికాని ఇటువంటి పనులు చెయ్య కూడదు. పిల్లలు రోగాలతో కుళ్ళిపోవచ్చు, వాళ్ళకు చొక్కాలు లేకపోవచ్చు. అప్పుల వాళ్ళు నానా బూతులు తిట్టవచ్చు. మురుక్కాలవ పక్కన షెడ్డులో జీవించవచ్చు. చింతతో తిండిలేక విశ్రాంతి లేక చివికి చావవచ్చు. నీతిని అమ్ముకోవచ్చు'' అన్నమాటల్లో మధ్యతరగతి బ్రతుకు బేష జాలకు పోయి లోపల చిరుగులున్నప్పటికి పైన మడతల కోటు వేసుకోవాలి అనుకుంటారు అన్న విషయాన్ని విశదపరుస్తుంది.

ఇవేమి చాలవన్నట్లు. మూలిగేనక్కపై తాడిపండూలా చాదస్తాలు ఆచారాలు మధ్యతరగతి జీవులపై పడుతుంటాయి. ఇక గుమస్తా జీవితం సమస్యలవలయం. ఇంటి అద్దె, పాలు, కాలేజీ ఫీజులు, అవసరాలు ఎక్కువ రాబడి తక్కువ. గొర్రె తోక బెత్తెడు లాగా చాలీచాలని జీతంతో ఇంట్లో వస్తువుల్ని తాకట్టు పెట్టి బ్రతకాల్సిన పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో మధ్యతరగతి వర్గం గత్యంతరం లేని పరిస్థితుల్లో అవినీతి బాట పయనించి సమాజంపై ప్రభుత్వం పై తిరగబడడం జరుగుతుంది. మొదటి వర్గానికి ప్రతినిధిగా రంగనాధం రెండవ వర్గానికి ప్రతినిధిగా గోపి ఉంటారు.

ఒకవేళ లంచం తీసుకోవడానికి అలవాటు పడినా ప్రశాంతత లేక మనో వ్యాకులతలో ఆందోళనతో మధ్యతరగతి జీవి నలిగిపోతాడు. మానసిక రోగిలా తాయారై ఇంట్లో వారిపై తన ప్రతాపాన్ని చూపి చివరకు తనువు చాలించాలనే తలంపు రావడమే దీనికి పరాకాష్ట. ‘‘హాయిగా ఒక్క రోజైనా ప్రశాంతంగా చీకు చింతా లేకుండా ఉండే కాలం వస్తుందా? మన బ్రతుకుల్లో’’ అన్న రంగనాధం మాటలను బట్టి మధ్యతరగతి వర్గం ఎంతటి అల్ప సంతోషులో అర్థం చేసుకోవచ్చు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని సంబరాలు జరుపుకుంటున్న సందర్భంలో మరోవైపు సామాజిక రుగ్మతలపై దృష్టి సారించమంటూ రచయిత హెచ్చరించినట్లుగా భావించవచ్చు. ఆర్థిక స్థితులు సరిగాలేకపోతే నైతిక పతనం తప్పదు. అని సందేశాన్ని అందించింది. ఎన్జీవో నాటకం.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# మార్గదర్శకమైన మాస్టార్జీ సాహిత్యం

- ముత్తారెడ్డి రాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, తెలంగాణ విశ్వ విద్యాలయం, నిజామాబాద్, తెలంగాణ.

"తాలిల్లే లిల్లియలో / శివతాలిల్లే లిల్లియలో / మా శివతాలిల్లే లిల్లియలో" అనే పాట జానపద సాహిత్యంలో మొదటి గేయం. ఇది ఆది కాలం నుండి ఈనాటి వరకు కూడా జానపదులు, దళితులు పాడుకునే సుప్రసిద్ధ గీతాలలో ప్రధానంగా స్థిరపడి పోయింది. చిందుబాగోతులు ఈ గీతాన్ని సంగీత, నృత్యాభినయాలతో ప్రదర్శిస్తుంటారు. ఈ గీతం ఎన్నో గీతాలు ఉద్భవించటానికి మాతృక అయింది. సంఘ సంస్కరణలో భాగంగా దళితేతరులు రాసిన గీతాలు అనేకం పుట్టాయి. గురజాడ అప్పారావు 1911లో లవణరాజుకల అనే గీతిక ఆంధ్ర భారతిలో అచ్చయింది. "మంచి చెడ్డలు మనుజులందున/ యెంచిచూడగ, రెండే కులములు/ మంచియన్నది మాల యైతే / మాలనే అగుదును" అని కులాలను బట్టి గాక మంచి చెడ్డలనేవి స్వభావాన్ని బట్టి మాత్రమే ఉంటాయని స్పష్టం చేసాడు. అలాగే మాదవపెద్ది బుచ్చి సుందర రామశాస్త్రి ఇలా అన్నారు. "అంటరాని వారెవరు? మా వెంటరానివారే" అంటూ ప్రగతి పథంలో మానవత్వపు దారుల్లో నడవని వారే నిజమైన అంటరానివారని తేల్చి చెప్పారు.

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి/ అందారు ఒక్కటై ఉండాలి సక్కంగా/ కష్టమ్ము లొచ్చిన నిష్టూరమొచ్చిన/ ఇష్టమ్ముగా నుండి కట్టూగ నుందాము" అంటూ మహారాజుల ఎల్లయ్యదేవ్ జాతీయ సమైఖ్యతను కోరుకుని రాసాడని సంపాదకులు జాంబవశాస్త్రి తన దళితజ్యోతి పత్రికలో 1969లో డిశెంబర్ మాసంలో వెలువరించారు. నాటి నేపథ్యాన్ని గమనించి... మహాద్భుతాలైన గేయాలను సృజించుకున్న కవి వాగేయకారుడు ఎవరయ్యా అంటే....

"కవీ... ఓ కళాకారుడా/ కవయిత్రీ.. ఓ కళాకారిణీ/ అటా ఇటా నువ్వెటు వైపూ/ ఎటో తేల్చుకో ఇటో తేల్చుకో"... అని సాహిత్యంలో ఆనాడు ఆ కవులకు, కళాకారుల కోసం రాసిన వాక్యాలు ఈనాడు కూడా ఎంతో మంది రచయితలు, కవులు, కళాకారులు మార్గనిర్దేశం చేసుకోటానికి స్ఫూర్తినిస్తాయి. ఇలా అందరినీ ఆలోచింప చేసేవిధంగా కవులకు, కళాకారులకు, రచయితలకు గురువు లాంటి వాడు. ఈ నేపథ్యంలో గద్దార్‌లాంటి వారికే గురువుగా పరిగణించ పడిన వాగ్గేయ కారుడు... ఒక చైతన్య కెరటం, ఒక గొప్ప ఆదర్శనీయుడు ఎవరయ్యా అంటే...

ఎంతోమంది హృదయాలను తట్టిలేపిన పాట, నేడు దళితోద్యమంలోనూ, సభల్లోనూ, సమాశాల్లోనూ అంబేద్కర్ సంఘాలలోనూ దళితులంతా పాడుకునే అత్యద్భుతమైన పాట... " అందుకో దండాలు - బాబా అంబేద్కరా/ అంబరాన ఉన్నట్టి -సుక్కలు గురువంగో / ముందుగా నినుదలచి -పాటలు పాడేము/ చీకటి మా బ్రతుకుల్లో సూర్యుడు పొడవంగో/ అందుకో దండాలు - బాబా అంబేద్కరా" అని ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా దళితులు జాతీయ పాటగా కొనసాగుతున్న ఈ పాట అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం అయ్యింది. తెలుగులో ప్రతీ దళితుని గొంతుక నుండి వినిపింప చేసిన వాగ్గేయకారడు ఎవరయ్యా అంటే...

## మాస్టార్జీ...

మాస్టార్జీ అసలు పేరు గంగాధరి శ్రీరాములు. తొలి రోజుల్లో తన అసలు పేరుతోనే సాహిత్య రంగంలో అడుగు పెట్టి, ఆ తర్వాత మాస్టార్జీ కలం పేరుతో సాహిత్య లోకంలో స్థిరపడ్డారు. 1977లో నటరాజ కళాసమితిని స్థాపించాడు. అభిరుచి గలిగిన పిల్లలను కళాకారులుగా తయారు చేసేవాడు. తాండూరులో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే... తీరిక సమయాల్లో నృత్య, గాన, సంగీతాలను నేర్పించేవాడు. 1977లో సెయింట్ మార్క్స ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నృత్యం నేర్పిస్తున్నపుడు ఆ

పాఠశాల సైన్సు టీచర్ కుమారి వసుందర మాస్టార్జీ అని పిలువటంతో విద్యార్థులు కూడా మాస్టార్జీ గానే పిలిచే వారు. ఆ పేరే కలం పేరు అయితే బాగుంటుందని వసుంధర సూచించడం వల్ల నాటి నుండి మాస్టార్జీ గానే పలిచుకోవడం జరుగుతుంది. ఇలా గంగాధరి శ్రీరాములు మాస్టార్జీగా నామాంతరం చెంది మాస్టార్జీ గానే ప్రఖ్యాతుడయ్యాడు. సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ప్రముఖ స్థానాన్ని పొందారు. మాస్టార్జీ పూర్వీకులు మెదక్ జిల్లా గజ్వేల్ తాలూకా, అనాజ్ పూర్ గ్రామ వాసులు. ఆ రోజులలో ఈ ప్రాంతం నైజాం పాలనలో ఉండేది. అయితే గ్రామాలలో మాత్రం దొరలు, భూస్వాములు, పటేండ్లు మొదలైన వారంతా అధికారులుగా చెలామాణి అయ్యేవారు. వీరు ఇతర కులాల వారిచే వెట్టి పనులు చేయించుకునేవారు. మాస్టార్జీ తండ్రి రాజయ్య. తాత శివయ్య. ఇద్దరూ దొరల వద్ద పాలేరులుగా పని చేసేవారు. వీరి కుటుంబమంతా కలిసి ఎంత వెట్టి పనులు చేసినా కుటుంబ పోషణకు కష్టమయ్యేది. ఇందుకు తీరిక సమయాల్లో వ్యవసాయానికి అవసరయమయ్యే నులుక తాళ్లు అల్లుకునేవారు. వాటిని అమ్మడానికై సికిందరాబాదులోని కంటోన్మెంటు ప్రాంతానికి నెలనెలా వచ్చేవారు. కొంతకాలం తర్వాత ఇక్కడి బొల్లారం వారితో తాత శివయ్యకు మంచి పరిచయాలు ఏర్పడ్డాయి.

మాస్టార్జీ తండ్రి రాజయ్య 10 ఏండ్ల బ్యాలం లోనే పాలేరుగా ఉన్నపుడు దొరలు పెట్టే బాధలు పడలేక ఊరు విడిచి పారిపోయి బొల్లారం చేరుకుంటాడు. అప్పటికే రాజయ్యకు చంద్రమ్మతో బాల్య వివాహం జరిగింది. బొల్లారం వచ్చిన రాజయ్య భుక్తి కోసం కూలీ పనులు చేస్తూ చివరికి మిలటరీలో తోటమాలిగా చేరాడు. కొన్ని సంవత్సరాలకు రాజయ్య బొల్లారం వాస్తవ్యురాలైన సత్తెమ్మను భార్యగా వివాహం చేసుకున్నాడు. వీరికి జన్మించిన బిడ్డడే మాస్టార్జీ. బొల్లారం కంటోన్మెంటు రిజాల బజారు హాస్పిటల్‌లో 7-9-1952 లో జన్మించిన మాస్టార్జీ విద్యాభ్యాసానికి ఎన్నో అవరోధాలు కలిగాయి. ఆర్థికంగానూ కుటుంబ పరంగాననూ, సామాజిక పరంగా తన చదువులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

గంగాధరి శ్రీరాములు బాల్యం బొల్లారంలోనే గడిచింది. తను ఇక్కడే పుట్టినా ఇక్కడే పెరిగినా సమాజంలో కుల భేదాలు ఉండటం వల్ల ఆయన జీవితానికి అవాంతరాలు ఎదురయ్యాయి. తాను పెరిగి పెద్దవాడవుతున్న కొద్దీ వివక్ష పాటించేవారి పట్ల ఆలోచన మెదులుతూనే ఉంది. తాను బడికి వెళ్లక ముందు తోటి వారితో కలిసి ఆటలు ఆడు కోవలసి వస్తే ఎవరు దగ్గరకు రానిచ్చే వారు కాదు. "ఎందుకు నన్ను వీళ్లతో కలిసి ఆడనివ్వడం లేదు? అన్ని ఆటల్లో కూడా నేనే ముందుండేవాడిని కదా! అని ఎందుకు నన్ను దూరంగా ఉంచుతారు." అని తన మనసులో తానే బాధపడేవాడు. ఏ బజారుకు వెళ్లినా తనని తక్కువగా చూస్తూ దూరంగా మసలేవాళ్లు. కుటుంబంలో కూడా మొదటి వాడు అయినందు వల్ల తన తర్వాత చెల్లెలును చూసుకోవడం కోసం ఇంటి వద్ద ఉండవలసి వచ్చింది. ఎందుకంటే ఆ రోజులలో కుటుంబ సభ్యులందరూ పనులకు వెళ్లితేనే జీవనం గడిచేది. తనకు చదువుకోవాలనే కోరిక మనసులో బలంగా నాటుకు పోయింది. "నేను చదువుకుంటాను" అని ఇంట్లో వత్తిడి చేయటం వల్ల అతని తల్లిదండ్రులకు కూడా తన కొడుకును చదివించాలనే కోరిక కలిగింది. మరల అదే పాఠశాలలో 3వ తరగతిలో చేర్పించారు. దీంతో మాస్టార్జీ జీవితం మలుపు తిరిగింది. కులవివక్షతను అనుభవిసస్తూ... ఎనిమిదవ తరగతి వరకు తన చదువును పట్టుదలతో కొనససాగించాడు. వేరే కులం వారు మాస్టార్జీని తమలో కలువనిచ్చే వారు కాదు. కొంతమంది దూరం కొట్టేవారు. ఇంకొందరు దూరంగా ఉండేవారు. ఇవన్నీ గమనించాడు. తన హృదయం పగిలి కుల వివక్షతను వ్యతిరేకించటం మొదలు పెట్టాడు. అలాగే ఇంట్లో పరిస్థితిని కూడా అర్థం చేసుకొని తండ్రికి చేదోడు వాదోడుగా పని చేసి పెడుతుండేవాడు. మాస్టార్జీ గేదెలను, ఆవులను మేపుతూ వాటి ద్వారా పాల వ్యాపారం చేస్తూ చదువుకునేవాడు.

మాస్టార్జీకి ఒక మంచి లక్షణం ఉంది. కుండబద్దలు కొట్టినట్లు ముక్కు సూటిగా మాట్లాడేవాడు. ఇది నచ్చని

వారంతా మాస్టార్జీని ఒకరౌడీగా చిత్రించారు. దీని మూలంగా తోటి విద్యార్థులతో అన్యోన్యంగా మెలగడానికి అవకాశం ఉండేది కాదు. ఇతనితో తిరిగే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలని మందలించేవారు. అందు కని ఎవరూ కూడా ముందుకు వచ్చి స్నేహాన్ని కోరుకునే వారు కాదు. ఎందుకంటే తక్కువ కులం వారిని అంటు కుంటే మైల పడతామని తోటి విద్యార్థుల తల్లిదండ్రులు వారికి చెప్పేవారు. వారు మాస్టార్జీతో స్నేహం చేయాలంటే ఇతర విద్యార్థులకు భయంగా ఉండేది. మాస్టార్జీ ఆకలినైనా, కష్టాలనైనా భరించేవాడు కానీ 'నీవు తక్కువ కులం వాడివి' అని ఎవరైనా అంటే మాత్రం రాజీపడేవాడు కాదు.

తెలంగాణ ఉద్యమంలో భాగంగా 1968లో పాఠ శాలలు మూసి వేయటంతో చదువు ఆగి పోయింది. తర్వాత 1974లో మళ్లీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మెట్రిక్యులేషన్ చదివాడు. 1976లో ఆంధ్రమహా విద్యా లయం కాలేజీలో ఇంటర్మీడియేట్ కోర్సు చేసాడు. 1983లో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో మొదటి బ్యాచ్‌లో బి.ఏ తెలుగు లిటరేచర్ పూర్తి చేసాడు. 1992లో సిద్ధాంతి లా కాలేజిలో ఎల్.ఎల్. బిలో చేరి 1995లో ఉత్తీర్ణుడయ్యాడు.

"ఎవడైతే కులహీనుడవని నిన్ను వెలి వేస్తారో/ తమ ఈర్ష్యకు మన దళితులను బలి చేస్తారో" వారిని మట్టు బెట్టడానికి దళితులంతా ఏకం కావాలి, కలిసి కట్టుగా పోరాడాలి అని దళితులకు పోరాట స్ఫూర్తినిచ్చిన మాస్టార్జీ బాల్యం నుండి తనకు ఉద్యోగం వచ్చేవరకు కూడా సమాజంలో ఎన్నో బ్బందులను సవాలుగా తీసుకొని అన్ని కష్ట నష్టాలను స్వీకరించి వాటిని ఎదుర్కోవడానికి అహర్నిశలూ కృషి చేయ వలసి వచ్చింది. కష్టాలను ఎదు ర్కోవాలంటే జీవితంలో చదువే ముఖ్యమని భావించాడు. ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ వాటిని అధిగమిస్తూ చదువులో అంచెలంచెలుగా ముందుకు సాగడం ఆయన విద్యా మనుగడ దీక్షకు నిదర్శనం. తాను విజ్ఞానవంతుడై పొందిన విజ్ఞానాన్ని ఇతరులకు పంచడంలో నాటి నుండి నేటి వరకు కూడా కృషి చేస్తున్న మాస్టార్జీ ఎందరికో మార్గదర్శకులుగా వెలుగొందుతున్నారు.

❀❀❀

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# వ్యక్తి స్వేచ్ఛకు సమాజ శ్రేయస్సుకు అంతస్సూత్ర వారధి 'నీల'

– డా॥ స్వర్ణలత గొట్టిముక్కల, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

The truth is, I often like women. I like their unconventionality. I like their completeness. I like their anonymity....Virginia woolf.

మార్పు అనేది చాలా స్వాభావికమైనది. గత అర్ధశతాబ్ది మానవజీవితాల్లో వేగంగా మార్పులను తీసుకొచ్చింది. ముఖ్యంగా స్త్రీ జీవితంలో. ప్రతి దశలోనూ సవాళ్ళతో సహవాసం చేసిన మహిళ ఒక సంక్లిష్టత నుండి మరో సంక్లిష్టతకు ప్రయాణం చేస్తోంది. ఒకప్పుడు ఆదరణకోసం, విద్యకోసం అవకాశాల కోసం తపించిన స్త్రీ నేడు అస్తిత్వం కోసం, స్వేచ్ఛకోసం తనదంటూ ఉండే చోటు కోసం తపిస్తోంది. వృత్తి, ఉద్యోగం, ఉద్యమాల్లో మమేకమైన స్త్రీ నిత్యం ఎదురయ్యే ఆకర్షణలను అర్థవంతంగా మలచుకుంటూ స్వేచ్ఛను పునర్నిర్వచిస్తోంది.

బ్రతుకే బందిఖానా అయినప్పుడు, పేదరికం తప్ప మరేదీ కనబడనపుడు కేవలం ఆత్మాభిమానం, ఆత్మ విశ్వాసం ఉచ్ఛ్వాస నిశ్వాసలై నడిపిస్తే, జీవితం పోరాటమై విజయపతాకను ఎగరేస్తే.... ఆ జీవితమే 'నీల'. స్వేచ్ఛను, సాహచర్యాన్ని ఏకకాలంలో కోరుకొని వాటిని సాధించు కున్న ఒక స్వేచ్ఛా పిపాసి నీల.

రచయిత్రి కె.ఎన్. మల్లీశ్వరి అనేకానేక అనుభవాల నీడలపై పరుచుకున్న నీల జీవితాన్ని ప్రాతిపదికగా ఎంచుకోవడం చేత, ఆ అనుభవాల మూలాలను విస్తా రంగా చర్చించి బహుముఖ సమాజాన్ని ప్రతిఫలించే అవ కాశం ఈ నవలకు కలిసివచ్చిన అంశం. అందుకే నేటి సమాజానికి స్ఫూర్తినిచ్చిన నవలగా 'తానా' బహుమతిని అందుకుంది. వివిధ వ్యక్తుల వ్యక్తిత్వాలను తీర్చి దిద్దడంలో రచయిత్రి చూపిన శ్రద్ధ ఆమె సునిశిత పరి శీలనాశక్తిని సూచిస్తుంది. వివిధ సన్నివేశాలను సహజంగా చిత్రించడం, ఉద్వేగభరిత శైలి, జీవశక్తితో నిండిన వ్యక్తుల కల్పన, ఆసక్తికర కథనం 550 పేజీల నవలను ఏకబిగిన చదవగలిగే ఉత్సాహాన్ని అందిస్తాయి.

ఈ నవల ప్రత్యేకత అంతా ఇది ఒక వ్యక్తి జీవిత కథనం మాత్రమే కాకపోవడం. తెలుగునేలపై 1986 నుంచి 2011 మధ్యకాలంలో సంభవించిన సాంఘిక ఆర్థిక రాజకీయ పరిణామాలను ఈ నవల చిత్రిస్తుంది. మూడు రెట్లు పెరిగిన స్త్రీ అక్షరాస్యత, పట్టణీకరణ వల్ల పెరిగిన చైతన్యస్థాయి, గ్లోబలైజేషన్ తెచ్చిన మార్పులు, పీపుల్స్‌వార్ సాయుధపోరాటాలు, ఉద్యమాలు జనసామాన్యంలో తెచ్చిన చైతన్యం, మహిళా సాధికారత పేరున ప్రభుత్వం ప్రోత్సహించిన పొదుపు ఉద్యమం, సారా వ్యతిరే కోద్యమం, సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమాలన్నీ ఈ కాలంలో జరిగినవే. వీటన్నిటి ఫలితంగా అనేక తాత్త్విక ఆలోచనాధోరణులు, అస్తిత్వ స్పృహలు తలెత్తాయి. అక్ష రాస్యతలోనూ, ఉద్యోగ ఉపాధి అవకాశాలలోనూ తమ ఉనికిని విస్తరించుకున్న స్త్రీలు స్త్రీవాద భావజాలాన్ని పెంపొందించుకోవడం, కారంచేడు, చుండూరు సంఘ టనలు దళిత అస్తిత్వ స్పృహను కలిగించడం, బాబ్రీ మసీదు విధ్వంసం ముస్లిం అస్తిత్వ సమస్యను ప్రకటిం చడం, పట్టణీకరణ నేపధ్యంలో ప్రాధాన్యత తగ్గిన వ్యవసాయరంగం, ఫలితంగా రైతుల అస్తిత్వ సంక్షోభం మొదలైన అనేక విషయాలను మనసులో ఉంచుకుని 'నీల'ను చదివితే రచయిత్రి ఆశించిన చైతన్యాన్ని పాఠకులు పొందగలుగుతారు.

ఏలూరుకు సమీపంలో ఉన్న చోళదిబ్బలోని వెనుక బడిన సామాజిక వర్గానికి చెందిన పేదకుటుంబానికి చెందిన అమ్మాయి నీల. తల్లి చంద్రకళ, తండ్రి పరశి తాగుబోతు. ఒక తమ్ముడు. చంద్రకళ మిషన్ కుట్టి సంపా దించే డబ్బే ఆ కుటుంబానికి ఆధారం. సూర్యం పీపుల్స్ వార్ ఉద్యమ అజ్ఞాతవాసిగా ఉంటూ స్త్రీలందరినీ కూడ గట్టి జూట్‌మిల్లు లాకౌట్ సమస్యను పరిష్కరించు కోవడంలోనూ, సారావ్యతిరేక ఉద్యమంలోనూ వారు

ధైర్యంగా నడవడానికి చోదకశక్తిగా పనిచేస్తాడు. ఆ సమయంలో అతడు చూపిన ధైర్యం, తెగువ, నిస్వార్థ గుణం, సామాజిక బాధ్యత చిన్నారి నీలలో నిక్షిప్తమై ఆమె జీవితమే ఒకపోరాటమైన నేపథ్యంలో పరోక్షంగా ఆమెలో అడుగడుగునా స్ఫూర్తిని నింపుతాడు. చంద్రకళ ఆటో రాజుతో సన్నిహితంగా ఉందన్న అక్కసుతో వారిద్దరినీ హత్య చేసి జైలుకెళ్తాడు పరిశి. అక్రమ సంబంధపు ముద్ర వేయించుకున్న చంద్రకళ నీల భవితవ్యంలోనూ ఒక మచ్చగా మిగిలిపోతుంది. చర్చి పాస్టర్, పాస్టరమ్మగార్ల మంచితనంతో వారి దగ్గరే ఉంటూ చదువుకుంటుంది నీల. ఆమె ప్రమేయం లేకుండానే ప్రసాద్‌తో ఆమె వివాహం జరుగుతుంది. వివాహం తనకొక మంచి సహచరుడిని, కుటుంబాన్ని, భద్రతనూ ఇస్తుందని నమ్మింది నీల. పాపపుట్టాక ప్రసాద్, సరళల సంబంధం తెరపైకి వస్తుంది. మూడో మనిషి ప్రమేయాన్ని నీల ఒప్పుకోలేక పోతుంది. ఫలితంగా హింసకు గురవుతుంది. లాయర్ వసుంధరతో స్నేహం, ఆమె ఇంట్లో జరిగే సామాజిక కార్యకలాపాలు నీల ఆలోచనా పరిధిని విస్తృతం చేస్తాయి. ప్రసాద్‌ను లొంగదీసుకోవడానికి సరళ చేసిన ఆత్మహత్యా యత్నం, దానికి ప్రసాద్ స్పందించిన తీరు నీలలో ఒక కొత్త చూపును, తెగువను కలిగిస్తాయి. అతనితో విడాకులు తీసుకుని, వసుంధర స్నేహితుడు లాయర్ సదాశివ చొరవతో పాపను కూడా పొందగలుగుతుంది. తామిద్దరి పోషణకోసం ఆమె చేసిన ఉద్యోగాలేమీ ఆమెకు సంతృప్తిని, భద్రతను ఇవ్వలేకపోవడంతో కర్ణాటకలో ఉంటున్న పాస్టరమ్మను వెతుక్కుంటూ వెళ్తుంది. ఆమె పరిస్థితీ అంతంత మాత్రంగా ఉండడంతో చోళదిబ్బకి తిరిగివస్తుంది.

తన తల్లికి సన్నిహితురాలైన ఆరంజ్యోతి కూతురు 'సంపూర్ణ' సహకారంతో ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాక డ్వాక్రా మొదలైన పొదుపు సంఘాల వ్యవహారాలనూ, గ్రామ రాజకీయాలనూ దగ్గరగా చూసి వాటిలోని లోటు పాట్లను బేరీజు వేయగలుగుతుంది. తాను చదివిన సోషియాలజీని తానున్న వ్యవస్థకు అన్వయించగలుగుతుంది. సోషియాలజీలో పిహెచ్‌డి చేస్తున్న పరదేశి ఆర్థిక సహకార సంఘాల అభివృద్ధిపై సర్వే చేయడానికి చోళ దిబ్బకు వస్తాడు. నీల, పరదేశి బలమైన ఆకర్షణలో చిక్కుకున్నా, అతని జీవితంలో మరో అమ్మాయి ఉందని తెలియగానే మూడో మనిషి ప్రమేయమున్న జీవితంలో ఇమడడం కంటే ప్రేమను తుంచడమే సుఖమనిపిస్తోంది అంటూ అతనికి దూరమౌతుంది నీల. డబ్బుకి లోటు లేకుండా జరిగిపోతున్నా, సంపూర్ణ ఏ ఆరోపణాలేని వల్ల మాలిన ఇష్టాన్ని చూపిస్తున్నా, తనకెదురైన వివిధ సంధర్భాలలో ఆమెలో కలుగుతున్న నైతికపరమైన మథన ఆమెను చోళదిబ్బకే శాశ్వతంగా కట్టిపడేయలేక పోయింది. వసుంధర సాయంతో హైదరాబాద్ చేరుకుని కొంత కాలం ఎన్జీవోలో పనిచేస్తుంది. సదాశివతో పునఃపరిచయం కలిగి అతని తల్లి నీతాబాయి చేస్తున్న మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టుకు సహాయకురాలిగా ఉంటుంది. సదాశివను విలువైన స్నేహితుడిగా భావిస్తుంది. క్రమంగా నిబంధనలు లేని స్వేచ్ఛలో నీల సదాశివ ప్రేమలో ఆనందంగా జీవిస్తుంది. అంతటితో తృప్తి చెందక తనలాంటి నీలవేణుల జీవిత ప్రస్థానాన్ని సులువు చేయడమే లక్ష్యంగా సామాజిక అవగాహనా కార్యక్రమాల్లో మమేకమవుతుంది నీల. స్థూలంగా ఇదీ 'నీల' నవల ఇతివృత్తం.

నీల వ్యక్తిత్వాన్ని ఒక క్రమానుగత వికాసంగా రచయిత్రి మలిచారు. 'బాగా చదివి గొప్పదానివి కావాలి నీలమ్మా' అని తల్లి తరచూ చెప్పిన మాట నీల పొందిన భవిష్యత్తుకు పునాది. ప్రసాద్‌తో వివాహం ఒక మనిషిలో ఇద్దరు మనుషులు ఎలా ఉంటారో నీల చూడగలిగింది. సరళ, నీల మధ్య నలిగిన ప్రసాద్ గురించి "ఇన్ని బాధల మధ్య ప్రసాద్ ఏం సుఖపడ్డాడు! అతనికి తెలీదు సరే, నెప్పి కలిగినదానిగా నేనుమాత్రం ఎక్కడ స్థిరంగా నిలబడి నన్ను రక్షించుకోగలిగాను! ఎందుకు గట్టిగా పోట్లాడలేక పోయాను. అసలు ముందు నాలో నన్ను మిగుల్చుకోకుండా అతన్ని దక్కించుకునే పోటీలోకి ఎందుకు పరుగులు పెట్టాను" అన్న వివేచనలోనుండి, "వెళ్ళి పోవడమే అతన్ని మనిషిగా గుర్తించడం, సరళకో నాకో కాక

అతనికి అతన్ని వదిలేయడమే తనని క్షమించడం. ఇట్లాంటి స్థితిలో తనకి నానుంచి విముక్తి కలిగించడం కన్న క్షమ, గౌరవం ఏముంటాయి?'' అనుకుంది నీల. నీలలోని ఈ అరుదైన వ్యక్తిత్వమే ఆమెను గొప్ప ప్రేమకు అర్హురాలిగా చేసింది.

రచయిత్రి స్వేచ్ఛ, నైతికత అనే రెండు ప్రమాణాలపై నీలను నడిపించి తన ప్రాధాన్యాలేమిటో సూచించారు. ఆకర్షణీయ బంధాలెదురైనపుడు నీల ఎంపిక ఈ విష యాన్నే స్పష్టం చేస్తుంది. అసంకల్పితంగా పరదేశి ఆకర్షణ లోకి వెళ్ళిన నీలకు ప్రసాద్‌తో కలిసి ఉన్నప్పటి జీవితం విధించిన సంకెళ్ళేవో తెగిపోతున్న భావన కలిగింది. ముసు గులు లేని పరదేశితో ఉన్న ఆమె మనఃస్థితిని రచయిత్రి ''ఈ సంచారితో కలిసి ఇక్కడ కూచుని ఈ అర్థరాత్రి ఆమె సాధించిన విప్లవం ఏమీ లేకపోవచ్చు. కన్నూమిన్నూ కానని ఈ ఉత్సుకత ఏ రకంగానూ ఫలవంతమైనది కాకపోవచ్చు. కానీ స్థలాలు, కాలాలు, బాంధవ్యాల చట్రంలేని ఒక స్థితి ఈ క్షణాల్లో ఉండడాన్ని ఆమె గుర్తుపట్టింది.'' అని వ్యాఖ్యానిస్తారు. సంతోషపు విలువను ఆమె గుర్తిస్తూ ''నేను బాకీ పడిన సంతోషాల సుఖాల అప్పుని తప్పకుండా జీవితానికి కట్టేస్తాను. లేకపోతే ఇన్ని కష్టాలకి ఎదురొడ్డి నిలిచినదానికి అర్థమే ఉండదు'' అంటుంది పరదేశితో. చేతనతో పరదేశి సంబంధాన్ని తెలుసుకున్న తర్వాత ''నాకు మంచి తోడు తప్పకుండా కావాలి పరదేశీ, కానీ ఇట్లా కాదు. ఎలాంటి పోటీలు లేని ప్రేమ కావాలి. ఉనికిలో ఉన్నప్రేమని తెగ్గొట్టుకుని మరింత గాఢమైన ప్రేమ తారసపడిందని నాతో కలిసి జీవించడానికి సిద్ధపడ్డారు. అది జీవితాన్ని ఎలా కాల్చేస్తుందో నా అనుభ వాలు చెపుతాయి'' అంటూ అతనితో బంధాన్ని వదులు కుంటుంది. ఈ మాటలు తన ప్రత్యక్షానుభవాలు ఆమె చైతన్యాన్ని నిర్ణయించిన తీరును వెల్లడిచేస్తాయి.

సదాశివ నీలకు సహచరుడుగా మారడం ఒక ముఖ్య పరిణామం, కాసనోవాగా సదాశివను నలుగురూ చెప్పు కుంటున్న మాటలు నీల చెవినబడ్డా అతని వ్యక్తిత్వం, అతడు చూపించే వాత్సల్యం ఆమెను ఏ కారణం చేతనయినా అతడినుండి దూరంగా జరిగే అవకాశం లేకుండా చేశాయి. ''మానవ సంబంధాలు ఏవైనా, అవి స్నేహాలైనా, ఉద్యోగ సంబంధాలైనా మనుషుల్లో ఉండే వికాసాన్ని విస్తృతం చెయ్యాలి. వేగవంతం చెయ్యాలి. మీ విచక్షణ, అవగాహన ప్రాతిపదికగా సాగాలి. మీకేది ముఖ్యమో మీకేది మంచిదో మిమ్మల్ని ఏది మరింతగా ఎదిగిస్తుందో ఏది మిమ్మల్ని మెరుగైన వ్యక్తిని చేస్తుందో దానికోసం మీ ఎంపికలు ఉండాలి. అది స్వార్థంకాదు. సెల్ఫ్ సెంటర్డ్‌నెస్ కాదు. మనుగడకి అవసరమైన ఆదిమ జ్ఞానం, తనకు మాలిన ధర్మంలేదు'' అంటూ సదాశివ నీలకు గొప్ప స్ఫూర్తినందిస్తాడు. 'అనేకమంది స్త్రీల సదాశివ' గురించి ఆమెకున్న అభ్యంతరాలన్నీ ''నీ ఇష్టం, ఆరాధన, ప్రేమ, తపన ఇవన్నీ చెప్పలేక, దాచుకోలేక ఇబ్బంది పడడం నన్ను వివశుడిని చేశాయి. నాకొక వాగ్దానం ఇచ్చాయి. అందుకేనేమో నిన్ను ఆలంబనగా చేసుకొని నన్ను నేను సవరించుకోవాలని దుర్బుద్ధి పుట్టింది. ఇక ఎవరూ వద్దని అనిపించడం మొదలైంది'' అన్న సదాశివ మాటలలో జీవితం మరీ ఎక్కువ అవకాశాల నివ్వదు అనిపిస్తుంది నీలకు. తన నిర్ణయాలు ఎవరికో ఆదర్శం కావడం గురించి ఆలోచించడం అనవసరమనీ, తనకు ఎదురైన పరిస్థితులలోంచి మెరుగైన వాటిని ఎంచుకుని ముందుకు సాగాలనీ, ఆడా మగా సంబం ధాల్లో సార్వకాలికమైన, సార్వజనీనమైన విలువలేమీ ఉండవని నేర్చుకుంటుంది నీల. సదాశివ ప్రేమ ఆమెకు రాజీ అవసరం లేని సాహచర్యాన్నే అందించింది.

ఈ నవలలో ప్రత్యేకంగా చెప్పుకోవలసింది కష్ట కాలంలో సైతం నీల ఆత్మవిశ్వాసాన్ని నిలుపుకోవడం. అనేక సంక్లిష్టతల మధ్యనుండి మనిషిగా ఎదగడంలో ఆమెకు తోడ్పడిన ముఖ్యమైన అంశం ఇదే. ప్రసాద్ నుండి విడిపోయాక అతడి నుంచి ఏమీ ఆశించక పోవడం, తన వ్యక్తిత్వానికి భంగం కలిగించే ప్రయత్నం చేసిన యజమానురాలిని ధిక్కరించడం మన తోటి వారినే చూసి మనం లేచి నిలబడడమెందుకు అనుకోవడం మొదలైన విషయాలు ఆలోచింపజేస్తాయి.

ప్రస్తుతం దళిత/బహుజనుల సమస్యలు సాహిత్యంలో రాజకీయరంగును పులుముకుంటు న్నప్పటికీ, వారిపట్ల సానుభూతితోనూ, సహానుభూతితోనూ నిజాయితీగా రచనలు చేసిన రచయితలు లేకపోలేదు. సుప్రసిద్ధ రచయితలు ఇనాక్, శిఖామణి లాంటివారిని ఈ కోవలో ప్రత్యేకంగా చేర్చవచ్చు. 'నీల' నవలలో రచయిత్రి మల్లీశ్వరి ఎక్కడా propagandistic (కేవలం ప్రచారోద్దేశ ధోరణి) ధోరణిని అవలంబించకుండా పీడిత పక్షాన నిలబడడం, వారిపట్ల సహృదయతను కనబరచడం వివిధ సందర్భాల్లో కనిపిస్తుంది.

Subaltern సాహిత్య లక్షణాలైన సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, మత సంబంధంగా తోటి ప్రజలను జాతి, కుల వివక్షతో అణచివేయడం, బహిష్కరణకు గురిచేయడం, లింగవివక్ష, స్త్రీలను అవమానించడం, కించపరచడం, జాతులను దోపిడీకి గురిచేయడం వంటివన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రచయిత్రి వర్ణిస్తుంది. పొదుపు సంఘం మీటింగ్‌లో తనను చూసి వ్యంగ్యంగా నవ్విన శుభాంజలిని తిట్టుకుంటూ 'అందుకే ఈ మీగడ ఒంటి మనుషులంటే చాలా ఎడం నాకు. అదోలా చూస్తారు వాళ్ళు. చర్మం వంక, చెప్పులూ, బట్టల వంకా అదోలా చూస్తారు. వీళ్ళ అంచనాలు తగలెయ్య' అనుకునే స్వగతంలో పైకి కోపం కనిపించినా మనుషులను మనుషులే వేరుచేసి చూచే దృక్పథం పట్ల వేదన కనిపిస్తుంది. పెదపాడు మండల ప్రచార సమన్వయ బాధ్యతలను సంపూర్ణకి అప్పగించిన సందర్భంలో ఆమె శుభాంజలి, రత్నాకర్ మొదలైన వాళ్ళకోసం ఎంతో ఆరాటపడి తన ఇంట్లో వంట చేయిస్తుంది. తినకుండా వెళ్ళిపోయిన వారిని చూసి సంపూర్ణ "నేనింత ప్రాణం పెడతాను, వాళ్ళ మీద ఈగ వాలనివ్వను కదా. ఇంటిముందు ఆగి కార్లో కూచుంటారు తప్ప నా ఇంటి గుమ్మంలోకి ఒక్క సారైనా ఎందుకు అడుగుపెట్టరు" అనుకుంటుంది దెబ్బ తిన్న ఆత్మాభిమానంతో. సమాజాన్ని ఎంత ఆధునికంగా మార్చుకున్నామని అనుకున్నా కులవర్గ స్పృహలు వదలని అనాగరిక వ్యవస్థలోనే ఉన్నామని రచయిత్రి గుర్తు చేస్తుంది.

మైక్రోఫైనాన్స్ అరాచకాల ఫలితంగా సంభవిస్తున్న అవాంఛనీయ, అమానవీయ సంఘటనలను రచయిత్రి లోతుగా విశ్లేషించి, ఆదర్శాలుగా చెలామణిలో ఉన్న పథకాల అసలు స్వరూపాన్ని, సామాన్యుల వెసులుబాటుకై ఉద్దేశించిన విషయాలు వారి జీవితాలను మరింత క్లిష్టతరం చేయడాన్ని విమర్శకు పెట్టారు. నీల అవగాహనను విస్తృతం చేయడానికి విభిన్న సన్నివేశాలలో నీలను ప్రత్యక్షసాక్షిగా నిలబెట్టారు. మెరుగైన సమాజానికై ఉద్దేశించిన ఎన్జీవోలు నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తున్నాయా అన్న అంశంపై కూడా రచయిత్రి దృష్టి పెట్టారు. 'విండో' అనే ఎన్జీవోలో పనిచేసిన నీల "నాలుగు సర్వే రిపోర్టులు రాసి, ఇంతమంది ఆడపిల్లలకి చదువులేదు, చదువుకోమని ఇంతమందికి చెప్పాం. వాళ్ళలో ఇంతమంది స్కూళ్ళకి వెళ్తున్నారు అని నాలుగు ఫొటోలు తీసుకుని పైకి పంపుతాం. వాళ్ళు ఇంకెక్కడికో పంపుతారు. ఖర్చులకి గానూ మనకి నాలుగు డబ్బులు వస్తాయి. ఇక అంతేనా?" అంటుంది అజితతో. అసహాయుల పట్ల సహానుభూతే కాకుండా ఆశయాలు మసకబారిన సంస్థల డొల్లతనం పట్ల కోపము పై మాటల్లో కనిపిస్తాయి. ఇవన్నీ ఛేదించాల్సిన లక్ష్యాలుగా నీల అనుకోవడమే ఆమె ప్రత్యేకత. సదాశివ ప్రేమలో లోటులేని జీవితాన్ని అనుభవిస్తున్న సందర్భంలోనూ "నేను జీవితపు బాధితురాలిని, ఇపుడిపుడే చల్లని నీడని దొరికించుకున్నదాన్ని. నేనూ ఏదన్నా చేయాలి. పదిమందికి పనికివచ్చే పని చేయాలి. నా చుట్టూ ఉన్న కంచెల్ని కొంచెం అయినా తెగగొట్టాలి. ఇరుకులని కొంచెమైనా ఎడం చేయాలి. నేను చేసే ఉద్యోగం ఇందులో మొదటి మెట్టు. నేను నా లక్ష్యాన్ని ఎంచుకుని అందులో పనిచేయడానికి ఇది పనికివస్తుంది" అంటూ తన ఆశయాన్ని వివరిస్తుంది. తన సంతృప్తి తన ఆనందంలో నుంచి కాక తనలాంటివారి జీవితాలలో వెతుక్కోవడం నీల ప్రత్యేకత. స్త్రీగా ఉండడం కన్నా మనిషిగా రూపొందడం కోసమే బతకాలన్న ఆశయం ఆమె వ్యక్తిత్వానికి మరింత దీప్తినిస్తుంది.

పరదేశి, సదాశివ వ్యక్తిత్వాలను రచయిత్రి మలచిన తీరు నిజంగా అద్భుతం. వారిద్దరూ మనకు తెలిసిన మగవాళ్ళు కారు. కేవలం మనుషులు, ముసుగులు లేని మంచివాళ్ళు. నీలకు ప్రేమను, స్వేచ్ఛలోని ఆనం దాన్ని రుచి చూపించిన వాళ్ళు. సమాజం మారాలంటే, స్త్రీలు మనుషులుగా బ్రతుకులోని మాధుర్యాన్ని అనుభవిం చాలంటే అలాంటి సహచరులు అవసరం. రచయిత్రి స్త్రీ కోరుకుంటున్న పురుష నమూనాలను (models) పరదేశి, సదాశివలుగా మలిచారు. రణరంగం కాని సాహచర్యాల కోసం నీల చేసిన అన్వేషణాఫలితాలే పరదేశి, సదాశివ.

రచయిత్రి చర్చించిన మరో ముఖ్యాంశం తరాల మధ్య అంతరాలు, మారుతున్న విలువలు. సదాశివ తల్లిదండ్రుల కులాంతర వివాహం వారి కాలానికి ఆదర్శ మైతే, నీల సదాశివల సహజీవనం వీరి కాలానికి కొత్త విషయం. మినో ప్రైవసీకోసం ఇంట్లోంచి వెళ్తాననడం, చదువు మధ్యలో ఆపి నచ్చిన వ్యాపకంపై దృష్టి పెట్టడం ఈ తరపు ధోరణులు. నీల పొందిన స్వేచ్ఛకీ, స్వేచ్ఛపట్ల ఆమె అవగాహనకీ పరిమితులున్నాయని భావించి తనదైన స్వేచ్ఛా ప్రయాణాన్ని సాగిస్తుంది నీల కూతురు మినో.

సమాజ ప్రభావాన్ని కాదనలేక, తన అస్తిత్వాన్నీ వదల లేక వ్యక్తి పొందుతున్న సంఘర్షణ నుంచే ఆధునికానంతర సాహిత్యం మొదలైన నేపథ్యం 'నీల' నవలకీ ఉంది. నీలకి తనూ కావాలి సమాజమూ కావాలి. తనలోకి తాను చూసు కుంటూనే ఎదుటి మనిషిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించింది. 'ఏదో ఒక సిద్ధాంతమో, దృక్పథమో అందరికీ ఆమోదయోగ్యం కావలసిన అవసరం లేదన్న ఆధునికానంతర స్పృహ' నీలలో పరిణామ వికాసాల్ని కలిగించింది. మంచి సాహిత్యం సామాజిక శాస్త్రాల కంటే శక్తివంతంగా సమాజ విశ్లేషణ చేయగలుగుతుందనడానికి 'నీల' నవల ఒక ఉదాహరణ.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ జీవితం - సాహిత్యం

- డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి, సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, వేమనపురం, కడప.

## పరిచయం :

"రాళ్ళపల్లి లోన రాళ్ళెన్ని పుట్టెనో
రాళ్ళ లోన వజ్జరాలు పుట్టె
వజ్జరాల లోన వలపెట్టు పుట్టెరా
కీర్తనీయ చరిత కృష్ణ శర్మ"

(చిలుకూరి నారాయణరావు)

రాయలసీమ రాళ్ళలోన పుట్టిన వజ్రం రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ. తెలుగు సాహిత్య లోకంలో కవిగా, విమర్శకుడిగా, అనువాదకుడిగా, గ్రంథ పరిష్కర్తగా, విభిన్న రూపాలలో ఉత్తమ సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి రాళ్ళపల్లి. రాయలనాటి రసికత, త్యాగయ్యగారి నాదసుధారసం. నిగమశర్మ అక్క, తిక్కన్న తీర్చిన సీతమ్మ వంటి వ్యాసాలు పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు పాఠాలుగా ఉండేవంటే ఆయన రచనల్లోని ప్రామాణికతను అర్థం చేసుకోవచ్చు.

## కుటుంబ నేపథ్యం :

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 1883 జనవరి 23న అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం తాలూకా రాళ్ళపల్లి గ్రామంలో జన్మించాడు. అలివేలుమంగమ్మ, కర్ణమడకల కృష్ణమాచార్యులు వీరి తల్లిదండ్రులు. వీరి పూర్వీకులు రాయదుర్గం సంస్థానంలో పండితులుగా ఉండేవారు.

అలివేలు మంగమ్మ రాళ్ళపల్లికి చెందిన లక్ష్మమ్మ, తిరుమల అనంతాచార్యుల కుమార్తె. అలివేలు మంగమ్మకు పెళ్లయ్యేనాటికి, ఈమెకు కర్ణమడకల కృష్ణమాచారికి తండ్రులు లేరు. అందువల్ల పెళ్లయిన తర్వాత కృష్ణమాచార్యులు తన స్వగ్రామమైన చెన్నంపల్లిని వదలి, అత్తగారిల్లైన లక్ష్మమ్మ ఇంటికి వచ్చేశారు. పుత్ర సంతానం లేకపోవడం వల్ల కూతురు బిడ్డైన అనంతకృష్ణశర్మను దత్తత తీసుకున్నారు. అందువల్ల అనంతకృష్ణశర్మ గారి ఇంటి పేరు రాళ్ళపల్లిఅయింది.

రాళ్ళపల్లి తండ్రిగారైన కృష్ణమాచార్యులకు తండ్రి వారసత్వంగా గొప్ప ఆస్తి లభించింది. భార్య వైపు నుండి కూడా మంచి ఆస్తి లభించింది. ఈయన రాయదుర్గం, కళ్యాణదుర్గం, హిందూపురం తాలూకాలలో శ్రోత్రియం, ఇనాం భూములను పరిరక్షిస్తూ సొంతగా మూడు కాండ్ల సేద్యం చేసేవాడు. సుమారు 2800 ఎకరాల భూమికి అలివేలు మంగమ్మ ఏకైక వారసురాలు. వీరికి లభించిన శ్రోత్రియం, ఇనాం భూములతో సహా ఎకరాల భూములు కరువు సీమలో కష్టాలను తీర్చలేక పోయాయి. కృష్ణమాచార్యుల మెతకతనం, మంచితనం రైతులకు మేలు చేశాయి, అతనికి మాత్రం అరకొర రాబడితో ఇబ్బందులు తప్పలేదు. కృష్ణమాచార్యులకు పదహైదు మంది సంతానం. పోయిన వారు పోగా ఆరు మంది కొడుకులు, ఇద్దరు కూతుళ్లు మిగిలారు. పుత్రులలో రెండోవాడు అనంతకృష్ణశర్మ. తండ్రి ఆస్తి నుండి వచ్చిన భాగంతో పాటు అమ్మమ్మ గారి ఆస్తికి వారసుడయ్యాడు రాళ్లపల్లి.

## వివాహం, సంతానం :

అనంతకృష్ణశర్మకు రుక్మిణమ్మతో వివాహమైంది. 'వీరి కీర్తికి ఆయమ పరిచర్యయే మూలస్తంభం'గా నిలిచిన అనుకూలతి రుక్మిణమ్మ.

వీరికి ముగ్గురు కుమార్తెలు. నాగమణి, ప్రభావతి, డాక్టర్ హరిణి. ఇద్దరు కుమారులు ఫణిసాయి, ఏఆర్ జయంత. వీరిలో హరిణి తత్వశాస్త్రంలో డాక్టరేట్ సాధించారు. జయంత శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆంగ్ల ఆచార్యునిగా పనిచేశారు.

## విద్యాభ్యాసం :

బాల్యంలో రాళ్ళపల్లి శర్మ తండ్రి దగ్గరే ఓనమాలు దిద్దుకున్నారు. తెలుగు, సంస్కృత భాషలను అభ్యసించారు. సంస్కృతంలో రామాయణ సంగ్రహం, రఘువంశం, చంపూ రామాయణం, చంపూ భారతం, విశ్వ

గుణాదర్శం వంటి గ్రంథాలను అధ్యయనం చేశారు. తెలుగులో అచ్చ తెలుగు రామాయణం, నీలాసుందరీ పరిణయం, ఆంధ్రనామ సంగ్రహం మొదలైన గ్రంథాలను అధ్యయనం చేశారు. 13 సంవత్సరాల వయస్సులోనే సంస్కృతాంధ్ర భాషల్లో పాండిత్యాన్ని సాధించారు.

తండ్రి సాహిత్య గురువైతే, తల్లి సంగీత గురువు. అలమేలు మంగమ్మ పాటలు పుట్ట. శాస్త్రీయ సంగీతం తెలియకపోయినా, కమ్మని స్వరంతో ఆమె పాడే భజనపాటలు, పెళ్ళిపాటలు, జోల పాటలు, కథాగేయాలు చాలా శ్రావ్యంగా ఉండేవి. తెలుగు, సంస్కృతం, తమిళం, కన్నడ భాషల్లో ఆమె గానం మనోహరంగా ఉండేది. అమ్మ నేర్పిన పాట, వరసకు మేనమామ నేర్పి పిడేలు రాళ్ళపల్లికి సంగీతం పట్ల ఆకర్షణ, అభినివేశం కలిగించాయి.

దత్తు తల్లి ఐన లక్ష్మమ్మ (అమ్మమ్మ) రాళ్ళపల్లిలో సరైన విద్యాభ్యాసం అందదని తెలిసి, శర్మగారిని (1906) మైసూరుకు తీసుకెళ్ళారు. అక్కడ అనంతపురం, పెనుగొండ తాలూకా, నల్లూరుకు చెందిన సజ్జల తాతాచార్యుల దగ్గర సంస్కృత కావ్యాలు, ముఖ్యంగా భారవి రచిత కిరాతార్జునీయం అభ్యసించాడు.

ఆ తర్వాత మైసూరులోని చామరాజేంద్ర సంస్కృత పాఠశాలలో విద్యార్థిగా చేరారు. సంస్కృత, ప్రాకృత (షడ్భాషాచంద్రిక) వ్యాకరణాలతోపాటు, అలంకారాలు, సంస్కృత నాటకాలు అధ్యయనం చేశాడు.

మైసూరులోని శ్రీమఠం వారు నిర్వహించే విద్వత్సభలో రాళ్ళపల్లి రాసిన శ్లోకాలను పండిత ప్రకాండులైన శ్రీకృష్ణ తంత్ర పరకాయ యతీశ్వరులు మెచ్చుకున్నారని, అవి తర్వాత కాలంలో జ్ఞప్తిలో లేవని చెప్పుకున్నారు. యతీశ్వరులు 'అలంకారమణిహారము' అనే స్వతంత్ర లక్షణ, లక్ష్యములు గల గ్రంథ రచన చేస్తున్న సమయంలో రాళ్ళపల్లి ఆయనకు సహాయకులుగా (చదువరి) ఉండడం ఆయనకు ఒక గొప్ప అనుభూతిని మిగిల్చిన అంశం.

అనంతరం, మైసూరు చామరాజనగరలో నివసించే పండితుడు రామశాస్త్రి దగ్గర శాకుంతలము, ఉత్తర రామచరిత్ర, ముద్రా రాక్షసం, అనర్ఘరాఘవం, కాదంబరిలో కొంత భాగాన్ని అభ్యసించారు.

రాళ్ళపల్లిలో కవిత్వం ఉరకలు వేస్తున్నా, 'కాళిదాసు, భవభూతిలాగా కవిత్వం రాస్తేనే కవి' అనే స్పృహలో ఉంటూ తనను తాను చిన్నవాడిగా అంచనా వేసుకునేవాడు.

రాళ్ళపల్లి చదువు డిగ్రీల కొలమానాలకు సంబంధించినది కాదు. భాషా సాహిత్యాలకు సంబంధించి లోతులు చూసిన అధ్యయనం ఆయనది. ఏ ఆచార్యుడికీ తీసిపోని మేథస్సు ఆయన సొంతం.

**కట్టమంచితో సాన్నిహిత్యం :**

1910వ సంవత్సరం కట్టమంచి రామలింగారెడ్డి గారితో రాళ్ళపల్లికి పరిచయం ఏర్పడింది. అప్పటికే కట్టమంచి వారు మైసూరు మహారాజు కళాశాలలో చరిత్ర, తత్వశాస్త్రం, ఆంగ్ల సాహిత్యం, తర్కం బోధించే ఆచార్యులుగా ఉన్నారు. కట్టమంచి గారి శిష్యుడైన కందాళ రఘునాథాచార్యులు ద్వారా ఏర్పడిన పరిచయం రాళ్ళపల్లిలో కొత్తమార్పుకు ఊపిరిలూదింది.

పాశ్చాత్య జీవిత సాహిత్య సంప్రదాయాలు తెలిసిన కట్టమంచి, శర్మ గారిని 'సమాన స్కంధుని'లా చూశాడు. "ఇరుపక్కలా మూడవ వ్యక్తికి చొరవలేని ముగ్ధమధుర సంబంధం మాది" (కట్టమంచి వారి వైలక్షణ్యం) అని రాళ్ళపల్లి వారు రాసుకోవడం వారి సాన్నిహిత్యానికి నిదర్శనం.

"పాత్ర ప్రపంచముననే ప్రాకులాడుచున్న నాకు వారితోడి సహవాసము ఆధునిక ప్రపంచపు తలుపులు తెరిచి ఆహ్వానించినది (నా గురువులు) అన్నంత వినయ సంపన్నత కట్టమంచి వారి పట్ల రాళ్ళపల్లికి ఉంది.

రాళ్ళపల్లి ప్రతిభా పాటవాలను గుర్తించిన కట్టమంచి మైసూరు మహారాజు కళాశాలలో తెలుగు పండితునిగా చేరమని కోరాడు. ఎలాంటి ప్రభుత్వం పరీక్షలూ 'పాసు' గాని రాళ్ళపల్లి, ఆ కళాశాలలో తెలుగు పండితులుగా చేరడం ఆ రోజుల్లో గొప్ప విషయం.

కట్టమంచి రాళ్ళపల్లి ఇరువురం విరివిగా సాహిత్య చర్చలు చేసుకునేవారు. భావ వినిమయం జరిగేది. ఈ క్రమంలో కట్టమంచి రచించిన 'కవిత్వ తత్వ విచారము'లో రాళ్ళపల్లి అభిప్రాయాలను సహృదయంతో కట్టమంచివారు నిక్షిప్తం చేశారు. అదే విధంగా అర్ధశాస్త్రం అనే గ్రంథరచనలోనూ రాళ్ళపల్లి సూచనలు తీసుకున్నారు. అయితే, కట్టమంచి వారి అభిప్రాయాలకు, శైలికి భిన్నమైన కొంత భాగాన్ని ఉటంకించి రాళ్ళపల్లి వారే ఈ గ్రంథాన్ని రాసి, కట్టమంచివారి పేరు పెట్టారని విమర్శకులు పుకార్లు పుట్టించారు. రాళ్ళపల్లి ఆ విమర్శలకు నొచ్చుకొని "కవిత్వ తత్త్వ విచారము"నకు వచ్చిన కీర్తిని పొందు అర్మత తమకు లేదని (వేమన - 1945) వినయంగా విన్నవించుకున్నారు.

కట్టమంచికి - రాళ్ళపల్లికి స్నేహబంధాన్ని బలపరిచిన అంశాలు రెండు. రాళ్ళపల్లి 'వేమన', రంగనాథరామాయణానికి రాసిన సమీక్షా వ్యాసం.

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు (ఆంధ్ర విశ్వవిద్యాలయం) ఉపాధ్యక్షులుగా పదవి నిర్వర్తిస్తున్న కట్టమంచి వేమనపై ఉపన్యాసాలు ఇవ్వడానికి రాళ్ళపల్లిని ఆహ్వానించారు. వేమనపై ఉపన్యాసాలు ఇచ్చే గౌరవాన్ని విశ్వకళా పరిషత్తు సిండికేటు రాళ్ళపల్లికి ఇచ్చింది. రాళ్ళపల్లి ఉపన్యాసాలకు పదును పెట్టి విషయసేకరణ, వివరణ, సిద్ధాంత ప్రతిపాదనలో కట్టమంచి పదేపదే సలహాలిచ్చి ప్రోత్సహించారని రాళ్ళపల్లి చెప్పుకున్నారు. ఉపన్యాసాలు పూర్తయ్యే నాటికి (9-2-1928 నుండి 13-9-1928 వరకు) కట్టమంచి ఎనిమిది ఉత్తరాలు రాశారు. అంతకుముందు నుండి రాళ్ళపల్లి వారు భద్రపరిచిన కట్టమంచిగారి పంతొమ్మిది ఉత్తరాలలో పది వేమన గురించి ఉండడమే విశేషం.

ఆ తర్వాత పని కట్టమంచి వారు 'రంగనాథరామాయణాన్ని' పండితులతో పరిష్కరింపచేసి ముద్రించడం. వేటూరి ప్రభాకరశాస్త్రి, గన్నవరపు సుబ్బరామయ్య గార్ల సహాయంతో రంగనాథ రామాయణాన్ని పరిష్కరింప చేశారు. అనారోగ్యం వల్ల వేటూరి వారు సకాలంలో పీఠిక రాయలేకపోయారు. పింగళి లక్ష్మీకాంతం గారి పీఠికతో, కట్టమంచి వారి అనుబంధ పీఠికతో రంగనాథ రామాయణం వెలువడింది. ఆ గ్రంథాన్ని 'భారతి' పత్రికకు సమీక్షణార్థం పంపితే, చివరికి దాన్ని సమీక్ష చేసే అవకాశం రాళ్ళపల్లికి వచ్చింది. ఆయన రాసిన సమీక్షలో "వారి శక్తి యుక్తులను గౌరవించినంత హార్ధముగా వారి యభిప్రాయములను గౌరవించుట నావంటి వారికి పలుమారు గల్గు భాగ్యము గాదు. అవి చాల మట్టుకు అపూర్వములు, స్వచ్ఛందములు, విప్లవాకములు" (రంగనాథ రామాయణం - సారస్వతాలోకము) అని ప్రకటించారు. కట్టమంచి గారి అభిప్రాయాలను అవసరమైనచోట విమర్శించి పెద్ద చర్చకే ఆస్కారం కల్పించారు. దీన్ని ఆసరాగా చేసుకొని రాళ్ళపల్లిపై కట్టమంచికి పితూరీలు చెప్పి వారి స్నేహాన్ని చెడగొట్టాలని ప్రయత్నించినవారూ ఉన్నారు. ఆ తర్వాత కాలంలో "గాథా సప్తశతీసారము" అనే గ్రంథాన్ని కట్టమంచి వారికి (మరణానంతరం) అంకిత మిచ్చి తన గురుభక్తిని చాటుకున్నారు రాళ్ళపల్లి.

## ఉద్యోగ ప్రయాణం :

1912 నుండి 1949 వరకు మైసూరు మహారాజు కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేసిన రాళ్ళపల్లి, చెలికాని అన్నారావుగారి ఆహ్వానం మేరకు తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనల పరిష్కరణ కోసం 1950 నుండి 1957 వరకు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనా సంస్థలో పనిచేశారు. సంగీత వాఙ్మయ పరిశోధకులుగా పీఠికలతో, పరిశోధనాత్మక వివరణలతో అన్నమయ్య సంకీర్తనల 8, 9, 10, 11, 12 సంపుటాలను వెలువరించారు. రాళ్ళపల్లి కృషి అభినందనీయమైంది.

## సంగీతంతో సంబంధం :

రాళ్ళపల్లి వారికి చిన్నప్పటి నుండే సంగీతంలో ప్రవేశం ఉంది. మైసూరులో ఉన్నప్పుడు కర్ణాటక సంగీతంలో శిఖర స్థాయిని అందుకున్న బిడారం కృష్ణప్పగారి కచేరీ చూసి, ఆయన దగ్గర శిష్యులుగా శాస్త్రీయ సంగీతంలో తొలి అక్షరాలు నేర్చుకున్నారు. కృష్ణప్ప పరిచయం ఏర్పడే నాటికే రాళ్ళపల్లి మైసూరు కళాశాలలో తెలుగు పండుతునిగా విధులు నిర్వర్తిస్తున్నారు. సమయం సరిపోక గాత్ర

సంగీతంలో తగినంత సాధన చేయలేకపోయారు రాళ్ళపల్లి. అదే సమయంలో రాళ్ళపల్లికి ఫ్లూజ్వరం (ఇన్ఫ్లుయెంజా) సోకడంతో శరీరం చిక్కి శల్యమైంది. వైద్యుల సలహా మేరకు గాత్ర సంగీత సాధన వదలి, ఫిడేలు చేపట్టారు.

1927లో అనంతపురంలో జరిగిన ఆంధ్రకాంగ్రెస్సు సమావేశంలో ఆంధ్రగాయక మహాసభ భాగమైంది. శ్రోతలు భోజనానికి వెళ్ళే సమయానికి గాయక మహాసభ పక్షాన అధ్యక్షోపన్యాసం ఇవాల్సి వచ్చింది రాళ్ళపల్లికి. 'మీరెప్పుడాపమంటే అప్పుడు ఆపేస్తానని' ప్రారంభించిన ఉపన్యాసం, గంటన్నర దాకా సాగినా, మంత్రముగ్ధులైన శ్రోతలు భోజనా సమయాన్ని మరిచిపోవడం, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ప్రశంసించి ప్రోత్సహించడం రాళ్ళపల్లిలోని సంగీత జ్ఞానానికి నిదర్శనం.

ఆ ఉపన్యాస ప్రతిని కాశీనాథుని నాగేశ్వరరావు తీసుకొని 'భారతి'లోనూ, ఆంధ్రపత్రిక సారస్వతాను బంధంలోనూ 'గానకళ' పేరుతో అచ్చేయించారు. దీన్నే 'గానకలె' పేరుతో కన్నడంలోకి అనువదించారు. రాళ్ళపల్లి త్యాగరాజ కృతులకు రాసిన స్వరాలను ఆంధ్రప్రభ వారపత్రిక ప్రచురించింది.

### అనువాదకుడిగా :

బహు భాషా పండిఉతడైన రాళ్ళపల్లి అనువాద రచనలు కూడా చేశాడు. వేంకటాధ్వరి విశ్వగుణాదర్శకంగా రాసిన "సుభాషిత కౌస్తుభము"ను నూరు పద్యాలలో తెనిగించి, అనువాదం తృప్తి నివ్వకపోవడంతో దాన్ని చించేశాడు. కాళిదాసు రఘువంశం, బాసుని స్వప్న వాసవదత్తం కూడా అనువదించాక, చించేశాడు. హాలుని గాథాసప్తశతిని, గాథా సప్తశతీసారము'గా సుందర పాండ్యుని ఆర్య (సూక్తి)లు, జాయపసేనాని 'నత్తరత్నావళి' ఎనిమిది అధ్యాయాలు పరిష్కరించి అనువదించాడు.

### కవిగా :

రాళ్ళపల్లి 18 ఏళ్ళ వయసులోనే కావ్యరచన ప్రారంభించాడు. భారతీయుల్లో అద్భుత మానసిక పరిణామం తెచ్చిన రాజస్థాన్ ప్రాంతానికి చెందిన కథను వస్తువుగా తీసుకొని 'తారాబాయి (1911) కావ్యాన్ని 175 పద్యాలతో ఏకాశ్వాస కావ్యంగా రాసి, కట్టమంచి ప్రశంసలందుకున్నాడు. కాకినాడ నుండి వెలువడే సరస్వతీ పత్రిక దీన్ని వెలువరించింది. భార్యాభర్తల మధ్య అనుమానం పెనుభూతమై చొరబడితే, పరుషాధిక్య సమాజంలో స్త్రీ పరిస్థితి ఎలా ఉంటుందో మీరాదేవి (1913) కావ్యం ద్వారా ఎత్తి చూపాడు. గురజాడ రాసిన పూర్ణమ్మ, కన్యక, రాయప్రోలు వారి కష్ట కమల, స్నేహలత; కట్టమంచి వారి ముసలమ్మ మరణంలా ఇది కూడా స్త్రీ పక్షపాత విషాదాంత కావ్యమే. కాళిదాసు, భారవి వంటి సంస్కృత కవుల స్థాయిని ప్రమాణంగా స్వీకరించిన రాళ్ళపల్లి, తన కవిత్వం ఆ స్థాయిని అందుకోలేకపోయిందని కావ్యరచన విరమించుకున్నాడు.

మైసూరు మహారాజు పెట్టిన పోటీకోసం మైసూరు రాజ్యప్రగతిని వివరిస్తూ 'శ్రీమహిసూర రాజ్యాభ్యదయాదర్శః' అనే కావ్యాన్ని రాసి ప్రథమ బహుమతిగా 160 రూపాయలు అందుకున్నాడు. రాళ్ళపల్లి రాసిన లీలాదేవి నవలను ఆంధ్రప్రచారిణీ సభ ప్రచురించింది.

### విమర్శకునిగా :

రాళ్ళపల్లికి విమర్శకునిగా మంచి గుర్తింపు ఉంది. 'మనన శీలత, సంయమనము, సమదర్శిత, శిల్పదృష్టి. ఆయన విమర్శనమునకు శోభ కూర్చిన చొక్కపు సరకు' అంటున్న తల్లావజ్ఝుల కోదండ రామయ్య మాటలు ఉదాహరణీయం. వేమనను (1929) మహాకవిగా నిలబెట్టిన రాళ్ళపల్లివి, వేమన మహావిమర్శకుడిగా నిలబెట్టాడనడంలో సందేహంలేదు.

'పెద్దన పెద్దతనము' పేరుతో 20 పేజీల వ్యాసం రాసి ముగించకుండా వదిలేశాడు. 'సారస్వతాలోకము (1939) నాటకోపన్యాసములు (1954), ఆయన విమర్శకు నిలువెత్తు సాక్ష్యాలు. 'ఈ రెండు సంపుటాలలో కావ్య నాటకములకు సంబంధించిన కొన్ని ముఖ్య విషయాలు పండిత వ్యవహారార్థం రాసినా... సరసాతి సరసంగా, చతురాతి చతురంగా ఉంటూ నుడికారపు చలోక్తులతో...

రాసి తెలుగులో వ్యాసాలకు ఒక ప్రతిష్ట తెచ్చారు (డా॥ ఎస్వీ జోగారావు, మహతి పుట 268) రాళ్ళపల్లి.

**పరిష్కర్తగా :**

శ్రీకృష్ణ భూపాలీయము (1924), తాళ్ళపాక సంకీర్తనలు (1951-1976) శ్రీమదాంధ్ర మహాభారతము (1953), పాండు రంగ మహాత్మ్యం (1967) పరిష్కరణలు రాళ్ళపల్లి పాండిత్య ప్రకర్షకు ఉదాహరణలు. ఇవికాక, రాళ్ళపల్లి రాసిన వ్యాసాలు, పీఠికలు, విమర్శలో కొంగ్రొత్త ప్రమాణాలను, వినూత్న విలువలును స్థాపించాయని విమర్శకులు అంటారు.

**బిరుదులు, సత్కారాలు :**

మైసూరు ప్రసన్న సీతారామ మందిరం వారు నిర్వహించిన చతుర్థ సంగీత సమ్మేళనం (1961)లో 'గానకళా సింధు' బిరుదుతో గౌరవించారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడెమీ 'గానకళా ప్రపూర్ణ' బిరుదునిచ్చి గౌరవించింది. కర్ణాటక సంగీత నాటక అకాడెమీ 1969లో ఘనంగా సత్కరించింది. బెంగుళూరు గాయక సమాజం 'సంగీత కళారత్నతో (1970) గౌరవించింది. మద్రాసు మ్యూజిక్ అకాడెమీ సంగీతకళానిధి (1974) బిరుదుతో గౌరవించింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆయనను గౌరవ డాక్టరేట్ (డిలిట్)తో గౌరవించింది.

1979 మార్చి 11న బెంగుళూరులోని రాళ్ళపల్లి వారి ఇంట్లోనే తిరుమల తిరుపతి దేవస్థానం వారు సన్మానించారు. సన్మానం అందుకున్న కొన్ని గంటలలోనే ఆయన కన్నుమూశారు.

**ఆధార గ్రంథాలు :**

1. నాటకోపన్యాసములు - రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ (1935), త్రివేణి పబ్లిషర్స్, మచిలీపట్టణము.
2. సారస్వతాలోకము - రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ (1954), త్రివేణి పబ్లిషర్స్, మచిలీపట్నం-1.
3. రాళ్ళపల్లి పీఠికలు - సంపాదకులు : ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, ఆర్వీయస్ సుందరం (1978) రాళ్ళపల్లి అభినందన సమితి, బెంగుళూరు.
4. అనంతరాగం - సంపాదకులు : ఆర్వీయస్ సుందరం, ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, శివలంక శ్రీరామచంద్రమూర్తి (1977), రాళ్ళపల్లి అభినందన సమితి, బెంగుళూరు-28.
5. విమర్శకునిగా రాళ్ళపల్లి - వి. రమాంజనీకుమారి (1987), ఫ్రెండ్స్ పబ్లికేషన్స్, నల్లకుంట, హైదరాబాదు-44.

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తెలంగాణ కథా సాహిత్య వైశిష్ట్యం

- జె. లక్ష్మినర్సయ్య, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ (ఓరియంటల్), ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

తెలంగాణ ప్రాంతం కథలకు కాణాచి. గుణాఢ్యుడు పైశాచి భాషలో రాసిన ' బృహత్కథ ', హాలుని ' గాథా సప్త శతి' మొదలుకొని ఇప్పటి కథా రచయితలు భండారు అచ్చమాంబ, మాడపాటి హనుమంత రావు, జి. సురమౌళి, కేశవ స్వామి, ఆళ్వారు స్వామి, గూడూరి సీతారాం, బి. యస్ రాములు మరియు పెద్దింటి అశోక్ కుమార్ గారు మొదలైన కవులు కథా సాహిత్యాన్ని తమ రచనల ద్వారా సుసంపన్నం చేస్తున్నారు.

## పూర్వపు తెలంగాణలో తొలి కథలు :

శాతవాహనులకు కథా సాహిత్యానికి సంబంధం ఉంది. నాటి ప్రాంతంలో వ్యవహార భాష అయిన పైశాచి భాషలో గుణాఢ్యుడు "బృహత్కథ"ను సంకలనం చేశాడు. ఇతడు ఛిముఖుని ఆస్థానకవి. క్రీ.శ.2.వ. శతాబ్దంలో "బృహత్కథ"ను "పైరుంగదై" అనే పేరుతో తమిళంలోకి అనువదించబడింది. ఆధుకకాలంలో భారతీయ భాషల్లోకి ఇంగ్లీష్, జర్మనీ, ఫ్రెంచ్ మరియు రష్యన్ మొదలైన యురోపియన్ భాషల్లోకి అనువదించబడింది. పైశాచి భాష నుండి సోమదేవుడు సంస్కృతంలోకి అనువదించిన "కథా సరిత్సాగరం" ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. "కథా సరిత్సాగరం" అనువదింనువదించిన సోమదేవుడు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, గంగాధార ప్రాంతానికి చెందిన వాడు. ఇతను క్రీ.శ. 959 సంవత్సరంలో "కథా సరిత్సాగరం"ను అనువదించాడు. గుణాఢ్యుని "బృహత్కథ " ప్రపంచ కథలకు పుట్టినిల్లుగా మారింది. అవి పంచతంత్ర కథల్లోకి భేతాళ పంచ వింశతి, శుక సప్తతి, బౌద్ధ జాతక కథల్లోకి పాకాయి. మరో శాతవాహన రాజైన హాలుడు "గాథా సప్త శతి" ని ప్రాకృత భాషలో రచించి ప్రపంచసాహిత్యానికే దిక్సూచిఅయ్యాడు. ఇలా తెలంగాణలో ప్రాంతానికి సంబంధిం చిన కథలతో సంస్కృతిక జీవనం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి.

## తెలంగాణలో తోలితరం కథకులు :

ఒక జాతి జీవన స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, మెరుగైన జీవితం కోసం చేసిన పోరాటాలు, వాటి ద్వారా ఫలితాలు సాహిత్యంలో ప్రతి ఫలించిన నాడు వాటి శాశ్వత్వం ఏర్పడుతుంది. తెలుగు వారి జీవితాల్ని సాంస్కృతిక పున:ర్వికాస వెలుగును, కథా సాహిత్యంలో రికార్డు చేసిన వారిలో అగ్రగణ్యులు, ఆధ్యులు భండారు అచ్చమాంబ. ఆధునిక కథానిక ప్రక్రియకు పునాది వేశారు. ఆమెకు తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర మరియు ఛత్తీస్ ఘఢ్ ప్రాంతాల్లోని జీవితాలతో ఈమెకు లోతైన సంబంధాలు ఉన్నాయి. తాను దగ్గరి నుండి చూసిన జీవితాలనువాటిలో రావల్సిన మార్పులను కాలానుగూణంగా, అమోదనీయతకు అనుకూలంగా కథా సాహిత్యంలో రికార్డు చేశారు.అచ్చమాంబ గారి మొదటి కథ "గుణవతి అగు స్త్రీ".

మాడపాటి హన్మంత రావు గారి "హృదయ శల్యము" మరియు "తొలి తెలుగు కథ - ఏడు అభిప్రాయాలు" అను పుస్తకాలలో భండారు అచ్చమాంబ గారి కథను తొలి కథగా పేర్కొన్నారు. తొలి తెలుగు కథ ఏది ? అనే అంశంపై చర్చలు, వాదోప వాదాలు మరియు పరిశోధనలు జరిగి చివరకు " గుణవతి యగు స్త్రీ" అనే కథకు ఆ గౌరవం దక్కింది. ఇలా మొదలైన కథా ప్రస్థానం మధ్యలో ఆగుతూ మళ్ళీ నడక ప్రారంభించింది. తెలంగాణ యాస, భాషతో, మాండలిక పదాలతో సింగారించుకుని కొత్త అందంతో నిండు యవ్వనపు యువతిలా ముస్తాబై కొత్త సొబగులు అద్దుకుంది.

తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని కథా సాహిత్యం ద్వారా ప్రజల జీవన స్థితి గతుల్ని చూపించిన వట్టికోట ఆల్వారు స్వామి గారు నైజాం పాలనలోని ముస్లీం కుటుంబాల ఆచారాలు, అప్పటి పరిస్థితులు,

యుగాంత పరిణామాలు మనకు నెల్లూరి కేశవ స్వామి కథలలో కనిపిస్తుంది. కేశవ స్వామి గొప్ప కవి అని చెప్ప డానికి మనం అన్నికథలు చదవాల్సిన అవసరం లేదు. ఒక "యుగాంతం" అనే కవిత చాలు.

రూహీ అపా, ప్రతీకారం, విముక్తి మరియు ఆకరి కానుక మొదలైనవి ఆణిముత్యాలే. కేశవ స్వామి వారి సమకాలికులు అయిన బిరుదురాజు రామరాజు, ధాశరథి రంగాచార్య, వట్టి కోట ఆళ్వారు స్వామి, సి. నారాయణ రెడ్డి. జి. సురమౌళి మరియు గూడూరి సీతారాం లాంటి వారు కథా సాహిత్యాన్ని బ్రతికిస్తూ వచ్చారు.

ఇక ఆధునిక కథా రచయితలు కూడా నేటి సమాజ జీవన చిత్రణనను స్పృశిస్తూ ముందుకు వెళ్తున్నారు. అందులో కొందరి రచయితల కథల్ని నా మొక్క వ్యాసం నందు స్పృశిస్తూ తెలంగాణ కథా సాహిత్య గొప్పతనాన్ని తెలుగు సాహితి పరులకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నాను.

తెలంగాణలో మొట్ట మొదటి కథను అందించి స్త్రీల మొక్క మనో భావాల్ని, ఆనాటి పరిస్థితుల్ని కళ్ళకు కట్టించారు. భండారు అచ్చమాంబ గారు తను తక్కవ వయస్సులో తనువు చాలించినప్పటికిని స్త్రీల అభ్యున్నతికి కృషి చేసిన మహిళ. తన కథల్ని మనం చూసినట్లైతే మొదటిది "గుణవతి యగు స్త్రీ".

తను రాసిన కథల్లో దంపతుల ప్రథమ కలహం, స్త్రీ విద్య, ధన త్రయోదశి మొదలైనవి ఉన్నాయి. ఆమె ఒక్కో కథ ఒక్కోరకమైన ఆణిముత్యం "గుణవతి యగు స్త్రీ" ఈ కథ "తెలుగు జనానా" పత్రికలో 1901లో అచ్చ యింది. ఈ కథను దశ కుమార చరిత్రలో ఉన్న ఒక కథను తీసుకుని రచించింది. ఈ కథలో ఒక వర్తకుడు తనకు గుణవతియగు భార్యకోసం వెతుకుతూ దేశాటనం వళ్ళడం జరుగుతుంది. తాను దేశాటనం చేస్తూ తల్లి దండ్రులు లేని అమ్మాయిని గుణవంతురాలుగా గుర్తిం చడం, తాను పెట్టిన పరీక్షల్లో ఆమె నెగ్గడం అతనికి భార్య కావడం జరుగుతుంది. ఈ కథలో గుణవతి యగు స్త్రీ ఇల్లాలుగా లభిస్తే అతని జీవితం, కుటుంబం సంతోషంగా ఉంటుందని, పొదుపుగా సంసారం నడుపు తుందని రచయిత్రి ఈ కథలో మనకు చెబుతుంది. తాను కథ చెప్పిన విధానం చాల బాగుంది.

"స్త్రీ విద్య"అనే కథా రచనలో స్త్రీ విద్య ఆవశ్యకతను కథానాయకుడి ద్వారా చెప్పిస్తుంది. "నీకే చదువు వచ్చియుండిన ......" నా అంతరంగంలోని విషయాలు నీకో ఉత్తరం ద్వారా తెలిపెవాడిని. నీకు ఆడవారు చదువు కోరాదని మీ పెద్దలు చెప్పిన విషయం సరైనది కాదని తన భార్య చేత చదవటం మొదలు పెట్టిస్తాడు.

జి. సురమౌళి గారి "ముక్కోటి బలగమోయి" కథ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డ తర్వాత దత్త మండలం వారు, బ్రిటీష్ ఆంధ్రా వారి నుండి తెలంగాణ ప్రజలు ఎదుర్కోబోయో అవస్థలను ఆధిపత్య భారాన్ని క్రాంత దర్శిగా చూపించారు. ఎమి తెలియని అటెండర్ కోటాయి ఒక కంబళి తుండు గుడ్డతో కర్నూలు నుండి హైదరా బాద్ వచ్చి కొద్దిరోజుల్లోనే స్థానికుల్ని భయపెటే స్థాయికి ఎలా వచ్చాడో అందుకు తెలంగాణ ప్రజల అమాయ కత్వం, మంచి తనం, సహృదయత, సంస్కారం అతనికి ఎలా ఉపయోగపడ్డాయో అతను "ఏకులా వచ్చి ఎలా తయారయ్యాడో ఈ కథ ద్వారా మనకు తెలిపారు.

పి. యశోదారెడ్డి గారి "ఎచ్చమ్మ కథలు"లో తెలం గాణ యాస, భాష మనకు కనిపిస్తాయి. తను రాసిన కోడలమ్మ ఎతలు, కొత్త బాట, మా ఊరి ముచ్చట్లు కథల్లో తెలంగాణ మాండలికం కనిపిస్తుంది. కోడలమ్మ ఎతలు కథలో "కొత్త కోడలి ఎతలు" అత్త గారి పెత్తనం వల్ల ఎదుర్కోనే సమస్యలు అందులో అత్తగారి మాటకారి తనం అప్పటి వారి ఆలోచన తీరుతెన్నులు కనిపిస్తాయి. ఈ కథలో తెలంగాణలో ఎక్కువగా వాడె సామెతలు మనకు కనిపిస్తాయి. ఇంకా గంగిరెగి చెట్టు, కొత్త బాట మొదలైన కథలు తెలంగాణ పల్లె జీవితాన్ని కళ్ళకు కట్టెలా చూపిస్తాయి. యశోదాగారి కథలు సమాజంలో జరిగే పరిణామాలను స్పృశిస్తూ ముందుకు వెళ్ళినవే. "సమాధి స్థలము" అనే కథను పొట్లపల్లి రామా రావు గారు 1945 సంవత్సరంలో ఈ కథను రచించారు. ఒక

బీద స్త్రీ తన చనిపొయిన శిశువును తీసుకుని ఓంటరిగా స్మశానానికి వెళ్తుంది. ఆమెను కాటి కాపరి అడ్డగించి లోనికి రానివ్వడు కానీ ఆమె లోనికి ప్రవేశిస్తుంది. అయిన అక్కడ పూడ్చడానికి స్థలం దొరకదు అదె స్మశానంలో రాజకీయ నాయకుల, దనవంతుల, సైనికుల సమాధులకు ఎంతో స్థలం కేటాయించబడింది. ఆమె అక్కడి నుండి తిరిగి వచ్చి ఒక రోడ్డు పక్కన శిశువును పూడ్చి పెడుతుంది. ఈ కథలో ఉన్నత వర్గాల వారు బ్రతికుడగానే కాక చనిపోయాక కూడా భూమిని ఆక్రమిస్తున్నారని రచయిత ఆవేదన వ్యక్తం చేశాడు. తెలంగాణ తొలితరం కథకుడు గూడూరి సీతారాం. ఇతని కథలన్ని 1953 నుండి 1965 మధ్య కాలంలో వెలువడ్డాయి. రాజమ్మ రాజరికం, లచ్చి, పిచ్చోడు మొదలైనవి. 1950 ప్రాంతంలో పల్లెల్లో పట్టణ నాగరికత ప్రభావం పడింది. పట్టణంలో వాడే సౌందర్య ద్రవ్యాలు పల్లెల్లోకి ప్రవేశించాయి. నాటి నాగరికత వ్యామోహం వల్ల కొందరు పల్లెల్లో ఉండి పట్టణీకరణకు అలవాటు పడితే మరికొందరు పట్టణాలకు వలస వెళ్ళారు. "రాజమ్మ రాజరికం" కథ పల్లెల్లోకి చొచ్చుకొస్తున్న పట్టన సంస్కృతికి నిదర్శనం. రాజమ్మ సాధ సీదా రైతు కూతురు. ఆమె అప్పుడే ప్రవేశించిన సినిమాల సుడిగుండంలో చిక్కుకుని ఒక స్త్రీ తనను తాను ఎలా పోగొట్టుకుందో చెబుతుంది ఈ కథ. ఇంటోంచి వెల్లిన రాజమ్మ తిరిగి వెనక్కి రావటానికి వీలు లేని పరిస్థితిని రాజమ్మ ఎలా కలిపించుకుందో ఈ కథ వివరిస్తుంది. కొక్కుల భాస్కర్ గారు రాసిన "తెగిన పోగు" కథ పద్మశాలీలు చేనేత వృత్తి గిట్టుబాటు కాక బొంబాయి, భీవండి వలస వెళ్ళిన క్రమాన్ని చిత్రిస్తుంది. కొక్కుల భాస్కర్ ఈ కథలో బొంబాయి వలస వెళ్ళిన క్రమంలో కుటుంబ సంబంధ బాంధవ్యాలు, ఆర్థిక స్థితిగతులు, తాను చాత కానీ వయస్సులో తిరిగి వచ్చిన సందర్భంలో ప్రరిస్థితులు ఏ విధంగా మారింది, పేదరికం తప్పా ఏమి మిగలని దశని "తెగిన పోగు" కథలో రచయిత హృదయ విదారకంగా చిత్రించాడు. బొంబాయి వలసల తర్వాత తెలంగాణ నుండి అరబ్ దేశాలకు వలసలు ఎక్కవ అయ్యాయి. ఈ వలసల కారణంగా పల్లెల్లోని ఇల్లలో ఎలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయో, కొంతమంది జీవితాలు ఏవిధంగా ఛిద్రమౌతున్నాయో మనకు పెద్దింటి అశోక్ కుమార్ గారు రాసిన కథల్లో హృదయానికి హత్తుకునేలా కనిపిస్తాయి. తాను రాసిన 'ఘర్షణ', 'కన్న తల్లి' కథలల్లో ఇంటి యజమాని వలస వెళితే భార్యా, పిల్లలు ఎదుర్కోనే సమస్యలు, అపవాదులు, వారి పట్ల సమాజం నడక తీరు ఎలా మారుతుంది అనేది "ఘర్షణ"లో కనిపిస్తుంది. "కన్న తల్లి" కథలో మస్కట్ మీదవ్యామోహంతో తల్లి మాట వినక పరాయి దేశం వెళ్ళి మోసపోయిన తీరు తెలంగాణ ప్రజల జీవన శైలి, అమాయకత్వం జాడలు కనిపిస్తాయి.

ఇలా ఎంతోమంది నాటి కవుల నుండి నేటి వర్తమాన కవుల వరకు మన తెలంగాణ కథా సాహిత్యం ప్రతి అంశాన్ని కదిలిస్తూ సమాజ జీవన చిత్రాల్ని ఎప్పటి కప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన రూపాన్ని మార్చుకుంటూ మానేరు నదిలా ప్రవహిస్తూ ముందుకు సాగుతుంది. ఈ ప్రవాహం ఆగనిది, ఆరనిది.

**ఉపయుక్తగ్రంథాలు :**

1. ఆధునిక కథా సరిత్సాగరం - మొదటి సంపుటి - బి. యస్. రాములు, వనమాల చంద్ర శేఖర్.
2. ఆధునిక కథా సరిత్సాగరం - రెండ. వ. సంపుటి - బి. యస్. రాములు, వనమాల చంద్ర శేఖర్.
3. భండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు - తెలంగాణ రీసెర్చ్ మరియు రెఫరాల్ సెంటర్ హైదరాబాద్, తెలంగాణ.
4. గూడూరి సీతారాం కథలు - వై. సత్యనారాయణ, ప్రచురణలు : మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల.

# జానపదుల వైద్యంలో వంటింటి దినుసులు

**– డా॥ పి. జయచంద్రుడు,** తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) చిత్తూరు.

ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. ఆరోగ్యంగా ఉన్న మనిషి ప్రపంచంలో ఏదైనా సాధించగలడు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే సమయానికి మంచి ఆహారం తీసుకోవాలి. పరిశుద్ధమైన, తాజా ఆహార పదార్థాలు తీసుకుంటే మనిషి ఆరోగ్యంగా, దేహదారుఢ్యంతో చక్కగా ఉండగలడు. అటువంటి ఆహారపదార్థాలతో జానపదులు వైద్యం చేయడం తరతరాలనాటిది. మనం ప్రతిరోజు ఆహారంగా తీసుకునే, ఆహారంలో ఉపయోగించే అనేక మసాలా దినుసులు, నిమ్మ, కొబ్బరి, ఎర్రగడ్డలు, తెల్లగడ్డలు మొదలైన దినుసులతో జానపదలు వైద్యం చేస్తున్నారు. అందుకు కారణం ఆయా పదార్థాలతో అనేక నొప్పులను నయం చేసుకోవడమే.

'ఇల్లాలే వైద్యురాలు - వంటిల్లే వైద్యశాల' అని ఏ మహానుభావుడన్నాడో గాని ఏ రోగానికైనా తక్షణ చికిత్సకు వంటిల్లు ఎంతగానో దోహదపడుతుంది. జలుబు చేస్తే శొంఠి కషాయం, దగ్గు వస్తే మిరియాల కషాయం, అజీర్తి చేస్తే వాము కషాయం లాంటి గృహచికిత్సలు జానపదులు ఈనాటికీ చేసుకుంటున్నారు. అట్లని జానపదులు ఇతర మందులుగాని, ఇతర వైద్యంగాని తీసుకోలేదని దానర్థం కాదు. నొప్పులు చిన్నదైనప్పుడు గాని, పెద్ద జబ్బులకైనా ప్రథమ చికిత్సగా జానపదులు ఆహారపదార్థాలతో వైద్యం చేసుకున్నారు. చేసుకుంటున్నారు కూడా. ఈ జానపదుల వైద్యాన్నే నాటు వైద్యమని, కూరగాయ వైద్యమని, గృహవైద్యమని వివిధ పేర్లతో పిలుస్తారు. ఇప్పుడు జానపదులు ఏఏ నొప్పులకు, ఏఏ జబ్బులకు ఆహార పదార్థాలను ఉపయోగించి వైద్యం చేస్తారో పరిశీలిద్దాం.

**తలనొప్పి :**

తలనొప్పికి జానపదులు సాధారణంగా పసుపు కొమ్మును నేలపై చాది అందులో కొంచెం సున్నం వేసి తలకు పట్టువేస్తారు. అలా పసుపుతో వేసిన పట్టు వలన కొంతసేపటికి తలనొప్పి మాయమవుతుంది. తెల్లగడ్డలను బాగా నలగగొట్టి నుదుట, కళ్ళకు రెండువైపులా రుద్దుకొంటే కూడా తలనొప్పి పోతుంది. కొందరు అల్లం కషాయాన్ని త్రాగుతారు.

**చెవినొప్పి :**

నువ్వులనూనెలో తెల్లగడ్డలు కాని, లవంగంకాని వేసి బాగా కాచి చెవిలో కొంచెం వెచ్చవెచ్చగా పోస్తే చెవినొప్పి తగ్గిపోతుంది. నిమ్మరసాన్ని నీళ్ళలో కలిపి కొంచెం వెచ్చచేసి చెవిలో బొట్టుబొట్టుగా వేసినా చెవిపోటు తగ్గుతుంది.

**పంటి నొప్పి :**

పంటి నొప్పి పోవడానికి జానపదులు ఎక్కువగా పొవ్వాకు చెక్కను ఉపయోగిస్తారు. కొంతమంది లవంగాలను, మిరియాలను కూడా వాడతారు. మిరియాలను, ఉప్పును మెత్తగా పొడిచేసి నొప్పిగా ఉండే పంటి మీద కొంతసేపు ఉంచితే పంటినొప్పి కొద్దికొద్దిగా తగ్గుతుంది. అలా రోజుకు రెండుపూటలు చేస్తే పంటినొప్పి తగ్గే అవకాశం ఉంది. లవంగాలను మెత్తగా నూరి నిమ్మరసంతో కలిపి చిగురు, పన్నుకు ఒత్తడం ఇస్తే నొప్పి తగ్గుతుంది. దాల్చిన చెక్కతో కూడా పంటి నొప్పిని పోగొట్టవచ్చును.

**గొంతునొప్పి :**

వెచ్చని నీళ్ళలో ఉప్పువేసుకొని అది బాగా కరిగిన తరువాత ఆ నీటిని గొంతులో పోసుకుని మింగకుండా పుక్కలిస్తే గొంతు నొప్పి పోతుంది. కఫం వలన ఎక్కువగా గొంతునొప్పి ఉంటే మిరియాలపొడిని కొంచెం బెల్లం ముక్కతో తింటే గొంతు నొప్పి తగ్గిపోతుంది. ఇంకా మునగాకు రసాన్ని సున్నంతో కలిపి గొంతుకు పూసినా నొప్పి తగ్గుతుంది. ధనియాలను రెండు ఉప్పురాళ్ళతో నమిలి మింగినా గొంతు నొప్పి పోతుంది.

**కడుపు నొప్పి :**

వాము, ఉప్పు కలిపి తింటే కడుపు నొప్పి పోతుంది. వెచ్చని నీళ్ళలో కొంచెం చక్కెర వేసుకొని తాగినా కడుపు నొప్పి తగ్గుతుంది. దాల్చిన చెక్క పొడిని, ఒక చెంచా తేనె కలిపి మూడు పూటలా తీసుకుంటే కడుపునొప్పి, కడుపులో గ్యాస్ చేరడం, పొట్ట ఉబ్బరం అన్ని తగ్గి పోతాయి. అట్లే ధనియాల పొడిని, చక్కెర కలిపి తింటే కూడా కడుపు నొప్పి తగ్గిపోతుంది.

**కళ్ళు నొప్పి :**

ఆకుకూరలు సాధారణంగా కళ్ళకు మంచివి. కళ్ళనొప్పి వచ్చినపుడు పొన్నగంటాకు కళ్ళకుకడితే కంటి నొప్పి పోతుంది. పసుపు నీళ్ళద్దిన గుడ్డతో కళ్ళను తుడుచుకుంటే కూడా కళ్ళనొప్పి పోతుంది.

**రక్త విరేచనాలు :**

రక్త విరేచనాలతో బాధ పడే వాళ్ళు ధనియాలు, అల్లం కలిపిన కషాయాన్ని తాగితే రక్తవిరేచనాలు తగ్గుతుంది. సగ్గుబియ్యాన్ని కాచి తాగినా తగ్గిపోతుంది. అదేవిధంగా దాల్చిన చెక్క పొడిని తగుమాత్రం నీళ్ళల్లో వేసి తాగిన రక్తస్రావం తగ్గుతుంది.

**దగ్గు :**

అల్లం, మిరియాలు, పసుపు పాలల్లో వేసి వెచ్చవెచ్చగా తాగితే దగ్గు తగ్గిపోతుంది. శొంఠిని ఉప్పు కలుపుకొని తింటే దగ్గు తగ్గుతుంది. దగ్గు తగ్గడానికి దాల్చిన చెక్క పొడితో తేనె కలుపుకొని తినాలి.

**జ్వరం :**

జ్వరం వచ్చినప్పుడు ఆహారం తీసుకోకపోతేనే జ్వరం తగ్గిపోతుంది. మామూలుగా తులసిరసాన్ని చెవిలో రెండు చుక్కలు వేస్తే జ్వరం తగ్గుతుంది.

**గాయాలు, పుండ్లు :**

గాయాలకు పసుపును రాసినపుడు తగ్గిపోతుంది. రక్తం కారుతున్నప్పుడు కాల్చిన మిరియాలను, కాల్చిన గుడ్డతో పొడిచేసి రక్తం కారుతున్న చోట పెడితే రక్తం కారడం తగ్గుతుంది. తెల్లగుడ్డలను చీముపట్టిన పుండ్లకు రాస్తే పుండ్లు ఎండిపోతాయి. కాలికి ముల్లు గుచ్చుకొని సొరెక్కినపుడు మిరపపొడిని మంచినూనెతో వేడిచేసి వెచ్చ వెచ్చగా కడితే చీముని లాగేస్తుంది. కాలిన గాయాలకు కొబ్బరి నూనెను రాస్తే తగ్గిపోతుంది. పుండ్లకు కొబ్బరి నూనె రాస్తే తగ్గుతుంది.

**పాము, తేలు కాటులు :**

తేలు కాటుకు ఎర్రగడ్డ కాని, తెల్లగడ్డ కాని నలగగొట్టి గాయమైన చోట కట్టితే నొప్పి తగ్గుతుంది. తేలుకుట్టగానే ఎర్రగడ్డ, బెల్లం నమిలి తినాలి. ఎర్రగడ్డ రసాన్ని కుట్టిన చోట పూయాలి. పాముకాటును గుర్తించడానికి మిరప గింజలను నమిలిస్తారు. మిరియాలు నమిలినప్పుడు కారంగా లేకపోతే పాముకాటుగా గుర్తించి తగు వైద్యం చేస్తారు.

**చర్మవ్యాధులు :**

చర్మంపై దద్దుర్లు లేచినపుడు, దురదగా ఉన్నప్పుడు కొత్తిమీర ఆకులతో తేనె, బాదాం తైలం కలిపి రాస్తే దురదలు తగ్గుతాయి. ఇంకా చర్మవ్యాధులకు వేపాకులు, నిమ్మరసం, పసుపు వంటి వాటిని వాడుతారు. ముఖంలో మొటిమలకు దాల్చిన చెక్కను నిమ్మరసంతో చాది మొటిమలకు వేయాలి.

**కీళ్ళనొప్పులు :**

కీళ్ళనొప్పులకు ధనియాలపొడి, దాల్చిన చెక్కపొడి, తేనె వంటి వాటిని ఉపయోగించి ఒత్తడం ఇస్తారు.

ఇంకా అనేక ఇతర నొప్పులకు, జబ్బులకు వంటింటి ఆహార సామాగ్రిని ఉపయోగిస్తారు. తల భారాన్ని తగ్గించ డానికి గసగసాలు తోడ్పడుతాయి. ఉల్లిపాయలు రక్తాన్ని శుభ్రం చేస్తుంది. ఉల్లిపాయలను తినకపోతే క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా ఉందని పరిశోధకుల అభి ప్రాయం. తెల్లగడ్డలు కొవ్వును కరిగిస్తుంది. కరివేపాకు పొడిని బాలింతలకు అన్నంతో ఇస్తారు. అది బాలింతలకు కావలసిన వేడిని ఇస్తుంది. వెంట్రుకలు పెరగడంలో, చుండ్రు పోవడానికి కరివేపాకు ఎంతగానో తోడ్పడు

తుంది. మెంతులు వేడిని తగ్గిస్తుంది. ఆకలివేయడానికి, జీర్ణవ్యవస్థ బాగా పనిచేయడానికి జీలకర్ర ప్రధానపాత్ర పోషిస్తుంది. పసుపు క్రిమిసంహారిగా పనిచేస్తుంది. గాయాలను మాన్పడంలో, రక్తస్రావం తగ్గించడంలో పసుపుపొడి ఉపయోగపడుతుంది.

ఉసిరికాయ సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. వ్యాధి నిరోధకశక్తిని పెంచడంలో ఉసిరిపాత్ర కీలకమైనది. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని జానపదుల నమ్మకంలో ఉల్లికి ఎంత ప్రాధాన్యం ఉన్నదో తెలుస్తుంది. సర్వరోగాలకు వాడదగిన మసాలా దినుసు దాల్చిన చెక్క. పంటి నొప్పి, జ్వరం, చెవుడు, రక్తస్రావం తగ్గించడం, కొవ్వును తగ్గించడం, దగ్గు.. ఇలా అనేక రోగాలకు దాల్చిన చెక్కను వాడుకోవచ్చు. బట్టతలపై వెంట్రుకలు రావడానికి దనియాలపొడిని తగు మోతాదులో వెన్నిగర్ కలిపి రోజు నెత్తికి రాసుకుంటే బట్టతల చిగురిస్తుంది. కొత్తిమీర, కర్పూరం కలిపి రసం పిండి వాటిని ముక్కులో వదిలితే ముక్కులో నుంచి రక్తం కారడం తగ్గిపోతుంది. ధనియాలను నీటిలో రాత్రి నానబెట్టి ఉదయం ఆ నీటితో నోరు పుక్కలిస్తే నోటిపుంత పోతుంది. ఇలా వంటింటి దినుసులు నిత్యం జానపదుల వైద్యంలో చోటు చేసుకుంటున్నది. ఒక విధంగా చెప్పాలంటే మనం తీసుకొనే ప్రతి ఆహారపదార్థం వైద్యగుణం కలిగి ఉన్నదనే చెప్పవచ్చును.

**ఇల్లాలే వైద్యురాలు - వంటిల్లే వైద్యశాల**

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# పఠాభి పదప్రయోగ వైచిత్రి

– డా॥ పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు (తెలుగు), ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

విచిత్ర భావాల విలక్షణకవి పఠాభి. ఎందుకంటే తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి గారి 'ఫిడేలు రాగాల డజన్'కు శ్రీశ్రీ రాసిన ఇంట్రోలో "విచిత్రమే సౌందర్యం సౌందర్యమే విచిత్రం" అనడంలో విచిత్రమైన కవితా భావుకత విలక్షణంగా కవిత్వంలో దర్శనమిస్తుంది. "భావకవిని కాను అహంభావ కవిని నేను" అన్న భావనలో మాటల్లో మృదుభాషిగా భావుకతలో అహంభావుకుడిగా దర్శన మిస్తాడు.

ఎవర్నని యనుకొంటరో మీరు నన్ను?
నేను పఠాభిని...
కాంగ్రేసు రాష్ట్రపతి స్థానాని కోసం
బాబూ సుభాసుబోసుతో పోటీజేసి
ఓడిపోయిన డాక్టర్ పట్టాభిని
గాన్నేను మరో పఠాభిని;

అని 'ఆత్మకథ' కవితలో తనకు తాను నిర్వచించు కున్నాడు. "కాని అక్కడక్కడ ఈ పద్యాలలో వచ్చునట్టి పఠాభి అను పేరుగల పాత్రకు, గ్రంథకర్తకు ఏ మాత్రం సంబంధంలేదని గమనింపు; 'కృష్ణపక్షం'లోని 'కృష్ణ' కును దాని గ్రంథకర్త నామంలోని 'కృష్ణ'కును ఎలా సంబంధం లేదో అలాగే!" అని తన విలక్షణతను, విచక్షణతను వినూత్న పంథాలో పేర్కొన్నాడు.

"నాకు విచిత్రమైన భావాలున్నాయని నా కన్నులలో టెలిస్కోపులు మయిక్రోస్కోపులున్నాయంటాడు. పఠాభి చూసే చూపు కొత్తదిగా ఉంటుంది. అభివ్యక్తీకరణలో విలక్షణత, వినూత్న పంథాలో వెల్లివిరుస్తుంది.

"నా ఈ వచన పద్యాలనే దుడ్డుకర్రల్తో
పద్యాల నడుముల్ విరగదంతాను
చిన్నయసూరి బాలవ్యాకరణాన్ని
చాల దండిస్తాను
ఇంగ్లీషు భాషా భాండారంలో నుండి
బందిపోటుంజేసి కావల్సిన
మాటల్ను దోస్తాను"

పై భావనలో సంప్రదాయపద్యం, వ్యాకరణం పట్ల విముఖత, ఆంగ్ల పదాల మీద మోజు, ఆధునికత వైపు పయనం పఠాభి పల్కులలో ప్రతిధ్వనిస్తాయి. "నా యిష్టం వచ్చినట్లు చేస్తాను, అనుసరిస్తాను నవీనపంథా" అన్న నవీనుడు పఠాభి. ఆంగ్లపదాలను తెలుగు పదాలతో జోడించి వ్యక్తీకరణలో వినూత్నత, విలక్షణలను ప్రదర్శిం చిన ఆధునికుడు తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి.

తగిలింపబడి యున్నది జాబిల్లి / చయినాబజారు గగనములోన, పయిన / అనవసరంగా అఘోరంగా....

"కానీ దురదృష్ట శశీ!
నీవు మాత్రం పదిహేను రోజుల్లోన గాని
నీ రూపాన్నంతా మార్చుకోలేవు
చాలాకాలం, చాలా ఆలస్యం,
ప్రజాదృష్టిని ఆకర్షించటంలో
మార్కట్లోని దుస్సాధ్య కాంపిటీషన్‌కు నీవు
తట్టుకోలేవు జాగ్రత్త సుమా
దివాలా తీస్తావు. నీవిచ్చోట
ఖచ్చితంగా అనవసరం నిరుపయోగం కూడాను

అని 'జాబిల్లి' కవితలో సహజత్వానికి, కుత్రిమత్వానికి, ప్రాచీనత, ఆధునికత-అత్యాధునికతకి మధ్య వ్యత్యా సాన్ని, సమాజంలో పోటీతత్వాన్ని, ప్రపంచీకరణ నేప థ్యాన్ని అక్షరబద్ధం చేశాడు పఠాభి. 'దుస్సాధ్య కాంపిటీషన్' లాంటి వినూత్న ప్రయోగం చేయటంలో దిట్ట పఠాభి. "శశీ! చయినాబజారు గగనానికీ నాకూ ఏ మాత్రం సరిపోదు దాంపత్యం" అంటాడు. "శశీ! నీ గుండ్రని మోమందపు తరహాసయితము మాకేమి నచ్చనే నచ్చదు! నోరూరును మాకు, నాగరిక కన్యల / పవుడర్ పూయ బడిన ముఖాలంటే అని ముమ్మాటికీ నీవిచ్చోట అనవ

సరం" అంటాడు. పఠాభి చెప్పదలుచుకున్న విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు సూటిగా చెప్పడంలో తనకు తానేసాటి.

చీలు దారుల్లోన నిల్చోనున్నాడు పోలీసు భటుడు అని భరతనాట్యం బాడుచున్న / ప్రశాంతప్రకాశ ముఖం బుతోడి / నటర్షి చూడామణిలాగా కన్పిస్తున్నాడు" అని పోలీసుని 'నటర్షి చూడామణిలా' పేర్కొన్నాడు. "బల్బు హారన్ల తాళాం తోడి / యిలక్ట్రికు హారన్ల రాగానికిన్ని / మోటారు సయికిళ్ళ మృదంగానికినీ, అనుగుణ్యంగా నర్తిస్తుంటాడు అని పోలీసును అభివర్ణించి అతని లక్షణా లను బట్టి 'మహాశక్తి సంపన్నుండగు యోగికాడా?' అని ప్రశ్నించడంలో విలక్షణత కన్పిస్తుంది.

"నవ్యస్త్రీ గురించి "క్రాస్వర్డ్ పజిల్సులాగున్న నీ కన్నులను సాల్వు జేసే మహాభాగ్యం ఏమానవునిదో కదా! కన్నులను క్రాస్వర్డ్ పజిల్సు" అని ఎవరూ పేర్కొనని పదబంధాన్ని సృష్టించిన వినూత్న పదశిల్పి పఠాభి. 'మరీనా' కవితలో

అహో! జాతి కన్నియ చిక్కని నిక్కబొడుచుకొని
వచ్చుచున్నట్టి గట్టిరొమ్ము
మగనిచే తృప్తి గననట్టి
అయ్యంగారి లలామగీటు "హంగ్రీ కనులు" అంటాడు.

"హంగ్రీకనులు" లాంటి ఎన్నో పదాలు సృష్టించిన ఘనత పఠాభికి దక్కుతుంది. ఆ పదసృజనలో లోతైన భావుకత కన్పిస్తుంది.

"ఓ బోగంచానా! నీవు! సంఘానికి వేస్టుపేపరు బాస్కె టువా? / మష్టుమషాణము పడవేయుబడునట్టి దిబ్బవా?" అని ప్రశ్నించి "కానీ నీవు మటుకు ఓ బోగం దానా! ముసుగులేని నిష్ఠురమగు నిజానివి / నీడపడనటు వంటి నిర్మలమగు నిజానివి" అని జగత్తులోకి వాస్తవాన్ని 'స్టేట్‌మెంట్'లా కవిత్వరూపంలో ప్రకటించాడు పఠాభి.

'ఉద్యోగం పురుష లక్షణం, నిరుద్యోగం మహాపురుష లక్షణం' అంటాడు. "రాటము మీద వడకుచుండుట, పోరాటములోన వడకకుండుట గాంధీ ఉపదేశద్వయం అంటాడు. "ఈనాడు వ్యాకరణంలోనేగాక అంతర్జాతీయ వ్యవహారాల్లో కూడా సంధులు పాటింపబడటం లేదు" అంటాడు. "తీసినా వేసినా బాధ కల్పించునవి పన్నులు" అంటాడు. "పంట పండించటంలో పూజ్యమయినా కోతలు కోయటంలో మొనగాడు" అని పఠాభి పంచాంగం చెప్పాడు.

గ్రామాలు గరిక ప్రదేశాలు గాని నాగరిక ప్రదేశాలు కావంటాడు. శూన్యానికి కూడా ప్రయోజనం వుంది. లోహమూ శూన్యం కలిసి పాత్రగా పరిణమించుచున్న వంటాడు. అతివల అధరాల మీద వుండేది అమృతం కాదు. అది అనృతం అంటాడు. గణితముకన్ననూ నాకు మణితము ఇష్టమంటాడు పఠాభి.

యుద్ధమ్ము వలన వసుధలోని సువర్ణంబు లోపించి వధ మాత్రము నిలంబడియున్నది" అంటాడు. "చని పోయిన వాని నామస్మరణం కన్నవాని వీలునామ స్మరణం చేస్తుంటారు బంధుమిత్రులు" అన్న వాస్తవకోణాన్ని ఆవిష్కరించాడు. "కాంచనంత, కాంత, కాదంబరి అనేవి జగతిలో ముక్కాలు; మిగిలింది నేను" అంటాడు. "ఉద్యోగులలో రెండు రకాల వారున్నారు / చేసే వారు కొందరు / కాజేసే వారు కొందరు" అని ఉద్యోగుల తీరు తెన్నులను సమీక్షించారు.

"ఈనాడు అంతా తారుమారు
ఆశలు మన్ను ముట్టినవి
ధరలు మిన్ను ముట్టినవి"

అన్న పల్కులలో సమాజంలోని పరిస్థితులను బట్టి ఆశలు నెరవేరక 'మన్ను'ను ముట్టితే ధరలేమో ఆకాశాన్ని ముట్టాయని అన్నీ తారుమారైన వైనాన్ని ముచ్చటగా మూడు వాక్యాలలో పంచాంగం ద్వారా భాష్యం చెప్పాడు.

"చిన్మయానందం కొందరికి / జిన్‌మయానందం అనేకులకు" అంటూ భావాన్ని ఆంగ్ల, ఆంధ్ర భాషలను మిక్సర్ చేసి పొట్లం కట్టినట్లు అక్షరబద్ధంచేసి కవిత్వసృజన చేస్తాడు పఠాభి.

"గాంధీ మహాత్ములు ఒకే ఒక్కరు / బ్రాందీ మహా త్ములు మటుకు పెక్కురు" అంటాడు. ద్రవ్యం యావత్తూ

పోయింది ద్రవం లాగా అంటాడు. "వెలయాలు చాలా ప్రియము / ఆలు చాలా సరసము" అంటాడు. సారాయి త్రాగినవాడు / షరాయి వీడి పోతున్నా తాను / వయి స్రాయి ననుకుంటాడు. "సినిమా వ్యాపారం బ్రహ్మాండ మైన లాటరీ / అదృష్టం వున్నవాడు వాసన్ / లేనివాడు ఉపవాసన్" అని సినిమా జాతకాన్ని 'లాటరీ'తో పోల్చి చెప్పాడు. తలంబ్రాలను గురించి "తలంబ్రాలు కాదు / అది తలన్ వ్రాలు" అంటాడు. 'దంతి కన్నా వదంతి పెద్దది' అంటాడు. "వధూవరులకు చదువుకన్నా / చది వింపు లెక్కువగా వున్నవి" అన్న వ్యంగ్యాస్త్రాలు పఠాభి పల్కులలో ప్రతిధ్వనిస్తాయి. కవులు చంద్రుని అమృత మండలం అంటారు. కాని శాస్త్రజ్ఞులు చెప్పేది మృత మండలం అని అంటాడు. కవులు, శాస్త్రజ్ఞుల భావనలో కల్పన, వాస్తవిక జగత్తులను బేరీజు వేసాడు పఠాభి. ప్రజాస్వామ్యాన్ని గూర్చి "సామాన్యులనే మాన్యులుగా తలంచుపద్ధతి 'డెమాక్రసి' అంటాడు.

'రామరాజ్యం కాదు నేను కోరేది, నేను కోరేది విరామ రాజ్యం' అంటాడు. 'చుక్కెదురు కావడం మంచిది కాదుగాని, చక్కని చుక్కెదురు కావడం అదృష్టమే' అంటాడు. 'ప్రేమ'లో పెనవేసుకొన్న ముడిని గూర్చి "విప్పు టకు వీలుకానిది ప్రేమడి" అంటాడు. గిరులకు పూర్వం యోగులు పోయేవారు; ఇప్పుడు భోగులు పోతున్నారు నీలగిరులకు" అంటారు. "హిమాలయంలోనే కాదు హిమం వుండేది; వనితా మణుల వదనాలలో సైతం హిమనీ స్నో వుంది" అంటూ ప్రతిపదంలోనూ సౌందర్యాన్ని అన్వేషించి పదచమత్కారాలను సృజించటంలో పఠాభిది అందెవేసిన చెయ్యి. "పూర్వం మంత్రాలను రహస్యంగా కాపాడేవారు; ఈనాడు రహస్యంగా కాపాడేది యంత్రా లను" అంటాడు. "కాకికన్ననూ దయనీయం ఏకాకి" అంటాడు. 'రెక్కాడితే గాని డొక్కాడని వాడు రైల్వే సిగ్న లర్" అంటారు. "కారుకన్నాస్పీడు పుకారు" అంటారు. "కాసుల రాబడి తప్ప మరేమీ తలంచనివారు, నిజంగా రాకాసులు" అంటూ తన పంచాంగాన్ని వినూత్న కోణంలో అభివ్యక్తం చేశాడు పఠాభి. పఠాభి ఇలా తన కవిత్వంలో తనదైన విచక్షణతో పదప్రయోగ వైచిత్రిని ప్రదర్శించి ప్రయోగవాదిగా ముద్రవేసుకున్నాడు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# ప్రపంచీకరణ యుగం - పదునెక్కిన స్త్రీ వాదం

– డా॥ తరపట్ల సత్యనారాయణ, తెలుగు శాఖాధిపతి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

ప్రవేశిక : ఇప్పుడు మనం ప్రపంచీకరణ యుగంలో పరుగులుతీస్తు అందరితో ముందుకుసాగాలనే తపనతో, మనుషులతో పాటు దేశాలు కూడా శరవేగంగా కదులుతూ, నూతన ప్రణాళికలను రచిస్తూ ప్రపంచాన్ని ఆకర్షిస్తు అడుగులు వేస్తున్నాయి. ఇది అత్యాధునిక నవ్య నాగరిక సమాజం. ఖండాల మధ్య దూరం పోయింది. దేశాలమధ్య సంబంధాలు సులభతరమయ్యాయి. అన్నీ గ్లోబల్ పుణ్యమా అని వేళ్లపై కంప్యూటర్‌తో అన్నీ సాధిస్తున్నాం, సమకూర్చుకుంటున్నాం. సంతోషిస్తున్నాం, సంభాషిస్తున్నాం. ఇవన్నీ షరామామూలే అయ్యాయి. ఎంత అభివృద్ధిని సాధించినా నింగిలో సగం నేలపై సగం అంతా సగం సగం అని సగర్వంగా చెప్పుకునే మహిళా లోకానికి అడుగడుగునా అవమానాలు, ఆత్మహత్యలు, ఛీదరింపులు, బెదిరింపులు నిత్యం ఎదురవుతూనే ఉన్నాం. న్యాయస్థానాల్లో ధర్మ దేవతకూడా కళ్ళుమూసుకునే ఉంటుంది. రక్షణభట నిలయాల్లో న్యాయ భక్షణే తప్పా బ్రతుక్కిభరోసా దొరకని పరిస్థితి. ఇదీ నేటి మహిళల దుస్థితి.

**ఉద్దేశ్యం :**

ఎక్కడ అవమానాన్ని పొందారో అక్కడే తల్లెత్తుకు తిరిగాలనే ధిక్కారస్వారాన్ని దిక్కులు పక్కిటిల్లేలా నినదిస్తూ, నినాదంగా స్వీకరిస్తు కలాలను, గళాలను సాధనంగా ఉపయోగిస్తూ, కొత్త గొంతుతో పదునెక్కిన కవిత్వాన్ని పదిమందికి పంచమ స్వరంతో వినిపించే ప్రయత్నం చేసిన ఎందరో స్త్రీ వాద రచయిత్రులు, కవియిత్రులు రచయితలు రాసిన పదునెక్కిన కవిత్వాన్ని వివరించే ప్రయత్నమే ఈవ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

**సంక్షప్తంగా స్త్రీ వాద నేపథ్యం :**

తెలుగు సాహిత్య చరిత్రలో నన్నయ ఆదికవి కాదు. కేవలం ఆంధ్రీకరణకవే. ఆయన కంటే ముందు అయ్యనభట్టు, చేతన భట్టు వంటి శాసన కవులున్నారు. అంతకంటే ముందు హాలుడు రాసిన గాధ సప్తశతిలో భాషా విశేషాలు ఎన్నో ఉన్నాయి. శాసనాల్లో తరువోజు వంటి పద్యాలు ఉన్నాయి. నన్నయ ఆంధ్రకరణతో అచ్చతెనుగు అటకెక్కింది. అచ్చమైన అజంతాభాష సంస్కృత రంగు పులుముకొని సంస్కృతీకరణతో పండిత భావజాలానికి, శిష్ఠ సంప్రదాయానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచి ఆర్యభాషకు అసలైన భాషగా నిలబడి గ్రంధస్త యోగ్యమైన భాషగా పునాది వేసుకుంది. అప్పటి నుండి ఇప్పటి వరకు 11వ శతాబ్దం సాహిత్య చరిత్రలో ఆంధ్రీకరణ యుగమే తప్ప అచ్చతెనుగు భాషకు ఆంధయుగమే అవుతుంది. తమిళ, కన్నడ, మళయాళ భాషల్లాగా మన తెలుగునకు అచ్చమైన దేశీయతతోకూడిన స్వచ్ఛత లోపించి అసలుకన్నా ఆర్య సంస్కృతికి ఆదిరూపమైంది. ఆ కాలంలో చాతుర్వర్ణమే రాజ్యమేలింది. కులానికేగాని కలానికి గౌరవం లేదు. ఆ కాలంలో స్త్రీకి గౌరవం లోపించింది. ఉదాహరణకు ఆతుకూరి మొల్ల రామాయణాన్ని రాసినా ఆమె కుమ్మరి మొల్లగానే నిందలు పొందింది. అలాగే రంగాజమ్మ అందించిన శృంగారాన్ని ఆస్వాదిస్తూనే ఆమెకు వేశ్య అనే అపనిందను అంటగట్టారు. ఇదంతా పురుష కవిపుంగవుల అహంభావ వైచిత్రికి నిదర్శనం. తరిగొండ వెంగమాంబ ఎంత ప్రతిభ ఉన్నా ఆమెను వితంతువుగానే ముద్రవేసిన సాహిత్య చరిత్రను ఈనాటి స్త్రీ వాద రచయిత్రులు నూతన దృక్పధంతో అధ్యయనం చేస్తూ అసలైన సాహిత్యాన్ని అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి.

పాశ్చాత్య విద్య అమలులోనికి వచ్చిన తరువాత సాంప్రదాయ విద్యకు బదులు ఆధునిక విద్యాబోధన అధ్యయన ఫలితంగా శాస్త్ర సాంకేతిక, వైజ్ఞానిక చరిత్ర,

సంస్కృతి, కళల అధ్యయనం మొదలైంది. దానితో సాహిత్యం సమాజచైతన్యానికి ఎంతో దోహదం చేసింది. ఆనాటి సమాజాన్ని ఆలోచింపచేసింది. అందులో భాగంగా తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ, కాల్పనిక, అభ్యుదయ, విప్లవ కవితోద్యమాల తరువాత అత్యంత ప్రభావం చూపిన ఉద్యమం స్త్రీవాద కవితోద్యమం. ఇది 1975 తరువాత నుండి క్రమ క్రమంగా వికసించి, విస్తరించి 1985 నాటికి ఒక స్థిరమైన స్థానాన్ని సంపాదించుకుని అన్ని ప్రక్రియల్లోను సమాంతరంగా విరాజిల్లిన కవిత్వమే స్త్రీ వాద కవిత్వం. దీన్నె ఫెమినిజం అంటున్నాం. దీన్నే స్త్రీ విముక్తి, స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ విమోచక ఉద్యమం అనే పేర్లతో పిలిచినా స్త్రీల ఆత్మక్షోభ, ఆత్మఘోష, అవమానాలు, ఆక్రంధనలకు, ఆత్మ హత్యలు, హింస, చాకిరి, పీడన, వేదన అన్నింటికి విరుగడగా స్త్రీ వాద కలాలు, గళాలు ప్రత్యేక వేదికలకు, చట్టాలకు, నూతన ప్రణాళికలకు, అమలుకు నాందిగా మారాయి.

స్థూలంగా చెప్పాలంటే 1789లో ఫ్రెంచ్ విప్లవం ద్వారా వచ్చిన నినాదంతో స్త్రీ వాద ఉద్యమానికి బీజం పడింది. ఆ తరువాత 1870 రష్యన్ విప్లవంలో స్త్రీ విముక్తి పోరాటం, అలాగే 1889లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో స్త్రీ పురుష సమాన హక్కులు, 1911 చైనా విప్లవంలో స్త్రీలు, కార్మికులు పాల్గొనడం, అలాగే 1966 తరువాత స్త్రీలు విముక్తికోసం బృందాలుగా ఏర్పడడం, ఆ తరువాత 1970లో అమెరికాలో అసలు ఉద్యమం మొదలైంది. ఇవన్నీ స్త్రీవాద ఉద్యమానికి నేపథ్యాలే.

## ఎలుగెత్తిన గొంతుకలు :

క్షమాయా ధరిత్రి అని చెప్పిన ఎన్నో ఆర్యోక్తులు అబలను సబలగా నిలబెట్టకుండా అందరికి సేవలందించే బానిసలుగా తయారుచేసాయి. స్త్రీని విలాస వస్తువుగా, పిల్లలను కనే యంత్రంలా మార్చేసాయి. కేవలం గృహస్థాశ్రమ ధర్మంలో ఆమె ఒక వంటింటి కుందేలు మాత్రమే. అందుకనే నస్త్రీ స్వతంత్ర మనర్హతి అని శాశించి మరీ ముద్రవేసారు. ఎందులోనూ స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేకుండా చేసారు. అది పురాత ఛాందసవాద కాలం, ఇది ఆధునిక, అత్యాధునికి నాగరిక సమాజం. ఆనాటి సీత లాంటిది కాదు ఈ నాటి స్త్రీ. ఇప్పటి సీత శీల పరీక్షంటే అదేదో నీతోనే మొదలుపెడదాం రావయ్యా మగధీర అంటూ ప్రశ్నించే యుగం. అందుకే మహిళా లోకం సహనాన్ని విడిచిపెట్టి చదువును ఒకచేత్తోను, చట్టాన్ని ఒకచేత్తోనూ పట్టుకుని కదులుతుంది. న్యాయాన్యాల కోసం నూతన కోణంలో అధ్యయనం చేస్తుంది. ఒకవైపు వరకట్నం ఒక వైపు లింగ వివక్షత, ఇంకొవైపు అధికార దర్పంతో అణచివేత, మరొకవైపు కులవివక్షత మొత్తం మీద విచిక్షణలేని ఈ మానవ సమాజంలో ఎన్ని వివక్షలు ఎదుర్కోవాలి స్త్రీ అనేది ప్రశ్నార్థకం! అందంగా ఉంటే ఒక ప్రమాదం, అందరితో కలిసి ఉంటే ఒక ప్రమాదం, మాట్లాడకున్నా ప్రమాదమే, మాట్లాడడం ప్రమాదమే అవుతున్న ఈ రోజుల్లో ఇన్ని ప్రమాదాల పంజిరంలో చిక్కుకున్న స్వేచ్ఛారహిత పక్షి కేవలం స్త్రీ మాత్రమే.

కమ్మని పిలుపుతో అమ్మగా నిలిచిన స్త్రీకి అడుగడుగునా అవమానాలేనా, మావల్లే సుఖాన్ని పొందిన ఈ మగ జాతిలో మా మనుగడ ప్రశార్థకంగా మారకూడదని శైంధవ కీచక దానవ సంస్కృతిగల మానవజాతికి వధ జరగాల్సిందే. అంటూ ఎరుపెక్కిన కళ్ళతో పిడికిళ్ళు బిగించి పిడుగుల వర్షం కురిపించి ఒక కొత్త సూర్యోదయం కోసం ఎదురు చూస్తుంది నేటి స్త్రీజాతి. వేదమంత్రాల మధ్య ఖరీదైన కట్నంతో నెత్తిన చల్లుకున్న అక్షతలు కొద్ది కాలానికే అగ్ని వర్షం అవుతుంటే కాలి బూడిదై కాలగర్భంలో కలిసిపోయి ఆకాశంలో అరుధంతీ నక్షత్రంలా ఆదర్శంగా కనిపిస్తుంటే, ఆరని అగరవొత్తిలా ఎరుపెక్కిన పగటి దివిటీల్లా పిడికిళ్లు బిగించి కదిలివచ్చిన కనకదుర్గలా ఎలుగెత్తిన గొంతులెన్నో ఉన్నాయి. వాటిలో నాటితరం నుండి నేటి తరం వరకు గమనిస్తే ఆధునిక కాలంలో స్త్రీలను ఏకంచేసిన వోల్గా, జయప్రభ, విమల, కొండేపూడి నిర్మల, కాత్యాయని విద్మహే, రజియా బేగం, షాజానా, మెహెజ్ బిన్, పాటిబండ్ల రజని, మందవరపు హైమావతి, ఘంట

సాల నిర్మల, చల్లపల్లి స్వరూపారాణి, ఈశ్వరి, వినోదిని ఇలా ఎన్నో ఎలుగెత్తిన గొంతులు కొత్తశకానికి బాటలు వేసాయి. స్త్రీ లోకంలో మహాచైతన్యాన్ని నింపాయి మరో కోణంలో ఆలోచింపచేసి మగధీరుల మస్తిష్కాల్లో సమానత్వ విత్తనాన్ని నాటే ప్రయత్నం చేసాయి.

## ఎరుపెక్కిన కలాలు :

హితేన సహితస్య భావః సాహిత్యం అన్నారు. సమాజానికి సాహిత్యం హితాన్ని బోధించాలి. అది కాంతా సమ్మితం కావచ్చు, మిత్ర సమ్మితం కావుచ్చు, ప్రభు సమ్మితం కావచ్చు. ఏదైనా సమ సమాజ నిర్మాణానికి శాంతి సందేశాన్ని, సామరస్య భావాన్ని అందించాలి. అది సాహిత్యం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. కాని సహిత్యంలో అది కనుమరుగైంది. కేవలం మొదటి దశలో భక్తి ప్రధాన్యత రెండవ దశలో కల్పనతో కూడిన శృంగార ప్రాధాన్యత, మూడవ దశలో ఆధునిక భావనలతో కూడిన వస్తువుతో కొత్త పుంతలు తొక్కింది. అప్పటి తెలుగు సాహిత్య చరిత్ర పండితుల సొంత పెత్తనంపై కొంతమంది పండిత వర్గ ఆధిపత్యానికి పరిమితమై క్రుత్రిమ తత్వంతో అభూత కల్పనలతో నడిచిపోయింది. సాంస్క ృతిక పునరుజ్జీవన దశ నుండి మార్పు వచ్చి ప్రజా వినియోగ భాషలో కవిత్వం సరళతరమై కార్మిక, కర్షక, శ్రామిక జీవుల కథలు, వ్యథలు కవితా వస్తువులయ్యాయి. అందులో స్త్రీ వాద కవిత్వం స్త్రీ సమస్యలపై వాస్తవిక దృక్ఫథంతో పాశుపతాస్త్రంగా అనేక రచనలతో ముందుకు వచ్చింది. స్త్రీవాద ఉద్యమంలో ఏంతోమంది కవులు, రచయిత్రుల కలాలు పదునెక్కిన భావాలతో సరికొత్త కోణంలో ఎన్నో అంశాలను ఆవిష్కరించాయి. కొన్ని ఎరుపెక్కిన కలాలను భావధారను పరిశీలిద్దాం : శ్రీమతి కవితలో స్త్రీ యొక్క స్థానాన్ని వివరిస్తూ

నేనొక స్త్రీని
నేనొక నిషిద్ధ జీవిని
మొన్నటిదాకా నా నవ్వు నిషిధ్ధం
నిన్న నా చదువు నిషిద్ధం

నేడు నా బ్రతుకు కూడ నిషిద్ధమే ... అంటూ ఈ నాగరిక సమాజంలో స్త్రీకి ఉన్న స్థానాన్ని, దుస్థితిని నిర్భయంగా ప్రశ్నించగలిగింది. గత కాలానికి నేటి కాలానికి కొనసాగుతున్న సనాతన సంప్రదాయ పద్ధతి ఈ స్త్రీ జాతిపై ఇంకా కొనసాగింపా? దీనికి పరిష్కారం ఏమిటి? కేవలం స్త్రీ అనే కదా ఈ నిషిద్ధం. ఆధునిక యుగంలో స్త్రీకి ఉన్న ఆంక్షలు ఇన్నీ, అన్నీ కాదు అన్నీ కష్టాలు తెచ్చేవే. కంధకాలుగా కనిపించేవే. అన్నీ నిషేధాలే. ఇదే పరిస్థితి ఇంకా కొనసాగింపు కాకూడదని స్త్రీ వాద కవయిత్రులు, రచయిత్రులు తమ కలం రాతలతో తమ తలరాతలు మార్చుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తంచేసారు. అలాగే చల్లపల్లి స్వరూపరాణి మాయమ్మ కవితలో

ఇంట్లో పెళ్లంగా
నిత్యావసర వస్తువులై
వీధుల్లో అవహేళన మాటలు మోపి
కులంతక్కువ గాడిదవై
అటు గోడ దెబ్బ ఇటు చెంపదెబ్బ

వెరసి గాయపడింది నీ బ్రతుకే... అంటూ ఒక దళిత స్త్రీ వేదనకు ప్రతిరూపంగా ఈ కవితను చిత్రీకరించారు. నేటికి అనేకమంది స్త్రీల వేదన, రోదన, కన్నీళ్ళు, కడగండ్లు ఇలాగే కొనసాగుతూనే ఉన్నాయి. కేవలం చాకిరీచేసే బానిసగా మాత్రమే ఈలోకం స్త్రీని చూస్తుందనేది వాస్తవం. కనీసం ఆమె కష్టాన్ని, బాధాతప్త హృదయాన్ని అర్థం చేసుకునే నాధుడేలేని పరిస్థితి. ఇంటిబయట అవహేళన పర్వాలే కనిపిస్తున్నాయి. ఇదే ఆధునిక భారతంలో అడుగడుగునా కనిపించే నిషేధ ఉపాఖ్యానాలు, ఆవేదనలు, ఆందోళనలు ఎన్నో ఎన్నెన్నో...

రోడ్డు మీద స్త్రీ కనిపిస్తే వేలకళ్ళు ఆమె శరీరాన్ని చూపులతో తడిమేస్తాయి. కళ్ళతో కామించి చూపులతో శీలందోచే కీచక జాతి అడుగడుగునా కనిపిస్తుంది. అటువంటి మగ మృగాల మనస్థత్వాన్ని హావ భావాలను వ్యక్తీకరిస్తూ ఘాటైన పదజాలంతో జయప్రభ ఇలా అంటుంది.

ఆ చూపుల్లో
ఎప్పుడూ ఒక్కటే సంకేతం ఉంటుంది
కళ్ళకే కాదు
ఈ దేశంలో ఆడదానికి
ఒళ్ళంతా ముళ్ళుండే రోజు

ఎప్పుడొస్తుందో... అని అంటుంది. నిజంగా ఈ దేశం శాపగ్రస్థదేశం. మనుసంస్కృతే మన సంస్క ృతిగా విరాజిల్లుతున్న సాంస్కృతిక దేశం. ప్రాచీన కావ్యాలన్నీ అంగాంగ వర్ణననకే అంకితమైపోయాయి. సంస్క ృత భాషతో, అద్భుతమైన శ్లోకాలతో, దీర్ఘ సమాసాలతో, భావ గీతాలతో చందోబద్ధంగా దేవతలను కూడా శృంగార బృంగారంలా అడుగడుగునా అమరనాదంతో శృతిమించి వర్ణించిన శృంగార వర్ణనలు ఎన్నో ఉన్నాయి. అవన్నీ ఉత్తమ పాత్రలున్న ఉత్తమ కావ్యాలుగా నిలిచాయి. చదువుతుంటేనే సిగ్గనిపించే వర్ణనలు ఎన్నో ఉన్నాయి. అవన్నీ శతాబ్ధాల నుండి పరిచయమై రాబోయే తరానికి పాఠ్యాంశాలుగా చేరిపోతున్నా అదంతా సాంప్రదాయ సాహిత్యమనే భావంలోనే ఉండిపోతున్నాం. దేవతలకు, దేవుళ్ళకు మధ్య శృంగారం, రతివిన్యాసం ఆయా రచనల్లో పరంపరగా నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఒక వరూధిని ఒక ప్రవరుడు, ఒక విజయ విలాసం. ఒక రాధిక సాంత్వనం నిత్యం స్మరించే ఒక సుప్రభాతం, ఒక శృంగార నైషధం ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ శృంగార ఘట్టాలే కనిపిస్తాయి. ఇక ప్రబంధ వర్ణనలు చెప్పనవసరంలేదు. స్త్రీని కేవలం భోగ వస్తువుగా వర్ణించిన సంప్రదాయం నేటికి కొనసాగుతూనే ఉంది. అందుకే శృంగారేవ ఏకో రసః అని నిర్ధేశించారు మన ఆర్యులు.

స్త్రీ అంటే కేవలం అందమైన బొమ్మాకాదు అంగడి వస్తువూ కాదు. ఆమెకు ఒక మనసుంది, కొంత స్వేచ్ఛ ఉంది. అందుకే ఈ చూపులు పడకుండా ఉండాలంటే, చేతులు తాకకుండా ఉండాలంటే వళ్ళంతా ముళ్ళుండే రోజులు రావలసిందేనని పురుషాధిక్య ప్రపంచానికి నెత్తుటి ప్రశ్నవేశారు స్త్రీవాద కవయిత్రులు. స్త్రీ అంటే ఆదిశక్తి పరాశక్తి అనే మాటలు కేవలం పొగడ్తలకే పరిమితం అయ్యాయి. ఇలా పొగడ్తలతో నింపడమే కవుల నుంచి ఒక దుష్టసాంప్రదాయం కొనసాగింది. అందుకే స్త్రీలు కల్పనా కథలను పక్కనపెట్టి వాస్తవిక కథనాలను ప్రధాన వస్తువుగా తీసుకున్నారు. ఈ దోపిడీ వ్యవస్తకు, దళారి వ్యవస్థకు బలియైపోతున్న స్త్రీజాతి విముక్తికోసం కొన్ని కలాలు ముందుకురికాయి. వాటిలో నిర్మల చెప్పుకోదగిన కవయిత్రి

అందమైన దోపిడీకి
పవిత్రమైన హింసకు
న్యాయమైన దాస్యానికి
బలైపోయిన నేను
భారత స్త్రీని... అని అంటుంది.

ఈ దేశంలో ప్రతీదానికి ఒక మంత్రం, ఒక ముహూర్తం, ఒక తంత్రం ఉంటుంది. ఆ పరిధి దాటి ఏ కార్యక్రమం జరగటానికి వీలులేదు. అందుకే సనాతన సాంప్రదాయ పంజరంలో స్త్రీ బంధీ అయిపోయింది. ఇష్టమున్నా లేకపోయినా వివాహ వేదికమీద పాణి గ్రహణంలో నవ్వుతూ యేడడుగులు నడవాలి. ఇది మన సంస్కృతీ సంప్రదాలలో భాగం. ఇక్కడ కూడా స్త్రీకి స్వేచ్ఛ లేకుండా పోయింది. మరోచలం పుడితేనే కాని నేటి స్త్రీలకు స్వేచ్ఛ రాదు.

నాదేశంలో స్త్రీని వర్ణిస్తూ జయప్రభ శతాబ్ధాల అణచివేతను నిర్భయంగా నినదిస్తూ ఇలా అంటారు

శృంఖలాలు తెంచుకుని
అంధకారం తెంచుకుని
తరాలుగా మా స్వేచ్ఛను దోచుకున్న
సంఘపు దౌర్జన్యంపై

తిరుగుబాటు చేయండి...అంటారు. ఈ పిలుపు మహిళాలోకానికి ఒక కొత్త ఊపిరి నిచ్చింది. స్త్రీ ఉద్యమంలో సరికొత్త బాటను వేయగలిగింది. స్వేచ్ఛ కోసం, స్వతంత్ర్యం కోసం ఎన్నో కలాలకు, గళాలకు వస్తువైంది. మరో ప్రపంచానికి పదునెక్కిన పాటగా నిలబడింది.

## నేటి పరిస్థితి :

శతాబ్దాలుగా ఈ దేశంలో స్త్రీ పరిస్థితి కొంతమెరు

గైందని అందరు అనుకుంటారు. ఇందులో నిజం అని సగంమంది నమ్ముతారు. ఎందుకంటే విద్య, ఉద్యోగ రంగాల్లో స్త్రీలు అగ్రస్థానంలోనే ఉన్నారు. చట్టాలు సంస్కరణల్లో అనుగుణంగానే మార్పులు వస్తున్నాయి. కాని శిక్షలు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. దానికి ప్రధానంగా రాజకీయ, ప్రాంతీయ, కుల, మత కారణాలే. అన్నింటికి పురుషులే ప్రధాన కారకులనడానికి వీలులేదు. దానికి స్త్రీలలోకూడా భాగస్వామ్యం ఉంది. ఇప్పటివరకు జరిగిన ఘోరాలు, హత్యలు, ఆత్మహత్యలు, అత్యాచారాలు వెనుక ఎన్నో అంశాలు ముడిపడి ఉన్నాయి. ప్రస్తుతం ఈ కారణాల వెనుక జరిగిన వాస్తవాలను నిశితంగా పరిశీలించాలి, పరిశోధించాలి, వారి మానసిక స్థితిని, పౌర స్థితిని సాంఘిక స్థితిని, ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి. వారికి ప్రత్యేకంగా అవగాహన తరగతులు నిర్వహించాలి. నేటి యువత అనేక వ్యసనాలతో పతనావస్థకు చేరుకుంటుంది. నెట్‌వర్క్‌లు, సెల్ ఫోన్‌లు, వాట్సాప్‌లు, యూ ట్యాబ్‌లు, మెసెంజర్లు కొత్తగావస్తున్న యాప్‌లు వల్ల కేవలం యువతే కాకుండా నేటితరం చెడుమార్గంలో పయనించే అవకాశం ఉంది. స్వేచ్ఛా శృంగారానికి దారితీస్తుంది. వయస్సుతో పని లేకుండా అనేక అసాంఘిక అవస్థలకు, వ్యసనాలకు ఇవన్నీ వేదిక అవుతున్నాయి. ప్రేమలు, పెళ్ళిళ్ళ విషయంలో ఎన్నో ఘోరమైన సంఘటలు చూస్తున్నాం. నిత్యం ఎదురయ్యే లైంగిక వేధింపులు, పరువు హత్యలు, లింగ వివక్షత ఇలా ఎన్నో ఉన్నాయి. ఇవన్నింటికి పరిష్కారం కనుగొనే మార్గాలు అన్వేషించాలి.

స్త్రీవాద ఉద్యమం నేటి సమాజంలో ఎదురౌతున్నా అనేక సమస్యలను అసలైన ఎజెండాగా తీసుకొని ప్రగతి పథంలో ముందుకు పయనించాలి. వాస్తవాలను గ్రహించాలి. చట్టాలను సంస్కరించాలి. నూతన ప్రణాళికలతో నేటి తరాన్ని అనేక మార్గదర్శకాలు రూపొందించాలి. లింగ వివక్షత, కులవివక్షత లేని సమ సమాజంకోసం చేయి చేయి కలిపి అందరం ఒకేజాతిగా భావించి భారతదేశం నా మాతృభూమి భారతీయులందరూ నా సహోదరులు అనే ప్రతిజ్ఞను మనసారా అమలు చేద్దాం.

**ఆధార గ్రంథాలు :**

1) తెలుగులో కవితోధ్యమాలు - తెలుగు సాహిత్య అకాడమీ ప్రచురణ
2) విమల్ విమర్శ - సెయింట్ జోసఫ్ మహిళా కళాశాల అంతర్జాతీయ సంచిక
3) నీలి మేఘాలు - కవితా సంకలనం

# జాషువ - విప్లవ భావాలు

- డా॥. వి. కృష్ణవేణి, తెలుగు విభాగాధిపతి, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాల, తిరుపతి.

గుర్రం జాషువ తెలుగు సాహితీ ప్రస్థానంలో ఓ వజ్రం. మట్టిలోని మాణిక్యం. తన జాతిని ఉద్ధరించడానికి విరిసిన పంకజం. అయితే జాషువా పరిపూర్ణ శిల్పంగా రూపుదిద్దడానికి అనుభవించిన ఉలి దెబ్బలెన్నో? ఈసడింపులు మరెన్నో? ఛీత్కారాలు ఏవేవో? తెలుసుకుంటే 'భళా మహాకవి!' అని అనకమానరు.

చలువరాతి గదుల్లో కూర్చొని వ్రాసిన కవిత్వం కాదు వీరిది. గబ్బిలాల గూడులో గుభాళించిన కవిత. ప్రకృతి అందాలతో పరవసించే తోటలో పుట్టలేదు ఈ ఖండ కావ్యాలు. స్మశానవైరాగ్యాల కడుపుకోతలివి. 'ఊరు పొమ్మనె, కాడి రమ్మనె' సామెతలోని తాత్త్వికాలివి. వలపు సోయగాల మన్మథ బాణాలు కావివి. ఆకలికేకల వెలివేతల బ్రతుకులివి.

అందుకే జాషువా జీవన విధానంలో, రచనా వైవిధ్యంలో ఓ విప్లవ శంఖారావం వినపడుతుంది. అందరూ నడిచిన దారిలో కాక తానొక భిన్నమైన మార్గానికి నాంది పలికారు. దళిత సాహిత్య ప్రక్రియ బలపడేలా విస్తృత లఘు, ఖండకావ్యాలను రచించారు. అందుకే, తననొక విశ్వగోత్రేయ మానవునిగా అభివర్ణించారు. సమాజానికి చేటుచేసే అంధ విశ్వాసాలను, అంటరానితనాన్ని తూర్పరబట్టారు. కావున జాషువలోని విప్లవ భావాలను పరిశీలించడం అవశ్యం. మొదట అందుకు దారితీసిన పరిస్థితుల ఆధారంగా వారి జీవనశైలిని పేర్కొనవచ్చు.

**జీవనశైలి :**

జాషువ జీవన గమనం ఓ ముళ్ళదారి. అందులోని కంటకాలను ఏరి పారవేయడంలో వీరి కాళ్ళు కాయలు కాశాయి. 'క్రిస్టియన్' పాఠశాలలో చదువుకుని, చర్చికి వెళ్ళి, బైబిల్ చదువుకొని, తిరిగి క్రిస్టియన్ పాఠశాలలోనే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు.

అయితే వెల్లువలా వచ్చే కవిత్వ ధారకు ఓ అర్థం చేకూర్చాలని భావించారు. ఇతిహాసాలు, పురాణాలు, ప్రబంధాలను అధ్యయనం చేయటం ప్రారంభించారు.

'భారత కావ్యకర్తల స్వభావములన్ కవితాస్వభావ
ముల్
తీరికగా బఠించి గురితించుచు తిక్కన కల్పనాచమ
త్కారములన్ తెలుంగు నుడికారములుం గమనించి
మెచ్చుచున్
బూరితి జేసితిన్ జెరకు ముక్కలవంటి దశాష్ట
పర్వముల్' (నాకథ)

మహాభారతంలోని కవితా స్వభావాలను, తిక్కన కల్పనా చమత్కృతులను, తెలుగు నుడికారాలను గుర్తించి, మెచ్చుకుంటూ, చెరుకు ముక్కల వంటి పద్దెనిమిది పర్వాలను పఠించినానని 'నాకథ' అనే తన స్వీయ చరిత్రలో వివరించారు.

అందుకు ఫలితం అనుభవించవలసి వచ్చింది. క్రైస్తవులు వీరిని తమవాడు కాదన్నారు. హిందువులు అంటరానివాడన్నారు. చివరికి తండ్రి సయితం తన ఫాదరీ ఉద్యోగానికి ముప్పు వాటిల్లుతుందని ఇంటి నుండి వెళ్ళిపొమ్మాన్నాడు. ఊరు, ఇల్లు వెలివేయగా మసీదులో జాషువ తలదాచుకోవలసివచ్చింది.

అక్కడే ఉర్దూ భాష నేర్చుకొనుటకు అవకాశం అందిపుచ్చుకున్నారు. ముస్లిమ్ స్నేహితుని ద్వారా ఆ భాషా సౌందర్యంను ఒంటబట్టించుకున్నారు. ఫలితంగా 'ఫిరదౌసి', 'ముంతాజ్ మహల్' వంటి రచనలను భవిష్యత్తులో రంచించారు.

మరో విషయం ఇక్కడ అర్థమవుతుంది. మూడు ముఖ్య మతాలయిన హిందూ, క్రైస్తవ, ముస్లీమ్ మత గ్రంథాల అధ్యయనం, ఆ మతస్థులతో సన్నిహితంగా జీవనం సాగించడం వంటి అంశాల వలన విశ్వమానవుడిగా తన భావాలను తీర్చిదిద్దుకున్నారు జాషువ.

జాషువ కుమార్తె హేమలతా లవణంగారు 'మాన్నాగారు' గ్రంథమయిన జాషువ జీవిత చరిత్రలో జాషువ వ్యక్తిత్వాన్ని వివరిస్తూ 'నిమ్న కులంలో పుట్టి ఇంతటి ఖ్యాతి గడించిన జాషువ అని ఎవరయినా మాట్లాడితే, ఆ మాటలు జాషువాకు అసహనం కలిగించే' వని వివరించారు.

అయితే మతానికి సంబంధించిన ఖండకావ్యాలయిన 'రుక్మిణీ కళ్యాణం', 'ధ్రువ విజయం', 'దావీదు చరిత్ర', 'చిదానంద ప్రభాతము', 'ముంతాజ్ మహల్' వంటి వాటిలో కంటే 'గబ్బిలము'. 'ముసాఫరులు' వంటి కావ్యాలలోని భావాలు అత్యున్నతములు.

## కవితా వస్తు విప్లవం :

జాషువలోని విప్లవ భావాలను నిరూపించే ముఖ్యమైన అంశం వస్తువు ఎంపిక. జాషువ కవితలల్లిన కాలం భావకవుల యుగం. 'ఊర్వశి' ఊహల్లో తేలియాడే కృష్ణ శాస్త్రి, కిన్నెరసానికి నడకలు నేర్పే విశ్వనాథ సత్యనారాయణ, పుష్పాల కన్నీరుకు తపించే కరుణశ్రీ వంటి మహనీయుల కవితలు యువతను పరవశంలో ముంచేసేకాలమది.

కానీ జాషువా కవితా ఖండికల్లో కరుకుదనం కనిపించేది. ఆ భావనను జీర్ణిచుకొనడానికి సాహిత్యాభిమానులకు కొద్దిగా కాలం దొర్లవలసి వచ్చింది. కవి సమయాలను నేలమట్టం చేసి కవితా వస్తువును ఎన్నుకోవడంలో జాషువా చూపిన ధీరత్వం తెలుగు వాఙ్మయంలో ఓ విప్లవగళం.

అందుకు తార్కాణం 'గబ్బిలం' ఖండకావ్యం. ఇందులో శివుడి వద్దకు రాయబారం పంపుటకు గబ్బిలాన్ని స్వీకరించాడు కవి. పచ్చటి రెక్కలు, ఎర్రటి ముక్కు గల రామచిలుకలను కాదనుకున్నాడు. పాలరంగు పావురాలను త్యజించాడు. హొయల నడకలు నడిచే హంసలను త్రోసిపుచ్చాడు.

చీకటి ప్రదేశాల్లో, తలక్రిందులుగా వ్రేలాడే నిశాచరి అయిన 'గబ్బిలం'ను శీర్షికగా స్వీకరించారు. గబ్బిలం ఇంటిలోకి వస్తే ఆ ఇంటిని నెల లోపల వదిలేయమంటారు. లేదా శుద్ధి పరచమంటారు. సరిగ్గా ఇటువంటి బ్రతుకులే అంటరాని వారి వెతలు. అందుకే భగవంతుడికి గబ్బిలంను శివుడికి రాయబారిగా కవి స్వీకరించారు.

పంచముడి గాలిసోకడం ఎంతపాపమని హిందువులు భావిస్తున్నారో తెలిపి, లోకాన్ని మేలుకొలపటం కవి ఉద్దేశ్యం.

"వానితెక్కల కష్టంబు లేనినాడు
సస్యరము పండి పులకింప సంశయించు
వాడు చెమ్మట లోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు వానికి భుక్తిలేదు.
ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెలతల్లి జీవనముసేయు
గసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు" (గబ్బిలము)

కవుల జీవితాల తీరు తెన్నులు, బాధలు, వేదనలను వివరించే మరో లఘుకావ్యం 'పిరదౌసి'. ఒక పారశీక కవి వీరుని జీవితాన్ని ఆధారంగా చేసుకుని రచింపబడిన కావ్యమిది.

ప్రకృతిలో పరవశించే కవి హృదయాన్ని వర్ణిస్తూ..

"హాయిగా బవ్వళించి బ్రహ్మానందములను
బల్కరించుచు నన్ను దివ్యస్వరూప
హృదయమును జీల్చి పూజలర్చించు కొందు
వందుకొని పొమ్ము, వ్యవధి లేదనక రమ్ము".

అంటాడు కవి చంద్రునతో కానీ ఆ కవి హృదయాన్ని, జీవితాన్ని ఓ రాజు అహంకారంతో కూలద్రోసిన విధానం హృదయాన్ని కదిలిస్తుంది.

'కాందిశీకుడు' ఖండకావ్య వస్తువును కూడా భిన్న కథా వస్తువు క్రింద పేర్కొనవచ్చు, పరాయిదేశంలో స్థిరపడి, యుద్ధాల వంటి విపత్కర పరిస్థితులలో స్వదేశానికి తిరిగివచ్చే కాందిశీకుల కడగండ్లను ఈ కావ్యంలో చిత్రించారు.

యుద్ధ పరిస్థితులపై దానిని ఎదుర్కొనవలెననే మనోస్థైర్యాన్ని వివరించే వాక్యాలివి.

"గీతాకృష్ణుడు గావలె, నీ తరుణమునందు గాంధీ
యేమిటికి? మహా
గౌతమ బుద్ధుడుండేటికి? మా తనువల్లికలు
పిరికిమందల జవికెన్"

(కాందిశీకుడు)

### భావ విప్లవం :

సమాజంలోని కట్టుబాట్లకు కొట్టుకొని పోకుండా, నిర్భయంగా తనలోని భావాలను వ్యక్త పరచడంలో గెలుపుసాధించారు జాషువ. భావస్వాతంత్రాన్ని కవిత్వంలో జొప్పించి, ఎందరినో తన దారిలో నడవటానికి చేయూతనిచ్చారు. ఈ భావ విప్లవ గీతికలతో గొంతు కలపడానికి, మరెందరో సిద్ధపడటానికి స్వరాలను సమ కూర్చారు జాషువ.

హేతువాద భావాలతో మనుధర్మశాస్త్రాన్ని ప్రశ్నిస్తుందీ పద్యం.

"ముసలివాడైనా బ్రహ్మకు బుట్టినారు
నలుగురు కుమారులనుట విన్నాముగాని
పసరముకన్న హీనుడభాగ్యుడైన
యైదవ కులస్థు డెవరమ్మ! సవిత్రి"

పంచముడి కులమేది? అంటూ భరతమాతకు వేసిన ప్రశ్నలతో లోకం నెవ్వరపోయింది.

"కులమతాలు గీచుకున్న గీతల జొచ్చి
పంజరాన గట్టుపడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు
తరుగులేదు, విశ్వనరుడ నేను"

జాషువా 'విశ్వనరుడను' అంటూ ఎలుగెత్తిచాటం ఎందరికో ఆదర్శం అయింది.

"ఒకడు ప్రోత్సహింప, నొక్కడు నిరసింప
నొకడు చేరబిలువ నొకడు తరుమ
మిట్టపల్లములను మెట్టుచు నెట్టులో
పలుకులమ్మ సేవ సలిపినాడ" (నా కథ)

అంటూ తన జీవితంలోని ఒడిదుడుకులను పొందికైన పదాలతో పద్యాలతో 'నా కథ' స్వీయ చరిత్రను వెలువరించడం లోకానికి ఓ స్ఫూర్తి.

సంఘంలో తన మనసును చిన్నబుచ్చిన సంఘ టనలను మాలగా కూర్చి, తన కవితలకు విలువనివ్వండి, కులానికి కాదంటూ ఎలుగెత్తి చాటిన గొప్ప కవి జాషువా.

'నా కవితావధూటి వదనంబు నెగాదిక జూచి, రూపురే
ఖా కమనీయ వైఖరులుగాంచి ''భళీ! భళీ''
యున్నవాడె. "మీ
దేకుల" మన్న ప్రశ్న వెలయించి చివాలున లెచిన
పోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర! వచింప
సిగ్గగున్' (నా కథ)

### జాతీయతా విప్లవం :

కులమతాల కురుక్షేత్రంలో కూరుకుపోని జాతీయకవి, విశ్వమానవునిగా నిలపమని వేడుకోవడంలోని అంతర్యం అతనిలోని దేశభక్తి.

నేతాజి, బాబూజీలు మరణించినపుడు వారి సేవలను కొనియాడతూ వ్రాసిన స్మృతి వాక్యాలు ఇందుకు నిదర్శనాలు.

సత్యాహింసలు రెండే
ముత్యాలసరాలు సకల పుణ్యంబులకున్
గత్యంతరములు ప్రేమ
వ్యత్యస్తములేని మోక్షపతి నేత్రంబుల్. (బాపూజీ)

సత్య, ఆహింసలు రెండు బాపూజీ నేత్రాలని పేర్కొ నడంలో కవి సత్యదర్శనం నిరూపితమయింది.

'మనము బానిసలము మనకును బానిసల్,
శాశ్వతముగ నిమ్నజాతి వారు
బానిసీంద్ర క్రింద బానిసలున్నచో, బలము
ముమ్మరించు పాలకులకు' - బాపూజీ

దీన జనోద్ధరనకు గాందీజీ అందించిన సందేశాన్ని భావగర్భిత వాక్యాలతో తెలియ చేశారు జాషువ.

గాంధీజీ విగ్రహములేని ఊరు, గ్రామం లేదనటం నిజం. దానితో సంతృప్తిపడకండి. అంటూ గాంధీ ఆశయా లను నెరవేర్చాలన్నాడు కవి.

'ప్రతిమల్ నెక్కి శిలాసహస్రముల నారాధించినన్ గాదు భా
రతదేశాన ననైక మత్యములు నీర్ష్వాద్వేషముల్ స్వార్థమున్
గతమై దోషపుజాలలేని యొక సాక్ష్యాత్ స్వర్గ మింపారినన్
బ్రతుకుంగ్రమ్మర శ్రీ సబర్మతి ముని బ్రహ్మంబు ముమ్మాటికిన్' (బాపూజి)

నేతాజీ మరణం నేటికీ వివాదస్పదమే. ధీరత్వం, పోరాట పటిమను చాటే నేతాజీ రక్తపుమరకల జీవితాన్ని ఆవిష్కరిస్తూ జాషువ వ్రాసిన ఖండకావ్యం జాతీయోద్యమానికి మలుపు.

తల్లిదండ్రుల, కవుల బాధ్యతలను గుర్తుచేసేదీ పద్యం.

'తలిదండ్రులెపుడు బిడ్డలకు నేర్పగరాదు
కులగోత్రముల వారి గొప్పదనము
చదివింపగారాదు చదువులయ్యలు పాఠ
శాలలలోన వర్ణాలగొడవ
రచియింపగారాదు రచయితల్ శాశ్వత
దాస్యంబు నిలుపు కథానకములు
సలుపరాదెట్టి ప్రచారంబులీ దినం
బమలు నందున్న కృత్రిమపు సంస్థ
లన్నదమ్ముల తనమున కడ్డువచ్చు
శబ్దజాండంబు సర్వంబు చావవలయు
స్వర్గ మఱచేతి యందూడి పడగవలయు
మోక్షరాజ్యంబు బొందితో పొందవలయు.

రాష్ట్రపూజ, నాగార్జునసాగర్, కొత్తలోకం వంటి ఖండ కావ్యాలలోని భావాలు కూడా జాతీయవిప్లవ గీతికలు.

'నవయుగకవి చక్రవర్తి' గా కీర్తిగడించిన జాషువ ఆలోచన సరళి, వెలయించిన కవితా ఖండికలు పఠితులలో ధైర్యాన్ని పోరాటతత్వాన్ని నింపుతాయి. ఆ భావాలున్నవి విప్లవ వాక్యాలలో. విప్లవమంటే అణచివేతను ఎదిరించటం. వెలివేతను ధిక్కరించటం. మనుషులుగా మసలే హక్కు, న్యాయంగా వారికి చెందవలసిన భాగం అందటం, దౌర్జన్యాలపై పోరాడటం... మొదలయిన అంశాలు.

ఈ అంశాలన్నీ పుష్కలంగా తన ఖండకావ్యాలలో అక్షర నిక్షిప్తం చేశారు జాషువ. అందుకే జాషువ ఓ విప్లవకవి.

**ఆధార గ్రంథాలు :**

1. కథానాయకుడు జాషువా - తెలుగు అకాడమి - హైదరాబాదు.
2. గాంధీ దర్శనము - ఉప్పులూరి వెంకట సుబ్బారావు - ఆదర్శ గ్రంథమండలి.
3. జాషువా కవిత్వము - అభ్యుదయ వేదిక - విజయవాడ.
4. జాషువా కృతుల సమాలోచన - డా॥ బి. భాస్కర చౌదరి.
5. జాషువా రచనలు - రెండవసంపుటం - శ్రీమతి హేమలతాలవణం.
6. మా నాన్నగారు - శ్రీమతి హేమలతాలవణం.

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా సాహిత్య సమాలోచన

– **జి. శ్రీమతి,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ (ఓరియంటల్), ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

పరాయి పాలనలో దోపిడీ, అణిచివేతల నుంచి ప్రత్యేక రాష్ట్రంగా తలెత్తుకున్న పోరాటాల గడ్డ తెలంగాణ. పరిపాలన సౌలభ్యం కోసం 31జిల్లాలుగా అవతరించిన పుణ్య భూమి. అందులో రాజన్న సిరిసిల్ల జిల్లా ఒకటి. నాడు భూస్వాములపాలనలో దోపిడీకి గురై, అరాచ కాలను, అత్యాచారాలను ఎదుర్కోన్న ఉద్యమాల పురిటి గడ్డ. కళలు, ఉద్యమాలు కలగలసి సాగిన యుద్ధ భూమి. ఒక నాటి సాయుధ పోరాటం, అగ్గిపెట్టెలో ఇమిడే చీర నేసిన మగ్గం చప్పుళ్ళు ఇక్కడి వారందరికి సుపరిచితమే. సాహిత్యంలో అయితే జ్ఞాన పీఠమై సగర్వంగా తలెత్తుకుని నిలిచింది. కన్నడపు ఆది కవి పంపనకు జన్మనిచ్చిన ధన్య భూమి. పద్య కవులకు ఓనమాలు దిద్దించిన కర్మ భూమి. సార్వజనీనమైన, సార్వ జనీకమైన సత్యాలను కంద పద్యాల్లో అందంగా అందించి, సుద్దులు చెప్పిన సుమతీ శతక కవి బద్దెన, భద్ర భూపాలుడుగా పాలించిన పృధ్వీ. శ్రీనాథుడి చేత కాశీ ఖండంలో “వచియింతు వేములవాడ భీమన భంగి, నుద్దండ లీల ఒక్కొక్క మాటు” అంటూ నన్నయ, తిక్కనల కంటే ప్రథమంగా ప్రస్తుతించబడిన మన వేములవాడ భీమ కవి నడయాడిన అవని. ‘కవిజనాశ్రయం’ ను అందించిన మల్లియ రేచన తిరుగాడిన నేల. చేనేతకు ప్రసిద్ధి గాంచిన సిరిశాల నేడు సిరిసిల్ల జిల్లాగా విలసిల్లుతుంది.

ఋగ్వేదార్యుల కాలం నాటి సమాజ కుటుంబ వ్యవస్థలో స్త్రీలకు ప్రత్యేక గౌరవ స్థానం కల్పించింది. స్త్రీకి యజ్ఞ యాగాది క్రతువుల నిర్వాహణలో భర్తతో సమానమైన అధికారం ఉండేది. ఆర్యులు భార్య లేకుండా యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహించే వారు కాదు. బాల్య వివాహలు, పరదా పద్ధతి ఉండేది కాదు. వారు స్త్రీ విద్యను కూడా ప్రోత్సాహించారు. స్త్రీలు కూడా పురుషులతో సమానంగా విద్యాభ్యాసం చేసి, చర్చలు, సమావేశాల్లో పాల్గొనేవారు. విద్యావంతులైన స్త్రీలు పాండిత్య ప్రకర్షలో పురుషులతో సమానమైన స్థాయిని సాధించారు.

విశ్వవర, ఆపాలఘోష లోపాముద్ర, శికతా నివశరి ఋగ్వేద మంత్రకర్తలుగా, గొప్ప విద్యావేత్తలుగా ప్రసిద్ధిగాంచిన మహిళా మణులు ఉన్నారు అంటే ఆ కాలంలోనే స్త్రీలు ఎంతగా ప్రోత్సాహిచడ్డారో గమనించ వచ్చు. అందులో కొందరు 1.చేన్నమనేని సుందరి బాయి 2. చెన్నాడి అరుంధతి 3. కొలిపాక శోభా రాణి మొదలైన వారు. చేన్నమనేని సుందరి బాయి గారు వేములవాడ మండలం మారుపాక గ్రామం వాస్తవ్యురాలు. ఈమె గుడి కేశవ రావు ప్రథమ పుత్రిక చెన్నమ నేని గోపాల రావు గారి ఇల్లాలు. తండ్రి గారికి ఉన్న సాహిత్య ప్రేమ వల్ల ఈమె ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రవేశ పరీక్ష తెలుగు మరియు హిందీ మాధ్యమిక పరీక్షలు ఇచ్చి కృతార్థులైనారు. తెలుగులో చక్కని పద్య కవిత రాసేవారు. మచ్చుకు వీరిదొక పద్యం.

సీ॥ “సీతారాముని ప్రీతిగా భర్తగా
పొంది బాధలను తానందినట్లు
దమయంతి నల భూపు ధవునిగా జేకొని
కష్టాల భరియింప గలిగినట్లు”

అంటూ స్త్రీ అస్థిత్వాన్ని చాటిన రచయిత్రి సుందరి బాయి. చెన్నాడి అరుంధతి సిరిసిల్ల జిల్లా కోరెం వాస్తవ్యురాలు. రచయిత్రిగా ఈమె ఎన్నో రచనలు చేశారు. కొలిపాక శోభారాణి గారు సిరిసిల్ల జిల్లా వాస్తవ్యురాలు. తన కలంతో తన గళాన్ని వినిపిస్తున్న రచయిత్రి. తాను ఒక వైపు సెస్ ఉద్యోగినిగా బాధ్యతలు నిర్వహిస్తూనే రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు. తాను రాసిన ‘గోగు పువ్వు’, ‘చెదిరిన కల’ ను వర్తమాన అంశాల్ని ప్రతిబింభిస్తున్నాయి.

గోగు పువ్వులో శోభారాణి గారు

"ఇక్కడ చిగురైనా .... చేవ కల్గే ఉంటుదని

ఇక్కడి మట్టి ఎఱ్ఱదనంతో....... పోరాట స్ఫూర్తితో ఉంటుందని....."

అంతే గాక " వంద సంవత్సరాల నాడే

స్త్రీలు శక్తి స్వరూపిణులుగా

అన్యాయాన్నెదిరించిన...ఈ నేల...ధీరోదాత్త !

తెలుగునాట తొలి తెలుగు రాణి

రుద్రమ్మ... మాయి... ముంత...బంధువు.....ఆనవాలు" స్త్రీల గొప్పతన్నాన్ని తన కవితల ద్వారా వినిపించారు. తన 'చలనం' కవితా సంకలనానికి తొలి సాహిత్య పురస్కారమైన 'రంగినేని ఎల్లమ్మ' పురాస్కారాన్ని షాజ హానతో పంచుకున్నారు. రేగులపాటి విజయలక్ష్మి గారు కథలు, కవిత్వం రాసిన రచయిత్రి. మాదిరెడ్డి అంజనా దేవి గారు మానవీయ విలువలున్న కవయిత్రిగా, ఆధ్యా త్మిక సాహిత్యాన్ని తనదైన శైలిలో తన కలం ద్వారా బయటపెట్టిన కవయిత్రి.

అంజనా దేవి గారు "సుమత్ర సునామి" అనే కవితా సంపుటిలో 'ఉప్పెన తిప్పలు' అంటూ సునామి బాధల్ని వివరించారు. 'కలాలు - గళాలు ' కవితా సంపుటిలోని 'తెలంగాణ జన ప్రభంజనం' అనే కవితలో

"తెలంగాణ జన ప్రభంజనం చెలరేగింది నేడు

స్వతంత్ర రాష్ట్రంగా ఏలుతానంటుంది రేపు" అంటూ గర్జించారు.

గర్షకుర్తి శ్యామల గారు కవిత్వాన్ని, బాల సాహిత్యం కథా సంపుటాలుగా మనకు అందించారు. ప్రసిద్ధ కథా రచయిత్రి అయిన శ్యామల గారు దేని మీదనైనా పాట కట్టడం తెలంగాణ స్త్రీలకు పుట్టుకతో వచ్చిన విద్య అని, పాటలు అల్లటం వాళ్ళ కవితా హృదయానికి నిద ర్శనం అంటూ

'తెలంగాణ పాట రావాలంటూ ....'

"రాబోయే బతుకమ్మనూ

ఆట పాటల్లో కొలుచుకుందాం చెల్లెలారా !" అని పిలుపునిచ్చారు. బతుకమ్మ - బతుకమ్మ కోల్ అంటూ తెలంగాణ బతుకు చిత్రాన్ని ఆవిష్కరించారు.

మైత్రి బంధం హిమజ గారు వేములవాడ వాస్తవ్యు రాలు. ప్రముఖ రచయిత జింబో గారి సతీమణి "చేతిలో లాంతరు" అనే కవితా సంపుటిని అందించారు. ప్రసిద్ధ కవయిత్రి అయిన తను "పల్లె తల్లి గుండె సప్పుడు" కవితను మంచి తెలంగాణ నుడికారంతో కవిత్వీకరిం చారు. మాతృదేశాన్ని వీడి డబ్బు మీది వ్యామోహంతో పరాయి దేశానికి వెళ్తున్న పిల్లలకు

"ఒక్కసారి మన దేశాకి రాండిరా కొడుకా....

ఈడనే మన మూలాలున్నాయ్ " అని పిలుపునిస్తూ ...

"పైస వెద్తె దునియా గనవద్తుం దిరా కొడుకా...

కడుపుల యెత దించుకుందామంటే

సాయం బట్టేటోల్లు కనవడ్త లేరు" అంటూ ఒక కన్నతల్లి ఆవేదనను స్త్రీ మూర్తిగా తను బయట పెట్టారు. బండారు జయశ్రీ గారు కవయిత్రి అనువాదకురాలు. 2015లో 'చిగురు కల' అనే కవితా సంపుటి అందించారు. జయ శ్రీ గారు రెండు పుస్తకాలు అనువాదం చేశారు. వివాహానంతరం భువనగిరిలో స్థిరపడ్డారు.

శారదా హన్మాడ్లు 'సావకు బిడ్డ' అనే కవితలో యువ కులు ఆత్మ హత్యలు చేసుకొవద్దని సందేశాన్ని చ్చారు. షహనాజ్ ఫాతిమ గారు సిరిసిల్ల వాస్తవ్యురాలు. ఉద్యోగ రిత్యా కరీంనగర్‌లో స్థిరపడ్డారు. ఈమె ఎన్నో కవితలు రాసిన కవయిత్రి. 'సమ్మిళిత సంస్కృతి పునరుజ్జీవనం మరుగునపెట్టిన చరిత్ర జ్ఞాపకానికి తెలంగాణ అవసరం' అంటూ తన కవిత ద్వారా ఆవేశం వ్యక్తం చేశారు. 6.వ ఏటనే తన కవితా ప్రస్థానాన్ని మొదలు పెట్టి సీనియర్ కవయిత్రిగా పేరు పొందారు. కెరటాలు, మౌన శబ్దాలు, చెలిమె అనేవి ఆమె కవితా సంకలనాలు. రావణా, టిల్ టిల్ సాహసం, పంచ మిత్రులు అనేవి అనువాద పుస్తకాలు. వీరి కవిత్వానికి 'వేంకట సుబ్బమ్మ' పురస్కారం లభించింది. అంతేగాక టి.వి. కార్యక్రమాలలోనూ, రేడియో కార్యక్రమాలలోనూ వీరు పాల్గంటున్నారు. దశ - దిశ, ముఖా - ముఖి, చర్చా వేదికలు మొదలైన

కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం వీరి కథ 'వనితా వాణి' అనే కార్యక్రమం కొరకు రికార్డు చేయబడుతుంది. అది త్వరలో ప్రసారం కానుంది.

ఫాతిమా గారు తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని

"తెలంగాణ నా ప్రాణం

హైదరాబాద్ నా ఊపిరి" అనే నినాదం ఇచ్చిన వ్యక్తి.

"గడ్డంలా పెరిగింది గడ్డి

సెలవుల్లో పిల్లలు లేరనే బెంగతో" అన్న నానీలో బడితో పిల్లలకున్న అనుబంధాన్ని వివరించారు.

కందేపి వారి మిని కవితలో

"చందమామను చావబాదితే

చల్లదనం రాదు

తేనెటీగను తెగనరికితే

తీయదనం రాదు

పువ్వులను పిప్పి చేస్తే

పరిమళం రాదు" అంటూ పిల్లల్ని చావబాదితే చదువు రాదు అంటూ దండన లేని స్నేహ పూరిత అభ్యసనం ఉండాలంటూ బోధన తత్వాన్ని ఆవిష్కరించారు.

డా॥ మారోజు దేవేంద్ర గారు ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు కథ పై పి.హెచ్.డి చేశారు. సాహిత్య వ్యాస సంకలనాలు కూడా రాశారు. వీరిది 'వ్యాస కలశం' అనే పేర సాహిత్య పుస్తకం కూడా వచ్చింది. 'నేషనల్ బుక్ ట్రస్ట్' వారి యువ రచయితల కథల్లో ఈమె కథ కూడా అచ్చయింది.

కందేపి రాణి ప్రసాద్ గారు గత 30 ఏళ్ళుగా సిరిసిల్లలో నివాసం ఉంటున్న బాల సాహితీ వేత్తగా సుపరిచితమే. బాల సాహిత్యంలో 14 పుస్తకాలు ప్రచురించారు. కథలు, కవితలు కూడా అందించిన రచయిత్రి. ఇదే సిరిసిల్లకు చెందిన రేపాక పద్మ గారు ప్రస్తుతం జనగాంలో ఉంటూ సాహిత్య సంబంధమైన ప్రక్రియలతో పుస్తకాలు ప్రచురించారు.

సుమ బాల గారు పత్రికా రచయిత్రిగా, కాలమిస్టుగా అందరికి సుపరిచితమే. ఈమె ప్రస్తుతం యన్.టి.వి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గా ఉన్నారు. తను రాసిన కథలు వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి.

డా॥ ఇర్కేడు విష్ణువదనాదేవి కవయిత్రిగా, పరిశోధకురాలిగా సుపచితురాలు. కాకతీయ విశ్వ విద్యాలయంలో బంగారు పతకాన్ని సాధించిన ఈమె నానీలు కవితా సంపుటిని వెలువరించారు. వేములవాడ దేవస్థానం ఆస్థాన కవి, మధుర కవి 'మామిండ్ల సాంబకవి జీవితం సాహిత్యం' పైన పి.హెచ్.డి చేశారు.

వేములవాడకు చెందిన మరో పరిశోధకురాలు ఇర్కేడు అర్కనందదేవి సాక్షి మొదలుకుని అన్ని పత్రికల్లో ఆధ్యాత్మి వ్యాసాలు రాశారు. బాల వీరులు, దేవతలు, దేవుళ్ళకు సంబంధించిన వ్యాసాలు రాస్తున్నారు. సంస్కృత సాహిత్యంలో పరిశోధన చేస్తున్నారు.

ఇదే సిరిసిల్ల జిల్లాకు చేందిన నేషనల్ బుక్ ట్రస్ట్ ఎడిటర్ అయిన డా॥ పత్తిపాక మోహన్ గారి భార్య అయిన సిరి చందన గారు తెలుగు నుండి హిందీలోనికి సాహిత్య అనువాద కార్యక్రమం చేస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మలేరియా సంస్థ కోసం ఆంగ్లం నుండి 'వైద్య విజ్ఞాన శాస్త్ర పుస్తకాన్ని' తెలుగులోకి అనువాదం చేశారు. యన్. గోపి గారి 'నన్హే ముక్తక్ అనువాద్ మూల్యాంకన్' అనే అంశంపై దక్షిణ భారత హిందీ ప్రచార సభ నుంచి యం.ఫిల్ సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. బూద రాజేశ్వరి గారు సిరిశాల ముద్దుబిడ్డ. తన శరీరం సహకరించకపోయినా తన కాళ్ళనే ఆయుధాలుగా చేసి కవిత్వాన్ని సంధిస్తున్న రచయిత్రి. తన కవిత్వంలో సామాజిక, మానవీయ విలువల్ని చూపిస్తున్న వర్ధమాన రచయిత్రి. సుద్దాల హన్మంతు జాతీయ పురస్కారాన్ని అందుకున్న వ్యక్తి. తెలంగాణ సాహితీ వేత్తలకు ఇచ్చే గౌరవ భృతిని అందుకుంటున్న రచయిత్రి.

ఈవిధంగా వివిధ ప్రక్రియల్లో సాహితీ సృజన చేస్తూ సిరిసిల్ల ప్రాంతాన్ని సుసంపన్నం చేస్తున్న రచయిత్రులు ఎందరో. మానేటి నీటిలోనే కవిత్వ ప్రవాహ ధార ఉంది.

మహా కవి సి.నారాయణ రెడ్డి గారు అన్నట్లు "మానేరు మన కళ్ళకు ముత్యాల పేరు"

జూకంటి జగన్నాథం గారు "మన మానేరు నీరు జీవ ధారే కాదు జీవ ధాతువు కూడా" అన్నారు. అలాంటి మానేరు తీర కవితాధార అనితరం. ఈ ధార బహు ముఖాలుగా విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకోసం ఒక ప్రత్యేక మహిళా సాహితీ వేదిక ఉన్నట్లైతే ఇంకెంతోమంది వర్ధమాన కవులు, రచయిత్రులు కవిత్వంలో తమ సత్తానూ చాటగలరు. ప్రత్యేక రాష్ట్రం అవతరించి ప్రపంచ తెలుగు మహా సభలను సగర్వంగా నిర్వహించిన మనంఇలాంటి వేదిక ఏర్పడితే తెలంగాణ మాగాణంలో మహిళా లోకం తనవంతు భాద్యతను నిర్వహించేలా సాహితీ వేత్తలు, ప్రభుత్వము ప్రోత్సాహాన్ని కల్పించాలని ఆశిస్తున్నాను.

## ఆధార గ్రంథాలు :

1. డా॥ మలయ శ్రీ, కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర (రచన కాలం 1990 - 1995), ప్రచురణ నవ్య సాహిత్య పరిషత్ ప్రచురణ, కరీంనగర్, డిసెంబర్ 1997.
2. డా॥ మలయ శ్రీ, కరీంనగర్ జిల్లా రచయితల చరిత్ర, ముద్రణ్ణ శ్రీరామ ప్రింటిగ్ ప్రెస్, కరీంనగర్, ఆగస్టు 1981.
3. రాజీవ, జ్వలిత, అమృత, గాయాలే... గేయాలై ! (తెలంగాణ కవయిత్రుల కవితా సంకలనం), ప్రచురణ రజిని పబ్లికేషన్, మే 2010.
4. సిసాస దశాబ్ది ఉత్సవాల సంచిక (1997 - 2007) , కళాలు - గళాలు (సిసాస కవుల కవితా సంపుటి), ప్రచురణ సిరిసిల్ల సాహితీ సమితి, డిసెంబర్ 2007.
5. కందేపి రాణీ ప్రసాద్, పూల తోట, ప్రచురణ్ణ మానేరు రచయితల సంఘం, సిరిసిల్లా, నవంబర్ 1999.

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# రెండు దశాబ్దాల రాయలసీమ పద్య కవిత్వం (1980-2000)

– కొక్కు నరేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, వేమనపురం, వై.ఎస్.ఆర్.కడప.

సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. సమకాలీన సామాజిక స్థితి గతులను ఆయా కవులు, రచయితలు తమ రచనల్లో పొందుపరుస్తారు. అది ఏ సాహిత్య ప్రక్రియ అయినా కావచ్చు. ఈ సత్యం ప్రపంచంలోని అన్ని సాహిత్యాలకూ వర్తిస్తుంది. అందువలన దీనిని సార్వకాలిక సత్యంగా పేర్కొనవచ్చు. ఈ దృక్కోణంలో చూసినపుడు రాయలసీమలో 1980-2000 మధ్య కాలంలో పద్య కవిత్వం పరిఢవిల్లిందని చెప్పవచ్చు. ఆధునిక కాలంలో పద్య కవిత్వానికి కాలం చెల్లిందని అందరూ భావిస్తున్న తరుణంలో పద్య కవిత్వం రాయల సీమలో వికాసం చెందడాన్ని శుభ పరిణామంగా పేర్కొన వచ్చు.

1980-200 మధ్య కాలంలో రాయలసీమలో డా॥ అంతటి నరసింహం గారి 'కం కాళరాత్రి', కుంటి మద్ది శేషశర్మ గారి 'మేలినోము', డా॥ ఎస్. గంగప్ప గారి 'నవో దయం', జోస్యము విద్యాసాగర్ గారి 'అమ్మ', ఎసి దస్తగిరి గారి 'కవితా భారతి', సవ్వప్పగారి ఈరన్నగారి 'పరదేశి', రామిరెడ్డి నారాయణరెడ్డి గారి 'ధ్రువ చరిత్ర', కలుగోట్ల విజయానందగారి 'పాంచాలి', మేడసాని మోహన్‌గారి 'పురుషోత్తమ చరిత్ర', కోడూరు ప్రభాకరరెడ్డి గారి 'పల్నాటి భారతము', వైసివి రెడ్డి గారి 'సిందూర రేఖ' వంటివి వెలువడ్డాయి. ఈ రచనలన్నింటిలో సామాజిక స్పృహ కనిపిస్తుంది. ఒక్కొక్క కావ్యంలోని ముఖ్యాంశాన్ని ఇక్కడ పేర్కొనడం జరిగింది.

డా॥ అంతటి నరసింహం గారు భారతీయులలో నెలకొన్న పెడ ధోరణులను చక్కగా విశదీకరించారు. దానికి మన చరిత్ర, సంస్కృతిని అన్వయం చేసి చెప్పాడు. దీనికి నిదర్శనమే ఈ కిందిపద్యం.

సీ॥ వేదాలలో లేని వేర్పాటు ధోరణి
ప్రజలలో నేరీతి వ్యాప్తి నొందె
ఉపనిషత్తులలో లేని ఉన్మత్త ధోరణి
పంచ జనుల నెట్లు ప్రబల మందె
సాంఖ్యమ్ములో తర్క శాస్త్రమ్ములో చెప్ప
బడిన రీతిగ సమత ప్రబల దేలో
స్మృతులలో శాస్త్రాల గతులలో పౌరాణి
కాఖ్యానములె ఖ్యాతి నందె నేలో
జైన బౌద్ధ మతాలలో బుద్ధిమంతు
లెందరో త్యాగులగుచు యోగీంద్రులగుచు
సర్వమానవ సమతను చాటి బోధ
చేసినను చావదేల యీ చెడ్డనీతి? - అంటూ ప్రశ్నించాడు.

(కంకాళ రాత్రి - పంచజన దుర్మార్గము - పద్యం: 4)

వేదాలలో, ఉపనిషత్తులలో సాంఖ్యాది శాస్త్రాల్లో తర్కశాస్త్రాల్లో స్మృతుల్లో పౌరాణిక గ్రంథాల్లో జైన బౌద్ధ మతాల్లో ఎక్కడగానీ కుల తత్వాన్ని గానీ కుల భేదాలు గాని పాటించాలని చెప్పలేదని, అలాంటపుడు నేడు ప్రజలు ఎందుకు కుల భేదాలు పాటిస్తున్నారని కవి సూటిగా ప్రశ్నించాడు.

తల్లికి బిడ్డల పట్ల ఎంత ప్రేమ ఉంటుందో జోస్యము విద్యాసాగర్ కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. దీనికి హేతువే ఈ కింది పద్యం.

కన్నులు కొంచెమెర్రబడి గట్టిగతుమ్మిన లేక దగ్గినన్
చిన్నికి జబ్బుచేసెనని చిందులు తొక్కును కాలు సేతు లే
మన్నను వెచ్చనాను అనుమానంతో స్పృశియించు చూచి లే
దన్న నిజ మ్మెరింగియు నిదానము చెందక తృప్తిక వెం
కన్నకు మొక్కి వేముడుపుగట్టు అమాయక అమ్మ అమ్మయే
(అమ్మ - పద్యం 14) అని శ్లాఘిస్తాడు.

బిడ్డకు ఏ చిన్న అనారోగ్యం కలిగినా తల్లి మనసు తల్లఢిల్లిపోతుందని కవి చక్కగా తెలిపాడు. అందుకే పూర్వులు నూర్గురు ఉపాధ్యాయుల కంటే తల్లి గొప్పదని

చెప్పారు. అదేవిధంగా మనం జీవితాంతం సేవ చేసినా తల్లి రుణం కొంచెం కూడా తీర్చుకోలేమని వేదాది గ్రంథాలు చెబుతున్నాయి.

రైతుల శ్రమను కవి ఎసి దస్తగిరి అద్భుతంగా చిత్రించాడు. ప్రపంచానికే తిండిపెట్టే రైతు జీవితం మాత్రం దుర్భరంగా సాగుతున్నదంటాడు కవి.

గీ॥ ప్రొద్దు పొడిచినది మొదలు ప్రొద్దు కుంకు
దాక చెమటోడ్చి కృషిచేయు త్యాగమూర్తి
పరుల శ్రమ మంత దోచక బ్రతుకు నీవు
ధరణి జనులకు నెల్ల ఆధారమయ్య

(కవితా భారతి - కర్షకుడు - పద్యం 2)

సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం వరకు రైతు పొలంలో కష్టపడుతూనే ఉంటాడు. ఎండ వాన గాలి చీకటి విషపురుగుల కాట్లు దేనినీ లెక్క చెయ్యడు. ఆరుగాలం శ్రమించి మనకు తిండి పెడుతున్నాడు. ఈ శ్రమ జీవిని గూర్చి పురాణాది గ్రంథాలు ఘనంగా శ్లాఘించాయి. ఆధునిక సాహిత్యం రైతుల శ్రమ శక్తికి అగ్రస్థానాన్నిచ్చింది. దీనికి శ్రీశ్రీ రాసిన 'ప్రతిజ్ఞ' ప్రబలోదాహరణంగా పేర్కొనవచ్చు.

పుణ్యభూమి, కర్మభూమి, ధన్యభూమి, వీరభూమి అనిన భారతదేశంలో స్త్రీలు ఎంతదుర్భరంగా జీవిస్తున్నారో చిత్రించాడు.

కామము కళ్ళు గప్పి పరకాంతల శీలము దోచునట్టు యా
కామ పిశాచమున్ విడచి కర్మ మెరుంగని నాకు శిక్షయా?
ఏమని విన్న వింతు పరమేశ్వరా! పాపపు లోకమందు నీ
నామము మాసిపోయెనిక నాగతి దుర్గతి పార్వతీ పతీ!

(పరదేశి - నేరము, శిక్ష - పద్యం 203)

నేడు కామాంధులు మూడు నెలల పసికందు మొదలు పండు ముసలి వరకు ఎవ్వరినీ వదలకుండా అత్యాచారం చేస్తున్నారు. నమ్మించి కొందరు, మోసం చేసి కొందరు, బల ప్రయోగంతో కొందరు, అధికార దర్పంతో కొందరు స్త్రీలపై అఘాయిత్యాలకు, హత్యాచారాలకు పాల్పడుతున్నారు. 2018 సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ అత్యాచారాల గణాంకాల్లో రెండవ స్థానంలో ఉన్నట్లు ప్రభుత్వం 9-10-2020 నాడు ప్రకటించింది. నిర్భయ, దిశ వంటి ఎన్ని చట్టాలు తెచ్చినా అత్యాచారాలు ఎంత మాత్రం తగ్గకపోగా దిన దినాభివృద్ధి చెందుతూనే ఉన్నాయి. దీనిపై ప్రభుత్వాలు కఠినాతి కఠినంగా వ్యవహరిస్తే తప్ప ఇలాంటి దుస్సంఘటనలు తగ్గవు.

భారతీయులు పౌరుషానికి పెట్టింది పేరు. మన దేశముపైకి దండెత్తి వస్తున్న అలెగ్జాండరును గట్టిగా ఎదుర్కొని నిలువరించాలని భావించాడు మన భారతీయ ప్రాచీన రాజు పురుషోత్తముడు. అతని దృఢ సంకల్పాన్ని కవి మేడసాని మోహన్ ఇలా తెలిపాడు.

కం॥ రేపో మాపో మనపై
చూపింపగ వచ్చు వాని శూరత, ధైర్యా
టోప విజృంభణ కాంతులు
దీపింప నెదిర్చి వాని తిముదణవ వలెన్

(పురుషోత్తమ చక్రవర్తి - శ్రావణ పూర్ణిమ - పద్యం 91)

తలవంచని వ్యక్తిత్వం కలిగినవారు భారతీయులు. అంతర్గత కలహాలకు గానీ, విదేశీయులను ఎదిరించడంలో గానీ మడమచూపని శౌర్య వంతులు భారతీయులు. విజయమో వీరస్వర్గమో తేల్చుకోవాలని భావిస్తారు. ఈ భావనే ప్రపంచంలో మనకు ఒక ప్రత్యేక గుర్తింపు రావడానికి హేతువు అయిందని చెప్పవచ్చు.

రాయల సీమ ప్రాంతంలో భూ స్వాములు తమ ఇంట్లో ఏదైనా శుభకార్యం జరిగితే వివిధ కుల వృత్తుల వారికి భారీగా దాన ధర్మాలు చేసే సంప్రదాయం తర తరాల నుంచి వస్తున్నది. రాజిరెడ్డి అనే రైతు చేసిన వదాన్యతను గూర్చి వైసివి రెడ్డి ఇలా తెలిపారు.

సీ॥ తన ఇంటి చాకలి కనుగలం బైనట్టి
పాడి మేకల రెంటి బట్టి యిచ్చె
తన యింటి తల వరిందని యింప నిల్లాలి
యొడ్డాణమిచ్చి తన్నోము కొమియె
తన యింటి మంగలిన్ గని కొమ్ము పొట్టేండ్ల
గోరిన రెంటిని కూడదోలె
తన యింటి మాదిగెందనుపు గాటను మేయు
కోడెదూడను పడ్డదూడనిచ్చె

గీ॥ కుమ్మరికి గట్టు బంగారు కమ్మలిచ్చె
కమ్మరికి, వడ్ల వానికి కట్టు పంచె
లిచ్చి, బియ్యము బేడల నిచ్చి ప్రియము
బల్కె మారెడ్డి పెండ్లి గేవలపు భక్తి
(సిందూరరేఖ - పద్యం - 115)

రాయలసీమ భూస్వాములు దాన ధర్మాలు చేయడంలో ఏ మాత్రం వెనుకంజ వేయరు. తమపై ఆధారపడి జీవించే అన్ని కుల వృత్తుల వారిని ధన ధాన్యాదులతో సత్కరిస్తారు. ఈ సంప్రదాయం వందలాది సంవత్సరాలనుంచి వస్తున్నది. అలా చేయడం తమ వంశప్రతిష్ఠకు హేతువుగా వారు భావిస్తున్నారు. దీనిని రాయలసీమ భూస్వాముల వదాన్యతకు ప్రబల హేతువుగా పేర్కొనవచ్చు.

శ్రీకృష్ణ దేవరాయల చరిత్రను శ్రీకృష్ణ భారతము పేరుతో భూతపురి సుబ్రహ్మణ్య శర్మ రాశారు. ఇందులో రాయల చరిత్ర మొత్తం సమగ్రంగా తెలుసుకొనుటకు ఈ కావ్యం చక్కగా దోహదపడుతుందని చెప్పవచ్చు. తాను రాజైనా కూడా రాయలు కవులు, పండితులు, కళాకారులకు అపరిమిత గౌరవాన్ని ఇచ్చాడు. భోజరాజు తరువాత అంతటి గౌరవాన్ని ఇచ్చిన రాజు రాయలు ఒక్కడేనని చరిత్ర ద్వారా తెలుస్తున్నది. రాయలు మహాకవి పెద్దనకు గండ పెండేరము తొడిగిన తీరును భూతపురి సుబ్రహ్మణ్య శర్మ ఇలా తెలిపారు.

తే॥ ఆంధ్ర కవితా పితామహా! యల్లసాని
పెద్దన కవీంద్ర! తగుదువు బిరుదగు కవి
గండ పెండెరమున కీవె! కైకొనుమని
తతము దమ్మునఁ దానె పాదమునఁ దొడిగె
(శ్రీకృష్ణ భారతము - అష్టమాశ్వాసము - పద్యం 415)

ఆంధ్రదేశాన్ని పరిపాలించిన రాజులు కవులను ఘనంగా సన్మానించారు. వారిని ఆదరించారు. వారికి ధన ధాన్యాది దానాలు చేశారు. వారికి సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అలాచేసిన వారిలో అగ్రగణ్యులు శ్రీకృష్ణదేవరాయలు. రాయలకంటే ముందున్న రాజులు కూడా కవులను ఆదరించినా, రాయల వలె అష్ట దిగ్గజాలను ఆదరించిన వారు లేరు. ఆ తర్వాత రాయలను దక్షిణాంధ్ర రాజులు అనుసరించారు. వీరి ద్వారా కవులకు సమాజంలో ఒక విశిష్ట గౌరవం దక్కిందని చెప్పవచ్చు.

ఈ విధంగా 1980-2000 మధ్య కాలంలో పద్య కవిత్వం రాసిన కవులు వివిధ చారిత్రక సాంస్కృతిక సాహిత్య అంశాలను తమ రచనల్లో ప్రతిబింబించి తమకు చక్కని సామాజిక స్పృహ ఉందని నిరూపించారు.

## ఉపయుక్త గ్రంథాలు :

1. కంకాళరాత్రి - డా॥ అంతటి నరసింహం
2. అమ్మ - జోస్యము విద్యాసాగర్
3. కవితాభారతి - ఎ.సి.దస్తగిరి
4. సింధూరలేక - వై.సి.వి.రెడ్డి
5. తెలుగుసాహిత్యసమీక్ష - ఆచార్య జి.నాగయ్య

✿ ✿ ✿

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# గురజాడ అప్పారావు - వేశ్యపాత్ర చిత్రణ

- **కొండయ్య కోసూరు,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, మధురై కామరాజు విశ్వవిద్యాలయం, మధురై, తమిళనాడు.

సాహిత్యమనగా సమాజ హితం కోరేది. అది ఏ రూపంలో వున్నా; సమకాలీన సమాజాన్ని ప్రతిబింబింప చేస్తూ, వాస్తవిక మానవ జీవితాన్ని ఆవిష్కరింప చేస్తే, ఉత్తమ సాహిత్యంగా కొన్ని తరాల వరకు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంటుంది. సహజత్వం వున్న రచన సహృదయ పాఠకునికి చేరువవు తుంది. అనుభవాల అనుభూతుల అక్షర రూపం సాహిత్యం. అందుకే ప్రేమ్‌చంద్ "జీవితాన్ని గురించి విమర్శించేదే సాహిత్యం" అని అంటాడు.

స్త్రీని శృంగార నాయికగా అంగాంగ వర్ణనలు కావించిన ప్రబంధాలను త్రోసిరాజని, సంస్కరణ భావాలతో అంకురించిన ఆధునికాంధ్ర సాహిత్యంలో వేశ్య పాత్రలకు సంబంధించి, ఉదాత్త భావాలను ప్రదర్శిస్తూ, రచన చేసిన తొలి తెలుగు సాహిత్యవేత్త గురజాడ అప్పారావు. క్రీ.శ. 19వ శతాబ్దంలో సాంస్కృతిక పునరుజ్జీవన నేపథ్యంలో ఆంధ్రదేశంలో రెండు సంస్కరణోద్యమాలు బాగా ఊపందుకున్నాయి. అందులో ఒకటి సంఘసంస్కరణ కాగా, రెండవది భాషాసంస్కరణ. సంఘసంస్కరణకు కందుకూరి కంకణం కట్టుకుంటే, భాషాసంస్కరణకు గిడుగు నడుం బిగించారు. వీరిద్దరికన్నా అటు సంఘాన్ని, ఇటు భాషను సంస్కరిస్తూ సాహిత్యాన్ని సృష్టించిన సామాజిక, సారస్వత వైతాళికుడు గురజాడ.

సాంఘిక దురాచారాలలో స్త్రీలపట్ల వివక్ష ఒక అంశంగా భావించిన గురజాడ, స్త్రీ అభ్యుదయాన్ని కాంక్షిస్తూ రచనలు చేశారు. "ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుంది" అన్న తన వాక్యంలోనే స్త్రీ జనోద్ధరణ పట్ల గురజాడ ముందుచూపు వ్యక్తమవుతుంది. స్త్రీల జీవితాలలోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ అంశాలను పురోగామి దిశగా మలుపు తిప్పగల దృక్పథమే స్త్రీవాదమైతే, తొలి తెలుగు స్త్రీవాద సాహిత్యవేత్తగా గురజాడను చెప్పుకోవచ్చును. ఎందుకంటే గురజాడ సాహిత్యంలో స్త్రీకి అంతటి మహోన్నతమైన స్థానముంది. తొలి తెలుగు కథానికైన దిద్దుబాటులో "భగవంతుడి సృష్టిలోకెల్లా ఉత్కృష్టమైన వస్తువు విద్య నేర్చిన స్త్రీ రత్నమే" అన్న గోపాలరావు మాటలలో స్త్రీ విద్యపట్ల గురజాడ అభ్యుదయ దృక్పథం స్పష్టంగా తెలుస్తుంది. గురజాడ సృష్టించిన స్త్రీలలో ఆడబిడ్డలపై జరుగుతున్న దౌర్జన్యాన్ని ఎదిరించలేని సమాజాన్ని ప్రశ్నించే వారున్నారు. అలాగే తమ తెలివితేటలతో సంసారాన్ని చక్కదిద్దుకునే వారూ ఉన్నారు. వీరందరికన్నా తమ వృత్తిని చేపడుతూనే, సంస్కారాన్ని ప్రదర్శించే వేశ్యలూ ఉన్నారు.

కొద్దికాలం ఉండే యవ్వనాన్ని జీవనాధారంగా చేసుకొన్న కులం వేశ్యలది. దేవదాసి వ్యవస్థ నుండి కాల గమనంలో రూపాంతరం చెందిన ఈ వేశ్యావ్యవస్థలో పుట్టి, పెరిగి వేశ్యలుగా జీవితాన్ని సాగిస్తున్నవారు కొందరైతే, బాల్యవివాహాల్లాంటి దురాచారాల వల్ల లైంగిక వాంఛను అదుపులో పెట్టుకోలేక వ్యభిచరించిన వాళ్ళు మరి కొందరు. మొదటి రకానికి మధురవాణి, సరళలు ఉదాహరణలైతే, రెండవ రకానికి మీనాక్షి, పూటకూళ్ళమ్మలు నిదర్శనాలు. వేశ్యను సంస్కారవంతంగా చిత్రించాలంటే ఎంతో ధైర్యం, సంస్కారం, సహనం కావాలి. ఈ మూడు గుణాలు మూర్తీభవించిన రూపం గురజాడ. అందుకే 'సంస్కర్త హృదయం'లో సరళ ద్వారా "కన్యాశుల్కం"లో మధురవాణి ద్వారా వేశ్యలలో ఉన్న సంస్కారాన్ని బయటపెట్టాడు. వేశ్యపాత్ర చిత్రణలో ప్రాచీన ధోరణికి విరుద్ధంగా, సంస్కార ధోరణిని ప్రదర్శించి వాళ్ళలో ఉండే తెలివితేటలు, చొరవ, మానవతా దృక్పథం ఆవిష్కరించి సాహిత్యాన్ని సంస్కరించినవాడు గురజాడ.

"వేశ్యలోని మానుషత్వాన్ని మరిచిపోకండి. ఆమె సుఖదుఃఖాలు మీవిగానీ, నావిగానీ అయిన సుఖదుఃఖాలకు ప్రాముఖ్యతలో తీసిపోవు. సంఘంలో లెక్కలేని వ్యభిచారులైన భర్తలూ, భార్యలూ ఉన్నారు. స్పష్టంగా తన వృత్తిని

తెలియపరిచే వేశ్య వారందరికన్నా అధమురాలెట్లా అవుతుంది? పైగా వేశ్య వివాహ ప్రమాణాన్ని భగ్నం చేయడం లేదు వీళ్ళవలె" అంటూ గురజాడ తన లేఖలో వేశ్యలకు మిగిలిన స్త్రీ, పురుషలకు గల సంబంధాల్లో బేధాలను ప్రశ్నిస్తున్నాడు. ఇక్కడ వేశ్య పక్షాన మాట్లాడినట్లు కన్పించినా, వేశ్యలోని మానవత్వాన్ని, సుఖదుఃఖాల్ని, నిజాయితీని ప్రపంచానికి తెలియచేయడమే పై వాక్యాల సారాంశం. విశ్వతోముఖత్వం, మానవత్వం, నూతనత్వం గురజాడ సాహిత్యంలో ప్రధాన లక్షణాలు. అందుకే అప్పారావు తరువాతి తరాల వారికి మార్గదర్శి అయ్యాడు.

ఆనాటి సమాజంలో వేశ్యలను ఉంచుకోవడం ఒక సామాజిక హోదాగా మగవాడు భావించేవాడు. అందువలన వ్యభిచారం ఒక వృత్తిగా మారింది. ఈ క్రమంలో వేశ్యలుగా స్త్రీల అనుభవాలను, వారి ఆలోచనలను, వారి జీవన సరళిని కూలంకషంగా పరిశీలించిన గురజాడ ఈ వ్యవస్థ స్వరూప స్వభావాల్ని, వేశ్యలలోని ఉన్నత భావాల్ని సందర్భానుసారంగా ఆయా పాత్రల ద్వారా మనకు తెలియచేశాడు. ఈ వేశ్యలవల్ల ఎన్నో పచ్చటి సంసారాలు నేలమట్టమయ్యాయి. ఐశ్వర్యవంతులు కూడా ఈ వ్యామోహంలో పడి దరిద్రులుగా మారారు. ఎంతోమంది గృహిణులు దుర్భరమైన జీవితాన్ని అనుభవించారు. కాబట్టి ఎటుచూసినా ఈ వ్యవస్థవల్ల బాధపడేది స్త్రీలే. అటు సంసార జీవితం సాఫీగా సాగాలన్నా, ఇటు వేశ్యల జీవితాలు ఉద్ధరింప బడాలన్నా, ఈ వేశ్యా వ్యవస్థను నిర్మూలించడమే ఉత్తమ మార్గమని గురజాడ భావించి ఉంటాడు.

సమాజంలో రెండు రకాల వర్గాలుంటాయి. ఒక వర్గం వేశ్యా సంపర్కం కావాలనుకునే ప్రోనాచీయులు కాగా, రెండవ వర్గం వేశ్యా సంస్కరణం కావాలనే యాంటినాచీయులు. యాంటినాచీయులకు వేశ్యలంటే గిట్టదు. వేశ్యలను అసహ్యంగా చూస్తారు. సమాజంలో ఒక అసాంఘిక శక్తులుగా వేశ్యలను వీరు పరిగణిస్తారు. వేశ్యల దగ్గరకు వెళ్ళడమంటే నరకద్వారంలోకి ప్రవేశించినట్లేనని భావిస్తారు. వేశ్యావ్యవస్థకి వ్యతిరేకంగా మాట్లాడతారు. అయితే వీళ్ళల్లో కొంతమంది మాటలలో వున్నంత సంస్కారం ఆచరణలో కనిపించదు. వీరు మానసిక బలహీనులు. సంస్కర్త హృదయంలోని ప్రొఫెసరు రంగనాథయ్యరు, కన్యాశుల్కం నాటకంలో సౌజన్యారావు వీళ్ళకి ప్రతీకలు.

ఎవరు ప్రోనాచి, ఎవరు యాంటినాచీ అన్న విషయంలో గురజాడకు స్పష్టమైన అభిప్రాయముంది. "కొందరు బంట్లు పగలు యాంటీనాచి, రాత్రి ప్రోనాచి యని, కొందరు ఉన్న ఊళ్లో యాంటీనాచీ, పరాయి ఊళ్లో ప్రోనాచి; కొందరు శరీర దారుఢ్యం ఉన్నంతకాలం ప్రోనాచి, శరీరం చెడ్డ తరువాత యాంటీనాచి, కొందరు బ్రతికి వున్నంత కాలం ప్రోనాచి, చచ్చిపోయిన తరువాత యాంటీనాచి; కొందరు అదృష్టవంతులు చచ్చిన తరువాత కూడా ప్రోనాచే అనగా యజ్ఞంచేసి పరలోకంలో భోగాలకి టిక్కెట్లు కొనుక్కుంటారు. నాబోటి అల్పప్రజ్ఞ కలవాళ్ళు లభ్యం కానప్పుడల్లా యాంటినాచే" అన్న కరకటశాస్త్రి మాటల ద్వారా చేతకాని వారు, అవకాశవాదులై, ఆచరణ శక్తిలేని యాంటీనాచుల గురించి గురజాడ కన్యాశుల్కంలో తీవ్రంగా దుయ్యబట్టాడు.

## గురజాడ రచనలు - వేశ్యాపాత్ర చిత్రణ :

1903లో రచింపబడ్డ "స్టాపింగ్ టు రైజ్" అన్న గురజాడ ఆంగ్ల కథను అవసరాల సూర్యారావు "సంస్కర్త హృదయం"గా తెలుగు అనువాదం చేశారు. ఈ కథలో వేశ్య పేరు సరళ. ఈమె అందగత్తె, తెలివైనది. మురికి కూపంలో పెరిగిన కళాశాల విద్యార్థిని సరళ. ప్రేమ కరువై, అభద్రతకు లోనై అసహ్యంగా, అసహనంగా జీవితాన్ని సాగిస్తున్న మహిళ. కళాశాల ప్రొఫెసరు రంగనాథయ్యరు మంచి సంస్కారవంతుడు. ఉన్నత భావాలు కలవాడు. సంఘసంస్కరణాభిలాషి, అవినీతి అన్యాయాన్ని అరికట్టాలని నిరంతరం ఆలోచిస్తూ, పడుపువృత్తిని చేటలతో చెరుగుతూ విమర్శించేవాడు. అయినా గాని సౌందర్యారాధకుడు. అందుకేనేమో సరళను చూసినప్పటినుండి అతనిలో ఉన్న సంఘసంస్కరణ కాస్త హృదయ సంఘర్షణకు దారితీసింది. సమాజ రుగ్మతలకు చికిత్స చేయవలసిన వైద్యుడు సంఘసంస్కర్తే అని భావించి, వేశ్యను

సంస్కరించాలనుకొన్న ప్రొఫెసర్, చివరికి వేశ్యా వ్యామోహంలో పడి కొట్టుకుపోయాడు. ఆంగ్లవిద్యను అభ్యసించిన కొంతమందికి సంఘాన్ని సంస్కరించాలన్న భావన వున్నా, శారీరక మానసిక బలహీనతలకు లోనై వారు నైతికత్వాన్ని కోల్పోతున్నారని చెప్పడానికి నిదర్శనం ప్రొఫెసర్ రంగనాథయ్యరు.

కథా ప్రారంభంలో ప్రొనాచులపైన విరుచుకుపడ్డ సంస్కర్త రంగనాథయ్యరు, కథాంతంలో బోగంపిల్ల సరళ సాహచర్య భాగ్యం లభిస్తే ఎంతో బాగుండునను కుంటాడు. అందుకోసం దూరమైనా, భారమైనా సరే కట్టుకున్న భార్యను పుట్టింటికి పంపడానికి కూడా సిద్ధమవుతాడు. కథ చివరలో సరళ సౌందర్యానికి దాసుడై, హృదయ సంస్కారాన్ని కోల్పోతాడు. ఈ కథలో ప్రొఫెసరు రంగనాథయ్యరు పాత్ర ద్వారా వేశ్యావ్యవస్థను నిర్మూలించాలనే సంస్కరణవాదుల డొల్లతనాన్ని, హిపోక్రసీని బయటపెట్టాడు గురజాడ. వ్యక్తులు సంస్కరించబడితేనే, సమాజం సంస్కరించబడుతుందని గురజాడ విశ్వాసం.

పద్మం బురదలోనుండి పుట్టినా, దానికి బురద, నీరు అంటదు. పైగా పరిమళాన్ని వెదజల్లుతూ అందంగా ఉంటుంది. అలాగే వేశ్యాకులంలో పుట్టినంత మాత్రాన ఒక స్త్రీ వేశ్య కావలసిన అవసరం లేదు. మానవత్వమనే పరిమళాన్ని వెదజల్లే ఆమెకు ఆ పాపపంకిలం అంటమన్నా అంటదు. వేశ్యాకులంలో పెరిగినంత మాత్రాన ఆమె నేరస్థురాలు కాదని, దురదృష్టవంతులను కనికరించినట్లే, మానవులు ఆమెను దయతో ఎందుకు చూడకూడదని రంగనాథయ్యరు ద్వారా గురజాడ ప్రశ్నిస్తాడు? ప్రేమను, కరుణను, తెలివిని, చివరకు ధనాన్నయినా సరే ధారపోసి సరళను ఉద్ధరించాలన్న రంగనాథయ్యరు మాటల ద్వారా సంస్కర్తల ఆదర్శ భావాలను తెలియజేశాడు గురజాడ. వేశ్యలు తాము ఉన్న అంధకారం నుండి బయటపడాలని ఆశిస్తారని, స్వచ్ఛమైన ప్రేమను పొందాలని పరితపిస్తారని సరళ ద్వారా ఈ కథలో తెలియచేశాడు.

ఎవరో ఒక ప్రబుద్ధుడు ఒక వేశ్యను పెళ్ళి చేసుకుంటే వ్యవస్థ మారదు. మర్యాదస్తులు, చదువుకొన్నవారు వేశ్యలను పెళ్ళాడితేనే వ్యవస్థ సంస్కరించినట్లవుతుందని సరళ మాటల ద్వారా మనకు అర్థమౌతుంది. బోగం పిల్లలంటే జీవితంలో ఓడిపోయిన స్త్రీలని, వారిని గెలుపుబాట వైపు పయనింప జేయవలసిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని గుర్తుచేశాడు గురజాడ. వేశ్యాకులంలో ఉన్నా, సరళవంటి స్త్రీలు బాగా చదువుకొని, సమాజంలో గౌరవంగా బ్రతకాలని కోరుకుంటారని ఈ కథ ద్వారా తెలుస్తుంది. సాధారణంగా వేశ్యల గదిలో శృంగారాన్ని ప్రేరేపించే అలంకరణ ఉంటుంది. కానీ దీనికి విరుద్ధంగా సరళ గదంతా రామాయణ, భారత కథలకు చెందిన చిత్రాలు, సంఘ సంస్కర్తల, కాంగ్రెస్ నాయకుల ఫోటోలతో అలంరించబడి వుందని చెప్పాడు. దీనినిబట్టి పురాణేతిహాసాల పట్ల సాధారణ, సంసారిక స్త్రీలకుండే ఆసక్తి, దేశభక్తి సంస్కారవంతమైన వేశ్యలకు కూడా ఉంటుందని మనకు తెలుస్తుంది. వేశ్య అయినా సరే ఎవరికీ రానన్ని సంస్కృత శ్లోకాలు, తెలుగు పద్యాలు నోటికి ధారాళంగా వచ్చాయంటే, ఆమెకు గల పాండిత్య పటిమ వ్యక్తమవుతుంది. ఇన్ని సుగుణాలున్నా ఆమె వేశ్యాకులంలో పెరగడంవల్ల పూజకు పనికిరాని పువ్వు అయింది.

వేశ్యా సంస్కారానికి సంబంధించి గురజాడ భావాలకి నిలువుటద్దం మధురవాణి. కన్యాశుల్కం నాటకంలో "మొగవాడికైనా, ఆడదానికైనా నీతి ఉండాలి" అనే మాటతో నైతిక ప్రాధాన్యం తెలిపే విధంగా రంగప్రవేశం చేసిన వేశ్య మధురవాణి. ఒకరి ఆడాలో ఉన్నప్పుడు వేరొకరిని తాకనివ్వని నిజాయితీ పరురాలు. పరువైన మొగాళ్ళొచ్చినప్పుడు, పరువైన ఆడవాళ్ళెందుకు రాకూడదు? అని ప్రశ్నించే స్వభావం కలది. వేశ్యలలో కూడా డబ్బుకి కక్కుర్తిపడే మనిషిగా కాక, మంచితనం, మానవత్వం మూర్తీభవించిన పాత్రగా గురజాడ మధురవాణిని తీర్చిదిద్దాడు. సాటి ఆడదానిపట్ల సానుభూతి చూపడమే కాకుండా, ఆపదలో వున్న అబలను ఆదుకొన్న సబల మధురవాణి. "జీవితంలో ఏ సందర్భానికైనా సరిపోయే మాటలు ఎక్కడో ఒకచోట గురజాడ మహాకవిలో

దొరుకుతాయి" అన్న శ్రీశ్రీ మాటలకు దృష్టాంతం కన్యాశుల్కం.

కన్యాశుల్కం నాటకానికి ఇతివృత్తం కన్యాశుల్కం సమస్య అయినా, కథ అంతా వేశ్య అయిన మధురవాణి చుట్టూ తిరుగుతుంది. మధురవాణి లేకపోతే కథే లేదన్నంతగా అల్లుకుపోతుంది. అపారమైన లోకజ్ఞానం, విశాల దృక్పథం కలిగిన వేశ్య మధురవాణి. వేశ్యను అతిచులకనగా చూడవద్దని, వేశ్యలలో కూడా వృత్తిధర్మాన్ని పాటిస్తూ ఉన్నత విలువలు కలిగిన వారుంటారని మధురవాణి పాత్రద్వారా గురజాడ తెలియచేశాడు. అభ్యుదయ భావాలు, సంస్కరణ దృష్టి కలిగిన సత్పురుషుడు సౌజన్యరావు, తనను ఆశించినా, చెడనివారిని చెడగొట్టకూడదన్న ఉదాత్త భావాన్ని ప్రదర్శించిన సౌజన్యమూర్తి మధురవాణి. 'వేశ్య' అన్న అంశాన్ని ప్రక్కనపెడితే, మిగిలిన విషయాలలో కులకాంతలకు ఏ మాత్రం తీసిపోని పాత్ర ఆమెది. తమ వృత్తిని తాము నిర్భయంగా నిర్వహిస్తున్న వేశ్యలకన్నా, బయటకు పతివ్రతా ధర్మాన్ని ప్రదర్శిస్తూ, చాటుమాటుగా వ్యభిచరిస్తున్నవారే సమాజంలో నైతిక విలువల పతనానికి కారకులని తెలుస్తుంది.

వేశ్యలను కూడా ఆటపాటలకు పిలవాలని, అందరిలా సమాజంలో గౌరవంగా బ్రతికే అవకాశం కోసం వారు ఎదురు చూస్తుంటారని, కామవాంఛలతో తమ దగ్గరకు వచ్చే విటులు కూడా బాగుపడాలనే కోరుకుంటారని, వాళ్ళకీ పెళ్ళి, పిల్లలు, సంసారం కావాలనే ఉబలాటం ఉంటుందని మధురవాణి పాత్ర ద్వారా గురజాడ సమాజానికి చాటిచెప్పాడు. సాంప్రదాయక వేశ్యావ్యవస్థలో, వేశ్యాజీవన గమనంలో అట్టడుగున పడివున్న మానవ సంబంధాలను వెలికితీసి, ఆర్థిక సంబంధాలకన్నా, హార్థిక సంబంధాలు గొప్పవని తెలియచేస్తూ, వృత్తికన్నా ప్రవృత్తి ఉత్తమమైనదని మధురవాణి ద్వారా గురజాడ లోకానికి తెలియచేశాడు. స్త్రీలు బాగా చదువుకొని, సంస్కార భావాలు అలవరుచుకొని, లోకానుభవం కలిగి వుండి, తమ సమస్యలను తామే పరిష్కరించుకునే ఆత్మవిశ్వాసంతో అడుగు ముందుకు వేస్తూ అభ్యుదయం వైపు నడవాలని 'మధురవాణి' ద్వారా గురజాడ మహిళాలోకానికి సందేశమిచ్చాడు.

ఇంక "కొండుభట్టీయం" నాటకంలో మంజువాణి విషయానికొస్తే, కొండుభట్టు మాటలద్వారా డబ్బు విలువ యెరుగని వేశ్యగా ఆమె కనిపిస్తుంది. రత్నాంగితో "నేను బోగందాన్నా?" అన్న మంజువాణి మాటలద్వారా బలవంతంగా ఈ వేశ్యావ్యవస్థలో చిక్కుకొని, స్వేచ్ఛకు దూరమై, బానిసగా బ్రతుకుతున్న వేశ్యగా మనకు అర్థమౌతుంది. పట్నంలో పరాయిస్త్రీల సహవాసం చేసిన భీమారావు పంతుల్ని ప్రాయశ్చిత్తం చేసుకుంటేనే గాని దగ్గరకు రానియ్యని వేశ్య ఆమె. ఈ నాటకంలో గురజాడ చిక్కులతో సాగే వేశ్యల జీవితాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించాడు. వేశ్యలకు తార్పుడు పనిచేసి ధనం సంపాదించే కొండుభట్టు వంటి వైదిక బ్రాహ్మణుల దిగజారుడు తనాన్ని బట్టబయలు చేశాడు.

ఈ వేశ్యల వద్దకు వెళ్తున్నవారు ఎవరు? ఎవరిని మారిస్తే ఈ వేశ్యావ్యవస్థ సంస్కరించబడుతుంది? అన్న ప్రశ్న గురజాడను బాగా ఆలోచింపచేసి ఉంటుంది. అందుకనే 'సంస్కర్త హృదయం' కథలో వేశ్యల వద్దకు వెళ్ళే విటులుగా విద్యాధికులు, ప్లీడర్లను, అలాగే 'కన్యావుల్కం" నాటకంలో సాంఘిక హోదా గల పెద్దలను, బ్రాహ్మణులను, పండితులను విటులుగా ప్రస్తావించారు. వీరు మారితే వ్యవస్థ మారుతుంది. అయితే పూర్తిగా మగవారి వల్ల మాత్రమే ఈ మార్పు జరిగేది కాదు. అనుభవం, వివేకం గల వేశ్యల వల్ల కూడా ఇది జరుగుతుందని గురజాడకు గట్టి నమ్మకం. అలాగే బాగా చదువుకున్న యువకులు ఈ వ్యవస్థను మార్చి దేశాన్ని అభ్యుదయపథం వైపు నడపాలన్నది గురజాడ కోరిక. నైతిక పతనావస్థ నుండి దేశాన్ని విద్యార్థులు ఉద్ధరించాలన్నదే ఆయన ప్రబోధ సారాంశం. సృష్టిలో అనాదినుంచీ పాపం, పుణ్యం ఒకదాని ప్రక్కన ఇంకొకటి ఉంటాయని, పాపంలో పుణ్యాన్ని వెతకాలనీ, అలాగే మంచిచెడులు ఒక సరసన పెరుగుతాయని, చెడులో కూడా మంచిని

గ్రహించవలసిన అవసరం ఉందని గురజాడ ఉద్బోధ. యుగయుగాల జీవితానుభవమే జ్ఞానమని, ఈ విజ్ఞానమే మన దైనందిన జీవితానికి తోడ్పడుతుందని, చీకటిలో మతములన్నియు మాసిపోయినా, జ్ఞానమన్నది నిలిచి వెలుగుతుందని గురజాడ విశ్వాసం. ఏది ఏమైనా గురజాడ చిత్రించిన వేశ్య పాత్రలు తమ వృత్తిధర్మాన్ని నిర్భయంగా పాటిస్తూ, నిజాయితీని ప్రదర్శిస్తూ, మానవత్వపు విలువలతో ఉన్నత భావాలు కలిగిన సంస్కారవంతులుగా కనిపిస్తారు.

సాంఘిక దురాచారాలను సాహిత్యంద్వారా ఖండించిన యోధుడు గురజాడ. ప్రజల భాషకి పెద్దపీట వేస్తూ, తన ఆధునిక భావజాలాన్ని సమకాలీన సమాజానికో, ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం చేయకుండా, అన్ని తరాల వారికి, అన్ని ప్రాంతాల వారికి ఉపయోగపడే విధంగా సాహిత్యాన్ని సృజియించిన మహోన్నతులు గురజాడ. పురుషాధిక్య సమాజంలో జీవిస్తూ కూడా “మగడు వేల్పన పాతమాటది, ప్రాణమిత్రుడ నీకు” అంటూ స్త్రీ, పురుష సమానత్వాన్ని కాంక్షించడమే కాకుండా అందుకు అర్ధనారీశ్వరుడిని సాక్షిగా నిలబెట్టాడు. కావ్యసృష్టి కోసం లేని సమస్యలను ఊహించుకొని చెప్పడం కాకుండా, తనచుట్టూ జరుగుతున్న ప్రత్యక్ష సహజ సంఘటలనే ఆధారంగా చేసుకొని, తన రచనలలో వాస్తవికతకు జీవం పోసిన మహనీయుడు గురజాడ అప్పారావు. “గురజాడ చనిపోయాకే జీవించడం మొదలు పెట్టాడు” అన్న కృష్ణశాస్త్రి పలుకులు దశాబ్దాలు, శతాబ్ధాలు గడిచినా కూడా అక్షర సత్యాలై నేటికీ సజీవంగా నిలిచి ఉన్నాయి.

**ఆధార గ్రంధాలు :**

1. గోపాలకృష్ణ పెన్నేపల్లి, 2012, గురజాడలు (మహాకవి గురజాడ అప్పారావు సర్వలభ్య రచనల సంకలనం). హైదరాబాదు : ఎమెస్కో బుక్స్.

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# కర్నూలు జిల్లా - శైవసంబంధిత జాతరలో ప్రతిబింబించే గ్రామీణ సంస్కృతి

- యం. నాగమ్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

## జానపదనిర్వచనం :

ఫోక్‌లోర్ అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా తెలుగులో " జానపదం" అనే పదం బాగా వాడుకలో ఉంది. అందుకే వారి జీవన విధానాలు, ఆచార్య వ్యవహారాలూ అంతా జానపదమే. సుదీర్ఘమైన మానవ జీవిత చరిత్రలో నేడు మానవ ప్రగతి దినదినాభివృద్ధిచెంది నాగరికతలో అత్యున్నత స్థానానికి చేరింది. మహావృక్షంలా అవతరించిన క్రమంలో అట్టి మహోత్తర నాగరికత మూలాన్ని " జానపదపు" పునాదుల్లో మొలకెత్తినవే అన్నది చరిత్ర ఎరిగిన సత్యం. కారణం నేటి ప్రపంచపు అభివృద్ధి జాడలన్నీ మానవుడు జానపదుడిగా ఉన్నప్పుడు సృశించినవే.

జానపద, జనపదం, జానపదుడు, జనపదుడు అనేవి తెలుగు సాహిత్యంలో జానపద వాఙ్మయాన్ని గూర్చి చేప్పేటప్పుడు ప్రయోగించేవే "జనానమ్ జానపదమ్" అని జానపద శబ్దానికి నిర్వచనం చెప్పబడింది. జనపదమన్నా ఒకటే అర్థమని విశ్వనిఘంటువులొని "భవేజ్జన పదోపిజన పదేశమో' అన్న వాక్యం ద్వారా తెలుస్తుందని డా. ఒగేటి అచ్చుత రామశాస్త్రి గారి అభిప్రాయం.

జనపద, జానపద శబ్దాలకు దేశం, గ్రామం, పల్లె, అని నిఘంటువులు వివిధ అర్థాల్ని సూచిస్తున్నాయి. జనపదుడు, జానపదుడు అనే శాబ్దాలకు మనుష్యుడు, గ్రామావాసి పల్లె యందుండు వాడు అనే అర్థాలు నిఘంటువుల్లో కన్పిస్తాయి. తెలుగులోనే కాక సంస్కృతంలోనూ కవులు, పండితులు జనపద, జానపద శబ్దాల్ని గ్రామం, విషయం, దేశంలాంటి అర్థాల్లో వాడినట్లు తెలుస్తుంది.

జానపద విజ్ఞానం మానవుని సంస్కృతిలో ఒక భాగమంటారు. డా. ఆర్.వి.యస్ సుందరంగారు "జానపదుల జీవనానికి సంబంధించిన గేయాలు, కథలు, సామెతలు, భాష, నమ్మకాలు, దుస్తులు, ఆటలు, పాటలు, వంట, వైద్యం, కళలు, ఆచారాలు, అలావాట్లు మొదలగునవి జానపద విజ్ఞానంలో భాగాలే.

డా.నాయని కృష్ణకుమారి జానపద విజ్ఞాన విభాగాల్ని గూర్చి వ్రాస్తూ " మనుష్యుని కౌటింబిక జీవనం, నిత్యాచార పద్ధతులూ, వావి వరసలు, విధి నిషేదాలు, జనన మరణాలు, సాంఘిక శాస్త్రానికి సంబంధించినవి. మనుష్యుని మేధోవికాసం, పరిణామ క్రమం, నృశాస్త్ర విజ్ఞానానివి, ఆదికాలం నుంచి వచ్చే ప్రభుత్వ విధాన పద్ధతులు, నాయకుడు వానికి సంబంధించిన గుంపుల మీద అధికృత, రాజుకి మనిషికి మధ్య నిర్ణయించబడిన సంబంధాల సామాన్య సూత్రాలు, సుఖలబ్దినిచ్చే మానవుని జీవననైతిక పద్ధతులు అన్ని రాజనీతులకు సంబంధించినవి. ప్రతి వ్యక్తి జీవితంలో విడదీయరాని విధంగా పెనవేసుకుపోయిన మత సిద్ధాంతాలు, వ్రతాలు, పూజలు, ఆచార కాండలు, శకునాలు, మంత్ర తంత్రాలు, దయ్యాలు, అజేయ శక్తులను గురించిన ఊహల పారమ్యం ఇవన్నీ జానపద విజ్ఞానంలో భాగాలే అంటారు.

ఆచార్య జి నాగయ్య గారి "తెలుగు సాహిత్యా సమీక్ష" లో జానపదులకు సంబంధించిన వాఙ్మయమే కాక జానపద కళలకు , భాష, నృత్యము, సంగీతము, నాటకము, వైద్య విధానము జానపదుల ఆచార వ్యవహారాలు వేషభాషణము మొదలగునవి అన్ని చేరును అని అన్నారు.

## జాతర :

జానపదుల సందడే జాతర. గ్రామదేవత ఉత్సవం జాతర రాయలసీమ ప్రాంతంలో జాతరలకు " తిరు

నాళ్ళ''ని పేరు. ఒక నిర్ణీత దినం దేవునికి చేసే ఉత్సవాన్ని'' తిరునాళ్ళ''ని అందురు. కొన్ని చోట్ల ''కొలవులని'' కూడ పిలుస్తారు.

ఆంగ్ల భాషలో 'జాతర' కు సమానార్థక పదం ఖీఉఅతీ ఇది లాటిన్ భాషలోని '' ఖీఉతీఱఖ'' అనే పదం నుంచి వచ్చిందంటారు. ఖీవతీఱఖ అంటే పండుగ భోజనదినం లేదా సెలవురోజు అలాగే జాతరను సూచించే జర్మన్ భాషాపదం వీవంంవ దైవ ప్రార్థనా సమావేశాన్ని ఇది సూచిస్తుంది.

ఈశ్వరజ్ఞలేనిదే చీమయినా కుట్టదనే బలమైన నమ్మకం జానపదులది. అందుకే వారు దేవున్ని స్తుతిస్తారు. మెట్ట వేదాంతం అయినా సరే మాట్లాడతారు. పరమార్థ ప్రాప్తికి భక్తి కర్మ జ్ఞాన మార్గాలున్నాయని జానపదులు పుస్తకాల ద్వారా నేర్చుకొలేద. మానవాతీత శక్తులను మంచి చేసుకోవడానికి స్తుతించడం, కర్మకాండలను జరపడం తత్త్వచింతన చేయడం ప్రాచీన కాలం నుండి నేటి వరకు వున్నాయి. పరమాత్ముని సాధించుటకు భక్తి జ్ఞానకర్మ మార్గాలు ముఖ్యమైనవి. కాని జానపదులకు ఈ మూడు కావాలి.

పుణ్యక్షేత్రాలకి యాత్ర చేయ్యడం వలన క్రమంగా జాతరగా వ్యాప్తిలోకి వచ్చి ఉంటుంది. ''యానేన త్రాయత ఇతియాత్ర'' పుణ్యక్షేత్రానికి వెళ్ళడం మూలంగా రక్షిస్తుంది లేదా పుణ్యక్షేత్రానికి వెళ్ళి వాళ్ళ రక్షయేయాత్ర యాత్ర శబ్దం తద్భవ రూపం జాత్ర జాత్ర క్రమంగా జాతరగా మారింది. ఉళ్ళో ప్రతి ఒక్కరని ఒక్కచోట చేర్చే ప్రయత్నం ఈ సందర్భంగా జరుగుతుంది. ఉత్సవాలు, జాతరలు తేదీల ప్రకారమైనా రావచ్చు. లేదా ఏదైనా మంచిరోజును నిర్ణంచి జాతర జరుపవచ్చు. లేదా ఏ దేవతో, దేవుడో కలలో కన్పించి ఉత్సవంగాని, జాతరగాని జరుపమంటే జరుపవచ్చు.

కర్నూలు జిల్లాలో జాతర్లను ఎక్కువగా వేసవికాలంలో చేస్తారు. వివిధ గ్రామాలలో వారి నిర్దిష్ట సమయంలో జాతరలు జరుగుతాయి. జాతర రోజు బంధుమిత్రులతో కలిసి, పూజలో పాల్గొంటూ, వినోద కార్యక్రమాలను తిలకిస్తూ, ఊరి జానాభాను ఒక చోట చేర్చే ఉత్సవమునే ''జాతర'' అనవచ్చు. ఈ జాతర సమయంలో ఊరిలోని ప్రజలు వారి వారి అవసరాలకు అనుగుణంగా విని యోగించుకుంటారు. జానపదులకు కావాల్సిన వస్తు సామాగ్రిని, పాడి పశువులను, వస్తు సామాగ్రిని, గాజులను, తిను పదార్థాలు ఈ జాతర సమయంలో కొంటారు. జనవరి నెల నుంచి మే వరకు జానపద వ్యవసాయ రైతులకు పనులు, వ్యవసాయోత్పత్తుల అమ్మకాలు తక్కువగా వుండటం వలన, అంటువ్యాధులనుంచి తమను కాపాడు కొవడానికి, జూన్‌మాసంలో పంటలు సమృద్ధిగా పండాలని, పశుసంపదను రక్షించమని కొరుతూ గ్రామదేవతలకు, దేవుళ్ళకు మొక్కులుఈ జాతరలలో చెల్లించుకొంటారు.

## శైవ సంబంధిత జాతరలు :

1. శ్రీ కాళికామాత శ్రీ వీరభద్రస్వామి వారి కళ్యాణ రథోత్సవాలు కర్నూలు జిల్లా కైరుప్పల్ మండలంలో జరిగే కళ్యాణరథోత్సవాలు ఫాల్గుణమాసం (మార్చి) లో జరుగుతాయి. ఈ ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు జరుగుతాయి. ఈ తొమ్మిది రోజులు ధ్వజారోహణము, పూజాకార్యక్రమాలు, ఉగాది పండుగ ప్రత్యేక పూజలు, పెద్దనుగ్గులాట, కళ్యాణోత్సవం, సాధారణ పూజలు, రథోత్సవము, వసంతోత్సవము చేస్తారు. ఈ ఉత్సవాలు ప్రతి సంవత్సరం జరుగుతాయి. శ్రీ కాళికామాత శ్రీ వీరభద్రస్వామి వారి కళ్యాణరథోత్సవాలు కైరుప్పలలో తప్ప మరి ఏ ఇతర ప్రాంతాలలో జరగవు. పూర్వంలో దేవరాయపురంగా పిలిచేవారు అక్కడ వీరభద్రస్వామి నివసించేవాడు అతనికి రెండు ఎద్దులు ఉండేవి. వాటిలో ఒక ఎద్దు పేరు కర్రే, మరొక ఎద్దు పేరు పులి ఇలా ఈ రెండు పదాలను కలిపితే కర్రెపుల అంటూ నేడు కాలక్రమంగా కైరుప్పలుగా పిలుస్తున్నారు.

ద్వాపరయుగంలో ఈ ఆలయంలో త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వీరు మహాఘోర తపస్సు చేయడం వలన స్వయంగా శ్రీ వీరభద్రుడు, శ్రీ కాళికా మాత మూర్తులవతరంలో వెలిసిన్నారని స్థానికుల చెప్పారు.

## స్వాముల వారి ప్రేమ వివాహం :

స్వామి శ్రీ వీరభద్రుడు జంగమకులానికి చెందిన వాడు. కాళికామాత మాదిగ కులానికి చెందినది. వీరు ఇద్దరు ప్రేమ వివాహం చేసుకుంటారు. వివాహం చేసు కొని గ్రామంలోనికి వస్తుండగా అమ్మవారి తరపున ఉన్న వర్గీయులు, స్వామివారి తరపున ఉన్న వర్గీయులను రాళ్ళతో కొట్టడం జరిగింది. అప్పటి నుంచి ప్రతి సంవ త్సరం జాతర సమయంలో రాళ్ళతో కొట్టుకునే ఆచారం నేటికి ఉంది. కాని ఈ ఆచారాన్ని ప్రభుత్వం ఇరవై సంవత్సరాల నుంచి అమలు చేయనివ్వలేదు. రాళ్ళతో కొట్టుకుంటే మనుష్యులు చనిపోతారు కాబట్టి రాళ్ళకు బదులు పిడకలతో కొట్టుకోవడం జరుగుతుంది.

## ఉత్సవ కార్యక్రమాలు :

"మాఘమాసం (మార్చి) నెలలో మొదటి రోజు ధ్వజా రోహణ జరుగుతుంది. రెండవ రోజు పూజా కార్యక్రమాలు జరుగుతుంది. మూడవ రోజు ఉగాది పండుగ ప్రత్యేక పూజలు జరుగుతాయి. నాలుగవ రోజు పెద్దనుగ్గులాట జరుగుతుంది. ఐదవ రోజు తెల్లవారు జామున 4.05 ని॥లకు స్వామి వారి కళ్యాణోత్సవం. ఆరవ రోజు సాధా రణ పూజలు జరుగుతాయి.ఏడవ రోజు సాయంత్రం 5 గం॥ రథోత్సవము.ఎనిమిదవ రోజు సాధారణ పూజలు జరుగుతాయి. తొమ్మిదవ రోజు వసంతోత్సవం జరుగు తుంది."

మొదటి రోజు ధ్వజారోహణం నాటి ఉదయం భక్తులందరు చేరి పెళ్ళి పందిరి వేసి ఆ పందిరిలోనే నవధాన్యాలను మట్టి కుండలో వేస్తారు. తరువాత వీరభద్రుని పెండ్లికొడుకుని చేస్తారు. స్వాములవారి ఫోటోలను ఒక బ్యానరులో వేయించి ఆబ్యానరును ధ్వజస్థంభానికి తగిలిస్తారు. ప్రతి రోజూ రాత్రి సమ యంలో అన్నంలో పసుపు, కుంకుమలు కలిపి రథం పైభాగంలో ఉన్న సింహాల నోట్లో పెట్టుతారు. ఈ రాత్రి నుంచి జాతర చివరి రోజు వరకు కొనసాగుతుంది. రాత్రి సమయంలో భక్తులు స్వామివారిని పల్లకిలో కూర్చోబెట్టి పది అడుగులు దూరం తీసుకెళ్ళుతారు ప్రతి రోజు ఇలా స్వామి వారిని కొంత ముందుకు తీసుకెళ్తారు. రెండవ రోజు ఉదయం పూజా కార్యక్రమాలు జరుగుతాయి. తరువాత స్వామి వారిని పల్లకిలో కూర్చోపెట్టి ఊరి చివర్లో వున్న కోనేరు దగ్గరకు తీసుకెళ్ళి విగ్రహాన్ని కడిగి పసుపు, కుంకుమలు పెట్టి అక్కడి నుండి గుడిలోకి తీసుకొని వచ్చి స్వామికి పూజలు చేస్తారు. ఇలా చేసే పూజని అర్చకులు మొదటి పూజ అంటారు.మూడవ రోజు ఉగాది పండుగనాడు ప్రత్యేక పూజలు చేస్తారు. ఉదయం నుండి స్వామికి పూజలు చేసిన తరువాత ఉప్పాల దొడ్డిలోని గిడ్డయ్య స్వామి దేవాలయం దగ్గర పిడకలాట సమయానికి ముందు భక్తులు నుగ్గులు అంటించి బయటకు వచ్చి వీరభద్ర స్వామి వర్గీయులకు, కాళికాంబ వర్గీయులకు చిన్న నుగ్గులాట జరుగుతుంది. ఈ చిన్న పిడకలాట అయిన తరువాత గుడి తలుపులు తెరిచి చూస్తే విభూదిగా తయారు అవుతుంది. నుగ్గులాటలో గాయపడిన వారు ఈ విభూదిని గాయాలకు పూసు కుంటారు. దానితో మూడవ రోజు ముగిసిపోతుంది. నాలుగవ రోజు మధ్యాహ్నకాల సమయంలో మూడు టపాసులను కాలుస్తారు. అనంతరం గుడిలోనికి భక్తులు ప్రవేశించి గుడిలో పూజలు చేసి పిడకలను రాసులుగా గుడి ముందు పోస్తారు, అ సమయంలోనే స్వామి వారిని ఊరేగింపుగా పల్లకిలో బ్యాండ్‌మేళాలతో చెన్నెంపల్లె పంట పొలాల్లో దావుతి వేసి టెంకాయకొట్టి ముందుకు వెళ్ళి కార్తీకేయ స్వామికి మంగళహారతి ఇచ్చి కార్తీకేయుడుని, వీరభ్రదుని పల్లకిలో వుంచి హంద్రినదిలోకి తీసుకెళ్ళి స్వామి వార్ల విగ్రహాలకు స్నానాలు చేయించి అదే పంట పోలాల నుంచి స్వాములవారు వస్తుండగా, సాయంత్రం ఐదు గంటలకు ఆచారం ప్రకారంగా పిడకల సమరానికి ముందు కారుమంచి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డిగారి (వంశస్థుడు) నాలుగవతరం వాడైన నరసింహారెడ్డికి రాజు దుస్తులు ధరించి గుర్రం పై కైరుప్పల గ్రామానికి చేరు కుంటారు. అతను ఆలయంలోకి వచ్చి స్వాముల వారికి పూజలు చేసిన అనంతరం ఆయన కారుమంచి గ్రామానికి బయలుదేరగానే స్వామి, అమ్మవారి వర్గీయులు

విడిపోయి పిడకల సమరం మొదలవుతుంది. ఒక్కరిపై ఒక్కరు అధిక ఉత్సహంతో ఇరు వర్గీయులు కొట్టు కుంటారు. మా వర్గం గెలవాలని, మా వర్గం గెలవాలని పిడకల సమరం జరుగుతుంది. ఈ సమరంలో స్త్రీలు, పురుషులకు పిడకలను అందిస్తూ వుంటారు. రాసులుగా పోసిన పిడకలు అయిపోయేంత వరకు సాగిస్తుంటారు. ఈ నుగ్గులాట భక్తులకు స్వల్పగాయాలు అయితే వీరంతా స్వామివారి బండారు రాసుకొంటారు. తరువాత స్వాముల వారిని బ్యాండ్‌మేళాలతో గుడిలోనికి వెళ్ళుతారు. తెల్లవారుజామున నిర్వహించే స్వామి అమ్మ వార్ల కళ్యాణోత్సవం ఏర్పాట్లలో భక్తులు నిమగ్నమై పోతారు. ఐదవ రోజు ముందుగా ముహుర్తాలు నిర్ణయిం చిన ప్రకారంగానే తెల్లవారు జామున కళ్యాణోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవాన్ని చూడటానికి పది వేలకు పైగా భక్తులు తరలి వస్తారు. కళ్యాణోత్సవం అయిన తరువాత పార్వతి, పరమేశ్వరుడు, వీరభద్రుడు, కాళి కాంబల విగ్రహాలను రథంపైన కూర్చోబెట్టి ఊరి చివరి లోని శివుని గుడి దగ్గరకు తీసుకొని వెళ్తారు. అక్కడ దీపా రాధన చేసి అక్కడి నుంచి దేవాలయంలోనికి తీసుకొస్తారు. ఆరవ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు సాధారణ పూజలు చేసుకుంటారు. ప్రతిరోజు లాగా సింహాల నోట్లో అన్నంలో పసుపు, కుంకుమలు కలిపి పెడతారు. స్వామి వారిని పది అడుగులు ముందుకు తీసుకు వస్తారు. ఏడవ రోజు స్వామికి యథా విధిగా పూజలు చేస్తారు. హెూమాలు జరుగుతాయి. ఆపై సాయంత్రం స్వామి వారిని పల్లకిలో కూర్చోబెట్టి మెరివణి చేస్తారు. ఆ విధంగా చేస్తూ ఊరి చివరిలో అంజనేయుని గుడి దగ్గరకు వెళ్ళి అక్కడి నుండి ఆలయానికి వచ్చే సరికి రాత్రి పది గంటలు అవుతుంది. వెంటనే నందికోల సేవ పొడవైన కర్రకు మధ్యలో వెండితో తయారుచేసిన పడగ విప్పిననాగుపాము విగ్రహంను తీసుకొచ్చి కర్రకు కట్టిన తరువాత భక్తులలో ఒక్కరువచ్చి ఆకర్రను తీసుకొని రెండు చేతులతో పట్టుకొని నిలబడిన వెంటనే బ్యాండ్‌మేళాలు మ్రోగడంతో నందికొల నృత్యం చేస్తాడు. అది అయిన వెంటనే రాత్రి పన్నెండు గంటల సమయంలో స్వామివారిని గర్భగుడిలోనికి తీసుకవెళ్ళుతారు. ఎని మిదవ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు సాధారణ పూజలు చేసుకుంటారు. ప్రతిరోజు లాగా సింహాల నోట్లో అన్నంలో పసుపు, కుంకుమలు కలిపి పెడతారు. స్వామి వారినిపది అడుగులు ముందుకు తీసుకు వస్తారు. తొమ్మిదవ రోజు స్వామి వారిని అలం కరించి ఆశ్వ వాహనంపై దేవాలయం నుండి ఊరేగింపు జరుగుతుంది. స్వాములవారి ఇరువురి విగ్రహాలను వేరు చేసి వీరభద్రుడుని కొద్దిగా దూరంగా తీసుకువెళ్ళుతారు. రాత్రి సమయంలో కాళికాంబ వర్గీయులు దీపస్తంభంతో, పూనకంతో వచ్చి స్వామి మెడలో ఉన్న హారాన్ని తీసుకొని వెళ్తారు. స్థానికులు దీనిని సొమ్మును దోచుకోవడం అంటారు. ఆ కార్యక్రమం అయిన తరువాత స్వాముల వారిని రథంపై ఊరేగిస్తారు. ఊరేగించే సమయంలోనే భక్తులు రంగులు చల్లుకొంటారు. వసంతోత్సవం జరుగుతుంది. మొదటి రోజు వేసిన నవధాన్యాలు తొమ్మిదొ రోజుకు మొలకలాగా వస్తాయి. వాటిని ఊరి చివరిలో బావి దగ్గరకు తీసుకువచ్చి ఎవరికి ఏ మొక్క ఇష్టమైతే దానిని వారు తీసుకొని వెళ్తారు. ఏ మొక్క అయితే తీసుకు వెళ్తారో వారి పొలంలో కూడా అవే పంటలు పండించుకొంటారు. అలా స్వామి దగ్గర ఉన్న మొక్కను వారి పొలంలో వేస్తే సమృద్ధిగా పంట వస్తుందని వారి నమ్మకం. దీని పూజారులు అక్కడే పూర్ణాహుతి పూజలు జరిపిస్తారు.అక్కడితో ఉత్సవాలు సమాప్తం అవుతాయి.

## శివపార్వతుల కల్యాణోత్సవాలు :

ప్రాతకోటలో జరగుతాయి. పూర్వం నుంచి నేటి వరకు అదే ఆనవాయితిగా సంక్రాంతి పండుగ రోజు శివపార్వతుల కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా చేస్తారు. సంక్రాంతి పండుగ అంటే కొత్త ధాన్యం ఇంటికి రావడం, కొత్త అల్లుళ్ళు ఇంటికి రావడంతో ఈ శివ పార్వతుల కల్యాణోత్సవాలు ఉత్సవాలు ఘనంగా చేస్తారు. పూర్వం రథోత్సవ సమయంలో ప్రాతకోట ప్రజల

మధ్య గొడవలు జరగడంతో గ్రామ పెద్దలైన నాగేశ్వర స్వామి, కాశేశ్వరస్వామి కోర్టు వరకు గుడి విషయాన్ని తీసుకెళ్ళారు. గ్రామం మధ్యలో కేసికెనాల్ వుండటంతో ప్రాతకోట గ్రామాన్ని తూర్పు ప్రాతకోట, పడమర ప్రాతకోటగా రెండు భాగాలుగా కోర్టు వేరు చేసింది. అప్పటి నుంచి తూర్పు పడమర గ్రామ ప్రజలు వారి వారి ప్రాంతాలలో రథోత్సవాలు జరుపుకొంటున్నారు. పూర్వంలో పంటపాలం నుండి శివలింగాన్ని తెచ్చి తూర్పు గ్రామంలో ప్రతిష్ఠించారు. శివలింగం మాత్రమే ఉందనే ఆలోచనలతో గ్రామప్రజలు శ్రీశైలం డ్యాం క్రింది ప్రాంతాలలో ఉన్న రాళ్ళను, సంగమేశ్వరం నుండి కొన్ని రాళ్ళను తెచ్చి దేవాలయాన్ని నిర్మించారని స్థానికుల కథనం. పడమర గ్రామం ప్రజలు శివ పార్వతుల విగ్రహాలను ప్రతిష్ఠించి గుడిని నిర్మించారు. ఈ గుడి నిర్మించి అరవై సంవత్సరాలు అవుతుందని గ్రామస్థులు చెప్పారు.

**ఉత్సవ కార్యక్రమాలు :**

నాలుగు రోజలు ఉత్సవాలు జరుగుతాయి. గత ఏడాది మొదటి రోజు పండిశావ వాహనం పై స్వాముల వారి ఊరేగింపు , రెండవ రోజు కల్యాణోత్సవం, మూడవ రోజుతూర్పు, పడమరల రథోత్సవాలు. నాలుగవ రోజు పార్వేట ఉత్సవాలు చేస్తారు.

సాధారణంగా మొదటిరోజు ఉదయం శివపార్వతులకు పూజలు నిర్వహించి పార్వతీదేవికి నవధాన్యాలతో ఒడినింపుతారు. భక్తులు సాధరణ పూజలు చేసుకొని వారి ఇండ్లకు వెళ్ళి నవధాన్యాలలో భాగమైన జొన్న రొట్టెలు చేసుకుంటారు. సాయంత్రం నాలుగు గంటలకు పండిశావ వాహనం పై శివుడిని పెళ్ళికొడికిని చేశామనే ఉద్దేశ్యంతో శివపార్వతులను ఊరేగిస్తారు. రెండవ రోజు రాత్రి సమయంలో కల్యాణోత్సవం జరుగుతుంది. శివ పార్వతుల కల్యాణం అయిన వెంటనే స్వాములవారిని పల్లకిలో ప్రభోత్సవం చేస్తారు. మూడవ రోజు తూర్పు, పడమర రథోత్సవాలు జరుగుతాయి. ముందుగా తూర్పు రథోత్సవం ఊరేగింపు నిర్వహించిన తర్వాతనే పడమర రథోత్సవం ఊరేగింపు జరుగుతుంది. తూర్పురథాన్ని (జిల్‌తేర్) కర్రతో పదహారు అడుగుల ఎత్తులో రథాన్ని తయారు చేయించారు. ఈరథాన్ని పెద్ద తేర్ అంటారు. రథాన్ని అంతటా బంతిపూలతో, మల్లెపూలతో, రంగురంగు విద్యుత్తుదీపాలతో అలంకరణ చేసిన తరువాత దిష్టితీసి శివపార్వతులను రథంపైన కూర్చోపెట్టి సాయంత్రం ఏడున్నర గంటలకు రథోత్సవం కార్యక్రమం జరుగుతుంది. పడమర రథాన్ని (టేకు) చెక్కతో తయారు చేశారు. ఇది పది అంగుళాల ఎత్తులో ఉంటుంది. ఈ రథానికి తెడ్లను చెక్కడం ద్వారా రథం లాగేటప్పుడు అటు ఇటు కదలకుండా సరియైన క్రమంలో రావడానికి తెడ్లు ఉపయోగిస్తారు. ఈ రథాన్ని చిన్న తేర్ అంటారు. పూర్వం రథంపైన సిరిసంపదలతో సుఖంగా వున్న భోగం స్త్రీని రథంపై కూర్చోపెట్టి ఊరేగించే ఆచారం ఉండేది. ఊరేగింపు తరువాత భోగంనృత్యం చేసి ఆమె చెప్పే ప్రతి మాట వెనుక శుభములు జరిగేవని స్థానికుల విశ్వాసం. ఇప్పుడు ఆ ఆచారం తొలగిపోయి శివపార్వతులను ఊరేగిస్తారు. ఆ రోజు గ్రామ ప్రజలు వారి ఇండ్లలో పిండిపదార్థాలు చేసుకుంటారు. ఆటల పోటీలు : (సంక్రాంతి) రోజు రథోత్సవంలో ప్రక్క పల్లెలు ఈ గ్రామానికి చేరడంతో గ్రామ పెద్దలు మధ్యాహ్నం బాల బాలికలకు కబడ్డీ పోటీలు ,పెద్దలకు ఎద్దుల బండ్ల పోటీలు ఏర్పాటు చేస్తారు. నాల్గొవ రోజు పారువేట చేసిన తరువాత శివుడు వేటకు నంది వాహనంపై వెళ్ళుతాడు. వేటాడే సమయంలో శివుడి శరీరంపై దుమ్ము, ధూళీ అంటుకోవడంతో గంగాదేవి వద్దకు వెళ్ళావు అని పార్వతి దేవి శివుని గుడిలోనికి రానివ్వకుండ తలుపులు వేసుకుంటుంది. గుడి తలుపులులాగా ఒక తెరను గుడిలో కడుతారు. ఉదయాన్నే శివుడు పార్వతి ఇరువురు రాజీ పడటంతో గ్రామపెద్దలు స్వాములవారిని గుడిలోపలికి తీసుకువెళ్లారు. తరువాత శివపార్వతులు ఈ ప్రాతకోట ప్రజలను కాపాడుదాం అని గ్రామంలోకి వెళ్ళుతారు. దీనినే గ్రామోత్సవం అంటారు. ఐదవ రోజు తీర్థావళీ శివ పార్వతులను గుడి ముందు ఉన్న కోనేరులో గంగ స్నానాలు చేసి గుడిలోనికి చేర్చుతారు. ఆ రోజు గ్రామస్థులు కూరగాయలు, సజ్జ, జొన్న రొట్టెలను ఆహారంగా చేసుకుంటారు.

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తెలుగు నేలపై పరిఢవిల్లిన బౌద్ధ సంస్కృతి

**- మామిడి మౌనిక,** పరిశోధక విద్యార్థిని, తెలుగుశాఖ, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

## పరిచయం :

మన భారతదేశం భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధిస్తూ విభిన్న జాతులకు, మతాలకు, సంస్కృతులకు నిలయంగా ఉంది. అనేక జాతులు, మతాలు కలిసి ఐక్యమత్యంగా ఏర్పడిన మన భారతదేశం అనేక సంస్కృతులకు ఆదర్శంగా నిలుస్తుంది. భారతదేశం కొన్ని పురాతన నాగరికతలకు, సాంప్రదాయాలకు పుట్టినిల్లుగా భావించచ్చును. ప్రపంచంలో నాలుగు ముఖ్య మతములైన హిందూ, బౌద్ధ, జైన, సిక్కు మొదలుగు వాటికి జన్మనిచ్చిన ప్రదేశం మన భారతదేశం. అందుకే మన దేశం భిన్నత్వంలో ఏకత్వం సాధిస్తూ లౌకిక దేశంగా స్థిరపడి ప్రపంచ దేశాలలో ఉత్తమంగా నిలిచింది.

ఇంతటి ప్రాధాన్యతను పొందిన మన దేశంలో బౌద్ధం భారతదేశంలోనే కాకుండా ఆంధ్రదేశంలోనూ క్రీస్తు పూర్వం 6వ శతాబ్దంలోనే స్థిరపడింది. బౌద్ధం విస్తరించిన విధానం, ప్రాధాన్యతను వివరించే ఎన్నో ఆధారాలు మన ఆంధ్ర ప్రాంతాలలో లభిస్తున్నాయి. ఈ విధంగా లభించిన వాటిల్లో శాసనాలు, స్థూపాలు, చారిత్రక కట్టడాలు, చైత్యాలు, ఆరామాలు, సాహిత్యం ప్రధానమైనవిగా చెప్పవచ్చును. ఈ విధంగా తెలుగు నేలపై పరిఢవిల్లిన బౌద్ధ వైభవాన్ని తెలియచేయడమే ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

## ముఖ్యాంశాలు :

ప్రపంచ ప్రసిద్ధి చెందిన ముఖ్య మతాలలో బౌద్ధం ఒకటి. మతం అనడం కంటే ఒక జీవనవిధానం అనడం సమంజసంగా ఉంటుంది. బౌద్ధం ప్రాశస్త్యం తెలుసుకొనుటకు సాధారణముగా ఆనాటి విద్యావిధానం, బౌద్ధ సూత్రాలు, బౌద్ధ క్షేత్రాలు, సాహిత్యం, శాసనాలు, బౌద్ధ సంస్కృతి బౌద్ధ అధ్యాయనంతో పాటు వీటన్నింటిని గమనించవలసి ఉంటుంది. వీటి ద్వారా నాటి బౌద్ధ వైభవం నేటికీ మనకు ప్రత్యక్షంగా కనిపిస్తుంటుంది.

## విద్యావిధానం :

అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి విజ్ఞానమనే వెలుగును ప్రసరించేది విద్య. బౌద్ధ విద్యా విధానానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చింది. విద్యావ్యాప్తికి అనేక విశ్వవిద్యాలయాలను విస్తృతంగా ఏర్పాటు చేసింది. బౌద్ధంలో విద్యా అనేది కుల, మత, వర్గ, ప్రాంతీయ, లింగ బేధాలు లేకుండా ప్రతీ ఒక్కరికి సమానంగా అందించబడేది. ఆ విశ్వవిద్యాలయాల మేలైన విద్యా విధానం ద్వారా అవి ప్రపంచ కీర్తిని పొంది ప్రసిద్ధి చెందాయి.

## నలందా విశ్వవిద్యాలయం :

బౌద్ధ విశ్వవిద్యాలయాలలో ప్రాచీనమైనది మరియు ప్రసిద్ధి చెందినది నలందా విశ్వవిద్యాలయం. ప్రస్తుతం భారతదేశంలోని బీహార్ రాష్ట్రంలో గల పురాతన విశ్వవిద్యాలయం. చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ నలంద విశ్వవిద్యాలయ వివరాలను సేకరించాడు. మహాపండితుడు భారత రసాయన శాస్త్ర పితామహుడు అయిన ఆచార్య నాగర్జునుడు నలంద విశ్వవిద్యాంలోనే విద్యను అభ్యసించారు. వేలాది మంది విద్యార్థులకు భోజన మరియు వసతి సదుపాయాలు కల్పించబడ్డాయి. ఇక్కడి గ్రంథాలయం, తరగతి గదులు, ధాన్య మందిరం అనేకమైనవి నిర్మించబడి విద్యను అభివృద్ధిపరిచేవిగా ఉన్నాయి. అనేక మంది విద్యార్థులు, బోధకులు, బోధనేతర సిబ్బంది ఉండి నిత్యం బోధనలు, చర్చలు, రచనలు, జరుగుతూ బౌద్ధ విజ్ఞాన కేంద్రంగా పేరు పొందినది.

## తక్షశిల విశ్వవిద్యాలయం :

ప్రాచీన భారతదేశంలో అతి పెద్ద ప్రధాన విశ్వవిద్యాలయాలలో నలంద తరువాత చెప్పుకోదగినది తక్షశిల విశ్వవిద్యాలయం. ప్రస్తుతం పాకిస్తాన్‌లోని ఇస్లామా

బాద్‌కు 35 కి॥మీ॥ దూరంలో తక్షశిల విశ్వవిద్యాలయం ఉంది. పాణిని, కౌటిల్యుడు, చరకుడు వంటి ఎందరో మహాపండితులు ఈ విశ్వవిద్యాలయం నుండి రావడం విశేషం. దీనిలో విద్యను అభ్యసించి గొప్ప చక్రవర్తులుగా పేరుపొందిన వారు ఉన్నారు. ఇలాంటి వారిలో సామ్రాట్ అశోకచక్రవర్తి చెప్పదగినవారు. బౌద్ధ వాఙ్మయంపై బోధనలు జరిపి అత్యున్నత విశ్వవిద్యాలయంగా ప్రసిద్ధి చెంది నేటికి అతి పూరాతన విశ్వవిద్యాలయంగా నిలిచింది.

**బౌద్ధం - బోధనలు :**

బౌద్ధం సర్వమానవ సౌఖ్యాన్ని కాంక్షించింది. ఆ దిశలోనే బోధనలు కూడా ప్రతీ మానవుని జీవన విధానానికి ఉపయోగపడే విధంగా బౌద్ధం తెలిపింది. బౌద్ధం తెలిపిన ప్రతీ విషయం మానవుని ఒక క్రమమైన జీవన విధానానికి, ఆనందమయ జీవితం కొనసాగించడానికి ఉపయోగపడుతుంది. మానవుడు సమాజంలో ఉండవలసిన తీరును బౌద్ధం తెలియజేసింది. బౌద్ధం మొదటి నుండి సంఘానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సమాజాభివృద్ధికి ఉపయోగపడే అనేక బోధనలు చేసినది.

**త్రిరత్నాలు :**

ఈ 3 సూత్రాలు రత్న త్రయ సందేశం, త్రిరత్న సందేశంగా పేరు పొందాయి.

1. బుద్ధం శరణం గచ్ఛామి - బుద్ధిని శరణు వేడుకోవడం
2. ధర్మం శరణం గచ్ఛామి - ధర్మాన్ని శరణు వేడుకోవడం
3. సంఘం శరణం గచ్ఛామి - సంఘాన్ని శరణు వేడుకోవడం

ఈ మూడు సూత్రాల పైనే బౌద్ధం యొక్క ఆచరణ తీరు ఆధారపడింది.

**ఆర్య సత్యాలు :**

వీటికే చతురార్య సత్యాలని పేరు ఉంది.

1. దుఃఖం, 2. దుఃఖ కారణం, 3. దుఃఖ నిరోధం, 4. దుఃఖ నిరోధ మార్గం. ఇవి మానవజీవితంలో ప్రధానంగా గుర్తించుకోవలసినవి, ఆచరించవలసినవి.

**బ్రహ్మ విహారాలు :**

మానవ ప్రవర్తన తీరు ఏవిధంగా వుండాలో ఈ నాలుగు సూత్రాలు వివరించినవి

1. మైత్రీ : అందరితో స్నేహపూర్వకంగా ఉండడం
2. కరుణ : తోటి వారి పట్ల కారుణ్యం కలిగి ఉండడం
3. ముదిత : ఇతరులకు సహాయపడి, వారికి మేలు చేయడం ద్వారా ఆనందం పొందడం
4. ఉపేక్ష : పక్షపాత దోరణి లేకుండా వ్యవహరించడం

**పంచశీల :**

సమాజ రక్షణకు మానవుడు ఆచరించవలసిన అయిదు సూత్రాలను బౌద్ధం తెలియచేసింది

1. జీవులను చంపకుండా ఉండడం
2. దొంగతనం చేయకుండా ఉండడం
3. అబద్ధాలు ఆడకుండా ఉండడం
4. కామ సుఖాన్ని పొందడంలో హద్దులు దాటకుండా ఉండడం
5. మద్యం లాంటి మత్తు పదార్థాలు సేవించకుండా ఉండడం

**అష్టాంగ మార్గాలు :**

వ్యక్తి తన జీవనానికి పాటించవలసిన 8 మార్గాలు బౌద్ధం తెలియచేసింది.

1. సమ్యక్ దృష్టి, 2. సమ్యక్ సంకల్పం, 3. సమ్మక్ వాక్కు, 4. సమ్యక్ కర్మ, 5. సమ్యక్ జీవనం, 6. సమ్యక్ యత్నం, 7. సమ్యక్ సమాధి, 8. సమ్యక్ స్మృతి.

బౌద్ధం బోధించిన సూత్రాలన్ని వాస్తవాలపై ఆధారపడి ఉన్నాయి. త్రిరత్నాలు, ఆర్య సత్యాలు, బ్రహ్మ విహారాలు, పంచశీల, అష్టాంగ మార్గం అన్నీ కూడా మానవ జీవన విధానానికి ఉపయోగపడినవే. అందువలనే బౌద్ధం అనేక మందిని ప్రభావితం చేస్తూ, నేటికీ ఆ ప్రభావం కొనసాగుతూనే ఉంది.

**బౌద్ధ క్షేత్రాలు :**

ఆంధ్రదేశంలో విశేషమైనటువంటి, అధిక స్థాయిలో బౌద్ధ క్షేత్రాలు ఉన్నాయి. బుద్ధుని బోధనలు, సూత్రాలు, ఆచరణ విధానాలు అన్ని ఆంధ్రులను అత్యంత ప్రభావితం చేసాయి. దానికి నిదర్శనమే ఎక్కడ లేనటు వంటి అధిక స్థాయిలో బౌద్ధ స్థూపాలు, చైత్యాలు, ఆరామాలు, గుహలు, శాసనాలు, ఆంధ్రదేశంలో లభించడం. భారతదేశంలో ఉన్నటువంటి స్థూపాల్లో అధికశాతం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. ప్రతీ బౌద్ధ క్షేత్రం కూడా ఆనాటి సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి. ఆంధ్రదేశంలో ప్రతీ ప్రదేశం కూడా ఏదో ఒక విధంగా బౌద్ధంతో సంబంధం కలిగి ఉన్నట్లుగా ఆధారాలున్నాయి. అటువంటి ప్రసిద్ధి చెందిన క్షేత్రాల్లో కొన్నింటిని ఈ వ్యాసంలో ప్రస్తావించడం జరిగింది.

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లా, కృష్ణా నది ఒడ్డున అమరావతి ప్రాంతం ఉంది. అమరావతి ప్రాంతం శాత వాహనుల కాలం నుండే అపూర్వమైన చరిత్ర కలదు. అమరావతిలో గల స్థూపాలు, శిల్పకళ, సాంస్కృతిక పరిస్థితులు ద్వారా బౌద్ధ అధ్యాయన ప్రధాన కేంద్రంగా పేరుపొందింది. దీనికి ధరణికోట, ధాన్య కటకమనే పురాతన నామాలున్నాయి. అత్యంత సుందరమయిన శిల్పాలతో ఆంధ్రుల శిల్పకళ వైభవాన్ని అమరావతి చాటి చెప్పేవిధంగా ఉన్నది. అమరావతిలోని చరిత్ర ప్రాధాన్యం, చైత్రాలు, స్థూప నిర్మాణాలు, పురావస్తు ప్రదర్శన శాల, శిల్ప సౌందర్యం, అద్భుత సంఘటనలు అన్ని కూడా అత్యుత్తమ బౌద్ధ క్షేత్రంగా అమరావతిని నిలుపుతున్నాయి. దేశ, విదేశీయులు సైతం సందర్శించే పర్యాటక కేంద్రంగా విలసిల్లినది ఈ అమరావతి ప్రాంతం.

**ఆదుర్రు :**

తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఆదుర్రు బౌద్ధ స్థూపం అత్యంత ప్రాచీనమైనది. సామ్రాట్ అశోక చక్రవర్తి నిర్మించిన స్థూపాలలో అత్యంత ప్రసిద్ధి మరియు పురాతమైనది. ఆదుర్రు బౌద్ధ స్థూపం. అనేక చారిత్రక సంఘటనలకు నిదర్శనం ఆదుర్రు బౌద్ధ స్థూపం. పచ్చని పంటల మధ్యలో బౌద్ధ ప్రాధాన్యం చాటుతూ పర్యాటక కేంద్రంగా సందర్శింపబడుతుంది. బౌద్ధ ప్రత్యేక దినము లలో ఇక్కడ వివిధ కార్యక్రములు నిర్వహించడం జరుగు తుంది.

**నాగార్జున కొండ :**

బౌద్ధ క్షేత్రాలనగానే అమరావతి తరువాత అంతగా పేరు పొందినది నాగార్జున కొండ. నాగార్జున కొండపై లభించిన విహారాలు, చైత్రాలు, స్థూపాలు అన్ని బౌద్ధ ప్రాధాన్యతను ప్రదర్శించేవిగా ఉన్నవి. దీనిలో లభించిన శాసనాలు బుద్ధుని ధర్మం, బోధనలు, సంఘమును గూర్చి వివరించాయి. నాగార్జున కొండపై శిల్పకళ పేరు పొందింది. అక్కడ నిర్మింపబడిన కట్టడాలు, దానిపై శిల్పాలు, చైత్య స్తంభాలు అన్ని కీర్తి గడించి మహా బౌద్ధ క్షేత్రంగా నాగార్జున కొండను విశ్వవ్యాప్తం చేశాయి.

**తొట్లకొండ :**

ఆంధ్రప్రదేశ్‌లో అనేక బౌద్ధ క్షేత్రాలను కలిగిన ముఖ్య మైన జిల్లాలో విశాఖపట్నం చెప్పుకోదగినది. విశాఖపట్టణం భీమిలి బీచ్ దగ్గరలో ఉన్నది తొట్లకొండ. ఈ కొండపై నీటికొరకు తొట్టెలను ఏర్పాటు చేయడం వలన తొట్ల కొండగా పేరుపొందింది. కానీ ఇది కొత్తురగిరెగా నమోదు పొంది, ఇక్కడ శాసనాలు కూడా ఈ పేరు మీదే లభిస్తు న్నాయి. తొట్లకొండపై ఉన్న మహాస్థూపం చైత్యాలు, భోజనశాల, స్నానపు గదులు, శాసనాలు అన్ని బౌద్ధ చరిత్రను వివరిస్తున్నాయి.

**బావి కొండ :**

విశాఖ జిల్లా భీమిలి దగ్గర ఉన్నది బావికొండ. ఈ కొండపై కొలను, మూడు బావులు, బావి ఆకారంలో ఉన్నవి లభించడం వలన బావికొండగా పేరు పొందింది. దీనిలోని శాసనాల్లో సెనగిరి ప్రాంతంగా నమోదైంది. పురా వస్తు శాఖ వారి కృషి ఫలితంగా బావికొండ బౌద్ధ స్థూపాలు బయటపడినాయి. బావికొండపై బౌద్ధ

భిక్షువులు నివాసానికి చైత్యగృహాములు నిర్మించబడి నాయి. భోజనశాల, వంటశాల, వంట సామాగ్రి నిలువ చేసే గదిని ఏర్పటు చేశారు. ఇక్కడ జరిపిన బౌద్ధ భిక్షువుల భోధనలు, వారి ఆచరణ విధానాలు అన్నింటికి బావికొండలోని ప్రతిచైత్యం సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

ఈ విధమైన అనేక బౌద్ధ క్షేత్రాలు మన ఆంధ్రదేశంలో అడుగడుగునా ఉన్నాయి. ఎంతమంది ఎన్నో రకాలుగా నాశనం చేసినా, పేర్లు మార్చిన ఇప్పటికీ ఆ బౌద్ధ చిహ్నాలు సజీవంగా చరిత్రను తెలియచేస్తున్నాయి. ఆంధ్రుల బౌద్ధ జీవన విధానానికి ప్రత్యక్ష ఉదాహరణలు నేటి మన ఆంధ్రదేశంలో గల బౌద్ధ క్షేత్రాలు.

**శాసనాలు :**

ఏ సంస్కృతి అయినా, సాహిత్యం, భాష ఏదయినా సరే దానికి ప్రధాన ఆధారంగా నిలిచేవి శాసనాలు. కాలాన్ని అనుసరించి జరిగిన అనేక సంఘటనలపై ప్రత్యేక స్థలాలలో, ప్రత్యేక విషయాలను తెలిపేవి శాసనాలు. ప్రాచీన కాలం నుండి అనేక మంది చక్రవర్తులు, రాజవంశాలు, శాసనాలు వేయించేవారు. ఈ విధంగానే బౌద్ధ సంస్కృతి, సంఘటనలు, స్థలాలను వేయించిన శాసనాలు బౌద్ధ చరిత్రను వివరిస్తున్నాయి.

బౌద్ధ ధర్మాన్ని అనుసరించి, శాసనాలు వేయించిన వారిలో అశోకుడు ప్రసిద్ధి. అశోకుని కాలంలోనే బౌద్ధం ఒక రాజ్యం గుర్తించే స్థాయికి ఎదిగింది. హర్షుడు తన కాలంలో నలందా విశ్వవిద్యాలయంలో శాసనాలు వేయించారు. ఎన్నో రాజవంశాలు కూడా బౌద్ధ కీర్తి వ్యాపించే విధంగా శాసనాలు వేయించినవి. ఆంధ్రదేశంలోని ప్రతీ బౌద్ధ క్షేత్రం నందు దాని విశేషాలను తెలియజేసే శాసనాలు ఉన్నాయి.

ఈ విధమైన శాసనాల వలన ఆ బౌద్ధ క్షేత్రం కొత్తగా చూసిన వారికి ఆ క్షేత్ర వివరాలను శాసనాలు తెలియజేస్తాయి. ఆనాడు జరిగిన సంఘటనలను మనం ఈనాడు తెలుసుకుంటున్నామంటే దానికి ప్రధాన ఆధారాలు శాసనాలు. నలంద, తక్షశిల, విక్రమశిల, వల్లబాయి మొదలగు విశ్వవిద్యాలయాల్లో గల శాసనాలు కూడా బౌద్ధ ప్రాధాన్యను తెలియచేసినవి.

**సాహిత్యం :**

తెలుగు సాహిత్యంలో బౌద్ధంకు సంబంధించి అనేక గ్రంథాలు వెలువడ్డాయి. 1902లో తిరుపతి వెంకట కవులు రచించిన "బుద్ధచరిత్ర" పద్యకావ్యం తెలుగు బౌద్ధ గ్రంథాలలో మొదటిది. ఈ గ్రంథంలో బుద్ధుని జననం నుండి బోధనలు వరకు అనేక విషయాలు వివరించబడినవి. బుద్ధ చరిత్రకు మూలం ఆర్నాల్డ్ రాసిన ద లైట్ ఆఫ్ ఏషియా గ్రంథం. దీని ద్వారా బుద్ధుని దయా, కరుణ, నిరాడంబరతను వివరించారు. బుద్ధ చరిత్ర గ్రంథం తరువాత 1932లో పింగళి కాటూరి కవులచే రచింపబడినది "సౌందరనందం" సుందరీ ప్రేమలో ఉన్న నందుని బుద్ధుడు తన బోధన ద్వారా సంఘ జీవనం వైపు నడిపిస్తారు. నందుని బౌద్ధ మత స్వీకరణ ఇతివృత్తమే సౌందరనందం.

అద్దంకి కేశవరావు గారు "తథాగతీయం" గ్రంథమును రాశారు. ఇది సంపూర్ణ గౌతమ బుద్ధుని జీవితాన్ని వివరించిన పద్యకావ్యం. ఈగ్రంథంలో 141 శీర్షికలతో 4080 పద్యాలు ఉన్నాయి. జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి కలం పేరు కరుణశ్రీ. వీరు బుద్ధ చరిత్రను కూడా "కరుణశ్రీ" అను పేరుతో రాసి బుద్ధుని జీవిత ఘట్టాలను విస్తృతంగా తెలియజేసారు. వీరి కావ్యంలో కరుణ, దయ, జాలి వంటి భావనలు విస్తృతంగా వివరించబడ్డాయి.

బౌద్ధంలో "దమ్మపదం" అత్యంత విశిష్టమైనది. గజ్జల మల్లారెడ్డి గారు పాళీ నుండి తెలుగులోకి అనువదించి దమ్మపదంను పద్యకావ్యంగా రాశారు. దీనిలో వివిధ సర్గల ద్వారా మానవ ప్రవర్తన తీరు ఏవిధంగా ఉండాలో ఈ గ్రంథం తెలిపింది. సినారె గారు "నాగార్జున సాగరం" అను గేయ కావ్యం రాశారు. నాగార్జున సాగరం వద్ద బయటపడిన అనేక బౌద్ధఆధారాలు ఇటువంటి రచనలకు ప్రధాన ఆధారాలు. నాగార్జున సాగరంలో నాయకా నాయికలు పద్మదేవుడు, శాంతశ్రీ.

నాటకాలలో రూపగుడి నారాయణరావు "గౌతమ బుద్ధ", ఆత్రేయ రాసిన "గౌతమ బుద్ధ" "అశోక సామ్రాట్", రామోహనరావు గారి "సంఘం శరణం

గచ్ఛామి'' మొదలగు నాటకాలు ప్రసిద్ధి. తెలుగులో బౌద్ధంకు సంబంధించి పద్యకావ్యాలు, వచన కావ్యాలు, నాటకాలు, నవలలు, శతకాలు, బుర్రకథలు అనేకం రచించబడ్డాయి. ఏ రచనయినా బుద్ధుని జీవితం, వ్యక్తిత్వం, భోధనలు, బౌద్ధ వైభవం చాటి చెప్పేవిధంగా ఉన్నాయి.

బౌద్ధం యొక్క ప్రభావం గల రచనలు ముందు కొన్నే రచించబడిన దాని సంఖ్య క్రమక్రమంగా పెరిగింది. ప్రతీ కవి బౌద్ధంపై, బుద్ధుని జీవితంపై ఆసక్తి చూపి రచనలు చేశారు. కొందరు బౌద్ధ సూత్రాలను, అవి పాటించడం ద్వారా సమాజంలో, వ్యక్తిలో జరిగే మార్పును రచనలు ద్వారా చూపి బౌద్ధ వైభవం చాటిచెప్పారు.

**బౌద్ధ సంస్కృతి :**

మన భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు నిలయం. అనేక సంస్కృతులున్న మన దేశంలో బౌద్ధ సంస్కృతి వేల సంవత్సరాల నుండి వికసించింది. అన్ని సంస్కృతుల కంటే విభిన్నమైనది బౌద్ధ సంస్కృతి. దీనిలో ఆడంబరాలకు చోటులేదు. సాధారణ జీవిత విధానం, నైతిక విలువలతో కూడా ప్రవర్తన, పరస్పర సహకార భావం, అనేకమైన వాటిని బౌద్ధం తెలియజేసింది. ఈ సంస్కృతిలో భాగంగానే బుద్ధునికి సంబంధించిన ప్రత్యేక దినాలను విశిష్టంగా భావిస్తారు.

**వైశాఖ పౌర్ణమి :**

బుద్ధునికి సంబంధించి వైశాఖ పౌర్ణమి ఎంతో విశిష్టతను పొందినది. దానికి కారణం బుద్ధునికి సంబంధించిన మూడు ముఖ్య సంఘటనలు వైశాఖ పౌర్ణమి రోజు జరగడం. అవి బుద్ధుని జననం, జ్ఞానోదయం పొందడం, మహాపరినిర్వాణం పొందడం. ఈ మూడు సంఘటనలు వైశాఖ పౌర్ణమి రోజునే జరగడం వలన బౌద్ధ సంస్కృతిలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. దీనినే బుద్ధ పూర్ణిమ అని పిలుస్తారు. వైశాఖ పౌర్ణమి రోజున ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాలు సందర్శకులతో కళకళాడతాయి.

**ఆషాఢ పౌర్ణమి :**

బౌద్ధ సంస్కృతిలో ఆషాడ పౌర్ణమి కూడా ప్రత్యేకమైనది. బుద్ధునికి సంబంధించిన విశేష ఘట్టాలు ఆషాడ పౌర్ణమిన జరిగాయి. బుద్ధుడు ఆషాడ పౌర్ణమి రోజునే తన 29వ యేట మహాభిష్క్రమణం జరిపారు. తన 35వ ఏట ఆషాడ పౌర్ణమి నాడే ప్రధమ ప్రభోదం చేసి, బౌద్ధ సంఘానికి పునాదులు వేశారు. ఆ దర్మప్రభోదం, బౌద్ధ సంఘాల ఏర్పాటు వలన బౌద్ధం అత్యంత వ్యాప్తి చెందింది.

**బౌద్ధ సంగీతులు :**

బుద్ధుని మహాపరినిర్మాణం అనంతరం, బౌద్ధ బిక్షకులు క్రమశిక్షణకు, బుద్ధుని ధర్మ సూత్రాలను లిఖిత రూపంలో ఏర్పరచడానికి గాను ఏర్పడినవి బౌద్ధ సంగీతులు. ఇప్పటి వరకు తొమ్మిది బౌద్ధ సంగీతులు జరిగి బౌద్ధ వ్యాప్తికి కృషి చేశాయి. మహకాశ్యపుడు, ఆనందుడు వంటి బుద్ధుని శిష్యులు, అజాత శత్రువు, అశోకుడు వంటి వారి పోషణతో ఈ బౌద్ధ సంగీతులు బౌద్ధ సూత్రాలను సుస్థిరపరచారు. బౌద్ధ సంస్కృతిలో మూఢాచారాలకు ప్రోత్సాహం లేదు. వ్యక్తిని బాధపరిచే ఏ అంశాన్ని బౌద్ధం స్వీకరించలేదు. అందువలనే బౌద్ధ సంస్కృతి ద్వారా బౌద్ధం మరింత వైభవాన్ని పొందింది.

**ముగింపు :**

ఆంధ్రప్రదేశ్‌లో గల బౌద్ధ సంస్కృతిని తెలియచేసే ఎన్నో చారిత్రక చిహ్నాలు, ఆరామాలు, స్థూపాలు, శాసనాలు, గుహలు, అడుగడుగునా మనకు ఆధారాలుగా కనిపిస్తాయి. తెలుగునేలపై పరిఢవిల్లిన బౌద్ధ సంస్కృతికి ఇవి ప్రత్యక్ష నిదర్శనాలుగా దర్శనమిస్తాయి. బౌద్ధ కేంద్రాలుగా పరిఢవిల్లిన ఈ ఆంధ్రదేశంలో బౌద్ధ సంస్కృతిని వివరించే విశేష సాహిత్య సంపద ఎంతో ఉంది. ఆనాటి బౌద్ధ సంస్కృతిని ప్రత్యక్షంగా తెలియజేసే ప్రధాన ఆధారాలుగా శాసనాలు కూడా కనిపిస్తాయి. వీటిపై విస్తృత పరిశోధనలు జరగవలసిన అవసరం ఉంది.

ప్రధానంగా బౌద్ధ శాసనాలు ప్రాచీన భాషలయిన ప్రాకృతం, బ్రాహ్మీలిపి, సంస్కృతం మొదలగు భాషలలో ఉండడం వల్ల ఈ భాషలపై తగిన అవగాహన లేక పోవడం వలన ఈ శాసనాలపై జరగవలసిన పరిశోధనలు అంతగా అందుబాటులోకి రావడం లేదు. మన భారత దేశంలో వెల్లివిరిసిన అనేక సంస్కృతులలో విశిష్టమైనది బౌద్ధ సంస్కృతి. భారతీయ వారసత్వంగా పరిఢవిల్లిన బౌద్ధ సంస్కృతిని పరిరక్షించవలసిన బాధ్యత ప్రజాలందరికి ఉన్నదనేది గమనించదగిన విషయం. ఇప్పటి వరకు బౌద్ధ సంస్కృతి, సాహిత్యంపై అనేక పరిశోధనలు జరిగినవి, ఇంకా జరుగుతూ కూడా ఉన్నాయి.

భావి పరిశోధనకులు కూడా బౌద్ధ సంస్కృతి, సంప్రదాయాలు, శాసనాలు, శాసనాలలో గల భాషను విశ్లేషిస్తూ పరిశోధనలు జరపడం వలన మన తెలుగునేలపై పరిఢివిల్లిన బౌద్ధ సంస్కృతి, వైభవములను భావితరాలకు అందించే ప్రయత్నం జరగాలని ఆశిద్దాం.

**ఆధార గ్రంధాలు :**

1. ఆంధ్రదేశంలో బౌద్ధ వైభవం - పిల్లి రాంబాబు
2. తెలుగులో బౌద్ధం - అన్నపరెడ్డి వెంకటేశ్వరెడ్డి
3. బౌద్ధ దమ్మ విశిష్టత - సరెళ్ల వెంకటరత్నం (సవేరా)

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# శ్రీ కొంపెల్ల వేంకరామశాస్త్రి గారి సుందరకాండము - సహాయక స్త్రీ పాత్రలు - ధర్మాధర్మ వివేచన

- పి. జయప్ప, పరిశోధక విద్యార్థి, తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

**ఉపోద్ఘాతం :**

రాజమహేంద్రవరం భక్తి కవులకు నిలయమైనది. అట్టి కవులలో ప్రథమగణ్యులు శ్రీ కొంపెల్ల వేంకట రామశాస్త్రి గారు. ఈయన అటు సంస్కృతం, ఇటు తెలుగు భాషలను క్షోదసమన్వితంగా అధ్యయనం చేసిన ఆర్ష సంస్కారవేత్త! తాను స్వయంగా భాషా ప్రవీణ విద్యను పూర్తి చేశాడు. అందుచేత సంస్కృత రామాయణాన్ని చక్కగా అర్థం చేసుకున్నాడు. వారి కుటుంబమే ఆర్ష వాతావరణంతో విలసిల్లుతుంటుంది. ఒకవేళ ఆయనకు సంస్కృత భాషపై అధికారం లేకుంటే సుందరకాండను అనుసృజించే అవకాశం ఉండేది కాదు. వారిది కొవ్వూరు ప్రాంతం. భాష రావడం ఒక ఎత్తు! భక్తి సంస్కారం కలగడం మరొక ఎత్తు! వారి పూర్వీకులు కూడా అచ్చమైన భక్తులే! అందుచేత సుందరకాండను తెలుగులోనికి అనుసృజించ డానికి పూనుకున్నాడు. ఆయన చెప్పినట్లు తనకు అంత యోగ్యత లేదు హనుమంతులవారే ఈ అవకాశం కల్పించారని మనవి చేసుకున్నాడు.

మహాభాగవతాన్ని తర్జుమా చేయడానికి బమ్మెర పోతన కూడ తనకు అధికారం లేదని, రామచంద్రుడే పలికించాడని విన్నవించుకున్నాడు. అలాగే కొంపెల్లవారు కూడా. వీరిని స్వాములవారు అనువదించడానికి ప్రోత్స హించినట్లుగా విన్నవించారు. అంతేకాక ఈ సుందర కాండము అనుసృజించడానికి తనకు కూడా స్వత్వము లేదని హనుమంతుడే ఈ పని చేయించారని భావింప బడాలి. అందుచేత దైవగ్రంథాలను వ్రాయటానికిగాని, అనువదించటానికిగాని దైవసహాయమే కావాలి.

సుందరకాండములో ధార్మిక వాతావరణం బాగా కనిపిస్తుంది. నాయకుడు హనుమంతుడు. మహాబలుడు! వజ్రశరీరుడు! ప్రకృతి కూడా సిద్ధుల ద్వారాను, చారణుల, అశరీరక వ్యాకుల, తిర్యగాదుల ద్వారా ధర్మానికి తోడ్పడింది. అంతేకాని రావణాసురునికి సహకరించలేదు. తోడ్పడినప్పటికీ అతడు వినడు, విన్నా పాటించడు. పాటించినా రాక్షస ప్రవృత్తి స్వభావాన్ని పోనివ్వడు. అందుచేత పాతిక భాగమే అధర్మాన్ని, ముప్పాతిక భాగం ధర్మం ఓడించిందన్నమాట! అనగా కొంత ఇబ్బంది పడినా - మరికొంత ఆలస్యమైనా ఆనాడు, ఈనాడు ఈ విశాలప్రపంచంలో ధర్మానికే జయం! అధర్మానికి పరా జయం! ఈ నగ్నసత్యాన్ని భావితరాల ప్రజలు గుర్తించాలి. తమ జీవితాలలో పాటించాలి! అప్పుడు 'ముక్తి' లభి స్తుంది! పక్షి స్వభావమైన జటాయువునకే శ్రీరాముడు 'ముక్తి'నిచ్చాడు. ఇక మానవుల సంగతి చెప్పనక్కరలేదు. ఇదంతా త్రేతాయుగం నాటి సంగతి. దేశ, కాల, పాత్రల పరిస్థితులను బట్టి సుందరకాండములోని సహాయ స్త్రీ పాత్రలను, వీరి ధార్మిక స్వభావాలను ఈ వ్యాసంలో పరిశీలించడం జరుగుతుంది.

**త్రిజట :**

రాక్షసులలో సైతం దయాగుణం ప్రకటితం కావడం ఆశ్చర్యం! త్రిజటలో దయాగుణం కనిపిస్తుంది. ఎక్కడ కష్టముంటుందో కారణం కూడా అక్కడే ఉంటుంది. "కన్నీళ్ళెక్కడ ఉంటాయో కాళన్న కూడా ఉంటాడు" అన్నది కలియుగంలో సైతం అక్కడక్కడ సార్థకం అవు తుంది. త్రిజట పాత్రలో ఇదే కనిపిస్తుంది. నిజానికి 'త్రిజట' అనగా మూడు జడలు గల రాక్షసి అని అర్థం. అశోకవనంలో సీతకు కావలి కాస్తున్న వారు రాక్షసకాంతలే! వీరిలో అగ్రగామి త్రిజట. సీతాదేవిని రాక్షసకాంతలు రావణుని వరించాల్సిందిగా పదేపదే చెబుతున్నారు. దాన,

భేదాలు ప్రయోగించలేదు. ఇక దండనమే శరణ్యం అనే రీతిలో రాక్షసకాంతలు సీతపట్ల దురుసుగా వ్యవహరించారు. అప్పుడు త్రిజటకు వచ్చిన స్వప్నం ప్రతీకాత్మకంగాను, గుండెలు పిండే విధంగాను, ఒడలు గగుర్పొడిచేలాగా వుంది.

అది రాముని జయమును, రావణుని ఓటమిని సూచిస్తుంది. సీతారాములు మరల అయోధ్యను పాలించడానికి విమానంపై బయలుదేరినట్లుగా ఉంది. తెల్లని దృశ్యం విజయానికి సంకేతం. రావణుడు నరకంలో పడిపోయేటట్లు ఆ 'కల'!. ఇదంతా త్రిజట తక్కిన రాక్షస కాంతలకు వివరంగా చెప్పి, సీతాదేవిని ఏమీ అనకూడదని, అవసరమైనచో నన్ను (త్రిజట) తినవలసినదిగా సమాధానం చెప్పింది. ఏనాటికైనా మంచి గెలుస్తుంది! చెడు ఓడుతుంది! మంచి ధర్మం, చెడు అధర్మం. ధర్మానికి అనగా పాతివ్రత్య ధర్మానికి సీత నిదర్శనం. అధర్మానికి రావణుడే నిదర్శనం. అంతేగాక లంక పతనమైపోతుంది. అని కూడా చెప్పింది.

ఇవి విన్న తోటి రాక్షస కాంతలు భయపడ్డారు. త్రిజట చెప్పినట్లుగా సీతాదేవియే భావికాలంలో మనలందరినీ రక్షించుగాక అని భావించారు. ఒక రకంగా త్రిజట స్వప్నంతో రామాయణము సమాప్తం అయినట్లే. వెంటనే సీతకు శుభశకునములు కలిగాయి. తరువాత త్రిజట చెప్పినట్లుగానే జరిగింది. అప్పటి నుంచి కథ మలుపు తిరిగింది. త్రిజట రామాయణములో రాక్షసకాంత అయినప్పటికీ సుందరకాండలో ధార్మిక పాత్రగా ప్రసిద్ధికెక్కింది.

## మండోదరి :

ఈమె రావణాసురునికి పట్టమహిషి. 'వీణా' విద్యలో ప్రవీణురాలు. ఆనాడు సామాన్యమైన పురుషులలోననే బహుభార్యాత్వం అమలులో ఉండేది. ఇక రాక్షసరాజు అయిన రావణాసురునికి బహుభార్యాత్వం ఆశ్చర్యంకాదు. చాలా సందర్భాలలో మండోదరి సీత పాతివ్రత్యాన్ని మెచ్చుకున్నది. అందుచేత రావణునితో సీత మానవకాంత కావున, రావణాసురుడు రాక్షసుడు కావున సీతను వదలి, రాక్షస కాంతలతోనే సుఖపడమని బోధించింది. రావణాసురుని రాక్షస బలాన్ని, కైలాసాన్ని కదిలించిన ఘట్టాన్ని ప్రశంస చేసింది. రావణుడు బహుభార్యావ్రతుడు కావచ్చు. మండోదరి మాత్రం అలా కాక, ఒకే పతిని వరించింది. అతనితోనే జీవించింది. రావణునికి 'కీడు' శంకించినప్పటికీ అతడు రాక్షసుడు కావున వినలేదు. తామసగుణం బలంగా ఉన్నప్పుడు మంచి మాటలు పరిగణింపబడవు, అట్లే మండోదరి మాటలు రావణుడు వినలేదు. తన వినాశనాన్ని తానే కొనితెచ్చుకున్నాడు. ఇలా మండోదరి, రాక్షసకాంత అయినప్పటికీ, సౌశీల్యవతి, అట్లే సౌజన్యవతి, ధార్మికమూర్తి. తక్కిన రాక్షసకాంతలు వేరు! మండోదరి వేరు! ఈమెను ధర్మగుణమే పట్టమహిషిగా చేసింది. అందువల్ల పుట్టుకతోనే ఎవరు ఉత్తములు కారు అనడానికి మండోదరి పాత్ర అపవాదం. రాక్షసకాంత అయిన మండోదరిలో ధర్మముంది. దయాగుణముంది. ముఖ్యంగా పట్టమహిషీగుణం ఉంది. "అన్నింటికి మించి ఆమె ఉత్తమమైన మూర్తీభవించిన ధర్మంగా మండోదరి పాత్ర కనిపిస్తుంది". జన్మవరకే రాక్షసకులం, స్వభావంలో మాత్రం ధర్మముంది. సుందరకాండలో ఈమె ధర్మగుణమంతా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

## సరమ - అనల :

విభీషణుడి భార్య 'సరమ', కూతురు 'అనల'. సత్వగుణం విభీషణుడి పాత్రలో సమృద్ధిగా కనిపిస్తుంది. సరమ - అనల పాత్రలలో కూడా సాత్త్వికత ప్రకటితమౌతుంది. ఇందుకు ఉదాహరణం - అశోక వనంలో ఒకానొక సందర్భంలో సీతాదేవి హనుమంతులవారితో సంభాషిస్తుందంది. అప్పుడు విభీషణుడు రావణునితో సీతను రామునివద్దకు పంపవలసినదిగా కోరాడు. అట్లు సరమ, అనల కూడా రావణునితో పతివ్రతతో పరాచికం యోగ్యం కాదని, సీతను రాముని చెంతకు పంపమని ఇరువురు విన్నవించారు. అయినప్పటికీ రావణుడు వినలేదు. కారణం అతనిలోని తామసగుణ ప్రాబల్యమే. ఇలా ఉండగా ధర్మం దానిపని అదే చేస్తుంది. విభీషణుడు, సరమ, అనలలో కూడా ధార్మిక స్వభావం

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


ఎక్కువ ఉంది. అందుకే రావణునికి ఈ మూడు పాత్రలు ఎంత విన్నవించినా అతడు పెడచెవిన పెట్టి చివరకు నశించాడు. సరమ, అనలలు ఉత్తమ స్త్రీ పాత్రలు. అందు చేతనే హనుమంతునితో పై విషయాన్ని తెలిపారు. ఇంతమంది చెప్పినా రావణుడు వినలేదు. అనగా అతని నాశనం అతడే పరోక్షంగా కోరుకుంటున్నాడు అన్న మాట!.

**శాపగ్రస్త కాంతలు :**

సముద్రంలో శాప కారణంగా పడియున్న ప్రాణి "సురస". ఈమె దక్ష ప్రజాపతి కూతురు. వానరునిచేత ఓడిపోయినప్పుడు ఈమె శాపం పోతుందని బ్రహ్మదేవుని వరం! అట్లే హనుమంతుడు 'సురస'ను చూశాడు. సురస మ్రింగే ప్రయత్నం చేసింది. హనుమంతుడు నోట్లోకి పోయి బయటికి వచ్చాడు. ఆమెకు శాపం పోయింది. సహజమైన 'స్త్రీ' రూపం వచ్చింది. జాగ్రత్తగా లంకలో సీతాదేవిని కనుగొనమని హనుమంతుల వారితో పలికింది. అట్లే హనుమంతుడు లంకకు వెళ్ళడం, సీతను కను గొనడం జరిగింది. ఈమె కూడా ధర్మమూర్తి అయిన స్త్రీ పాత్రే. అందుచేతనే స్త్రీగా మారిన తర్వాత ఆమె పలికన పలుకులు ధర్మబద్ధంగా ఉన్నాయి.

**సింహిక :**

సింహిక కూడా కామరూపిణి. శాపగ్రస్తయై నీరసపడి ఉంది. హనుమంతుని చూసి తిండి దొరికిందని చాలా సంతోషించింది. హనుమంతుడు సింహికను చూచి, దాని ఆయువుపట్టును కనిపెట్టి, సంహరించాడు. అంతట సింహిక చచ్చి, సముద్రజలం మీద తేలాడింది. సింహిక కూడా నిజరూపాన్ని దాల్చి హనుమంతుల వారిని 'సాధింప వలసిన కార్యమును సునాయాసంగా సాధిం పుము' అని చెప్పింది. ఒక రాక్షస స్త్రీ ధర్మబుద్ధితో చెప్పిన వాక్యంలో చాలా అర్థం వుంది. లంకలో హనుమంతుడు ఇబ్బంది పడకుండా సీతను చూశాడు. మాట్లాడాడు. ఆ వార్తలు తిరిగి రామునకు విన్నవించాడు. సింహికకు ధర్మబుద్ధి లేకుంటే ఇలా ఎందుకు చెప్పగలుగుతుంది. రాక్షస రూపం వరకే అధర్మబుద్ధి! రాక్షస రూపం పోయిన తర్వాత 'ధార్మిక' బుద్ధి కలిగింది.

**లంకిణి :**

ఈమె లంకానగరానికి కావలికాస్తున్న రాక్షస కాంత. లంకానగరానికి చేరటానికి కోటలు, ప్రాకారములు, అగడ్తలు మున్నగునవి ఉన్నాయి. లంకిణి ఊరు చివరలో ఉన్నటువంటి రాక్షసకాంత! హనుమంతుని ప్రవేశాన్ని అడ్డగించిన సాహసకాంత. హనుమంతుణ్ణి యుద్ధానికి కూడా ఆహ్వానించింది. లంకిణి హనుమంతుణ్ణి అర చేతితో ఒక దెబ్బ కొట్టింది. దెబ్బతిన్న హనుమంతుడు ఆమెను ఒక గ్రుద్దు గుద్దాడు. అంతట ఆమె గర్వం తొలగి పోయింది. భయపడి పోయింది. స్త్రీ రూపం దాల్చింది. లంకా నగరానికి తాను దేవత! అటువంటి లంకిణిని హనుమంతుడు అవలీలగా పడగొట్టాడు. స్త్రీ రూపం దాల్చిన లంకిణి నగరమును కాపాడుతున్నానని, ఒక "వానరుడు బలముతో గెలిచినచో అప్పటి నుండి రాక్షసు లకు అపాయం ఏర్పడుతుంది" అని గ్రహింపుము అని ఆంజనేయునితో (బ్రహ్మ) ఇచ్చిన వరాన్ని చెప్పింది. మునుపే పేర్కొన్నట్లు సురస, సింహిక, లంకిణి శాపగ్రస్త కాంతలు! హనుమంతుని ఆగమనం వల్ల శాపం పోయింది. పూర్వరూపం వచ్చింది. అప్పుడు పలికిన వాక్యములు ధర్మబద్ధంగా ఉన్నాయి. అవి బ్రహ్మ వాక్కులని కూడా విశదమవుతున్నాయి.ఈ పాత్రలన్నింటిని పరిశీలించగా, ధర్మానికి మహా 'శక్తి' ఉంది. ఈ శక్తి ధర్మబద్ధంగాను వ్యవహరిస్తుంది. అందుచేత సుందర కాండలో త్రిజట, మండోదరి, సరమ, అనల, సురస, సింహిక, లంకిణి విద్యాధర కాంతలు. ఆకాశ గామినులు - నీలుడు, పనసుడు, మైందుడు, ద్వివిదుడు మున్నగు పాత్రల ద్వారా ధార్మిక 'శక్తి' సార్థకమైనది. ఈ సత్యాన్ని సుందరకాండము అమోఘముగా ఋజువు చేస్తున్నది.

**ముగింపు :**

మానవులు త్రేతాయుగంలో నరులు చాలా వరకు ధర్మదృష్టితో వ్యవహరించారు. ద్వాపరయుగంలో సగ భాగం మాత్రమే ధర్మాచరణం కనిపిస్తుంది. కలియుగంలో మూడు భాగాలు అధర్మం, ఒక భాగమే ధర్మం! అందువల్ల ఎక్కడ చూసినా మానవుల ఆగడాలు, దౌర్జన్యాలు,

దొంగతనాలు, అత్యాచారాలు, అవకాశవాదాలు, స్వార్థాలు, అహంకారాలు, అసత్య భాషణలు, అడుగడుగునా కనిపిస్తున్నాయి. ఎక్కడో ఒకచోట మాత్రం ధర్మం సాగిపోతుంది. మహాకవి వాల్మీకి కూడా తన రామాయణంలో పర్వతాలు, ప్రవాహాలు, పచ్చిక మైదానాలు, విహంగాలు, నీలాకాశం, గాలి, వెలుతురు ఇవన్నీ ఉన్నంతవరకు తన కావ్యం భద్రంగా ఉంటుందని చెప్పాడు. చిత్రమేమనగా ఆయన మానవుల ప్రస్తావన చేయలేదు. అందుకే మనిషి కంటే పక్షి, పక్షికంటే సమీరం, దానికంటే సెలయేరు, ఇలా ధర్మం అనేది ఉత్తరోత్తర బలీయంగా కనిపిస్తుంటుంది. హనుమంతుడు రాముని లాగా ధర్మానికి చక్కని ప్రతినిధి! అందుచేత లంకలోని రాక్షసులను స్వశక్తితో సంహరించాడు. ఒకరిద్దరిని కాదు, వేలమందిని! ఈ శక్తి ఎలా వచ్చింది? అనగా రాముడు ధర్మస్వరూపుడు కనుక, ఆయన శక్తి యుక్తులన్నీ హనుమంతునిలో సంపూర్ణంగా ఉన్నాయి. లంకను దహించాడు. అక్షుడు హతుడైనాడు. ఇంద్రజిత్తు కూడా హనుమంతునితో పోరలేక బంధించాడే తప్ప, హనుమంతుని ఓడించలేదు. ప్రతి కదలికలో కూడా హనుమంతుడు సత్యాన్నే పలికాడు. ఆచరిచాడు. అధర్మాన్ని నిర్మూలించాడు. ఎంతసేపు సీతాదేవిని కేంద్రబిందువుగా చేసుకొని తాను 'లంకాదహనం' అయితేనేమి 'రాక్షసుల సంహారం' అయితేనేమి అంతా చేశాడు. సీతాదేవి బ్రతికిందని చారణులు చెప్పగా హనుమంతుడు విన్నాడు. అప్పుడే చారణులు పలకడం ఎందుకు, హనుమంతుడు వినడం ఏల? సీత క్షేమంగా ఉండటం ఏల? త్రిజట చెప్పడం ఏల? ఇవన్నీ కూడా ధార్మిక వాతావరణానికి, సంబంధించినవే, "ధర్మోరక్షతి రక్షిత:" అన్నట్లు సీతాదేవిని రక్షించుకుంటే తాము క్షేమంగా ఉంటామని భావించారు. అలాగే జరిగింది.

ఏ చిన్న మేలు చేసినా (ధర్మం చేసిన) రాబోయే కాలంలో మహాకష్టాల నుంచి రక్షణ ఉంటుంది. జటాయువు పోరాటం, సంపాతి చెప్పడం, చిన్నవే కావచ్చు. అవి గొప్ప ప్రమాదాల నుంచి కాపాడుతాయి. పక్షికి 'మోక్షం' వచ్చింది. హనుమకు 'చిరంజీవత్వం' వరంగా లభించింది. త్రిజటకు రక్షణ కలిగింది. విభీషణునికి రాజపదవి లభించింది. మారీచునికి మోక్షం కలిగింది. సుగ్రీవునకు కూడా పట్టాభిషేకం కలిగింది. ఇలా ఏ చిన్న ధర్మం చేసినా అది భవిష్యత్తులో పలు విపత్తుల నుంచి కాపాడుతుంది - అన్నది సత్యం! సుందరకాండలో ధర్మం పరాకాష్టకు చేరింది. చివరకు ధర్మమే జయించింది. అధర్మం అపజయం పాలైనది. ఒక చిన్న గడ్డిపోచలో తేలి, మేఘంలో, సెలయేటి నీటిలో, పద్యములలో, పల్లవములలో, శింశుపంలో, ధర్మం మూర్తీభవించిన కాండమే ఈ "సుందరకాండం" - ఈ "సుందరీకాండం"!.

**ఆధార గ్రంథాలు :**

1. ఉత్తరరామచరిత్ర (సం) - భవభూతి
2. రామాయణ చంపువు (సంస్కృతం) - భోజదేవుడు
3. రామాభ్యుదయము - అయ్యలరాజు రామభద్రుడు
4. సుందరకాండము (వచనం) - శ్రీ కొంపెల్ల వేంకటరామశాస్త్రి
5. సాహిత్య సోపానాలు - దివాకర్ల వేంకటావధాని
6. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
7. సమగ్రాంధ్ర సాహిత్యము - ఆరుద్ర
8. సాహిత్య దర్శనము - ఆచార్య కాకర్ల వెంకట రామ నరసింహం

# పరీక్షణం - ఒక పరిశీలన

- పోల్కం రాములు, తెలుగు ఉపన్యాసకులు, ఆర్.జి.యు.కె.టి. బాసర, తెలంగాణ.

ప్రపంచ సాహిత్యంలో వ్యాసం మొట్ట మొదటగా ఫ్రెంచ్ సాహిత్యంలో రాయబడింది. ఫ్రెంచ్ సాహిత్యంలో వ్యాసంను మొదటగా రాసిన వ్యక్తి 'మాన్‌టేన్'. వ్యాసం ఫ్రెంచ్ సాహిత్యం నుండి ఆంగ్ల సాహిత్యంలోకి ప్రవేశించింది. ఆంగ్లంలో ఫ్రాన్సిస్ బేకన్ మొదటగా 'మైసేల్ఫ్' పేరుతో వ్యాసం రాశాడు. తెలుగు సాహిత్యంలో మొట్ట మొదటగా సామినేని ముద్దు నరసింహనాయుడు 'ప్రమేయాలు' పేరుతో వ్యాసం రాశాడు. తెలుగు సాహిత్యంలో మొదటి వ్యాస రచయిత్రి పోతం జానకమ్మ. హిత సంజీవని పత్రికలో వ్యాసం రాసినది. వ్యాసం అను పదమునకు ప్రయత్నం కృషి, పరిశీనల, విభాగం, విస్తరించు అను అర్థాలు కనిపిస్తాయి.

శ్రీరామచాంద్ర శుక్లా గారి మాటల్లో కవి ప్రతిభకు గీటురాయి గద్యం అయితే గద్యంనకు గీటు రాయి వ్యాసం అని నిర్వచించాడు. అలాంటి వ్యాసాలు తెలుగు సాహిత్యంలో అనేకంగా వచ్చాయి. అలా వచ్చిన వ్యాస సంకలనాలలో పరీక్షణం ప్రముఖంగా కనిపిస్తుంది.

పరీక్షణం అనగా 'వస్తుతత్వాన్ని, గుణశీదులను నిర్ణయించే గొప్ప స్థానం కలది అని అర్థం. ఈ వ్యాస సంకలనం యొక్క ముఖ్య ఉద్దేశ్యం పరిశోధక, సాహిత్య విద్యార్థులలో ఉన్న సాహిత్య జిజ్ఞాసను వెలికి తీసి ప్రోత్సహించడం. ఈ వ్యాస సంకలనం యందు పరిశోధక విద్యార్థులతో పాటు రచయిత్రుల వ్యాసాలు కూడా ఉన్నాయి. ఈ సంకలనం యందు ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం, జానపద సాహిత్యం పండుగలు, ఉత్సవాలు మొదలు వాటిని వివిధ కోణాలలో ఎంతో ఆలోచనాత్మకంగా, తమదైన రీతిలో పొందుపరచడం జరిగింది. ఈ వ్యాసాలు సాహిత్యంలోని అన్ని కోణాలను ప్రతిబింబించేవిగా ఉన్నాయి. ఈ సంకలనం మద్దిరాల సత్యానారాయణరెడ్డి సంపాదకత్వంలో వచ్చింది. సంపాదకుడు ప్రస్తుతం పరిశోధక విద్యార్థిగా ఉన్నాడు. ఈ పుస్తకాన్ని 20 ఆగష్టు 2018 సంవత్సరంలో లక్ష్మీసాయి ప్రింటర్స్ (నయీంనగర్ హనుమకొండ) వారు ముద్రించారు. ఈ సంకలనంను వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావులపెంట క్యాంప్ ధ్వంసకారుడు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు క్రామేడ్ మద్దిరాల రాంరెడ్డి గారికి అంకితం ఇవ్వడం జరిగింది. సంపాదకునికి పరిశోధన పట్ల సాహిత్యం పట్ల, ఆసక్తి ఉంది ఆ కారణం గానే వివిధ పరిశోదక విద్యార్థులు, అధ్యాపకులు, రచయిత్రుల సహాయంతో ఈ సంకలనాన్ని వెలువరించాడు. పది మంది ప్రతిభను వెలికి తేవడం కొరకు రచయిత చేసిన కృషి అభినందనీయం అని పరీక్షణానికి ముందుమాట రాసిన కవి, విమర్శకులు, సినీయర్ ఎడిటర్ కాసుల ప్రతాపరెడ్డి ప్రశంసించారు.

## ప్రాచీన సాహిత్య వ్యాసాలు :

శకుంతలోపాఖ్యానం - నన్నయ్య కవితా లక్షణ సమన్వయం వ్యాసం యందు పద్యాలు రెండు విధాలుగా ఉంటాయి. పఠన యోగ్యమైనవి, గాన యోగ్యమైనవి. నన్నయ పద్యాలు గానయోగ్యానికి చెందినవి. అనేక మంది విద్వత్కవులు కావ్య లక్షణాలు ఉట్టి పడేలా ప్రబంధాలను, కావ్యాలను రాశారు కాని శాస్త్ర గ్రంథాలను లక్షణ గ్రంథాలను వ్రాయలేదు. ఆంధ్రభాషను బాగా పరిశోధించి 'ఆంధ్ర శబ్ద చింతామని' అనే గొప్ప వ్యాకరణ గ్రంథంను అందించిన గొప్ప వైయాకారుడు నన్నయ. ఛందశాస్త్రంపై లక్షణసారము పేరుతో గ్రంథాన్ని వెలువరించాడు. శబ్దములను పలికించడంలో నన్నయ దిట్ట కాబట్టి ఇతనికి వాగనుశాసనుడు అను బిరుదు వచ్చింది. తెలుగుభాషకు ఒక రూపు రేఖలను కల్పించి కావ్యేతిహాసంగా మహాభారతం ను మలిచి శబ్దశాసనుడు అను బిరుదుకు అర్హుడయ్యాడు అని బోలుగద్దె అనిల్‌కుమార్ విశ్లేషించాడు.

తెలుగులో భగవద్గీత ఒక అధ్యయనంలో మానవులలో మానవత్వంను కలిగించి ఒక మంచి మార్గంను చూపించే దిక్సూచి భగవద్గీత. ఇది మత గ్రంథము కాదు మానవాళికి హితం చేకూర్చే గ్రంథం. మహాభారతంలో భీష్మ పర్వంలో 25వ అధ్యాయం నుండి 42వ అధ్యాయం వరకు మొత్తం 18 అధ్యాయాలుగా, 700 శ్లోకాలుగా ఉందని ఎల్కమూరి రాజు పేర్కొన్నాడు. బమ్మెర పోతన రచనలు వ్యాసం యందు ఓరుగల్లు జిల్లా జనగామ తాలుకా బమ్మెర గ్రామ నివాసి పోతన. బోగినీ దండకం, నారాయణ శతకం, వీరభద్ర విజయం భాగవతం పోతన రచనలు అని వివరిస్తూ తమ గురువు గారి అనుగ్రహం వల్ల తారక మంత్రోపదేశమును పొందాడు. తిక్కనవలె హరిహర ద్వైతంను ప్రతిపాదించాడు అని సొనబోయిన సతీష్ వివరించాడు.

**గిరిజన సాహిత్యం :**

బంజారా గేయంలో హాస్యం, చమత్కారం వ్యాసం యందు మానవుని సహజ ప్రవృత్తులలో హాస్యం ఒకటి. నవరసాలలో హాస్యం ప్రముఖంగా ఉంది. హాస్యానికి, చమత్కారానికి సన్నిహిత సంబంధం ఉంది. కాని భేదం చెప్పడం కష్టం. వికృతమైన ఆకారం,మాటలు, వేషం, చేష్టలు అన్నింటి వల్ల హాస్యం జనిస్తుందని, హాస్యం అన్ని రకాల బాధలను దూరం చేస్తుందని అందుకే జానపదులు హాస్యంనకు ప్రాధాన్యం ఇస్తారు. బంజారా సాహిత్యానికి లిపి లేక పోవడం వలన లిఖిత భాష ఏర్పడలేదు. బంజారా జీవితంలో, వివాహాది శుభకార్యాలు, పండుగలు, పబ్బాలో, అత్త అళ్ళుళ్ల మధ్య, భార్యభర్తల మధ్య హాస్యం ఏ విధంగా జనిస్తుందో పరిశీలన పూర్వకంగా వివరణ చేశాడు డా॥ భగ్గునాయక్. గిరిజనుల ఇలవేల్పులు సమక్క, సారలమ్మల వ్యాసం నందు ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజనుల ఉత్సవం మేడారం జాతర, మాఘ శుద్ధ పౌర్ణమి నాడు బుధ, గురు, శుక్ర వారాలలో ప్రారంభమవుతుంది. మేడారంను దర్శించుకొనే ముందు ములుగుకు 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న గట్టమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారని శ్రీనివాస్ అక్షరికరించాడు. శివసత్తులు జాతరలో ప్రత్యేక ఆకర్షణ. జంపన్న వాగులో స్నానం చేస్తే రోగాలు నయం అవుతాయిన భక్తుల నమ్మకం. జాతరలో బంగారం (బెల్లం)ను నైవేద్యంగా సమర్పించడం అనవాయితే. దేవతలను అధికార లాంఛనాలతో గద్దెలపై ప్రతిష్టించి నాలుగో రోజు దేవతలు వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది. దీనికి చారిత్రక నేపథ్యం కూడా ఉందని రచయిత అభిప్రాయపడ్డాడు. బంజార వరుడి సంస్కృతీ సంప్రదాయాలు అనే వ్యాసంలో వన్‌దర్ భణ్‌జారే అనే హింది పదం నుండి బంజారా పదం వచ్చింది. వీరినే లదా నియా, బంజారీ, లభానా, వంజార, వనజీరా అని పిలిచేవారు. సగాయి అనగా బంజారా వివాహ వ్యవస్థలో నిశ్చితార్థం అని అర్థం. సాడి తొనేరోనొక్త అనేది ఆదివారం పెండ్లి కుమారుని ఇంట్లో నిర్వహించే కార్యక్రమం. పెండ్లి కుమారుని అనేక రకాలుగా అలంకరించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. వడాయి అనగా పెండ్లి కుమారుని ఎడమ భుజంపై వాత పెట్టడం. ఈ బంజారా సాంప్రదాయ పద్ధతులో పెద్దల సమక్షంలో (తండా వాసుల) పెండ్లి కుమారుని అలంకరించి పాటలు పాడుతూ పెళ్ళి జరుపుతారని రచయిత మూడ్ రాజు వివరించాడు. ఆదిలాబాద్ ఆదివాసీ తోటిల పండుగలు - పరిశీలన అను వ్యాసం యందు పండుగలు అనేవి మనిషిలోని సమస్యలను మరచిపోవడానికి దోహదం చేస్తాయని, గిరిజనుల పండగలు సరదాకొరకో, కాలక్షేపానికో కాదు. ప్రకృతిని ప్రేమిస్తూ ఐక్యతను చాటుతూ సాంప్రదాయాలను కాపాడేలా ఉంటాయి. ఆదివాసీలలు దేవున్ని పేన్ అని, పిలుస్తారు. వీరి దేవతకు రూపాలు ఉండవు. చెట్టు, రాయి వంటి వాటిని దేవతలుగా భావించి పూజిస్తారు. చంటి భీమన్న మర్మి అనే పండుగలను చైత్ర మాసంలో ఇప్ప చెట్టు దగ్గర భీముడు, హిడింబల ప్రతిమలను ఉంచి వాటికి పెళ్ళి చేస్తారు. వచ్చే సంవత్సరంలో దిగుబడి ఏ విధంగా ఉంటుందో ముందుగానే తెలుసుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. రేలా పుంగర్ పూజ వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, పాడి

పంటలు పచ్చగా ఉండాలని కోరుతూ ఈ పూజను చేస్తారు. కేడరాజుల పూజ అనేది పచ్చని గడ్డి మొలచి నేల సస్యశ్యామలంగ ఉన్న రోజు నిర్వహించే పండుగ. పోరా అనేది పశువులను పూజించే పండుగ. అకుర్పొక్ అనేది ప్రజలను, పిల్లలను, పశువులను, సుఖసంతోషాలతో చూడాలని పోచమ్మతల్లికి మ్రొక్కుతారు. దండాలి, జామురా అముస్, భీమ దేవుని పూజ, మారడి, ఆకిఫిన్, పెరత అమావాస్య, పెరాక్సిన్ మొదలైన ఆదివాసి పండుగలను గురించి ఇడేవార్ సుభద్ర సమగ్ర పరిశీలన చేసింది.

## జానపద సాహిత్యం :

నీలా జంగయ్య కన్యకా పరమేశ్వరి బుర్రకథ రచన వైశిష్టం అను వ్యాసం నందు కవి రత్న నీలా జంగయ్య గారి బుర్ర కథ ప్రసిద్ధమైనదని రచయిత్రి పేర్కొన్నది. వీరి రచనలో 37 అముద్రిత గ్రంథాలు, 27 ముద్రిత గ్రంథాలు రచించారు. పెనుగొండ వర్ణన, కుసుమ భూపతి గుణగణాలు, కుసుమ భూపతి దంపతుల పుత్ర కామేష్ఠి యజ్ఞం. కుసుమాంచిక స్వప్నం, కుసుమ భూపతి దంపతులు సంతనం పొందడం, వాసవి సౌందర్యం,విష్ణు వర్ధనుడు పెను గొండను దర్శించడం, కుసుమ భూపతి సభను ఏర్పాటు చేయడం, వాసవి తండ్రితో పలికిన పలుకులు, కుసుమ భూపతి దంపతులు సంతానం పొందడం, వాసవి సౌందర్యం, విష్ణు వర్ధనుడు పెను గొండను దర్శించడం, కుసుమ భూపతి సభను ఏర్పాటు చేయడం, వాసవి తండ్రితో పలికిన పలుకులు, కుసుమ భూపతి దుఃఖించిన విధానం అనేక వృత్తాంతాలను డా॥ శ్రీమతి నూనె త్రిపురసుందరి వివరించారు. కరీంనగర్ జిల్లా జానపద కథలు సామాజికాంశాల పరిశీలన అను వ్యాసంలో కథ కంచికి మనం ఇంటికి అంటూ కథను ముగించగానే విన్న శ్రోతకి ఆలోచన మొదలౌతుంది. జానపదకథలు జానపదుల కష్టసుఖాల నుండి పుట్టి ముందు తరాలకు జీవన నైపుణ్యాలను కల్గిస్తున్నాయి. మాక్స్ముల్లర్ అభిప్రాయం ప్రకారం వేదాలలో జానపద కథ ములాలు ఉన్నాయని, బెన్ఫె ప్రకారం పంచతంత్రం అనేక కథలకు మూలమని విశ్వసించారు. జానపద కథలలో మార్గదర్శకత్వం చేసేవి, ఆచారాలు తెలిపేది, కట్టుబాట్లు నేర్పేవి. వైద్యంను గురించి, కుటుంబ జీవన విధానంను గురించి, రాజుల చరిత్ర చిత్రణ, సంస్కృతిని తెలిపేవి. మానవ జీవితంలోని ప్రతి సంఘటనను జాన పద కథలలో చూడవచ్చుని తాటికాయల భోజన్న ఉటంకించాడు. జానపద కుటుంబ బాధ్యతలలో స్త్రీ పాత్ర అనే వ్యాసం నందు జానపదతత్వం ఉన్న ప్రతివారు జానపదులే. భారతీయ సంప్రదాయాన్ని సంరక్షించడంలో కాంతయే ప్రధాన సూత్రధారి. తల్లిగా, భార్యగా, బిడ్డగా, అత్తగా కోడలుగా సంసార సాగరంలో విశ్వవిహారం చేస్తుంది. జానపద స్త్రీకి ప్రత్యేక వ్యక్తిత్వం ఉన్నట్లు ఎక్కడ కనిపించదు. ఆమె ఎప్పుడు ఒక పురుషుని చాటు మాటున పెరిగిన మొక్క లాంటిది. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు ముగ్గురి అధీనంలో బతికినట్లు తెలుస్తుంది. పురుసాధిక్యత ఉన్న ప్పటికి స్త్రీని గృహ సామ్రాజ్ఞిగా భావించి గౌరవించేవారు. స్త్రీని శక్తి స్వరూపిణిగా భావించే వారని అరుందతి జనావత్ పేర్కొన్నది.

నులక జంగయ్యల జాంబ పురాణం - ఉపకురాల పరిశీలన వ్యాసం యందు కుల పురాణంలో వెలిసిన పురాణం బాంజ పురాణం. దీనికే ఆదిజాంబవ మహా పురాణం అని పేరు. జాంబవంతుని సంతతియే నేడు మాదిగలుగా పిలువబడుతున్నారు. అన్ని కులాలకు ఉన్నట్లే చిందు, డక్కలి, బైండ్ల, మూష్టి, కిన్నెర, నులుక సంగయ్యలు మాదిగలాశ్రిత కులాలు. తెలంగాణలో దక్షిణ కాశీ కొలనుపాక ఇక్కడ పద్దెనిమిది కులాల కుల మాతాలు ఉన్నాయి. అందులో జాంబవంతుని మఠం కూడా ఉంది. వారు చేస్తున్నట్టి వ్యక్తులను బట్టి వర్ణాలు, కుల - ఉపకులాలు ఏర్పడ్డాయని నోముల రాజు విశ్లేషించాడు. జానపద కళారూపాలలో మందహెచ్చులు యందు అక్షర జ్ఞానం లేని పల్లె ప్రజలు సాంప్రదాయక విజ్ఞానం అని తంగిరాల సుబ్బరావు పేర్కొన్నాడని, జానపదులు పాడుకొనే పాటలు,ఆటలు, నృత్యాలు, జానపద కళ

రూపాలుగానే పేర్కొనవచ్చు. ప్రసార మధ్యమాలు అందు బాటులోకి రావడం వలన వాటి ప్రాచుర్యం తగ్గింది. ఒకప్పుడు ఇదే ప్రజల వినోద సాధనాలు. మంద హెచ్చులు యాదవ, గొల్ల కులాల వారి ఆశ్రిత కులాలు వీరు కాటమ రాజు కథలు చెప్తుంటారు. మూలపురుషుడు అలగొల్ల మంద జగ్గన్న. పదిహేను నుండి ఇరవై రోజులు కథలను చెపుతూ అరవై బొమ్మలను చూపుతూ కథాగానం చేస్తారని రొండి అర్జున్ వివరించాడు. యక్షగాన ప్రశస్తి ఒక పరిశీలన అను వ్యాసం నందు ఆంధ్రసాహిత్యంలో యక్షగాన ప్రశస్తి శ్రీనాథుని భీమఖండంలోనే స్పష్టంగా కానవచ్చింది.

కీర్తింతు రెద్దాని గంధర్వులు !!
గాంధర్వమున యక్షగాన సరణి !!

పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో దీని ప్రశస్తి కలదు. దీని బట్టి పరిశీలిస్తే పాల్కురికి సోమ నాథునికి పూర్వమే పాత్రల చేత ఆటపాటల రూపంలో ప్రయోగించబడే యక్షగాన ప్రక్రియ జక్కుల చేత పోషింపబడిందని తెలియుచున్నది. యక్షగాన ప్రక్రియ గూర్చి ఆచార్య యస్వీ జోగారావు వివరిస్తూ ప్రోలుగంటి చెన్నశౌరి రచించిన సౌభరి చరిత్రం మొదటిదని, వెల్లంకి తాళంభట్టు గారి లక్ష్మీకళ్యాణము రెండవదని, చక్రపురి రాఘవాచార్యుని విప్రనారాయణ చరిత్ర మూడోదని, కందుకూరి రుద్రకవి వారి సుగ్రీవ విజయం నాల్గోదని వివరించాడు. ప్రకటించబడిన మొదటి యక్షగానం సుగ్రీవ విజయమే. యక్షగానం నాంది భాగవత్‌స్తుతితో ప్రారంభమై, వినాయకస్తుతి, పూర్వ కవిస్తుతి, కుకవినింద, కృతిభర్త వర్ణనం షష్ఠ్యంతాలుగా ప్రవర్తించబడతాయి. 17వ శతాబ్దం ఉత్తరార్థం యక్షగాన యుగంగా గుర్తించడం జరిగిందని మెరుపుటాల సతీష్‌కుమార్ పేర్కొన్నాడు

**ఆధునిక వ్యాసాలు :**

కాల్పనిక కవితలో ఆరు రకాల స్వేచ్ఛలు వ్యాసం యందు స్వేచ్ఛలను ఆరు రకాలుగా వర్గీకరించింది అసిరెడ్డి లక్ష్మి. అవి భావస్వేచ్ఛ, భాషాస్వేచ్ఛ, వ్యక్తిస్వేచ్ఛ, దేశస్వేచ్ఛ, జాతిస్వేచ్ఛ, రాష్ట్ర స్వేచ్ఛ, భావం ఆత్మాశ్రయం కావచ్చు. పరాశ్రయం కావచ్చు. విశ్వశ్రయం కావచ్చు. కవితలో కల్పనికోద్వేగం, ఆవేశం ముఖ్యం. ఈ లక్షణాలు దేవులపల్లి గారి కవితలో కనపడుతుంది. తెలుగులో కాల్పనిక కవులు భావ స్వేచ్ఛతో పాటు భాషా స్వేచ్ఛను సాధించారు. కాల్పనిక కవులకు భాష అంటే అభివ్యక్తి. భావా స్వేచ్ఛ ఊహాలోక సంబంధి, వ్యక్తి, దేశ, జాతి, రాష్ట్ర స్వేచ్ఛలు సమాజ సంబంధాలని రచయిత్రి విశ్లేషిం చింది. ముద్దెర ఒక పరిశీలన అను వ్యాసం నందు తెలంగాణ ఉద్యమం తెలుగు సాహిత్యంను కూడా మలుపుతిప్పింది. ప్రాంతీయవాద ఉనికిని కాపాడు కోవాలనే ఈ కోణంలోనే వచ్చిన రచన ముద్దెర (తెలంగాణ ప్రాంతీయ ఆస్తిత్వ వాద సాహిత్య విమర్శ వ్యాసాలు). దీని సంపాదకురాలు ముదిగంటి సుజాతరెడ్డి. పద్నాలుగు వ్యాసాలతో విమర్శన రంగంలో ఒక రత్నం వలె వెలిగి పోయిన రచన. ముదిగంటి సుజాతరెడ్డి అస్థిత్వవాదం - ఒక ఉపోద్ఘాటం వ్యాసంలో ప్రపంచీకరణ మూలాన అనేక దేశాల జాతులకు, భాషలకు, సంస్కృతులకు ముప్పు ప్రారంభమైనదని పైడిపెల్లి దేవేంద్ర విశ్లేశించింది. రేగులపాటి కిషన్‌రావు - సంస్కార కథలు వ్యాసం నందు కిషన్‌రావు గారు వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. ఇతను ఆరు కథా సంపుటాలు, పదమూడు కవిత సంకలనాలు, నాలుగు నవలలు, భాగవత విషస్వరం అను విమర్శ గ్రంథం. ఒక వ్యాస సంపుటి, సమీక్ష వ్యాసాలు, వీరి కలం నుండి జాలువారాయి. ఈ వ్యాసంలో సంస్కారం కథల సంపుటి గురించి విశ్లేషిస్తూ ఇందులో 15 కథలు ఉన్నాయి. సమాజంలో వస్తున్న మార్పులు, మానవ నైజాలు, మోసకారులు, దుర్మార్గులు, వారి స్వభావాలను చాలా వాస్తవికంగా చిత్రించారు అని రచయిత్రి కాటుకం శారద విశ్లేషించారు.

జాషువా కవిత్వం - స్త్రీల అభ్యుదయం అను వ్యాసం యందు జాషువా గబ్బిలం, అనాథ, ముంతాజ్ మహల్, కొత్త లోకంలో స్త్రీల అభ్యుదయంను గూర్చి వివరించాడు. 1940లో గబ్బిలం ఖండ కావ్యంను రాశారు. అస్పృశ్యత,

వర్ణ వ్యవస్థ నిరసన,అనైక మత్యం,స్వార్థలబ్ధిత, పీడిత తాడిత పంచమ జాతికి ప్రతినిధిగా గబ్బిలంను రాశాడు. అనాథ కావ్యంలో స్త్రీమూర్తి నిరుపేదరాలు, మాల వనిత, జోగురాలు చంటి బిడ్డతో భర్తను పోగొట్టుకున్న పేదరాలు. ముంతాజ్ మహల్‌ను భార్య ప్రేమ చిహ్నంగా రాసిన కావ్యం. కొత్త లోకంలో నూతన లోకం ఏలా ఉండాలో వివరించాడని విమర్శకుడు ధర్మవరపు నాగయ్య విశ్లేషించాడు. ప్రజలను చైతన్యవంతం చేసిన నాటక సాహిత్యం అను వ్యాసంలో సుంకర సత్యనారాయణ వాసిరెడ్డి భాస్కరరావు గార్ల చారిత్రత్మకమైన నాటకం మా భూమి. నిజాం నిరంకుశతత్వాన్ని వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు జరిపినపోరాటమే మా భూమి నాటక ఇతివృత్తం. తెలంగాణ విముక్తి పోరాటంలో కొన్ని వేల మంది వీరులు అమరులై నేల కొరిగారు. ఈ నాటకంలోని ప్రతి పాత్ర ఈ గడ్డలో పుట్టి పెరిగిన జీవితాలు, వాస్తవికమైనపాత్ర చిత్రణ. తెలంగాణ యాస అన్నియు ఈ నాటకంను మహా కావ్యంగా నిలబెట్టాయి. నిరక్ష రాస్యత ప్రజల బ్రతుకుల్ని ఏలా కుంగదీసిందో తెలుసుకోవచ్చు. ఈ నాటకం ప్రజలను చైతన్యవంతం చేసిందని గండెల చంద్రశేఖర్, ఓరగంటి ఎల్లయ్యలు సంయుక్తంగా విశ్లేషించారు. బహుముఖ ప్రజ్ఞా సంపన్నులు, రాజకీయ దురంధరులు, చిన్నప్పటి నుండి భాష, సాహిత్యాల పట్ల ఆసక్తి కలిగి ఉన్నాడు. పి.వి. నరసింహారావు తెలుగు మాతృభాష కాబట్టి తెలుగు సాహిత్యం పట్ల ప్రత్యేక మమకారం చూపేవాడు. గొల్ల రామయ్య కథ, ది ఇన్‌సైడర్, అబల జీవితం వంటి రచనలు చేశాడు.1948లో కాకతీయ వారపత్రికను స్థాపించాడు. యావత్ దేశం గర్వించదగ్గ వ్యక్తి అతను అని పి.వి. నరసింహరావు గారి సాహిత్యం - స్థూలదర్శనం అను వ్యాసంలో పొన్నలూరి శ్రీనివాసఫణి విశ్లేషించారు. తరతరాల తెలుగు - వెలుగు - నృత్యగేయ రూపకము అను వ్యాసం నందు డా॥ సి.నా.రె. తన ఒక్కొక్క అక్షరం వెనుక సరళత, సరసత, నవీనత, బావుకత, స్నేహశీలత, ఆర్ద్రత, సాహిత్య సంప్రదాయాల విజ్ఞత ఉందని సి.నా.రె. అభిప్రాయం తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న గొప్ప కవి సి.నా.రె. అని గూడెపు అనిత ప్రశంస పూర్వకంగా వివరించింది. కాళోజి కథల్లో ప్రజాస్వామ్యం థృక్పథం వ్యాసం నందు సమకాలీన సంఘటనల పట్ల స్పందిస్తూ నిబద్ధతతో కాళోజి రాసిన కథలు ఆలోచింపచేస్తాయని లింగాల సురేష్ వివరించాడు. తెలంగాణ గర్వించదగ్గ రచయిత ఐతా చంద్రయ్య వ్యాసంలో బడుగు బలహీన వర్గాల చిత్రణ ఐతా చంద్రయ్య మధ్య తరగతి చెందిన వ్యక్తి. కథా, నవలలు, నాటికలు రచించాడని తోట శారద విశ్లేషించింది.

వల్లంపట్ల నాగేశ్వరరావు - సారా వ్యతిరేకోద్యమ గీతాలు వ్యాసం నందు అనేక రంగాలలో నైపుణ్యం సాధించిన బహుముఖ ప్రజ్ఞాశాలి నాగేశ్వరరావు. సారమీద మన్నుబడ అను ప్రబోదాత్మక గేయాలను రచించాడు జీవితాలు, కుటుంబాలు అదో పాతాళం చేరడానికి సారా కారణమని కవి తన రచనలో పలికించాడని పొన్నాల ఉపేందర్ అక్షరీకరించాడు. గురజాడ కథలు - మతం దృష్టికోణం అను వ్యాసం నందు గురజాడ వారి మీపేరేమిటి, మతము, విమతము కథల యందు స్థానిక చరిత్ర, ప్రజల సమస్యలను కథ వస్తువుగా తీసుకొని రచన చేశారని నల్ల సమ్మయ్య విశ్లేషించాడు. డా. మలయశ్రీ నవల సాహిత్యం పరిశీలన అను వ్యాసం నందు మానవతవాది నలభైయేండ్లు ఉపాధ్యాయ వృత్తిలో రాణించిన వారు అని వారి కొన్ని నవలలు సీరియల్‌గా వచ్చాయని అలువాల మహేందర్ విశ్లేషించాడు. నాడిమెట్ల రామయ్య గేయ కవిత్వం - పరిశీలన వ్యాసం నందు రామయ్య రచనలో తెలంగాణ యాస, తెలుగు మాండలికాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. వర్తమాన అంశాలను సునిశితంగా తీసుకొని రచనలు చేసి ప్రజాకవిగా మన్ననలు పొందారని శివశేఖర్ అక్షరీకరించాడు. దళిత దిక్కారస్వరం - దామెర రాములు వ్యాసంలో సమాజం మధ్య అణచివేత అధికార చెలాయింపు మూలాన వైరుధ్యాలేర్పడుతాయని ఇవి పోవాలంటే తిరుగుబాటే మార్గం అని రాములు గారి అభిప్రాయం అని మచ్చ విజేందర్ వివరించాడు. ప్రజల మనిషి సామాజిక చైతన్యం వ్యాసం నందు

వట్టికోట నిజామాబాద్ జిల్లా దిమ్మగూడెం గ్రామంను ఇతివృత్తంగా తీసుకొని ప్రజల మనిషి రచించాడు. రాచరిక వ్యవస్థ ఫ్యూడల్ నిరంకుశత్వం, వెట్టిచాకిరి ఈ నవలోని ఇతివృత్తాలు అని అట్టపల్లి శ్రీలత విశ్లేషించింది. పెన్ను తోనే పాలకుల వెన్నులో వణుకు పుట్టించిన వీరుడు ఎక్క డైన అన్యాయం జరిగితే ఎదురోడి పోరాడాలి అని విన్న వించాడని దిక్కార స్వభావం కాళోజి కవిత్వంలో అంకం దామోదర్ విశ్లేషించాడు. ప్రభాకర్ జైనీ జీవితం సాహిత్యం వ్యాసం నందు జైనీ అనేక రచనలు చేశాడు. సమాజసేవ చేశాడు అని కందికట్ల ప్రకాష్ వివరించాడు. పి.వి. రమణ నాటకాలు ఒక పరిశీలన అను వ్యాసం నందు రమణ సామాన్యులు అణచివేతను, దౌర్జన్యంను అంగీకరించి నంతకాలం అణిగిమణిగి ఉండాల్సిందేనని ఐక్యమై ఏదిరిస్తే విజయం సాధ్యమని రమణ పేర్కొన్నాడని ముద్ద మల్ల సుభాషిణి అక్షరీకరించారు.

మనుగడ పోరాటంలో మైనార్టీలు వ్యాసం నందు బాబ్రీ మసీదు కూల్చివేతతో మైనార్టీ కవిత ప్రారంభమైంది. అనేకమంది మైనార్టీ కవులు తమ కవితల ద్వారా ముస్లిం సమస్యల్ని చిత్రిస్తూ వారి చైతన్యానికి దోహదం చేశారని జోగు సంతోష్‌కుమార్ పేర్కొన్నాడు. వవిధ భక్తి మార్గాలను గూర్చి దండిబోట్ల శ్రీ శిరిడిసాయి శతకంలో శ్రవణం, కీర్తనం, స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యాం, ఆత్మనివేదనం నవవిద భక్తి మార్గాలను డా॥ లక్ష్మణరావు విశ్లేషించాడు. తెలుగులో తొలి అద్యమకుట శతకం వ్యాసం నందు మకుటాల ఆధా రంగా చేసుకొని శతకాలను వివరాణాత్మకంగా పొరుండ్ల శంకర్ విశ్లేషించాడు. డా॥ టి. శ్రీరంగస్వామి రచనలు - పరిచయం వ్యాసంలో రంగస్వామి విశ్వనాథ వారి కృష్ణకావ్యంపై పి.హెచ్.డి. చేశాడు. రంగస్వామి అనేక సత్కారాలు, సన్మానాలు పొందాడని ఏరుకొండ శ్యాం ప్రసాద్ విశ్లేషించాడు. తొలి తరం తెలంగాణ కథలు - సంస్కృతి అను వ్యాసం నందు తెలంగాణలో పండుగల అవిర్భావం, సాంప్రదాయాలను కల్లెబోయిన కుమార స్వామి విశ్లేషించాడు. గ్రామదేవతలలో ఎల్లమ్మ ప్రాము ఖ్యాన్ని గురించి వివరిస్తూ మద్దిరాల సత్యనారాయణరెడ్డి మనిషి విశ్వాసానికి సంబంధించిన, కాసుల ప్రతాపరెడ్డి రాసిన ఎల్లమ్మ కథ ప్రాముఖ్యాన్ని సమగ్రంగా అక్షరీకరిం చాడు. ఈ కథలో సత్యనారాయణరెడ్డి రచయిత అభివ్యక్తి రీతిని అర్థం చేసుకొని ధృక్పథాన్ని సూటిగా పట్టుకొని కాసుల ప్రతాపరెడ్డి ఎల్లమ్మ కథ - విశ్లేషణ అను వ్యాసంలో వ్యక్తీకరించాడు.

ఈ వ్యాస సంకలనంలో ఆయా రచయితలు గ్రంథాల మూలాలను కనిపెట్టడానికి పడిన తపన స్పష్టంగా కనిపిస్తుంది. ఇలాంటి సమగ్రమైన వ్యాసాలు పరిశోధకు లకు, విమర్శకులకు, విశ్లేషకులకు చాలా ఉపయోగ కరంగా ఉంటాయి. ఇలాంటి వ్యాస సంకలనాలు ఇంకా అనేకంగా రావాలని ఆశిద్దాం.

### ఉపయుక్త గ్రంథసూచి :

1. పరీక్షణం (సంపాదకులు - మద్దిరాల సత్యనారాయణరెడ్డి)
2. ముద్దెర (సంపాదకులు - ముదిగంటి సుజాతారెడ్డి)
3. ఎల్లమ్మ ఇతర కథలు

# స్త్రీ హక్కుల వైవిధ్యం – 'ఈ' పత్రికా సాహిత్యం

– ఆచార్య **కొలకలూరి మధుజ్యోతి,** తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

'ఈ' పత్రికా సాహిత్యం ఇతర సాహిత్యంలాంటిదే. కాని, దేశవిదేశాలలోని తెలుగు రచయితల రచనలతో పత్రికలు ఉంటాయి. సంస్కృతి వైవిధ్యం ఉంటుంది. ఈ నేపథ్యం హక్కులు అనుభవించటంపై ఉండే అవకాశం

ఉంది. ఈ దేశంలో ప్రాథమిక హక్కులు భద్రతను ఇస్తే, విదేశాలలోని ప్రవాసాంధ్రులకు మానవ హక్కులు రక్షణ కల్పిస్తాయి. ఈ నేపథ్యంలో హక్కులు ఎంత వరకు అనుభవ యోగ్యంగా ఉన్నాయో స్త్రీలు ఎలా అనుభవిస్తు న్నారో చూడటం ఈ పత్ర లక్ష్యం.

1. స్వేచ్ఛకు పరిమితులు ఉంటాయి. మార్పులు ఉంటాయి. దేశదేశాలకు మధ్య స్వేచ్ఛ అనుభవించటంలో పొందటంలో వైవిధ్యం ఉంటుంది. ఒక చోట ఉన్న స్వేచ్ఛ మరో దేశంలో అభ్యంతరంగా భావింపబడే అవకాశం ఉంది. 'ఆచార్య దేవోభవ' (పి.కె. జయలక్ష్మి - సుజనరంజని) కథలో గాయత్రి యూరోప్‌కు విజిటింగ్ ప్రొఫెసర్‌గా వెళ్ళింది. ఇది ఒక స్వేచ్ఛ. స్వేచ్ఛ అంటే Freedom of movement. మానవహక్కులు వ్యక్తి స్వేచ్ఛను దేశ భౌగోళిక పరిధులను దాటి ఎక్కడైనా ఎవరైనా సంచరించవచ్చు. ఉపాధి నేర్పర్చుకోవచ్చు, జీవించవచ్చు. ఆ హక్కును పొందటం గాయత్రి విదేశి సందర్శనానికి, విదేశాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించ టానికి నిదర్శనం.

   ప్రొఫెసర్‌గా భారతదేశంలో విద్యార్థుల నుంచి లభించే వినయవిధేయతలకు గౌరవానికి అలవాటు పడిన గాయత్రి, యూరప్ విద్యార్థుల యథాలాప ప్రవర్తనతో సర్దుకోలేక రాజీపడలేక, వారిని దారిలో పెడుతున్నా ననుకొంటూ తనకు అలవాటయిన విధానాలను వారికి నేర్పే ప్రయత్నం చేస్తూ వ్యతిరేకతను పోగుచేసుకొంది. భారతదేశంలో లాగా విద్యార్థులు తల్లిదండ్రులపై ఆధార పడరు, వారి సంపాదన వారు సంపాదించుకోవాలి, ఈ క్రమంలో వారు రోజూ తరగతులకు రాలేరు అంటూ విభిన్న దేశాల విద్యార్థుల మధ్య ఉన్న వైవిధ్యాన్ని భారత దేశాన్ని ఇష్టపడే విద్యార్థిని ద్వారా తెలుసుకొంది. కథాంతానికి విద్యార్థులను తన మార్గానికి తెచ్చు కొన్నట్లు ఉంది.

   ఇక్కడ విద్యార్థుల అనుభవించే స్వేచ్ఛ, ఆచార్యులు భావించిన స్వేచ్ఛ విభిన్నం. వారి స్వేచ్ఛ, ఆచార్యుల ఆంతర్యం పక్కవారికి అర్థం కాక వారివారి పరిధిలో తమ హక్కులకు భంగం కలిగిందని భావించారు. ఆచార్యుల స్వేచ్ఛ విషయబోధనకే పరిమితం కావలసి వచ్చింది. విద్యార్థులను తీర్చిదిద్దే పరిధి తనది కాకుండా పోయింది. సంస్కృతి వైవిధ్యం స్వేచ్ఛకు పరిమితులను నిర్ణయించాయి.

2. మరోకథ సుజనరంజనిలో కథాభారతి శీర్షిక కింద వచ్చిన 'బల్గేరియాకథలు' ( కె.రావు, సుజనరంజని - సిలికానాంధ్ర) గీతిక, ఓ సెమినార్‌కు వచ్చినెల ఉండి బల్గేరియా టర్కి చూడాలనుకొంది. అక్కడ వున్న సంస్కృతిని, స్త్రీ పురుషుల విశృంఖల స్వేచ్ఛను బహిరంగ చుంబనాలను చూసి చికాకు పడే గీతకకు స్నేహితురాలు రచన, అది పరస్పర ఇష్టంతో జరి గేది అని ఏ ఒక్కరి బలవంతమో కాదని ఇతర దేశాలలో లాగా లైంగిక దాడులు అత్యాచారాలు ఉండవని, అది ఈ దేశ సంస్కృతిలోని గొప్ప తనమని స్నేహితురాలికి విడమర్చి చెప్పింది.

3. స్వేచ్ఛ విశృంఖలతకు అర్థం కాదు. 'సివిలైజ్డ్ ఇన్ అమెరికా' (సాయి బ్రహ్మానందం - ఈ మాట) కథలో నాయకుడు చాలా నాగరికుడు. ఎంతగా అంటే

కూతురిని, ఈ వారం బాయ్‌ఫ్రెండ్ మారాడా ఇంకా పాత వాడేనా? అనేంత. పిల్లలతో అలాగే ఉండాలని వారికి స్వేచ్ఛ ఉండాలని భావించే వ్యక్తిని తాను అనే చెప్పాడు భార్య రాధికతో. ఈ కథ అంతా కొంత హస్యంగా నడిచినా విదేశీ సంస్కృతిలో తెలుగు వాళ్ళ జీవితం పట్ల వ్యంగ్యాస్త్రానికి సంధించింది. ఆ సాయంత్రం ఇంటికి రాధిక స్నేహితుడు బిల్ వచ్చాడు. భర్తకు పరిచయం చేసి ఆరు నెలలుగా తామిద్దరికి సంబంధం ఉందని, ఒప్పుకొంటే ముగ్గురం కలిసి ఉందామని, లేకపోతే విడాకులు ఇచ్చి బిల్‌తో వెళ్ళిపోతానని అంది. నాగరికత సంస్కృతులు వేరు. విలువలు ఆయా సంస్కృతుల ఫలితమే. భారతీయ సంస్కృతిని విడిచి అమెరికా సంస్కృతిని అలవరుచుకొని తన స్వేచ్ఛ పరిధిని నిస్సంకోచంగా వ్యక్త పరిచింది రాధిక.

4. 'మాంగల్యానికి మరోఅర్థం'(శింగిశెట్టి సంజీవ రావు - కౌముది.నెట్) కథ స్వేచ్ఛకు కొత్త భాష్యం ఇచ్చింది. సవిత తమ గారాల బిడ్డ నిత్య సుమంగళిగా ఉండాలని భావించి వివాహం చేశారు. వివాహ మండపంలోనే పెళ్ళి కొడుకు చనిపోయాడు. సుమంగళిగా ఉండడాన్ని కోరిన ఆ తల్లిదండ్రులు బిడ్డను సతీసహగమనం చేయించి సుమంళిగా పోయిన సౌభాగ్యాన్నివ్వాలనుకొన్నారు. బిడ్డను సతీసహగమనం చేయించాలని తల్లిదండ్రులను కోవటం హాస్యాస్పదం మూర్ఖత్వం. కథను మలుపు తిప్పటానికి ఒక కారాణంగా ఈ నిర్ణయాన్ని ఆ తల్లిదండ్రులు తీసుకొన్నట్లు రచయిత భావించి రాశాడు.

సవితకు బతకాలనే ఆశ ఉంటుందని గ్రహింపులేని అత్తామామలూ దానికి అంగీకరించారు. హ్యూమన్ రైట్స్ యాక్ట్‌లోని రెండవ ఆర్టికల్ వ్యక్తికి ఉన్న జీవించే హక్కు ఉందని చెప్తుంది. ఆమె హక్కును అందరూ కాలరాయదలిస్తే, సవిత భర్త శరీరాన్ని ఐసుపెట్టెలో ఉంచుకొని ఆ భర్తతో తాను సుమంగళిగా జీవిస్తానని ప్రకటించింది. ముగింపు నిర్హేతుకమే అయినా, సవిత తన జీవించే హక్కును స్వేచ్ఛను అలా కాపాడుకొంది.

5. 'ఆడదే ఆధారం'(ఆదూరి హైమావతి, తెలుగు ఉమెన్ మ్యాగజైన్) కథలో సావిత్రి ముగ్గురాడపిల్లల తల్లి, మళ్ళీ గర్భంతో ఉంది. ఆడపిల్లలు వద్దనుకొనే తండ్రి మళ్ళీ ఆడపిల్లే కలిగితే చంపేస్తానంటూ కల్గించిన భయం పిల్లల్లో తల్లిలో నాటుకుపోయింది. చదువుకోసం పెద్దకూతురడిగిన డబ్బు ఇవ్వకపోగా నిండుగర్భిణిని తన్ని వెళ్ళిపోయాడు. పిల్లలు, స్కూలు టీచరు సాయంతో స్కూలు వారి ఆసుపత్రిలో చేర్చారు. ఆడపిల్లను కన్న సావిత్రి బతుకు తీపితో భర్త దగ్గరకు వెళ్ళకుండా బిడ్డలను పెంచి ప్రయోజకులను చేసింది. అసహాయ స్థితిలో ఆసుపత్రి మెట్లపై పడి ఉన్న తండ్రికి వైద్యం చేసింది సావిత్రి పెద్ద కూతురు. జీవించే హక్కు కాలరాసే భర్త దగ్గరకు వెళ్ళేకంటే వెళ్ళి చిత్రవధలు అనుభవించేకంటే తన స్వీయశక్తిని నమ్ముకొని బతికింది బతికించింది.

6. జీవించే హక్కు స్వేచ్ఛకు ఒక నిర్వచనం అయితే ఎలా జీవించటం అనేది ఒక ప్రశ్నే. విద్య ఉద్యోగాలలో స్త్రీ పురుషులు సమానంగా అర్హులుగా ఉంటున్నారు. ప్రపంచపోకడలూ వీరికి పరిచయం అవుతూ ఉన్నాయి. పుట్టి పెరిగిన వాతావరణం ఇచ్చిన సంస్కృతి, కొత్తగా పరిచయం అవుతున్న సంస్కృతి మధ్యలో యువత ముఖ్యంగా స్త్రీలు నలుగుతున్నారు నష్టపోతున్నారు. పునాదులుగా ఉన్న సంప్రదాయ భావాలను దూరం చేసుకోలేక కొత్తగా అలవర్చుకొన్న సాహసోపేత సవాళ్ళతో రాజీపడలేక కొట్టుమిట్టాడుతున్నారు. అలాంటి యువతి సారిక. సహజీవనం అనే ధోరణి నేడు మహాపట్టణాలలో యువతీ యువకుల జీవిత పంథా అయ్యింది. సారిక గోపి అలాగే జీవించటానికి ఇష్టపడ్డారు 'సారి -రా -సారిక(వియోగి-

కౌముది.నెట్). ఇరు వైపులా తల్లిదండ్రులు దూరం అయ్యారు. కాలం గడిచింది. గర్భవతి అయిన సారిక గోపి వివాహ దృష్టిలో తాను లేవని తెలుసుకొంది. ఘర్షణ జరిగి గర్భస్రావం అయ్యింది. స్నేహితుల సహాయంతో గండం గడిచింది. తమ ఇంట్లో గోపి మరోస్త్రీతో గడపడం సహించలేని సారిక అతడిని వదిలి వెళ్ళింది. వివాహ వ్యవస్థకు వెలుపల జీవించటం సహజీవనం. నేడు ఇది ఈ దేశంలో పెరుగుతూ ఉంది. సుప్రీంకోర్టు కూడా సహ జీవనంలో ఉండి దంపతులలాగానే జీవితాన్ని గడిపినప్పుడు ఆ స్త్రీకి రక్షణను కల్పించాలని పేర్కొంది. సహజీవనంలో గోపి సారికలు సమా నంగా భాగమయినా, గోపిలాగా సారిక ఆ బంధాన్ని తేలిగ్గా భావించలేకపోయింది. నలిగి పోయింది. ఆరోగ్యాన్ని మానసిక ప్రశాంతతను కోల్పోయింది. బంధు వర్గానికి దూరం అయ్యింది. సహజీవన మార్గాన్ని ఎంచుకొన్న స్వేచ్ఛ బతుకుకే ఎసరుపెట్టే పరిస్థితి అయ్యింది.

7. భ్రూణ హత్యలు నేరం. గర్భస్థ శిశువు ఆడబిడ్డ అని తెలిస్తే ఉసురు తీసే సామాజిక స్థితి నెలకొని ఉంది. 'నాన్నా! ఒక్క జన్మనివ్వు' (బైతి దుర్గయ్య - గో తెలుగు) కథ అటువంటిదే. ఆడబిడ్డ పట్ల పాతుకుపోయిన వివక్షను తొలగించటానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. Female infanticide prevention act 1970; Act viii of 1870 ఇవి బ్రిటిష్ పాలనలోని భారతదేశంలో చేసిన చట్టాలు. గర్భస్థ శిశువు తల్లి ధరణితో వెళ్లి బుచ్చే ఆశ ఆక్రోశాల వెనుక నిస్సంకోచంగా జరుగుతున్న ఆడబిడ్డల హననం వుంది. ఆధునిక సాంకేతికత ఈ హత్యలకు మరింత దోహదమవుతూ ఉంది. Preconception an prenatal diagnostic Technic Act (PCPNDT) ద్వారా 1994 లో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను నిషేధించారు. ఎన్ని చట్టాలు వచ్చినా, స్త్రీ మనుగడ గర్భస్థ దశ నుంచే ప్రమాదంలో ఉండటం మారకుండా నిల్చి ఉన్న వాస్తవం.

8. 'ప్రశ్న' (గీతాంజలి - తెలుగు ఉమెన్ మ్యాగజైన్) కథ అంతా పసివారిపై జరిగే అరాచాకాలు అకృత్యా లపై ఆందోళన. సుధీర్ స్వరూపల కూతురు నీహారిక. ఆరేళ్ళ నీహారిక స్నేహితురాలైన రమ్య ఎదురింట్లో ఉన్న శ్రీనివాస్ వలన అత్యాచారానికి గురయ్యింది. పసిపిల్లలపై ఇలాంటి దాడులు అధికంగా జరుగుతున్నాయి. పెరుగతున్నాయి. Protection of children from sexual offerces act 2012 (POSCO) చట్టం వచ్చింది. Sexual assault తీవ్రతనుబట్టి (pib.gov.in) శిక్ష ఉం టుంది. పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా మాత్రం ఆపలేకపోతూ ఉంది. అందుకే రచయిత్రి పసిపిల్లలకు పరులు తమను తాకకూడని భాగాల పట్ల స్పృహను కల్పించాలి అని పేర్కొంది. అది అత్యవసరం. అలా అనుచిత ప్రవర్తనకు గురైతే వెంటనే అరవాలని పిల్లలకు తెలియ చేయాలి.

9. 'సమస్య - పరిష్కారం' (గంటిసుజల- భూమిక) కథ ఇంజినీరింగ్ చదువుతున్న పదిహేడేళ్ళ స్రవంతిది. పదహారు పదిహేడు సంవత్సరాల వయస్సులోనే మగపిల్లలతో స్నేహాలు ఆడపిల్లల జీవితాలను కుదిపేస్తున్నాయి. స్రవంతి స్నేహితు రాలిని అన్నను ఇష్టపడింది. అది సన్నిహితతను ప్రోత్సహించింది. వారిద్దరూ సన్నిహితంగా ఉన్న సమయాన్ని వీడియో తీసి వెబ్‌సైట్‌లో పెట్టాడు. అది తెలిసి ఏడుపుతో కుంగిపోతున్న కూతురిని అడిగి తెలుసుకొన్న తల్లి, బిడ్డకు ధైర్యం చెప్పింది. అలాంటి దురవస్థనే ఎదుర్కొంటున్న స్రవంతి స్నేహితురాలు సుమ ఇంటికి వెళ్ళి ఆ తల్లితో మాట్లాడి, వాడి లాప్‌టాప్‌ని పిల్లల ద్వారా యుక్తితో తెప్పించింది. అది తెస్తే, వాడికి శిక్ష ఖాయం. ఆన్ లైన్ వేధింపులకు చట్టాలున్నాయి. అశ్లీల వీడియో

లను కొనే వెబ్‌సైట్‌లు ఉన్నాయి. ఆ డబ్బుకోసం దిగజారేవారు ఉన్నారు. కాని, స్త్రీ సమ్మతి లేకుండా అలాంటి దృశ్యాల చిత్రీకరణ వెబ్‌లో ఉంచటం నేరం. ఐపిసి సెక్షన్ 354 సి1P & IT Act ప్రకారం నేరం. మూడేళ్ళ జైలు శిక్ష (mirrornownews.com). స్రవంతి తల్లి సైబర్‌క్రైమ్ వారికి సమాచారం ఇచ్చింది. వెబ్‌సైట్ నిర్వాహకులను, ఈజీమనీకోసం పాట్లుపడే యువకులను అరెస్టు చేశారు. ఆన్‌లైన్ వేధింపులు హెచ్చు మీరుతున్నాయి. ఇలాంటి ధైర్యం అందరూ చేయాలి తప్పు దారి పట్టిన వాళ్ళను చట్టానికి పట్టివ్వాలి.

ఈ కథలన్నీ విభిన్న సమస్యలు హక్కుల ప్రస్తావనను చెప్పేవే. స్త్రీ ఏ దేశంలో ఉన్నా ఏ స్థాయిలో ఉన్న ఆమె హక్కులు అనుభవించటం ప్రశ్నార్థకం అవుతూ ఉంది. కొన్నిసార్లు సంస్కృతిలో వైవిధ్యం హక్కుల అనుభవించటంలో హద్దులను ఏర్పరిస్తే చాలా సందర్భాలలో సమాజ కల్పిత ప్రతిబంధకాలు హక్కులను అనుభవించనీయకుండా చేస్తున్నాయి.

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# టి.జి.ఆర్. ప్రసాద్ కథలు - నామ సార్థకత పరిశీలన

- యస్. రాధిక
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు.

- డా॥. పి. శ్రీనివాసులు
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు.

డా॥. టి.జి.ఆర్. ప్రసాద్‌గారు సుమారుగా 300 కథలు బాలల కోసం సృష్టించిన బాల కథా రచయిత. వీరు సిల్వర్ జూబిలీ కళాశాల, కర్నూలు నందు ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. విద్యారంగంలో సుమారు మూడు దశాబ్దాలుగా వివిధ స్థాయిలలో సేవలందించిన సాహితీ కృషీవలుడు. వీరి రచనలలో సమాజంలో ప్రత్యేకించి భవిష్యత్ తరంలో మానవీయ విలువలు నింపాలనే తృష్ణ, వారికి బాలకథా రచయితగా నిలబెట్టడానికి ప్రేరణ. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు తరచు "దేశము యొక్క అభివృద్ధి పాఠశాల తరగతి గదుల్లో నిర్మాణమవుతుందని చెబుతూ ఉండేవారు. "నేటి బాలలే రేపటి పౌరులు".

రచయిత పాత్రలకు, కథలకు పేర్లను నిర్ణయిం చేటప్పుడు వివిధ అంశాలను దృష్టిలో పెట్టుకొని పెడు తుంటారు. ప్రసాద్ గారి కథలు పరిశీలిస్తే ఈ విషయం మరింత అర్థమవుతుంది. ప్రసాద్‌గారు తమ పాత్రల పేర్లను ప్రత్యేక దృష్టితో ఆలోచించి పెట్టారనిపిస్తుంది. ఈ వ్యాసంలో అటువంటి కొన్నింటిని ప్రస్తావించడం జరుగుతోంది.

అదృష్ట వంతుడు కథ లో ప్రధానంగా రాజకుమారి దేవసేన అయినప్పటికి, ఆ పాత్రచుట్టూ సంబంధం కలిగి ప్రధాన కథకు ఆలంబనగా నిలిచే పురుష పాత్రలు - పుళిందుడు, కృపాసాగరుడు, ధన్వంతరి, ప్రసేనుడు, ప్లవంగుడు.

<u>పుళిందుడు</u> ఈ కథలో శబర యువకుడు. అడవిలో రాజకుమారిని సింహం నుండి రక్షించాడు. అడవిలో ఆటవిక జాతికి చెందిన యువకుడు కాబట్టి పుళిందుడు అని పేరు పెట్టడం సమంజసం. రాజకుమారి ఎముకల వ్యాధితో బాధపడుతూ ఉన్న సమయంలో ఎంతో మంది వైద్యులు ప్రయత్నించి విఫలమయిన సందర్భంలో ఒక నిష్ణాతుడైన వైద్య యువకుడు వచ్చి రాజకుమారికి వైద్యం చేసి ఆరోగ్యవంతురాలిని చేశాడు. ఆ యువకుడికి రచయిత ధన్వంతరి అని పేరు పెట్టాడు. ధన్వంతరి వైద్యానికి అధిదేవత. అటువంటి పేరు ఆ పాత్రకు పెట్టి రచయిత సమయస్ఫూర్తి ప్రదర్శించాడు.

<u>కృపాసాగరుడు</u> మరియొక పాత్ర. పొరుగు రాజ్యంలో రాజు ప్లవంగుడు రాజ్యంమీద దండెత్తివచ్చి, దాడిచేసి కోటను వశపరచుకొని రాజకుమారి తండ్రిని చంపి, కోటలోకి ప్రవేశించే సమయంలో రాజకుమారి కోటనుండి తప్పించుకొని రహస్యమార్గం ద్వారా అడవిలోకి పారి పోయినప్పుడు - అడవిలో ఒక యువకుడు రాజ కుమారిని రక్షించి ధైర్యం చెప్పి ఆమెకు అనేక వసతులు కల్పించి సేవ చేశాడు. ఆ యువకుడు పేరు కృపా సాగరుడు అనే పేరు పెట్టాడు రచయిత. కృపాసాగరుడు అంటే దయకు సముద్రం వంటి వాడు అని అర్థం. అడవిలో ఇబ్బందిపడుతున్న అమ్మాయిని రక్షించి, సేవ చేసి కాపాడే మంచి హృదయము కలిగిన వాడుగా చిత్రించిన ఈ పాత్రకు ఆ కృపాసాగరుడనే పేరు సముచితంగా ఉంది.

ఇక రాజకుమారిని మనసు గెలిచి, రాజకుమారి తండ్రిని చంపి రాజ్యాన్ని వశపరచుకున్న ప్లవంగునుడిని చంపి, రాజకుమారిని వివాహమాడిన యువకుడు - ప్రసేనుడు. సేనను ప్రచోదనం చేసేవాడు ప్రసేనుడు అని భావిస్తే, దేవసేనను ప్రచోదనం చేసి ధైర్యం నింపి ప్లవంగుడిపై యుద్ధం ప్రకటింపజేసి, ప్లవంగుడిని ఓడింది, విజయం సాధించడానికి కారణమయ్యాడు. కావున

ప్రసేనుడు అనే పేరు ఎంతో తగివుంది. ఈ విధంగా కథా రచయిత అదృష్టవంతుడి కథలోని పాత్రల పేర్లు ఎంతో ఉచితంగా ఉన్నాయి.

అధికార దాహం కథ అనే కథలో ప్రధాన పాత్ర లోకనాథుడు. ఈ పాత్రకు రచయిత లోకనాథుడు అనే పేరు ఎంపిక చేయటం ఎంతగానో తగి ఉంది. ఈ కథలో రాజుగారి ఆదేశం ప్రకారం తన గ్రామములో వున్న అభ్రకం గనులు త్రవ్వించడానికి, గ్రామస్తులను ఖాళీ చేయించాలి. అందుకోసం రాజభటుల సహకారం తీసుకుని గ్రామ ప్రజలను ఖాళీ చేయించాడు. ప్రజలలో తిరుగుబాటు వస్తే, బలప్రయోగంతో ఖాళీ చేయించాడు. అదే విధంగా నదిపై ఆనకట్ట కట్టడంకోసం గ్రామ ప్రజలను ఖాళీ చేయించాల్సి వచ్చినప్పుడు కూడా లోకనాథుడు యిలాగే ప్రవర్తించాడు. ప్రజలు ఎంతగా తనను నిందించినా, స్వార్థ పరుడని దూషించినా, ఏమాత్రం లెక్కచేయకుండా ప్రజల తిరుగుబాటు రాజు సహకారంతో అణచివేసి, ఆనకట్ట నిర్మాణానికి సహకరించి రాజునుండి ప్రశంసలు, అధికార హెూదా, పదవులు పొందాడు. రాజ్య సంక్షేమం కోసం ప్రజలు తనను తిట్టుకున్నా ఏమాత్రం లెక్క చేయకుండా లోక క్షేమం కోసం రాజ్య శ్రేయస్సు కోసం నిందలు పడడానికి సిద్ధపడ్డాడు. కావున ఈ పాత్రకు లోకనాథుడు అనే పేరు ఎంతగానో తగివుంది. తాత్కాలికంగా స్థానిక ప్రజల దృష్టిలో లోకనాథుడు అధికార దాహం కలిగిన వాడుగా అగుపించినా, వాస్తవానికి లోకనాథుడికి అధికారం వున్నట్లు అగుపించదు. కేవలం ప్రజాసంక్షేమం దృష్టితోనే అలా ప్రవర్తించినాడనిపిస్తుంది. స్థానిక ప్రజల దృష్టిలో మాత్రం అధికార దాహం కలిగినవాడుగా అగుపించాడు. రచయిత ప్రజల భావన దృష్టితో పేరు పెట్టినట్లు అగుపిస్తుంది.

అదేవిధంగా ఆ గ్రామానికి పెట్టిన పేరు ' సిరిపురం'. ఈ పేరు రచయిత నిర్ణయించడం ఎంతగానో సమంజసం. అభ్రకం లాంటి ఖనిజం చాలా విలువైనది. అటువంటి విలువైన ఖనిజం కలిగి వున్న ఆ మండలం సిరికి నిలయం. సిరి అంటే సంపద, లక్ష్మి. లక్ష్మిపురం అయింది. అంతేగాక ఆ మండలంలోని నదికి ఆనకట్ట కట్టడం వలన ఆ మండలమంతా సాగునీటిపారుదల సౌకర్యం పెరిగింది. తద్వారా చక్కటి పంటలు పండసాగాయి. తద్వారా ధన ధాన్యాలతో ఆ మండలం కళకళలాడింది. అందువల్ల ధనధాన్యాలతో కళకళలాడిన ఆ మండలానికి లక్ష్మిపురం ' సిరిపురం' అనే పేరు పెట్టడం ఎంతగానో తగివుంది.

'ఉత్తమ నాయకుడు' అనే కథలో రచయిత పాత్రల పేర్లు సమయోచితంగా పెట్టాడు. ఈ కథలో దత్తాత్రేయుడు, కార్తికేయుడు, రణధీరుడు, సుమంతుడు అనే నాలుగు ప్రధాన పాత్రలున్నాయి. వీళ్లు నలుగురు అవంతికా రాజ్య సంరక్షణ కోసం ప్రయత్నించారు. ఈ నలుగురు రాజ్య రక్షణకు అనుకూలించిన విధానాన్ని బట్టి, ఆలోచనను బట్టి ఆ యా పేర్లు రచయిత నిర్ణయించాడనిపిస్తుంది.

### దత్తాత్రేయుడు :

ప్రజలలో చైతన్యం కలిగిస్తూ దైవం మీద భారం వేసి రాజ్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చాడు. దత్తాత్రేయుడు దైవాంశ సంభూతుడు కావున ఆ పేరు పెట్టాడు.

### కార్తికేయుడు :

కార్తికేయుడు అంటే సుబ్రహ్మణ్యస్వామి / కుమారస్వామి. కుమార స్వామి శివ సైన్యాధిపతి. శౌర్యానికి ప్రతీక. అగ్ని స్వరూపం. ఎవరికోసం ఎదురు చూడరాదని వీరత్వం నింపి, ప్రజలలో చైతన్యం కలిగించాడు. అందుకనే కార్తికేయుడనే పేరు పెట్టాడు.

### రణధీరుడు :

రణధీరుడు - నిజంగా రణమునందు ధీరుడే. కత్తిని కత్తితోనే ఎదుర్కోవాలని, ధైర్యంతో దృఢకాయులను చేరదీసి, యుద్ధ శిక్షణనిచ్చి, పోరాటమే లక్ష్యంగా కృషి చేసి చివరకు అవంతి రాజ్యాన్ని ఆక్రమించిన రాజును చంపి, రాజ్యాన్ని శత్రువులనుండి రక్షించాడు. యుద్ధమే లక్ష్యంగా పనిచేశాడు. అందుకే రణమే పరిష్కారంగా కృషి చేసి విజయం సాధించాడు. అందుకే ఈ పాత్రకు రణధీరుడనే పేరు ఎంతగానో తగి ఉంది.

**సుమంతుడు :**

సుమతి కలవాడు. మంచి బుద్ధి కలవాడు. అహింసా మార్గం ద్వారా ప్రజలలో చైతన్యం కలిగించి, రాజ్య పరిరక్షణకు తోడ్పడ్డాడు. సాత్వికుడు. రణధీరుడు రాజ్యం జయించిన తర్వాత సుమంతుడికే రాజ్యం అప్పగించాడు. రాజ్య పరిపాలకునకు సత్వగుణం, మంచి బుద్ధి, బలం అవసరం. అందుకే రచయిత ఈ పాత్రకు సుమంతుడినే పేరు పెట్టడం ఎంతగానో సమంజసంగా వుంది.[3]

'కార్య దక్షత' అనే కథలో ప్రధాన పాత్రలలో కేశవుడు, కృతవర్మ, మదాలస, ధూమకేతువు పాత్రలు. ధూమకేతువు అనే వాడు కాంభోజ రాజకుమారిని అపహరించి, లక్షల వరహాలు కానుకగా పంపాలని, అప్పుడు మీ అమ్మాయిని వదులుతామని సందేశం పంపుతాడు. ఈ కథలో ప్రతికథానాయకుడు కాంభోజ రాజ్యం అభివృద్ధిలో వుంటే చూసి ఓర్వలేకపోయాడు. అనేక కష్టాలు కలిగించాడు. ఈర్ష్య, అసూయ కలవాడు. చివరకు చంపబడ్డాడు. ధూమకేతువు అంటే అగ్ని, ఉత్పాతము. ఒక రాక్షసుని పేరు. అగ్ని లక్షణం కాల్చడం. ఉత్పాతము అంటే అనుకోని ప్రమాదము. రాక్షస లక్షణాలయిన ఈర్ష్య, అసూయ, దయదాక్షిణ్యాలు లేకపోవడం, కఠినంగా ప్రవర్తించడం, నష్టం కలిగించడం మొదలగు లక్షణాలన్నీ ఈ పాత్రకు ఉన్నాయి. అటువంటి పాత్రకు ధూమకేతువు అనే పేరు పెట్టడం సమంజసంగా వుంది.

కృతవర్మ కార్యసాధకుడు. కాంభోజరాజ కుమార్తె మదాలసను ధూమకేతువు అపహరిస్తే, కేశవుడనే సేనాధిపతి విడిపించడానికి ప్రయత్నించి విఫలమైన తరువాత కృతవర్మ వెళ్ళి, ధూమకేతువు గుట్టు మట్టులన్నీ తెలుసుకొని, మదాలస ఎక్కడ ఉందో తెలుసుకొని ధూమకేతువు సైన్యం ఎంత ఉందో తెలుసుకొని, పోరాటానికి ప్రయత్నించి తను ఒక్కడే వున్నాడు. ఆ ధూమకేతువు సైన్యంతో పోరాడలేడని తెలుసుకొని, రాజ్యానికి తిరిగివచ్చి పెద్ద సైన్యంతో వెళ్ళి ధూమకేతువును చంపి, మదాలసను విడిపించాడు. ఈ ప్రయత్నంలో వెనకకు తిరిగి వచ్చిన కృతవర్మను అందరూ ఎగతాళి చేసినా పట్టించుకోలేదు. ఎక్కడ తగ్గాలో, ఎక్కడ పెరగాలో తెలిసి తెలివిగా ఆలోచించి, తగిన నిర్ణయాలు తీసుకొని తనకు అప్పగించిన పని సాధించాడు, తదుపరి కేశవుడి స్థానంలో సేనాధిపతిగా నియమించ బడ్డాడు.

'మదాలస'ను విడిపించిన ఈ పాత్రకు 'కృతవర్మ' అని పేరు ఎంతగానో తగివుంది. 'కృత' పూర్తిచేయబడిన అని అర్థం.తనకు అప్పగించిన కార్యం సమర్థతో పూర్తి చేయగలవాడు అనే అర్థం స్ఫురించేలా వుంది. 'మదాలస' అనే పాత్ర కాంభోజ రాజ్య రాజకుమారి, అందగత్తె. చెలికత్తెలతో కలిసి వనవిహారానికి వెళ్ళి ధూమకేతువు ద్వారా అపహరింపబడింది. 'మదాలస' అంటే ఒక అప్సరస. ఈమె విశ్వాసుడు అనే గంధర్వుని కూతురు. కువలయాశ్వుని భార్య. తాళకేతువనే రాక్షసుని చేతిలో తన భర్త చనిపోయాడని తెలుసుకొని ప్రాణత్యాగం చేయగా, ఈశ్వరుని వరప్రసాదంతో పునర్జీవితురాలైంది -పూర్వగాథాలహరి. ఈ కథలో మదాలస రాజుగారి కూతురు. ధూమకేతువుతో అపహరించబడి, కేశవుడు, కృతవర్మల ప్రయత్నంద్వారా విడిపించబడింది. అందమైన రాజకుమారి. ఇలాగ రచయిత ఈ కథలోని పాత్రలకు నామౌచిత్యం పాటించాడు.

ఈ విధంగా టి.జి.ఆర్ ప్రసాద్ గారు వారి కథలకు మరియు అందులోని పాత్రలకు పేర్లు నిర్ణయం చేసేటప్పుడు పౌరాణిక అంశాలను, చారిత్రాత్మక ఇతివృత్తాలను, జానపద కథా ఇతివృత్తాలను దృష్టిలో పెట్టుకొని ఆ యా కథలకు పేర్లను నిర్ణయించారని తెలుస్తోంది. దీనిని బట్టి టి.జి.ఆర్ ప్రసాద్ గారికి పౌరాణికాంశాల మీద, చారిత్రాత్మకాంశాలమీద మంచి అవగాహన కలిగి ఉందని, వాటియందు ఆసక్తి కలిగి ఉందని తెలుస్తుంది.

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# జనాదరణ కోల్పోతున్న - జానపదుల వైద్యం

**- సాలి రాజా,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం, రాజమహేంద్రవరం.

**జానపద వైద్యం :**

జానపద వైద్యమే గ్రామ సీమల్లో నాటు వైద్యంగా ప్రచారంలో ఉంది. నిత్య జీవితంలో మానవులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. అందులో ఆరోగ్య సంరక్షణ ఒకటి. ప్రాచీన కాలంలో ఇప్పుడున్నటువంటి వైద్య శాలలు లేవు. ప్రకృతే వారికి ఆధారం. ప్రాచీనులు ప్రకృతిలోని వస్తువుల రోగ నిరోధక గుణాన్ని కనిపెట్టి వాటినే ఔష ధాలుగా ఉపయోగించారు. ఆ ఔషధాలే నేటికీ గ్రామ సీమల్లో తరతరాలుగా సంక్రమించిన నాటీ వైద్యంగా ప్రచారంలో ఉంది. గిరిజనుల్లో, ఆదిమ జాతులకు చెందిన అనేకుల్లో మూలికా వైద్యం బాగా ప్రచారంలో ఉంది. సర్పగంధి, సుగంధిపాల వంటి వాటిని రోగాలకు తగ్గట్టుగా ఉపయోగించడం వీరికి అనుభవం వలన వచ్చింది. జానపదులు నడిచేటప్పుడు వారి దృష్టి మూలికల మీదనే ఉంటుంది. గాయాలకు, రక్తపోటుకు, గర్భస్రావానికి, గర్భ నిరోధానికి జానపదుల వద్ద శక్తివంతమైన ఔషధాలు ఉన్నాయి.

**ఉద్దేశ్యం :**

జానపదులు యొక్క అద్భుత వైద్యం నేడు ఎంతగానో ఆదరణ పొందుతుంది అని అనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రస్తుత ఈ వ్యాసంలో జానపదుల వైద్యం ఆదరించబడుతున్న విధానాన్ని వివరించే ప్రయత్నం ముఖ్య ఉద్దేశ్యం.

**జానపద వైద్యం - స్వరూపం :**

జానపద వైద్యం తరతరాల నాటిది. ప్రకృతే మాన వుడి మొట్టమొదటి ఔషధశాల. మనిషి ప్రపంచంలో ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతాన్కి వెళ్తూ ఈ ప్రకృతి వైద్యశాలను విస్తరించాడు. జానపద వైద్యాన్ని నిర్వచించే ప్రయత్నాలు జరిగాయి. వైద్యమే వైద్యుల కంటె ప్రాచీన మైనది. అందువల్ల వైజ్ఞానిక వైద్యానికి భిన్నమైనది **జానపద వైద్యం** అని చెప్పవచ్చు. మానవుడు ఎన్నో విషయాలను ప్రకృతి నుంచి నేర్చుకున్నాడు. కొన్ని ఆకస్మికంగా నేర్చు కుంటే మరి కొన్నింటిని అవసరం కొద్దీ నేర్చుకున్నాడు. ప్రాచీన మానవుని అనేక ప్రయోగాల వలన తన రోగాలను నయం చేసుకోగలిగాడు. ఈ రోగాలు నయం చేసు కోవాలనే తాపత్రయం, తత్ఫలితంగా చేసిన ప్రయోగాలు, వాటి మూలంగా కలిగిన అనుభవము వలన అనేక రకాలైన వైద్య విధానాలు ఉద్భవించడానికి కారణం అయ్యాయి.

**పుట్టుక - వికాసం :**

ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, ప్రకృతి చికిత్స, జల చికిత్స, అయస్కాంత చికిత్స మొదలైన వాటికంతా ఒక విధంగా **జానపద వైద్యమే** మూలం. అందువల్ల ఈ అన్ని వైద్య విధానాల అన్నింటికి ప్రాచీన మైనది జానపద వైద్యం అనటంలో ఎటువంటి ఆశ్చర్యం లేదు. పైన పేర్కొన్న అన్ని రకాల వైద్యాల చరిత్ర కొంత కొంతయినా తెలిసిందే. కానీ జానపద వైద్యం చరిత్ర పూర్వయుగాలకు సంబంధించింది. ప్రకృతిలో ప్రతిచెట్టు, ప్రతి మొక్క ఏదో విధంగా మానవునికి ఉపయోగపడేవే. జానపద వైద్యంలో ఎక్కువగా వృక్ష సంబంధమైనవి వాడతారు.

వ్యాధి వచ్చిన తరువాత వైద్యం చేసుకోవటం కంటే అసలు వ్యాధి రాకుండా చేసుకోవటం మేలని ప్రకృతి వైద్యంలో చెప్పే విషయమే. ఈ విషయంలో జానపద వైద్యం కూడా ఏమీ వెనుకబడి లేదు. జానపదులు చెప్పే కొన్ని ఆరోగ్య నియమాలు నిజానికి ఎవరైనా అనుసరించ దగినవే. గోళ్ళు కొరక కూడదనేది అటువంటి విషయాలలో ఒకటి. వెల్లుల్లి పొట్టును పొగ వెయ్యడము అలాంటిది. సాంబ్రాణి పొగ కూడా క్రిమి సంహారిగా ఉపయోగపడుతుంది.

## జానపదుల వైద్యం - వర్గీకరణ :

జానపద వైద్యంలో వృక్ష సంబంధమైన వైద్య వర్గీకరణను ముఖ్యమైనదిగా చెప్పవచ్చు.

**జానపద వైద్యం - రకాలు :**

1) నాటు వైద్యం
2) చిట్కా వైద్యం
3) పసర వైద్యం
4) బెరడు వైద్యం
5) మూలికా వైద్యం
6) లేపన వైద్యం
7) అనువంశిక వైద్యం
8) గృహ వైద్యం
9) చూర్ణ వైద్యం
10) భూత వైద్యం
11) ప్రకృతి వైద్యం
12) మంత్ర, తంత్ర వైద్యాలు
13) బైరాగి వైద్యం

## నాటు వైద్యం :

ప్రకృతిలోని వస్తువుల్ని వినియోగించి రోగ నిరోధక గుణాలను కనిపెట్టి వాటినే ఔషధాలుగా ఉపయోగించారు. ఆ ఔషధాలే నేటికి గ్రామసీమల్లో తరతరాలుగా సంక్రమించిన నాటీ వైద్యంగా ప్రచారంలో ఉంది. భారతదేశ సాంప్రదాయ వైద్య విధానమే నేటివ్ వైద్యం. ఈ నాటు వైద్యంలో కూడా ప్రాంతాలు, జాతులు, తెగల సాంప్రదాయ వైద్య విధానాలలో వ్యత్యాసాల వల్ల పరస్పర అవగాహన, సత్సంబంధాలు లేకపోవటం వల్ల ఇది వైద్య పరిణామ క్రమంలో ఆయా వైద్య విధానాలు స్థిరపడ్డాయి.

నాటు వైద్యం ద్వారా ఈ క్రింది సాధారణ రోగాలను నయం చేయవచ్చు.

అవి :(1) ఇలుకు నొప్పి

**ఇలుకు నొప్పి :**

**లక్షణాలు :** నరాల యొక్క లేక నరాల సంబంధమైనవి బెనుకులు వలన మోకాలు, మణికట్టు, మడమ, మోచేతులు, వ్రేళ్ళ కీళ్ళు, వీని యందు నొప్పి జనించి వాపుదల నొందును. అధిక బాధ కలిగి ఉండును. నొప్పి పట్టిన భాగానికి పూర్ణ విశ్రాంతి ఇవ్వాలి.

**చికిత్సలు :**

నిమ్మగడ్డితో చేసిన నూనె మర్ధన చేసినా ఇలుకు నొప్పి తగ్గును. 2-3 గంటలు మంచి సారాయితో తడుపుతూ, రుద్దుతూ వచ్చిన ఇలుకు నొప్పి తగ్గిపోతుంది.

**చిట్కా వైద్యం :**

ఒక చిన్న మూలిక - మాట పద్ధతులలో చిటికెలో, తేలికగా చేసే వైద్య విధానాన్ని చిట్కా వైద్యం అంటారు. ఈ క్రింది పేర్కొన్న వ్యాధులకు చిట్కా వైద్యం ద్వారా నయం చేయవచ్చును.

**దగ్గు నివారణకు చిట్కా వైద్యం :**

సొంఠి కషాయంలో గానీ లేక అల్లం రసంలో గానీ, తేనె కలిపి తీసుకుంటే ఆయాసం, దగ్గు, కఫం తగ్గుతాయి.

## జలుబు నివారణకు చిట్కా వైద్యం :

తాజా తులసి ఆకులు, అల్లం, మిరియాలు, వాము, ఆకులు కలిపి కాచిన కషాయాన్ని గోరు వెచ్చగా ఉన్నప్పుడు తేనెతో తీసుకోవాలి.

## బెరడు వైద్యం :

మొక్కల యొక్క బెరడును వినియోగించి జానపదులు చేసే చికిత్సలను బెరడు వైద్యం అంటారు. ఈ వైద్యం ద్వారా ఈ క్రింది వ్యాధులను నివారించవచ్చు.

**కామెర్లు :**

వేప కామెర్ల వ్యాధికి మంచి ఔషధం. వేప చెక్కను (బెరడును) ముద్దగా నూరి 2 చెంచాలు ఒక గ్లాసు నీటిలో వేసి అరగ్లాసు అయ్యేంత వరకు కాచి, చల్లార్చిన తరువాత తేనె కలిపి సేవించిన కామెర్లు తగ్గుతాయి.

## నులి పురుగులు :

వేప ఆకు రసం (1 చెంచా) తేనె కలిపి సేవిస్తే కడుపులో ఉండే పురుగులు నశిస్తాయి.

### మూలికా వైద్యం :

ఒక మొక్క యొక్క మూలికను ఉపయోగించి, అనేక వ్యాధులకు అనుపానాలను మారుస్తూ స్వస్థత చేకూర్చే వైద్యం.

**జ్వరం :**

వెల్లుల్లిపాయలు ముద్దగా నూరి అందు నువ్వుల నూనె, సైంధవ లవణం కలిపి ఉదయమే సేవించిన విషమ జ్వరం, సమస్థ వాత వ్యాధులు నశించును.

**అతిసారం :**

ఊడుగ వేప యొక్క కల్కము నందు తేనె కలిపి బియ్యపు కడుగుతో సేవించిన అతిసారము, నీటి ప్రవాహమునకు అడ్డు కట్టవలె అరికట్టును.

### అనువంశిక వైద్యం :

తరతరాలుగా పెద్దలు చేస్తున్న వైద్య విధానాన్ని వారి కుటుంబం, వంశం వారు కూడా అదే వైద్య విధానం చేస్తే ఆ వైద్య విధానాన్ని అనువంశిక వైద్యం అంటారు. దీనికి వైద్య విజ్ఞానం తెలిసినా, తెలియకపోయినా, అనువంశిక వైద్యం పెద్దల నుండి సంక్రమిస్తుంది.

### పాము కాటుకు మందు :

మట్టి, పుసుపు, చంగల్వ కోష్టు, కరు ధూపం, చిట్టి వేరు, వీనిని సమ భాగాలుగా నూరి, కర్ష ప్రమాణాలను నేతిలో కలిపి సేవించిన విష దోషం నివారించును.

### తేలు కాటుకు మందు :

వెలమ సంధి వేరును కలిలో నూరి త్రాగిననూ లేక దానిని గంధం దీసి కరచిన స్థలంన లేపనం చేసిన తేలు విషం నివర్తించును.

**గృహ వైద్యం :**

ఇళ్ళలో తరచుగా పోపు డబ్బాలలో వాడే వస్తువులు, గృహంలో ఉండే ఇతర పదార్థంలోను, వస్తువులతోను చేసే వైద్య విధానం.

### నడుం నొప్పి తగ్గేందుకు చికిత్స :

ఒక రోజంతా ఖర్జూరపు పళ్ళను నీళ్ళలో నానవేసి అనంతరం బాగా పిసికి పిప్పిని తీసేసి ఆ నీళ్ళు త్రాగు తుంటే నడుం నొప్పి తగ్గుతుంది.

### ఋతు వ్యాధులు హరించెందుకు :

ఉల్లిరసంలో తేనె కలిపి రోజూ రెండు పూటలా సేవించాలి. ఇలా నాలుగు నెలలు చేస్తే ఋతు వ్యాధులు తగ్గుతాయి.

**బైరాగి వైద్యం :**

రసవాదంలో నిమగ్నమై ఆధ్యాత్మికత కల్గిన ఋషులు దేశాటన చేస్తున్నప్పుడు వారికి తారసపడిన రోగులకు వారు చేసిన చిట్కా వైద్యమే బైరాగి వైద్యం.

**కుక్క కాటుకు వైద్య చికిత్స :**

కోడి రెట్ట, బెల్లం, జిల్లేడు పాలు కలిపి నూరి కాటుపైన లేపనం చేసిన బాధ తొలగును. కోడి మలం కరచిన చోట రాసినా కుక్క కాటు విషయం తొలును.

**ఎలుక కాటుకు వైద్య చికిత్స :**

ఆగాకర దుంప మంచి నీరు పోసి నూరి పుచ్చు కొనవలెను. అదే కాటుపైన రాసిన విషం మానును. చప్పిడి పథ్యం ఘాటెక్కువ.

పైన పేర్కొన్న వైద్య విధానాలే కాకుండా జానపదుల వైద్య విధానాలలో లేపన వైద్యం, భూత వైద్యం, చూర్ణ వైద్యం, ప్రకృతి వైద్యం, బొమ్మ వైద్యం మొదలైన వైద్యాలు ప్రాచుర్యాన్ని పొందుతున్నాయి.

### ముగింపు :

జానపద వైద్యం లేదా మూలికా వైద్యం ఈనాటికి కాదు. జానపదులు అనేక మూలికలను వాడడం క్రీపూ నాలుగైదు సంవత్సరాల నుండే అడవుల్లో, కొండ ప్రాంతాల్లో నివసిస్తూ, ప్రయత్నించి తప్పు గ్రహించే ప్రాతిపదికన వాడుతూ వస్తూండటం రాను రాను అవి పక్కా శాస్త్రాలుగా మారాయి. ఈ వైద్య శాస్త్రాలు అతి పురాతన నాగరికతలు కల చైనా, బాబిలోనియా, ఈజిప్ట్, ఇండియాలలో క్రీ.పూ॥ 3000 ఏళ్ళ క్రితమే రూపొందాయి.

దేశీయ వైద్య విధానాలను మరీ ముఖ్యంగా జానపదులు వైద్యాన్ని ప్రోత్సహించడంలో రాష్ట్ర, కేంద్ర

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ప్రభుత్వములు అప్పుడప్పుడు ప్రయత్నించి విఫలమవుతున్నాయి. అమెరికాలో "హెర్బల్ మెడిసిన్స్" పై విస్తృత సాహిత్యం అతి మొత్తంలో అందుబాటులో ఉంది.

మన దేశంలో జానపదుల వైద్యం, మూలికా వైద్యం, ప్రకృతి వైద్య చికిత్సా విధానాలపై అన్ని భాషలలో విస్తృత సాహిత్యం లభ్యం కావాలి. అప్పుడే ప్రతి వ్యక్తి కూడా మన పురాతన జానపదులు తెలిపిన వైద్య విధానాలను అవలంభించి, అతి తక్కువ ఖర్చులతో తమ రోగాలను నయం చేసుకోగలుగుతాడు. ఇందుకోసం మన దేశంలో ప్రతి రాష్ట్రంలో "జానపదుల వైద్యం పైన, అక్కడ లభించే వృక్ష సంపద పైన పరిశోధనలు చేసి విస్తృత ప్రచారం చేయగలిగితే జానపదుల యొక్క అద్భుతమైన వైద్య విధానాన్ని, ఆ పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్కరికి అందించవలసిన బాధ్యత ఎంతైనా ఉంది."

**ఆధార గ్రంథాలు :**

1) ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆచార్య ఆర్.వి.యస్. సుందరం
2) గుప్త వైద్య ప్రకాశిక - శ్రీ దోగుపర్తి స్వామి గుప్త సిద్ధాంతి
3) నాటు వైద్యం - లొల్ల రామ్‌జీ

# గిరిజన సంప్రదాయ జాతర - మేడారం

- **శెల్కలపెల్లి రాజు,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్లు, తెలంగాణ.

భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనము అనడానికి మన దేశంలో జరిగే కుంభమేళాలు, పుష్కరాలు మరియు జాతరలు ప్రధాన ప్రతీకగా నిలుస్తాయి సంవత్స రానికి ఒక్కసారి లేదా అంతకు మించి జరిగే దేవతా ఉత్సవాలను జాతరలు అంటారు. అనునిత్యం జరిగే దైవదర్శనాలకు ఈ జాతరలు భిన్నంగా ఉంటాయి. జాతర అంటే జనం ఒక్కచోట గుమికూడి తమ కష్టసుఖాలను చెప్పుకోవడం. ప్రస్తుతం మనకు ఉత్తరాలు, చరవాణిలు, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇవన్నీ అందుబాటులో లేని రోజుల్లో సకలజనులందరూ జాతర్లలోనే కలుసుకొని మాట్లాడుకునేవారు. ఊరికి దూరంగా ఏ వాగు పక్కనో, అడవి మధ్యలోనో రెండు, మూడు రోజుల పాటు జాతరలు జరిగేవి. ఈ జాతరలకు వెళ్లిన ప్రజలు తమ ఆత్మీయులను కలుసుకొని కడుపునిండా మాట్లాడుకొని వచ్చేవారు. ఒక ఊరిలో జరి గిన మార్పులు, వింతలు - విశేషాలు మరొక ఊరి వారికి తెలియజేయడం ఈ జాతరల వెనక ఉన్న ప్రధాన ఉద్దేశ్యంగా చెప్పవచ్చును.

సార్వజనీనతను సంతరించుకొన్న మహాజాతరలలో 'మేడారం సమ్మక్క గిరిజన జాతర ఒకటి. ఈ జాతర ప్రపంచ జాతర చరిత్రలో దక్షిణాసియాలోనే రెండవ స్థానాన్ని ఆక్రమించింది. దట్టమైన అరణ్యంలోని చిన్నపల్లె ప్రపంచ పటంలోకి ఎక్కిందంటే అది ఒక్క సమ్మక్క సారలమ్మ జాతర వల్లనే అని చెప్పాలి.

సమ్మక్క సారలమ్మజాతర ములుగు జిల్లా తాడ్వాయి మండలం (ఉమ్మడి వరంగల్లు) మేడారం గ్రామంలో జరిగే గిరిజన జాతర. ఇది 'ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. భారత దేశంలో కుంభమేళ తర్వాత అత్యధిక భక్తులు హాజరయ్యే పండుగ' ఇదే. వరంగల్లు జిల్లా కేంద్రం నుండి 110 కిలోమీటర్ల దూరంలోని తాడ్వాయి మండలంలో దట్టమైన అడవులు, కొండ కోనల మధ్య ఈ చారిత్రాత్మకమైన జాతర జరుగుతుంది. సమస్త గిరిజనుల ఆరాధ్య దేవతలు సమ్మక్క సారలమ్మలు. కష్టాలు తీర్చే కలియుగ దైవాలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపద్బాంధవులుగా, యావదాంధ్ర దేశంలోనే గాక అఖిల భారతదేశంలోనే వనదేవతలులిగా పూజలు అందుకుంటున్నారు 'దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర'గా ప్రసిద్ధికెక్కిన ఈ జాతర గిరిజన సంప్రదాయ రీతుల్లో జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, చత్తీస్ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాలతో పాటు విదేశాల నుండి కూడా భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి తమ మొక్కులు చెల్లించుకుటారు.

మేడారం జాతర కాశీ పుష్కర మేళాలకు, పూరీజగన్నాథ రథయాత్రకు, తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలకు భిన్నమైన రీతిలో జరుగుతుంది. పూజా విధానమంతా కూడా ఆదివాసీ గిరిజన సాంప్రదాయంలో జరగడం విశిష్ఠతను సంతరించుకున్నది. హిమాచల్ ప్రదేశ్లోని మానాలిలో హిడింబ, ఆదిలాబాద్లో నాగోబా గిరిజన జాతరలకు ప్రతిష్టించే దేవతల విగ్రహాల్లాంటివి కూడా ఇక్కడ కనిపించవు. దేవతలు మేడారంలో ఏర్పాటు చేసిన గద్దెల మీద జాతర సమయంలోనే ప్రతిష్ఠింపబడతారు. ఆదివాసి 'వడ్డేలు' నిర్వహించే పూజలకు భక్తులు పసుపు, కుంకుమ, బంగారం (బెల్లం) వంటి అరుదైన వస్తువులను సమర్పించుకొని తరిస్తుంటారు. ఆదివాసీల అపురూపమైన ఈజాతర తెలంగాణకే తలమానికం.

మేడారం జాతర నమ్మకాలకు, ఐకమత్యానికి, కట్టుబాట్లకు నిదర్శనం, సుమారు ఏడు వందల సంవత్స రాల చరిత్ర గల ఈ జాతరకు వెళ్ళే భక్తులు ముందుగా రాజన్న సిరిసిల్ల (ఉమ్మడి కరీంనగర్) జిల్లా వేములవాడ

రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు అప్పజెప్పి వస్తారు. తర్వాత మేడారం జాతరకు బయలు దేరుతారు. మేడారం వెళ్ళే మార్గంలో ములుగుకు రెండు కిలోమీటర్ల దూరంలో ప్రధాన రహదారిపై గట్టమ్మ గుడి ఉంది. జాతరకు వెళ్ళే భక్తులు వారు తమ వాహనాలను ఆపి ఇక్కడ పూజలు చేసి మేడారం వెళ్ళుతారు.

తెలంగాణ కుంభమేళగా జరిగే ఈ మేడారం జాతరకు వచ్చిన భక్తులు పవిత్ర జంపన్న జల తరంగాల్లో మునిగి మోక్షం పొందుతారు. అఘోరా సన్యాసులను మించి శివసత్తులు భక్తి పారవశ్యంలో మునిగి పోతారు. చిలుకల గుట్టలో మహిమాన్విత కుంకుమ భరిణె రూపంలో స్వయంభువుగా వెలసిన సమ్మక్క పురాత్మ రూపంలో గద్దె మీదికి చేరి చల్లని తల్లిగా కొలువు తీరి భక్తులకు కొంగు బంగారం అవుతుంది. జాతర రోజుల్లో మేడారం పుణ్యక్షేత్ర మంతా పసుపు వర్ణ శోభితంగా కనువిందు చేస్తుంది. బంగారం (బెల్లం)లో పుట్టిన సమ్మక్క దేవతకి బెల్లమే నైవేద్యమవుతుంది. పసుపు కుంకుమలే సౌభాగ్యాలవు తాయి. తెలంగాణ సాంప్రదాయపద్ధతిలో పోసిన ఒడి బియ్యం జీవపాథేయమవుతుంది. భక్తులు దేవత పేరు మీద కట్టిన కానుకలతో పాటు తలనీలాలు సమర్పించు కుంటారు. తమ కోరికలు తీరిన భక్తులు నిలువెత్తు తూకాలు వేసి బెల్లాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు.

## సంప్రదాయ పద్ధతిలో దేవతల రాక :

మేడారంలో కొలువయ్యే దేవతలు ఒక్కచోట కాకుండా చుట్టూ ఉన్న నాలుగు దిక్కుల్లోని పల్లెల్లో గల గుడుల్లో ఉన్నారు. కన్నెపల్లిలో సారలమ్మ, పూనుగుండ్లలో పగిడిద్దరాజు, కొండాయిలో గోవిందరాజులు, చిలుకల గుట్టలో సమ్మక్క దేవత ఇలా ఆయా ప్రదేశాల్లో ఉంటారు.

మాఘమాసం శుద్ధ పౌర్ణమి దాకా శూన్యంగా కనిపించే దేవతల గద్దెపైన తమ ఇష్టదైవం సారలమ్మ కన్నెపల్లినుండి ముందుగా (బుధవారం నాడు) కొలువు తీరడంతో ఈ జాతర మొదలవుతుంది.ఆచార వంతులు (కోలకాడు, చాకలి, విశ్వకర్మ, వడ్డె, శివసత్తి) కాకా వంశం వారు, కలెక్టర్ సారలమ్మను జాతర స్థలానికి తరలిస్తారు. సారలమ్మ భర్త గోవిందరాజులును ఏటూరునాగారం మండలం కొండాయినుండి ఆచార, లాంచనాలతో గద్దెకు తీసుకువస్తారు. సమ్మక్క భర్త పగిడిద్ధరాజును కొత్తగూడ మండలం, పూనుగండ్లనుండి ఎనబైమైళ్ళు తరలించి ఆచార, లాంచనాలతో డప్పుచప్పుళ్ళతో గద్దెకు చేర్చుతారు.

మేడారంలోని చిలుకల గుట్ట మీది నుండి మాఘ శుద్ధ పౌర్ణమి (గురువారం) నాడు కుంకుమ భరిణె రూపంలో సమ్మక్క తల్లిని చందావంశం వారు, వడ్డెలు, జిల్లా ఎస్పీ, కలెక్టర్, ఎ.ఎస్పీలు ఆచార, లాంచనాలతో గద్దె మీద ప్రతిష్టిస్తారు. గతంలో నెమలినార చెట్టు ఉన్న ప్రాంతమే నేటి సమ్మక్క గద్దె ప్రాంతం.

సమ్మక్కతల్లి గద్దె మీదికి చేరేప్పుడు క్షేత్రంలో నలుదిశల్లో 'శరణు శరణు' నాదాలతో మేడారం ప్రతిధ్వని స్తుంది. శుక్రవారం రోజున గద్దెలపైన దేవతలందరూ కొలువై ఉంటారు. అమ్మ వార్లు గద్దెమీద కొలువు తీరిన రోజు నుంచి కోట్లాది మంది ప్రజలు తమ మొక్కులు చెల్లించుకోవడానికి పసుపు కుంకుమలను, ఒడి బియ్యా లను, బంగారం (బెల్లం) సమర్పిస్తారు. కోడి పుంజులను, మేకపోతులను బలులిస్తారు.

## దేవతల వన ప్రవేశం :

జాతరలో సమ్మక్క - సారలమ్మలకు మొక్కులు చెల్లించే ప్రక్రియ నాలుగవరోజుకు చల్లబడుతుంది. గద్దెలపై ప్రతిష్ఠితులైన సమ్మక్క సారలమ్మలు శనివారం సాయంత్రం వనప్రవేశం చేయడంతో జాతర వైభవంగా ముగుస్తుంది. మేడారం జాతరకు వచ్చిన జనం (భక్తులు) వెళ్ళిన తరువాత ఆ పల్లె మళ్ళీ నిశ్శబ్దపు ఒడిలోకి జారి పోతుంది.

## చారిత్రక నేపథ్యం :

"పుట్టు బయ్యక్కపేట
పురమందు వెలసిన
ఆ చందా పరమయ్యా
ఆ ఇంటి సమ్మక్క"

అంటూ జానపద కవులు కీర్తిస్తారు. (మేడారం జాతర సమ్మక్క సారలమ్మ పుట సంఖ్య 45) మేడారం స్థల

పురాణాలు, శాసనాల ఆధారంగా వినికిడి గాథల ఆధారంగా జాతర చరిత్ర తెలుసుకోవచ్చును. 13వ శతాబ్దంలో సిరిమల్లె పల్లెలో అసాసరావు,తూలిముత్తి దంపతులకు శక్తి దేవతాంశంతో సమ్మక్క సడలమ్మగా జన్మించింది. వారి నివాస గూడెం బయ్యక్కపేటలోని ఇల్లు ఇల్లంతా బెల్లం వాసనలతో నిండి ఉండేది. బాల్యమంతా బయ్యక్కపేటలోనే గడిచింది. కోయరాజు సమ్మక్కకు యుద్ధ విద్యలు నేర్పించాడు. వరాన పుట్టిన సమ్మక్క పెరుగుతున్న కొద్దీ ఆమెలోని మహిమలు చుట్టు ప్రక్కల ప్రాకుతూ వచ్చాయి. పాము కాటేస్తే మరణించిన వారినీ, దుష్టశక్తులు వాలి ప్రాణాలు కోల్పోయిన వారినీ మళ్ళీ బతికిస్తూ వచ్చింది. దీర్ఘ వ్యాధులున్న వారికి, తీవ్రంగా గాయపడిన వారికి అడవిలోని ఔషదాలతో నయం చేసేది. ఎల్లప్పుడూ శివధ్యానంలో ఉంటూ అడవిలో గల క్రూర మృగాలను అదుపులోకి తెచ్చుకునేది. ఈ విధముగా ఆదివాసీలను కంటికి రెప్పలా కాపాడుతూ వారికి ఆరాధ్య దైవమయింది. కోయ తెగలో ఐదో గట్టు గోత్రానికి చెందిన సమ్మక్కకు సబ్బిసాయిరం మండలాధిపతి నాలుగో గట్టు గోత్రానికి చెందిన పగిడిద్ధరాజుకు వివాహం చేసారు. పగిడిద్ధరాజు కాకతీయ సామ్రాజ్యానికి సామంత రాజ్యమైన పొలవాసను పరిపాలించే మేడరాజుకు మేనల్లుడు. వివాహానంతరం పగిడిద్ధరాజు మేడారానికి రాజవుతాడు. వీరి సంతానం కూతురు సారలమ్మ, కొడుకు జంపన్న. సారలమ్మ కూడా బయ్యక్కపేటలోని చందా వారింటిలోనే పెరిగింది. యుద్ధ విద్యలన్నీ అభ్యసించడమే కాకుండా సమ్మక్క లాగానే ధైర్యసాహసాలు ప్రదర్శించేది. పెళ్ళి వయస్సు రాగానే కొండాయి పాలనాధికారి గోవిందరాజులుకు ఇచ్చి వివాహం జరిపించారు. కొన్ని సంవత్సరాలకు మేడారం రాజ్యంలో కరవు వచ్చింది. అంతలోనే కప్పం చెల్లించమంటూ కాకతీయ ప్రభువు వేగిరిపరిచాడు. కరువు కాలంలో వన్నులను కట్టలేనని వగిడిద్ధరాజు విన్నవించుకొన్నప్పటికీ అవేమి పట్టించుకోకుండా ప్రతాపరుద్రుడు కప్పం కోసం ఒత్తిడి తెస్తుంటే పగిడిద్ధరాజు మేడారాన్ని స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకున్నాడు. దాంతో ఆగ్రహించిన కాకతి రుద్రదేవుడు మేడారాన్ని స్వాధీనం చేసుకొనేందుకు మంత్రి యుగంధరు (యౌగంధరాయణుడు)ని నేతృత్వంలో సైన్యాన్ని తరలించాడు. సైన్యాలు నేటి ములుగు తాలుకా 'లక్నవరం' చెరువు వద్ద స్థావరాలు ఏర్పరచుకున్నాయి.

యుద్ధ వ్యూహంగా సంపెంగ వాగు వద్దనే కాకతీయ సైన్యాన్ని ఎదిరించాలని సమ్మక్క సూచించింది. సమ్మక్క చెప్పిన విధంగా భర్త పగిడిద్ధరాజు, కొడుకు జంపన్న, కూతుళ్ళు సారలమ్మ, నాగులమ్మ మరియు అల్లుడు కొండాయి ప్రభువు గోవిందరాజులు, ఆడబిడ్డ కొడూరు లక్ష్మమ్మ మరికొంత మంది పరివారంతో కాకతీయుల సైన్యాన్ని సంపెంగ వాగు దాటకుండా అడ్డుకున్నారు. మారణాయుధాలతో ముట్టడించిన సైన్యంతో హోరాహోరి పోరాటం చేసి చాలా మంది సమరంలో నేలకొరిగారు. జంపన్న 'అపర అభిమన్యుడి' లాగా పోరాడి శత్రు సైన్యాలకు చిక్కకుండా సంపెంగ వాగులో దూకి మరణించాడు. అప్పటి నుండి సంపెంగ వాగుకు జంపన్నవాగుగా పేరొచ్చింది. ఈ గడ్డపై పుట్టిన ప్రతి వ్యక్తి వీరరత్నం కావాలి. స్వాతంత్ర్యం కోసం పోరాడి గెలవాలి అంటూ సమ్మక్క తల్లి యుద్ధానికి సిద్ధమై యుద్ధరంగంలోకి దూకింది. సారలమ్మ శత్రువులతో పోరాడుతూనే ఉంది. యుద్ధరంగంలో 'అపరకాళి'లా విజృంభిస్తున్న సమ్మక్క దాటికి తట్టుకోలేక ఒక సైనికుడు చాటుగా వచ్చి వీపులో పొడిచాడు. తీవ్రగాయాలతో యుద్ధం చేస్తున్న సమ్మక్కకు మేడారంలో పడిగిద్ధరాజు, గోవిందరాజుల చితి వెలిగిస్తున్నట్టు వార్త అందింది. కడసారి భర్తను చూసుకొందామని చితివద్దకు వెళ్ళి అందులో దూకి దగ్ధమయింది. సమ్మక్క వెనకాలే వచ్చిన సారలమ్మ కూడా గోవిందరాజుల చితిమీదపడి అదే పని చేసింది. దగ్ధమైన సమ్మక్క ఒక వెలుగు రూపంలో చిలుకలగుట్ట వైపుగా సాగిపోయి మాయమయినది. కోయ వారందరూ ఆ వెలుగు వెంట పరుగెత్తుతూ 'నెమలినార' చెట్టు దగ్గరికి రాగానే సమ్మక్క కనిపించకున్నా మాటలు వినిపించసాగాయి. నెమలినార చెట్టు వద్ద దగదగ మెరిసే ఒక 'కుంకుమభరిణె'

కనిపించింది. మానవాతీత శక్తులున్న తల్లిగా విశ్వసించిన కోయలకు ఆ దేవత కుంకుమ భరిణె రూపంలో లభించింది వారు దానిని సమ్మక్క తల్లి గుర్తుగా ఆరాధించారు. ప్రతాపరుద్రుని కలలో కాకతీయుల ఇలవేల్పు ఏకవీరాదేవి కనిపించి మేడారం నా శరీరం. నీ అధికార దాహంతో నన్ను గాయపరిచావు అని కన్నీరు పెట్టిందట. పశ్చాత్తాపంతో ప్రతాపరుద్రుడు మేడారం వెళ్ళి రాజరికాన్ని నిలుపుకోవడానికి ఇంతమంది అమాయకుల ప్రాణాలు బలిగొన్నందుకు క్షమాపణలు చెప్పుకున్నాడు. రెండేండ్లకు ఒకసారి వైభవంగా సమ్మక్క తల్లి పేరు మీద మూడు రోజులు వైభవంగా జాతరను జరపడానికి ఆదేశాలిచ్చి వీటి నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి తాను కూడా సమ్మక్క తల్లి భక్తుడయ్యాడు.

దాదాపు యాభై సంవత్సరాల దాకా సమ్మక్క చరిత్ర మౌఖికంగానే ప్రచారం అవుతూ రావడం వలన అనేక కథనాలు పుట్టాయి. ఎన్ని కథనాలు ఉన్నప్పటికీ సమ్మక్క అగ్నికి ఆహుతి అయిందనే చందావంశీయులు, డోలి వారు చెప్తూ వస్తున్నారు. 13వ శతాబ్దంలో సమ్మక్క జీవితంలో సంభవించిన సంఘటనలు ఈ అంశాలనే ధ్రువపరుస్తున్నాయి. అయితే ఆ కథలన్నింటిలో దైవారాధన తప్ప మరొకటి చోటు చేసుకోవడం ఉండదు. మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర చరిత్ర రచించిన తిరునగిరి రంగయ్య, సమ్మక్క పురాణం యక్షగానంగా రాసిన ఉగ్రగౌడ్‌లు సమ్మక్కది సతీసహగమనమే అంటారు. చంద్రకళ నవలలో "సమ్మక్క కాలి బొటివెన వ్రేలితో రాతిని గట్టిగా రుద్దింది. అందులో నుండి అగ్నిజ్వాల భగ్గున వ్యాపించింది. చూస్తుండగానే ఆమె యోగాగ్నిలో దగ్ధమైపోయింది." అంటాడు రచయిత. దేవాదాయ శాఖ వారు ప్రచురించిన ప్రత్యేక సంచికల్లో సమ్మక్క సారలక్క యుద్ధంలో మరణించారనీ అప్పటి ఆచారం ప్రకారం సమ్మక్క సారలమ్మ సతీసహగమనం చేశారని ఉంది. వీటన్నింటిలో ఏకాంశమయినది సమ్మక్క సారలమ్మలు అగ్నికి ఆహుతి అయ్యి జీవితాన్ని త్యాగం చేశారనేది నిజం. అదంతా దైవ సమానులైన వారికే సాధ్యం కాబట్టి ఇప్పటికీ వీరవనితలుగా కీర్తించబడుతున్నారనేది వాస్తవం. వారి స్మృత్యర్థమే దేవల్‌పునాక్ (కోయపున్నం) నాడు మేడారం జాతర జరుపుకుంటూ వస్తున్నారు.

మేడారంలో విగ్రహాలు లేని దేవతా గద్దెలు, శిల్పాలు లేని దేవతామూర్తులు, వేద మంత్రాలు లేని అర్చనలు, పువ్వులు లేనిపూజలు, ద్వజస్తంభం లేని ముఖద్వారం మేడారం జాతరకు వైవిధ్యాన్ని తెచ్చిపెట్టాయి. మేడారం జాతర వందల సంవత్సరాల క్రితమే మొదలైనప్పటికీ దాని చరిత్రను నిక్షిప్తం చేసిన చరిత్రకారులు లేరు.సమ్మక్క వంశం వారు, కోయ వడ్డేలు జాతర కోసం ఒప్పందం చేసుకొన్న 75 సంవత్సరాల క్రితం నాటి దస్తావేజులు లభిస్తున్నాయి. అప్పటి నుండే మేడారం జాతరకు బహుళ ప్రచారం వచ్చింది. ములుగు తహసీల్దారు, ఆదేశంతో మేడారం దేవల్ కమిటీ, చందా వంశం వారు, కోయ వడ్డేలు చేసుకొన్న 1944 నాటి ఒప్పంద పత్రాలు జాతర చరిత్రకు ప్రాణం పోశాయి. అప్పటి నుండి ఈ జాతర ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చింది. 1996 సంవత్సరంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించినది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పండుగకు మరింత ప్రాచుర్యం ఏర్పడింది.

ఇంతటి ప్రాధాన్యమున్న జాతర చరిత్ర మరియు క్షేత్ర మహిమలను ప్రపంచానికి చాటవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. చరిత్ర కారుల నిర్లప్తత వలన కాకతీయ రాజుల నిర్లక్ష్యం వలన ఈ ఆదివాసీ వీర యోధురాళ్ళ ప్రాణ త్యాగాలు శాసనాలకెక్కలేదు. పరోక్షంగా మాత్రమే శాసన రచనల్లోకి ఎక్కాయి. అలాగే చరిత్ర కెక్కిన పుక్కిటి పురాణాల్లో జానపద కళారూపాల్లో నిలిచిపోయాయి. మేడారం అడవుల్లో ఎగిరిన ఆదివాసీల అస్తిత్వ బావుటాకు సమ్మక్క సారలక్క సాహసాలు ప్రకాశవంశంగా వెలుగొందుతూ వస్తున్నాయి. కవుల కలాల్లో, గాయక గళాల్లో పడి ఎల్లలుదాటి పయనింప చేస్తున్నాయి. మేడారం జాతరలో భక్తులకు తెలంగాణ

రాష్ట్ర ప్రభుత్వం వసతులు కల్పిస్తున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదు. ప్రత్యేకించి మరుగు దొడ్లు, వైద్య సదుపాయాలు, రక్షిత మంచినీరు మరింత మెరుగైన రీతిలో అందుబాటులో ఉండునట్లుగా కృషి చేయాలి. ఆ దిశగా ప్రయత్నం చేస్తూ జాతర పరిసరాలలో కొన్ని చోట్ల శాశ్వత ప్రాతిపదికన వసతులు ఏర్పాటు చేస్తే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది. రోడ్డు రవాణా సంస్థ వారు బస్సులను తల్లుల గద్దెలకు చాలాదూరం వరకు నడుపుతున్నారు. బస్సులలో వెళ్ళిన భక్తులు నడవలేక ఇబ్బందులకు గురవుతున్నారు. రవాణా సంస్థ వారు తల్లుల గద్దెల వరకు బస్సులను నడిపినచో భక్తుల ప్రయాసను కొంత మేరకు తగ్గించి నట్లువుతుంది. జాతరలో ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా, పరిసరాలు కలుషితం కాకుండా జాతర పవిత్రతను కాపాడాల్సిన భాద్యత భక్తులపై ఉంది. తెలంగాణ రాష్ట్ర పండుగ "మేడారం" సమ్మక్క - సారలమ్మ జాతర"ను కేంద్ర ప్రభుత్వం "జాతీయపండుగ"గా గుర్తించాలనే అశేష భక్తజనకోటి కోరిక నెరవేరాలని ఆశిద్దాం ...

**ఆధార గ్రంథాలు :**

1. మేడారం జాతర - సమ్మక్క సారలమ్మ - ననుమాసస్వామి - కాకతీయ హెరిటేజ్‌ట్రస్ట్, ఫిబ్రవరి 2016.
2. సమ్మక్క సారలమ్మ జాతర - డా॥ దివిటి అంజనీదేవి, అనిలసాయి ప్రచురణలు, కరీంనగర్, తృతీయ ముద్రణ, 2008.
3. పరీక్షణం - సాహిత్య వ్యాస సంకలనం - సంపాదకులు -మద్దిరాల సత్యనారాయణరెడ్డి, 2018.
4. తెలంగాణ రాష్ట్ర పండుగ - సమ్మక్క - సారలమ్మ మహాజాతర వికీపీడియా - తెలుగు.

# మానవ జీవితం - కుటుంబ ప్రాధాన్యత

- యస్. స్వరూపరాణి, పరిశోధక విద్యార్థిని, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం గుంటూరు.

జడాత్మకమైన ప్రకృతి పంచభూతాలతో కూడి చైతన్యాన్ని పొందుతుంది. ఆ క్షేత్రం పరబ్రహ్మ సంయోగంతో సజీవమైంది.

యావత్స ఇజ్ఞోయతే కించిత్ సత్త్వం స్థావరజజ్గమమ్!
క్షేత్ర క్షేత్రజ్ఞ సంయోగాత్ తద్విద్ధి భరతర్షభ॥

ఈ జీవశక్తి తన సంకల్పబలంతో, సంస్కారానుసారంగా వివిధ రూపాల్లో వ్యక్తమవుతుంది. మనుగడ కోసం సాగిన ఈ సంఘర్షణ అన్వేషణకు దారి తీసి ఆత్మజ్ఞాన మంకురించింది. ఈ ఆత్మజ్ఞానమే ప్రేరణ మాత్రాన జీవించే ప్రాణికోటి నుండి మానవుణ్ణి ప్రత్యేకించింది - ప్రధానుణ్ణి చేసింది. ఏ మహాశక్తి అమీబాను (ఏక కణాంకజీవి) మానవాకృతిగా పరిణమింపజేసిందో ఆ మహాశక్తి అనంత విశ్వంలో అనంత కాలంలో ఒక ప్రయాణాన్ని అనుసరించి మరుగుజ్జులాంటి మానవుణ్ని - మరో ప్రయాణాన్ని అనుసరించి విరాట్స్వరూపుణ్ణి చేసి విశ్వంతరాళాలలో నింపివేసింది. కళాకారుడి ప్రతిభలో, సత్పురుషుడి ఔన్నత్యంలో, సృష్టి సౌందర్యంలో మెరిసే ఈ దివ్య విభూతే మానవుల కళ్ళకు మిరుమిట్లు గొలుపుతూ ప్రగతి మార్గానికి దారి చూపుతుంది.

సమాజమనేది లేకుండా మానవుడి ఉనికికి అర్ధమే లేదు. తన పరిసర వ్యక్తులతోటి వివిధానుబంధాల విన్యాసమే మానవ జీవితం. పాతరాతియుగం నాటి నుంచే ఆరంభమైనట్లుగా ఊహించబడుతున్న సమాజ చరిత్రో ఈనాటి కుటుంబ వ్యవస్థ ఎప్పుడు ప్రారంభమైందో ఊహించడానికి తగిన ఆధారాలు లేవు. జనం గుంపులుగా నివసించేవారు. ప్రకృతి సహజమైన కొన్ని శారీరక బలహీనతల వల్ల స్త్రీలు ఆశ్రయించక తప్పలేదు. అయినా ప్రత్యేక కుటుంబాలు ఏర్పాటుకాలేదు ఆ దశలో స్త్రీలో కన్పించే సృష్టిశక్తి పురుషుడికి అద్భుతంగా తోచింది. ఆమెను ఒక దేవిగా ఆరాధించాడు. వావ్యవసాయిక యుగం ప్రారంభమైంది. అప్పుడు పురుషుడికి సృష్టి రహస్యం బోధపడింది. సొంత ఆస్తి సంపాదించుకోవటం మొదలైంది ఆనాటి నుంచి పురుషుడిలో తన ఆస్తి తన వారే అనుభవించాలనే ఆశ ప్రారంభమైంది. ఒక రకంగా కుటుంబ వ్యవస్థకిది పునాది అయింది. స్త్రీ పురుషుల సంయోగంలో కాని మానవతకు పరిపూర్ణత లేదు. స్త్రీ పురుష శక్తులు పరస్పర పరిపూర్ణకాలు. ఆ కారణం చేత ఏ ఒక్కరూ స్వయం శక్తి పొందలేరు. ఈ అభిప్రాయాన్ని సమర్ధించే పురాణగాధ ఒకటుంది. “అత్యంత ప్రాచీన కాలంలో మానవులు రెండు ముఖాలు, నాలుగు కాళ్ళు, నాలుగు చేతులు - ఇలా ఉండేవారట! అలాంటి ఆకృతి ఎప్పుడో రెండుగా చీలిపోయిందట! అప్పటినుండి ఒక సగం తన మిగిలిన సగంతో కలిసిపోవటానికే తపిస్తుందట.

మానవుడు తన సహజవాంఛనలను సక్రమ పద్ధతిలో సంతృప్తి నొందించుకునే సాధనమే కుటుంబ వ్యవస్థ. కాని కేవలం వాంఛా పరిపూర్తి మాత్రమే కుటుంబ వ్యవస్థకు ప్రాతిపదిక కాదు. అంతే అయితే ఆ వ్యవస్థ సుస్థిరమయ్యేది కాదు.

కుటుంబ జీవితంలో ఆనందం ప్రధానంగా ఆ కుటుంబీకుల సంయమన శక్తిపై ఆధారపడి ఉంటుంది. స్వార్ధరాహిత్యము. బాధ్యతలను గుర్తించి ప్రవర్తించడం, సద్విమర్శ స్వీకరించి సంస్కరించుకోవడం, సత్యాన్ని ఎదుర్కొనే సామర్ధ్యం, నిగ్రహం తోడి కామానుష్ఠానం, నిబ్బరమైన ఆలోచన ఈ లక్షణాలన్నీ కుటుంబంలోని వ్యక్తులందరూ అలవరచుకోవాలి. మనవాళ్ళు కామాన్ని కూడా కళ అంటున్నారు. కళావికాసానికి శాంతము, సహనము, ఆలోచన, అవగాహన అవసరం.

కామాన్ని కళాత్మకం చేసేది ప్రణయం దాంపత్య జీవితంలో దంపతులు ప్రధానంగా ఆశించేవి ఆదరంగా

ప్రవర్తించటం - ఆ ధర్మాలు గౌరవించటం, కృషి ఫలితాన్ని ప్రశంసించటం, మనస్తితి నర్ధం చేసుకోవటం, ప్రధాన నిర్ణయాలు చేసుకొనేటప్పుడు పరస్పరం సహకరించటం, జీవితంలో ఆశలను చిగురింప చేసుకోవటం, ఆపదలలో ఒకరికొకరు అండగా ఉండటం, ఒకిరి సద్గుణాలను మరొకరు గౌరవించటం, ఒంటరితనాన్ని మరిపించే మమతలు పంచుకోవటం.

ప్రణయం లేకపోతే ఇలాంటి సమరస భావన సాధ్యం కాదు. కామాన్ని పాశవిక స్థాయనుండి తప్పించి మానవుల మధురానుభూతిగా మలచేది ప్రణయమే! కేవలం కామంవేరు, పవిత్ర ప్రణయం వేరు. ఉద్రేక పూరితమైన శృంగార భావనలే శాశ్వతంగా నిలుస్తాయని నమ్మి వివాహబంధంలో ప్రవేశిస్తే విచ్ఛేదం తప్పదు. పవిత్ర ప్రణయం ఉద్రేక పూరితమైనది మాత్రమే కాదు. మేధాసంపన్నం కూడా రెంటిలో ఏది లోపించినా దాని ప్రధానాశయాలు ఫలించవు. దాంపత్య జీవితంలో ఒకరి బలహీనతలు మరొకరు సహించాలి. సమస్యలు వచ్చినప్పుడు ఏకాభిప్రాయం కుదరకపోయినా, అపార్థాలు వచ్చినా మనస్థితి సరిగా లేకపోయినా ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి తీవ్రమైన ప్రయత్నం చేయాలి. దాంపత్య జీవితానందం తమ తమ భాగస్వాములపై ఆధారపడి ఉంటుందని కొందరు భ్రమపడతారు. కానీ జీవితం సౌఖ్యప్రదం కావటం ప్రధానంగా వారి వారి వ్యక్తిత్వాలపైనే ఆధారపడి ఉంది. ప్రాణికోటిలో ఏ శిశువైనా తగిన పరిరక్షణ లేకపోతే పెరగలేదు. మానవులకి శైశవావస్థ మరింత దీర్ఘం. తాను స్వతంత్రంగా జీవించగలిగే వరకూ అంటే కనీసం పది, పదిహేను సంత్సరాల కాలం శిశువులకు తల్లి దండ్రుల అండదండలవసరం. అంతే కాదు, జంతువుల జీవితం వాంఛా పరిపూర్తి వరకే పరిమితం మానవుడు అలాకాదు. ప్రత్యేక సంస్కృతి సంప్రదాయాలకు వారసుడు. తానొక సంస్కృతి నిర్మాత. ఈ కారణాల వల్ల మానవజాతిలో కుటుంబ వ్యవస్థ సుస్థిరం కావలసిన అవసరం ఉంది. ప్రాణికి వ్యక్తిగా రూపొందించే ఏకైక సామాజిక వ్యవస్థ కుటుంబం.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1). సులోచనారాణి, యద్దనపూడి - జీవనసత్యాలు, క్వాలిటీ పబ్లిషర్స్, విజయవాడ - 2, నవంబరు 2001.

2). సౌభాగ్య - ఆకాశరాజు కవితా వైభవం, కవిసంధ్య గ్రంథమాల హైదరాబాదు, 2011.

3). కాత్యాయనీ విద్మహే- తెలుగు నవలా కథానికా విమర్శనా పరిణామం చరిత ప్రచురణలు, హైదరాబాదు. 1995.

4). రంగనాధాచార్యులు, కె.కె. - తెలుగు సాహిత్యం మరోచూపు, ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాదు. 1981.

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# ఐతా చంద్రయ్య గారి హాస్యకథలు విశ్లేషణ

**– తోట శారద,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

మానవుని సహజ ప్రవృత్తులలో హాస్యం ఒకటి, ఒక హాస్యపు మాటను విని ఆనందపడినప్పుడు మనస్సు నిర్మలమై ప్రశాంతతను పొందుతుంది. హాస్యాన్ని గురించి విశ్వనాథుడు (సాహిత్య దర్పణం-283) "వికృతాకార వాస్వేష చేష్టాదేర్నర్త కాద్భమేత్ హాస్సోహాస స్థాయి భావ" అని నిర్వచించాడు. వికృతమైన ఆకారం, మాటలు, వేషం, చేష్టలు మొదలైన వాటి వినోదం వల్ల హాస్యం జనిస్తుందని విశ్వనాథుని అభిప్రాయం.

"నవ్వడం ఒక భోగం, నవ్వించటం ఒక యోగం, నవ్వకపోవటము యొక రోగం" అన్నాడు జంధ్యాల. నీవు నవ్వితే ప్రపంచం నీతోపాటు నవ్వుతుంది. నీవు ఏడిస్తే మాత్రం నీవొక్కడివే ఏడుస్తావు" అన్నాడు బీర్బల్, "తాను నవ్వుతూ ఇతరును నవ్వించగలవాడు దేవతల ముఠాకు చెందినవాడు" అన్నాడు హాస్య కథా రచయిత మన్నవ గిరిధరరావు, ఈయనే హాస్యం పుట్టించే అంశాలను ఇలా ఉటంకించాడు అవి 1) అస్తవ్యస్తం, 2) అల్పులకు ఉన్నతాసనం, 3) అమాయకత్వం అజ్ఞానం వల్ల తప్పులు 4) అలవాటులో పొరపాటు, 5) నీచోపమ, 6) వ్యంగ్యం 7) స్వయం విరుద్ధాలు, 8) పారడీ, 9) ఊహించని ఫలితాలు, 10) శబ్దగత హాస్యం ("కథలలో హాస్యం" వ్యాసములో)

హాస్యపూరిత బ్రతుకు నేటి యాంత్రిక జీవనంలో టార్చ్‌లైటు పెట్టి వెతికిన కనబడదు. బ్రతుకులు యాంత్రికమై, చదువులు భారమై, యువతకు మొబైలే లోకమై, మనిషికి మానవత్వం లోపమై మహిళలకు మనుగడే శూన్యమై పరుగులు పెట్టె జీవన విధానంలో అయోమయంలోని మనిషికి హాయిగా నవ్వే సందర్భాలు కరువైపోతున్నాయి.

హాస్యరసపోషణ వికలాంగులను. ఒక వర్గాన్ని, ఒక జాతిని, దేవతలను కించపరిచేలా, ఒకరి మనోభావాలను దెబ్బతీసెలా, ఉండకూడదు, అలాగుంటే రసపోషణ రసాభాసాగా పరిణమిస్తుంది. కథలో వెలికితనం నవ్వుల పాలు చేస్తుంది. మన్నవగిరిధరరావు కథలు, బీర్బల్ కథలు, చిలకమర్తి లక్ష్మీనరసింహం గణపతి కథలు, భానుమతి రామకృష్ణ అత్తగారి కథలు, ముని మాణిక్యం నరసింహారావు కాంతం కథలు ఆరోగ్యకరమైన హాస్యాన్ని పుట్టించినవే.

మునిమాణిక్యం "కాంతం కథలు" పెళ్ళయ్యాకే అసలు ప్రేమ మెదలవుతుందనే భారతీయుల విశ్వాసానికి అద్దం పట్టాయి. పాఠకుల మనసుల్లో గిలిగంతలు పెట్టాయి. "మా కాంతం" కథలో కొత్త కాపురం భర్త బజారుకెళ్ళి తెచ్చిన కూరగాయలను, ఇతర సామాగ్రికి వంకలు పెట్టిన కాంతం ఓసారి తానే బజారుకెళ్ళి వెలగని అగ్గిపెట్టే, కిరసనాయిలు, తెచ్చి ముద్దాయిగా నిలబడు తుంది. అదొక ప్రణయకలహం, శ్రీ రమణ కలం నుండి వెలువడిన "మిథునం" లాంటి కథలు పాఠకులను ఆనందడోలికలూగిస్తూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడతాయి. అలాగే ఐతా చంద్రయ్య కథలలో కూడా నవ్వు ప్రధానంగా కన్పిస్తుంది. నవరసాలలో రెండవ ప్రాధాన్యం కలిగిన హాస్యం నేపధ్యంగా వచ్చిన కథలెన్నో ఉన్నాయి. ఇతివృత్తంలో, పాత్ర చిత్రణలో, సన్నివేశ కల్పనలో, సంభాషణల్లో హాస్యంనిండిన కథలే హాస్య కథలు, నవ్వటం ఎంత సులువో నవ్వించటం అంత కష్టమని హాస్య కథల్ని పరిశీలిస్తే అర్థమవుతుంది.

"పశుభోజనం" కథలో ప్రకాశం ఆదివారం నాడు బంధువుల ఇంట్లో పెండ్లి ఉంది వెళ్లాలంటూ మాట్లాడు తున్న స్నేహితుల మధ్యలోంచి లేవబోయాడు. మన మందరం మాట్లాడుకుంటున్నప్పుడు నువ్వు అలా లేచి వెళ్లటము బాగాలేదురా, అని భుజాలుపట్టి కూర్చొబెట్టాడు నగరేశం. అంతలో రామచంద్రం మనం సినిమా చూడక

చాలా రోజులవుతుంది. మధ్యాహ్నం మ్యాట్నీషోకు వెల్దామని కరాఖండిగా చెప్పేశాడు. అనుకున్న టైంకు అందరూ కొత్తగా రిలీజైన చిరంజీవి సినిమా చూడటానికి థియేటర్‌కు వచ్చారు కాని ప్రకాశం ఇంకా రాలేదు, ఏంటని నగరీశం పెదాలు చప్పరించాడు. పదిగజాల దూరం నుంచి స్నేహితులను పిలుస్తున్నాడు ప్రకాశం. ఈ పిలుస్తున్నవాడు ఎవడెబ్బా మాయమాటలు చెప్పి టిక్కెట్టు లాక్కుపోడు కదాని రామచంద్రం అనుకున్నాడు. దగ్గరకు వచ్చాక ప్రకాశం వేసుకున్న షర్టు మరకలనుచూసి స్నేహితులందరూ ఏమైందిరా సినిమా టైం అయిపోతుం దని గుంపులో చొరబడ్డావా అందరిప్లేట్లు నీ వీపుకు తగిలాయి కదాన్నారు. నిజమేరా ప్లేట్లో అన్నిరకాల పదార్థాలు వడ్డించుకొని దూరంగా వెళ్లి తినాలనే కామన్ సెన్స్‌లేని వాళ్ళుంటారు అంటూ అందరూ సినిమా థియేటర్‌లోకి వెళ్లారు. కొందరూ వ్యక్తులు పండుగ లకు, పబ్బాలకు వెళ్లినప్పుడు గడ్డితినే పశువులకంటే అధ్వానంగా ప్రవర్తిస్తారని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

''ఇంటల్లుని ఇంగితం'' కథలో పెండ్లైన కొత్తలో శంకర్రావు తన భార్య హిమజతో కలిసి దీపావళి పండగకి విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు అత్తగారింటికిరైలులో వస్తున్నాడు. ఆ రైలు సామర్లకోటకు వచ్చేసరికి చీకటి కావటంతో ఇద్దరూ అన్నం తిని ఎవ్వరి సీటు మీద వారు పండుకున్నారు. అంతలోనే శంకర్రావు టాయిలెట్ కోసమని బాత్రూంకు వెళ్లి పావుగంట అవుతుంది. ఇంకా బయటకు వస్తలేదు, బయట ఉన్నవారికి ఆపుకోవటం కష్టమవు తుందని గట్టిగా పిలుస్తున్నారు. ఆ అల్లరికి హిమజ లేచి చూసేసరికి సీటుమీద శంకర్రావులేడు. పై సీటు నుంచి దిగివచ్చిన ఒకావిడ బాత్రూంలో ఉంది. మీ ఆయనే కదా అంది. వెంటనే హిమజ వెళ్లి అబ్బా ఇది మనిల్లుకాదు బయటకు రండని గట్టిగా పిలిచింది. అలగే తెల్లవారింది కదాని టూత్‌పెస్టు, బ్రష్ ఇచ్చి ముఖం కడుక్కొని రమ్మని వాష్‌బేషన్ వైపు పంపిస్తే శంకర్రావు అక్కడ బురగలు వచ్చేటట్లు అసహ్యంగా పళ్లు తోముకొని నోట్లో వెళ్లువేసి కక్కుతుంటే ఆ శబ్దానికి చిన్నపిల్లజడుసుకొని ఏడుపు అందుకుంది. అయినా శంకర్రావు నాలుకమీద చెయ్యివేసి కడుగుతూనే ఉన్నాడు. హిమజకు అరికాలు మంట నెత్తికెక్కి అతనిషర్టుపట్టి వెనక్కి లాగింది. అమాయకుడి లాగ ఏమైంది హిమజని అడుగుతాడు. ఆమె ముఖం కడుక్కొని వస్తుంటే పాతతల్లి హిమజని కోపంగా చూసింది, అది ఆమెకు బాధన్పించింది. హిమజ తల్లిదండ్రులు కార్తీక పౌర్ణమిదాకా ఉండమంటారు. కాని రైలులో జరిగిన సంఘటనలు గుర్తుకు వచ్చి ఆయనకు రాత్రి ప్రయాణం పడదని బయలుదేరుతుంది. ఆనాడా హిమవంతుడు అల్లుడు శంకరున్ని అత్తవారింటికి రావద్దన్నట్లు ఈనాడే హిమజ భర్త శకర్రావుని అత్తవారింటి నుండి బలవంతంగా తీసుకెళ్లుతుందనటంతో అదికాదండనీ కసుక్కున నవ్వు తుంది.

కామన్‌సెన్స్ అనేది ప్రతి ఒక్కరికి ఉండాలి అది ఒకరు చెప్పితే వచ్చేది, కాదు, శంకర్రావు ముఖం కడు క్కుంటే ఎదుటివారికి ఎలా అసహ్యం కలుగుతుందో ఎదుటివారు కూడా ముఖం కడుక్కుంటే శంకర్రావుకు కూడా అలాగే అసహ్యం కలుగుతుందని గ్రహించాలి లేకపోతే అతని వ్యక్తిత్వం మీద కూడా అసహ్యం కలుగుతుంది. ఇంట్లో ముఖం కడుక్కున్నట్లు బయట కడుక్కుంటే తోటి ప్రయాణీకులకు ఇబ్బంది కలుగు తుంది. కాబట్టి కడుక్కొని గమ్మున బయటకు రావాలే లేకపోతే ఇంగితజ్ఞానమనేది మనిషి వ్యక్తిత్వంను బయట పెడుతుంది.

"చౌరస్తాలో చదరంగం" కథలో నాలుగుతోవల మధ్య ప్రవీణ్, చేతన్ అనే ఇద్దరు బాల్యస్నేహితులు ప్రపంచాన్ని మరచిపోయి మాట్లాడుకుంటున్నారు. వీళ్లను వచ్చి పోయే వాహనదారులు బండ్లమీదుండి, బాతాకానీలు కొట్టు తున్నారని తిట్టుకుంటూ వెళ్లుతున్నారు. అంతలోనే అంబా సిడర్ స్పీడుగా వచ్చి అక్కడున్న ఆవును, ప్రవీణ్ హోండాను, చేతన్ చేతక్‌ను కలిపి గుద్దేసింది. వీరి అరుపులు చౌరస్తాను అదరగొడుతున్నాయి. కేసును బుక్

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


చేసుకోవటానికి వచ్చిన పోలీసులు జెరంత కామన్‌సెన్స్ లేనోల్ల గతిగంతేనంటు కామెంట్స్ చేస్తున్నారు. జీవులలో మానవ జన్మ ఉత్తమమైనది కాబట్టి, మానవుడికి సాధారణ జ్ఞానం లేకపోతే అనర్థాలు జరుగుతాయని ఈ కథ తెలియజేస్తుంది.

## ముగింపు :

హాస్యం అనేది మానవాళికి ఒక టానిక్‌లా పని చేస్తుందని అర్థమైనది. నవ్వటం మరియు నవ్వించటం వలన ఆయుష్షు ప్రమాణం పెరుగుతుందని పెద్దల నానుడి వాస్తవమే అన్పిస్తుంది.

## ఉపయుక్త గ్రంథసూచీ :

1) ఇంగితం
2) కథా కమామీషు (కథ రాయడమెలా ?)
3) కాంతం కథలు - మనిమాణిక్యం.

# కందిమళ్ల సాంబశివరావు "సై సై... జోడెడ్లాబండి" (నాటకం) - ఒక పరిశీలన

- చెంచు రామారావు, తెలుగు లెక్చరర్, డి.సి.ఆర్.యం. డిగ్రీ కళాశాల, ఇంకొల్లు, ప్రకాశం జిల్లా.

కందిమళ్ళ సాంబశివరావు సై సై జోడెడ్లాబండి నాటకంలో వ్యవసాయం సంబంధమైన సన్నివేశాలు న్నాయి. వ్యవసాయం అంటే పట్టిన పట్టు విడవకుండా ఉండటం అని, వరదొచ్చినా కరువొచ్చినా పట్టిన పట్టు విడువకుండా పంటను పండించేవాడే రైతు అని పల్లె సుద్దులలో పేర్కొనబడినది. రైతులు తమకు వ్యవ సాయంలో చేదోడు వాదోడుగా సహకరించే ఎడ్లకు పేర్లు పెట్టుకుంటారు. వాటిని అపురూపంగా చూసుకుఎంటారు. ఈ నాటకంలో రాజన్న (రైతు) తన ఎడ్లకు రాముడు, లక్ష్మణుడు అని పేర్లు పెట్టుకోవడం మనం గమనించ గలము.

వానలు లేక పశువులకు మేత లేక పశువులు బక్కచిక్కి పోతుండగా, రాజన్న ఎడ్లలో రాముడు బలహీన పడి పోతుంటే రాజన్న వానదేవుణ్ణి ఎలా ప్రార్థిస్తున్నాడో చెపు తున్నాడు కందిమళ్ళ.

రేయ్ రావుడూ.. ఏమైందిరా... ఏందట్టా తొణుకు తున్నావ్? ఆరుగాలం సాకిరి చేసి మా కడుపులు నింపావు.. కాని ఇయ్యాల.. గుప్పెడు గరిక పరికలు బెట్టి నీ ఆకలిని తీర్చలేకపోతున్నాను... నా చేతగానితనాన్ని చెమించు రాముడూ చెమించు... దేవుడా వానదేవుడా... కరుణించు తండ్రీ... సల్లంగ చూడు.. వాన కురిపించు తండ్రీ... వాన కురిపించు... అంటూ ఆరుగాలం నీచేత చాకిరి చేయించు కొని కడుపు నింపుకున్న నేను నీకు గుప్పెడు మేత పెట్టలేని స్థితిలో ఉన్నాను క్షమించమని అడుగుతూ వానను కురిపించి కరుణించమని వానదేవుణ్ణి ప్రార్థిస్తున్న రైతును గమనిస్తాము.

వానలు లేక పశువులకు మేత లేక పశువులు బక్కచిక్కి పోతుండగా, రాజన్న ఎడ్లలో రాముడు బలహీన పడి పోతుంటే రాజన్న వానదేవుణ్ణి ఎలా ప్రార్థిస్తున్నాడో చెపుతున్నాడు కందిమళ్ళ.

రేయ్ రావుడూ... ఏమైందిరా.. ఏందట్టా తొణుకుతు న్నావ్? ఆరుగాలం సాకిరి చేసి మా కడుపులు నింపావు... కాని ఇయ్యాల... గుప్పెడు గరిక వరికలు బెట్టి నీ ఆకలిని తీర్చలేకపోతున్నాను.. నా చేతగాని తనాన్ని చెమించు రాముడూ చెమించు.... దేవుడా... వాన దేవుడా... కరు ణించు తండ్రీ... సల్లంగ చూడు... వాన కురింపిచు తండ్రీ... వాన కురిపించు... అంటూ ఆరుగాలం నీచేత చాకిరి చేయించుకొని కడుపు నింపుకున్న నేను నీకు గుప్పెడు మేత పెట్టలేని స్థితిలో ఉన్నాను క్షమించమని అడుగుతూ వానను కురిపించి కరుణించమని వానదేవుణ్ణి ప్రార్థిస్తున్న రైతును గమనిస్తాము.

వానలు లేక పంటలు పండక ఎన్నిసార్లు దండోరా వేయించినా రాజన్న పన్ను కట్టలేకపోతాడు. సేనాపతి, ఇద్దరు భటులు వచ్చి రాజన్నను ఎలా లాక్కెళుతున్నారో చూపుతున్నాడు సాంబశివరావు.

ఓరీ... రాజన్నా.. ఎన్నిసార్లు దండోరా వేయించినా పన్ను కట్టలేదు.. నీ ఇంటి చుట్టూ ఎన్నిసార్లు తిరగాలిరా.. నిర్లక్ష్యమా... అహంకారమా... లేక కండకావరమా? పద.. రాజుగారు ఈడ్చుకు రమ్మన్నారు.

రైతుల యెడల ప్రభుత్వాధికారులు చూపించే కఠిన వైఖరిని చూపించాడు కందిమళ్ల. వానలు కురవక ఎండు కరువొచ్చింది. తిండికే కటకటలాడుతున్నారు. పన్నులు కట్టలేదని అన్న రాజన్నతో ఇంటిలోని వస్తువులను జప్తు చేయిస్తానని అంటాడు రాజు. ఆ సన్నివేశంలో - ఏమున్నాయని జప్తు చేయిస్తారు సామీ. ఒకెద్దు సచ్చి పోయింది.. రెండో ఎద్దు ఎత్తబడింది... కదల్లేదు, మెద ల్లేదు. పుచ్చిపోయిన అరక సామాన్లు.. తెగిపోయిన పట్టెళ్ళు.. ఇంకా నాకాడ ఏమున్నయ్.. జప్తు చేయడానికి.. (పుట : 146) అని రాజన్నతో పలికిస్తాడు. తన వ్యవసాయా

నికి ఉపకరణములైన అరక సామాన్లు, పట్టెళ్ళు కూడా బాగు చేయించుకోలేని స్థితిలో రాజన్న ఉన్నాడనుటను బట్టి కరువు ఎంత భయంకరంగా ఉందో గమనించ గలము.

కరువు వల్ల శిస్తు కట్టలేని రైతుల పట్ల రాజులు ఎంత హీనంగా ప్రవర్తించేవారో సాంబశివరావు రాజుచేత పలికిం చిన డైలాగులో గమనిస్తారు. మీ ఇంటికి ముత్యాల పల్లకి పంపిస్తాం.. అందులో మీ చెల్లెల్ని రాణివాసానికి పంపు.. శిస్తు రద్దుచేస్తాం... శిస్తుగా బదులుగా నీ చెల్లెల్ని రాణి వాసానికి పంపు అని రాజు పలుకుట ఎంత దారుణ. రాజుల కాలంలో రైతుల పరిస్థితి ఏవిధంగా ఉందో సాంబశివరావు ఈ నాటకంలో చక్కగా చూపించాడు.

అంతేగాక రాజుకు - రాజన్నకు ఈ సందర్భంలో జరి గిన సంభాషణ పరిశీలిస్తే - రాజంటే ప్రజలకు కన్న తండ్రి లాంటివాడు. తండ్రి కూతర్ని కోరుకోడదు మారాజా అన్నప్పుడు, మాకే నీతులు చెపుతావా? రాజాజ్ఞ ధిక్కరిస్తే ఫలితం ఏమిటో తెలుసా - అన్న రాజుతో రాజన్న చెప్పిన డైలాగును గమనిద్దాం.

అరె పో... నువ్వేం రాజువయ్యా? రాజంటే పెత్తనం కాదు.. ప్రేమ! అధికారం కాదు.. అభిమానం! రాచ్చసత్వం కాదు.. రచ్చన.. కిరీటం ఉందిగదాని కళ్ళు మూసుకు పోకూడదు. కిరీటం ఉండటమే గొప్పనుకుంటే.. నీకే కాదు.. మాకూ ఉంది.. ఇదిగో కండువా.. ఇది నడుముకు సుడితే శాకిరి... బుజం మీదేసుకేంటే పెద్దరికం.. తలకు చెడితే కిరీటం.. నీ కిరీటంలో ఉండే యీ ఉత్త ఈకలు.. మరి నా కిరిటీంలో ఉండేయి మడుసులకే కాదు.. పశు వులకీ, పచ్చులకీ గూడా కడుపునిండా తిండి పెట్టే కంకులు.. ఆ.. నేనూ రాజునే.. ఈ భూమిని దున్ని, దాని ఆలనా పాలనా జూసే అసలు సిసలైన రాజుని... అంటాడు.

ఇక్కడ రాజు తలపై ఉన్న కిరీటానికి, రైతు తలపాగా (కిరీటం)కు ఎంత వ్యత్యాసాన్ని చూపించాడు కందిమళ్ళ. తన సామ్రాజ్యంలో ఉన్న ప్రజల ఆలనా పాలనా చూడవలసినవాడు రాజైతే, ఈ నేలను దున్ని, దాని ఆలనా పాలనా చూసే అసలు సిసలైన రాజు రైతు - అటూ సమాజంలో రాజుకంటే ఉన్నతమైనవాడు రైతురాజు అని రైతును ఉన్నతంగా చూపించాడు సాంబశివరావు.

రాజన్న మెడకు నాగలి కట్టి పొలం దున్నిస్తున్నాడు. బాగా ఆలోచించుకో. మీ చెల్లెల్ని కట్టబెడతావో, కలకాలం కష్టాలలో కుములుతావో తేల్చుకోమని రాజు అనగా రాజువైనంత మాత్రాన కంటికి నచ్చిన ప్రతి ఆడదాన్ని కోరుకునే హక్కు మీకు లేదు అని అన్న రాజన్న నాలుకను వెయ్యి ముక్కలు చేయమని సేనానికి ఆజ్ఞాపిస్తాడు రాజు. సేనాని కత్తి తీసుకుని పోతుండగా ఆ పని చేయవద్దని నేను నీతోనే వస్తానని చెల్లెలు అడ్డుపడుతుంది. చెల్లెల్ని ఆ రాజుకు దక్కనీయకుండా రాజన్న ఏమి చేశాడో క్రింది డైలాగులో గమనించగలము.

అమ్మా.... ఎంత పని చేశావు తల్లీ.. నా కోసం ఈ అన్న కోసం.. నీ బతుకునే బుగ్గి చేసుకున్నావమ్మా? (అంటూ ఏడుస్తూనే చెల్లెలి పైటకొంగును ఆమె మెడకు బిగించి లాగేస్తాడు. ఆమె తలన వాల్చేసింది) అమ్మా నన్ను చమించమ్మా.. పైరగాలంత పవిత్రంగా పెరిగిన నువ్వు ఇలాంటి పాపాత్ముల పాదాల క్రింద నలిగిపోవడం ఇష్టం లేకే.. ఈ చేతుల్తో.. నిన్ను అల్లారుముద్దుగా పెంచిని ఈ చేతుల్తోటే నీ పీక పిసికేశాను తల్లీ పిసికేశాను - ఇలా తన చెల్లెలు ఆ దుర్మార్గుడైన రాజుకు దక్కకుండా అల్లారుముద్దుగా పెంచిన తన చేతులతోనే చంపివేశాడు. దుర్మార్గులైన రాజుల చేత హింసించబడిన రైతుల జీవిత చరిత్రలు చరిత్ర కాలగర్భంలో చాలానే ఉన్నాయి.

సీన్ నెం. 10లో నరసయ్య అనే రైతులు చూస్తాము. ఇతను అగ్రికల్చర్ బి.యస్సి. చదివి ఉద్యోగంలోకి పోకుండా పొలంలోకి (వ్యవసాయంలోకి) దిగాడు. వ్యవసాయం కలిసి రాలేదు. కల్తీ విత్తనాలు, కరువు రక్కసి, దళారీలు అందరూ కలిసి రైతును దివాలా తీస్తారు. అప్పులు, పరువు తీసే జప్తులు వల్ల ఎవరి సాయములేని ఈ వ్యవసాయాన్ని నమ్ముకొని ఇక బ్రతకలేను - నా సమస్యకు పరిష్కారం చావే అంటూ పురుగు మందుల డబ్బా మూతతీసి గడగడా తాగేస్తాడు. ప్రకృతి వైపరీత్యాల వల్ల, మధ్య దళారీల వల్ల సేద్యంలో రైతు ఎంతగా అప్పుల

పాలై ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నాడో కవి తెలియజేశాడు.

సీన్ నెం. 11లో ఆత్మహత్యాయత్నం చేసిన నరసయ్య బ్రతుకుతాడు. రాజయ్య నరసయ్యకు ధైర్యం చెబుతూ... రైతంటే వెన్నెముక.. అది ఇరిగిపోకూడదు.. రైతు నిట్టాడి లాంటోడు.. ఆ నిట్టాడి కూలిపోతే దేశమే కూలిపోద్ది. అబ్బాయ్.. ఒక మాట చెప్పనా!.. కదిలేబండి చక్రంలో పై ఆకులు క్రిందికొస్తాయ్.. క్రింది ఆకులు పైకిపోతాయ్.. అట్టాగే జరుగుతున్న జీవితకాలంలో కష్టసుఖాలు కిందిమీదులౌతూనే ఉంటాయ్.... చూడు అందరూ తినేవాళ్ళే అయితే ఎట్లా చెప్పు? బువ్వ పుట్టించేవాళ్ళు గూడా ఉండాలిగా.. అంటాడు. దేశం మనుగడకు రైతు ముఖ్యమైనవాడని, రైతు కూలిపోతే దేశమే కూలిపోద్దని, రైతుకు - దేశ మనుగడకు ఉన్న సంబంధాన్ని ఇక్కడ తెలియజేశాడు కందిమళ్ల సాంబశివరావు.

రైతులు పండించిన పంటలను మార్కెట్‌కు తరలిస్తే అక్కడ మధ్య దళారీల మోసానికి సరియైన ధర లభించక రైతు ఎలా మోసపోతున్నాడో సీన్ నెం. 12లో వివరించ బడింది. ప్రపంచంలో ఎవరు తయారు చేసిన వస్తువుకు వారే రేటు నిర్ణయిస్తారు. కానీ రైతు పండించిన పంటకు రైతు ధరను నిర్ణయించే భాగ్యం లేకపోవుట విచారకరము.

సీన్ నెం. 13లో స్టేజి రెండు భాగాలుగా విభజించబడు తుంది. ఒకవైపు రాజయ్య మరికొందరు రైతులు, మరొకవైపు నాయకుడు నరసింహం మరికొంత మంది నాయకులు ఉన్నారు. రైతులలో ఉండే అనైక్యతను అడ్డుపెట్టుకొని రైతులను దళారీలు ఎంతగా మోసం చేస్తున్నారో ఈ సీన్‌లో వివరించబడింది.

కాకి లెక్కలు కట్టి ప్రకటించే మద్దతు ధర కాకుండా, వంటకైన ఖర్చు, రైతుల కష్టం, కుటుంబ ఖర్చులు అన్నీ కలిపి ఇచ్చే గిట్టుబాటు ధర ఇవ్వాలి అని రైతులంతా సంఘటితంగా పోరాటం జరుపుటను కూడా గమనిస్తాము. ఈ పోరాటంలో రైతు నాయకుడిగా రాజయ్య వ్యవ హరిస్తాడు. ముందు వెనుకా ఆలోచించకుండా ఈ పోరాటంలో దిగావు. అర్ధరాత్రి, అపరాత్రి దాకా తిరుగుతు న్నావు. ముక్కు మొకం తెలియని వాళ్ళ బెదిరింపులు ఇవన్నీ మనకెందుకు, ఒకసారి ఆలోచించు అన్న ఆదిలక్ష్మితో - రైతు కుదురులో పుట్టిన నువ్వు ఆ మాట అనకుడదే.. మొన్న మీ తాత.. న్ని మీ అయ్య.. ఇవాళ నేను.. రెక్కలు ముక్కలు చేసుకుంటూ కష్టపడుతున్నామే గాని.. కష్టానికి తగిన ఫలితాన్ని ఎప్పుడైన.. ఎవరిమైనా పొందగలిగామా? లేదు.. ఇక ముందెవ్వరికీ ఇలా జరుగకుండా ఉండాలంటే.. ఎవరో ఒకరు. ఏదో ఒకటి చెయ్యాలి.. ఆ ఎవరో ఒకరు చెయ్యాల్సిందే.. చేసేది నేనెందుకు చేయకూడదు...? అందుకే చేస్తున్నా.. నువ్వేం ఆలోచించకు.. న్యాయం మన పక్షానుంది (పుట : 168) - అంటాడు రాజయ్య.

రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తానని నమ్మబలుకుతూ నరసింహం రాజయ్యకు నమ్మకద్రోహం చేస్తాడు. ఈ నాటకం ముగింపులో రాజయ్యపై తనకున్న అధికార బలంతో నరసింహం కాల్పులు జరిపిస్తాడు.

అభివృద్ధిని అడ్డం పెట్టుకొని ప్రయోగాల పేరుతో, పరిశ్రమల పేరుతో ప్రపంచవ్యాప్తంగా పచ్చని పంట పొలాన్ని నాశనం చేసుకుంటూ పోతుంటే, పెరుగుతున్న జనాభా అవసరాన్ని తరుగుతున్న పంటలు ఎలా తీర్చ గలుగుతాయి? ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భావితరాల ప్రజలు ఆకలితో అల్లాడుతారు. ఆహార కొరతతో ప్రపంచం అతలాకుతలమౌతుంది. మట్టిలో మొలక లేకపోతే మనిషికి మనుగడే లేదు. అభివృద్ధి అభివృద్ధి అంటున్నారుగాని భూమి మీద ఉన్న దేనినయినా అభి వృద్ధి చేయగలరుగాని ఈ భూమిని ఒక్క అడుగైన అభి వృద్ధి చేయగలరా? ఎంతమంది శాస్త్రజ్ఞులు ఎన్ని ప్రయో గాలు చేసినా ఒక్క అంగుళమైనా ఈ భూమిని పెంచ గలరా? ఒకప్పుడు పరాయిపాలనలో ఉన్న ఈ మట్టితల్లిని విముక్తి చేయడానికి ఆనాడు ఎందరో మహానుభావులు ప్రాణాలను ఫణంగా పెట్టారు. కానీ ఈనాడు నరసింహం లాంటి స్వార్థపరులు తమ స్వలాభం కోసం అదే మట్టిని విదేశీయులకు అమ్మజూపుట ఎంతో విచారకరమనే ఈ నాటక సందేశాన్ని గమనించగలరు.

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# రాణీసంయుక్త - పరిశీలన

- డా॥. పఠాన్ ఖాశిం ఖాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు, ఆధునిక భారతీయ భాషల కేంద్రం, అలీఘర్హ్ ముస్లిం విశ్వవిద్యాలయం, అలీఘర్హ్.

సర్వజనశ్రేయోభిలాషి, సర్వమతాభిమాని తక్కల్లపల్లి పాపాసాహెబ్ గారు 1928లో అనంతపురం జిల్లా రాయల చెఱువు మండలం కేశవరాయని పేటలో జన్మించారు. వీరు దుర్భర జీవితాన్ని అనుభవించారు. సమాజంములో సంభవించే అన్యాయాలను అడ్డుకొనేవారు. తీవ్రస్థాయిలో అధర్మపరులతో పోరాటం చేసేవారు. అధర్మాన్ని భరించ లేక యణగారిన ప్రజలను సంఘటితం చేసి అన్యాయ పనులను ఎదర్కొనేవారు.

కవిత్వాభీష్టము, సమస్యాపరిష్కరణాసక్తి, దీన జనోద్ధ రణాకాంక్ష, అధర్మ బహిష్కరణాభిలాష, దేశసేవా పరాయణత్వం వీరిని కవిగా తీర్చిదిద్దాయి. ప్రజా సమస్యల పరిష్కారణార్థము, అన్యాయనాశార్థము రాజకీయాధికారం పరమాయుధముగా భావించారు. కాని తన జీవితంలో యది నిరాశగానే మిగిలింది. అధికర రాజకీయనేత కానప్పటికీ ప్రజానేతంగా ప్రజాకవిగా విరాజిల్లారు. విశ్వ శ్రేయస్సు కొరకు తన ఆయుధాశయములుగా సాహిత్యమునే మలచుకొన్నారు.

రాజ్యశ్రీ, రసఖండము, అవధి, శకుంతల, కన్నీటి చుక్కలు ప్రేమవిలాసము, రాణీసంయుక్త, అంబ, సత్యాన్వేషణము, పాపసాబు మాట పైడిమూట యను దశకృతులు పాపాసాహెబ్ సాహిత్య సుధా స్రవంతులు. వీనిలో చారిత్రిక కావ్యమైన రాణీ సంయుక్త ప్రకృత పరిశీ లనాంశము.

కనోజ్ రాజ్యాధినేత జయచంద్రుడు. అతడి యనుంగు బిడ్డ రాణీ సంయుక్త. ఆమె ఢిల్లీ నాధుడు పృధ్వీరాజును వలచి వివాహమాడ కాంక్షిస్తుంది. జయచంద్రుడు పృధ్వి రాజేకు తక్క శేషసర్వరాజ్యాధినేతల కావ్యానమంపి రాణీ సంయుక్త స్వయంవరోత్సవము ప్రకటిస్తాడు. రాణీ సంయుక్త ఆమె తల్లి కుమిలిపోతుంటారు. జయ చంద్రుడు ఘోరిని కొండంత యుండగా విశ్వసిస్తుంటాడు.

రాణీ సంయుక్త తన ప్రణయదూతగా యొక విప్రుని పృధ్వీరాజు చెంత కలుపుతుంది. ఆమె సర్వస్వము సమర్పించటానికి సంసిద్ధంగా యున్నదని వివరించి యామెను గైకొని హిస్తన చేరమని విప్రుడు రాజు నర్ధిస్తాడు. ఘోరీయే కాదు రుద్రుడే వచ్చినప్పటికీ శత్రురాజుల యుక్కడగించి యామెను గొనిపోయి పరిణామమాడతా నని, దీక్షాముద్రతో మాతృ క్షితిరక్షణకై పోరాడతానని ప్రతిజ్ఞ చేస్తాడు. అంత విప్రుడమందానంతముతో రాణీ సంయుక్తను చేరి విషయము విశదపరుస్తాడు.

స్వయంవరముతో రాణీ సంయుక్త తటిల్లతలా మెరసి యదృశ్యమవుతుంది. సభ్యులందరు కలవరపడు తుంటారు. ఢిల్లీ నాథుడు రాణిని గైకొని పయనమవుతాడు. రాకుమారులు, ఘోరీ జయచంద్రులు వారిని వెంబడించి విఫలమవుతారు. రాణీ సంయుక్త పృధ్వీరాజుల కళ్యాణోత్స వము కన్నుల పండువగా జరుగుతుంది. ఇంతాకుల చిత్తముతో జయచంద్రుడు తద్దంపతులనాహరించటకు సదాయుపాయముల నన్వేషిస్తుంటాడు. కాని బిడ్డపైగల వాత్సల్యముతోను, పృధ్విరాజపరాక్రమ భయముతోను యుద్ధవిముఖుడవుతాడు. భంగపడిన స్వయంవరా గతరాజులందరు పృధ్వీరాజునుమార్కొ నుటకు సిద్ధమని, పృధ్వీరాజును మట్టుబెట్టి తనను సార్వభౌముని జేస్తానని ఘోరి వాకృచ్చగా జయచంద్రుని హృదయములో సార్వ భౌమపద వాంఛ పురి విప్పుతుంది.

ఉభయ సైన్యములు యుద్ధానికి సన్నద్ధమవుతాయి. రాణీ సంయుక్త పురుషవేషములో నశ్వారూఢురాలై తండ్రిని సమీపించి ఘోరీ కపటోపాయములను విశదపరుస్తుంది. తన మమతను తెలిపి మాతృభేజూఊమిని రక్షించమని ప్రాధేయపడుతుంది. కానీ జయచంద్రుడు వివేక విహీ నుడై ఆగ్రహోదగ్రుడై యావాను క్రింద పడవేస్తాడు. రాణీ సంయుక్త దేశరక్షణార్థమై ప్రతినబూని పతిని సమీపిస్తుంది.

ఇరు పక్షాలు ప్రాణాశను పరిత్యజించి పరస్పర జయ వాంఛతో భీకర సమరము సాగిస్తుంటాయి. కాని తుదకు ఘోరీ జయచంద్రుల కపటోపాయములకు రాణీ సంయుక్త బలియవుతుంది. పృధ్వీరాజు బందీ యవుతాడు.

ఇందు వీరరసము ప్రధానము. అంగరసములు శృంగార కరుణ రౌద్రాదులు. సహజ సుందరవర్ణనా వైదగ్ధ్యముతో నీ కావ్యము సంశోభితము. సందర్భోచిత సంభాషణాచాతుర్యముతో రంజిల్లుతుంటుంది. ఔచిత్యా లంకారములతో నలరారుతుంటుంది. కవి ప్రాచీన కావ్య పరిజ్ఞానము ప్రతిబింబితము. ఇది పంచ తరంగములుగా విరచితము.

ముఖ్యంగా యుద్ధవీరము ప్రకృత కావ్యమునందు పరిపుష్టమవుతుంది. రాణీ సంయుక్తా పృధ్వీరాజుల జన్మ భూమి సంరక్షణార్థము చేసే యుద్ధయత్నములు కావ్యము నందధికముగా విస్తరించియున్నాయి.

రాణీ సంయుక్త విప్రుని పృధ్వీరాజు చెంతకు పంపుచూ - దారుణజేమున కాననములో వియోగవేదనలతో తూలుతూ ప్రేమపిపాస తన మదిలోనతిశయించడముతో తాళలేక యుపశమిల్లుచున్నానని, హృదయవల్మీకములో యణగే ప్రేమాహిని యన్వరాజరంగదతుల కీర్తి పాత నాగస్వరమును తంత్రి అనే పాములవాడు యూది యూది బయటకు వెడలించి చదువుటకు పూనుకున్నా డని నివేదిస్తుంటుంది. ఇందలి రూపకములు రాణీ సంయుక్త రాగస్థితికి దర్పణములు. కవి భావనాపటిమకు ప్రమాణములు ద్విగుణీకృత కావ్యశోభకు కారణములు.

పృధ్వీరాజు స్వయంవరోత్సవము నుండి రాణీ సంయుక్తను గైకొని యేగుచుండగా శత్రు స్వనములను సమకర్ణించి రాణీ సంయుక్త వారిని మార్కొంటానంటుంది. అంత పృధ్వీరాజు -

పసుపు పారాణి, పునుగు జవాదియాది
పరిమళ ద్రవ్యచర్చలఁబరిమళించు
నీలలితశరీరము రణకేళి కెట్లు
తగును? రతికేళి కెట్టులదగునుగాని

అని ప్రవచిస్తుంటాడు. ఇందలి విషయాలంకారముతో సహృదయరంజకముగా కవి మొనరించినయననురూప ఘటన సందర్భోచితముగా సరసంగా సంశోభిల్లు తుంటుంది.

పృధ్విరాజు సైన్యము యమునా తటమును సమీ పించు సమయమునకు సంభవించిన సూర్యాస్తమ యమును కవి -

ఖరకరుండు దుస్సహసమగ్రప్రతాప
దుర్నిరీక్ష్యుడ మందేహ దుష్టదాన
వాళినుగ్గాడి, రక్తసికాంగమెల్లఁ
గడుగుకొనెనన పశ్చిమ జడధిసొచ్చె॥ 2 ॥

అని యభివర్ణించారు. ఈ సంభావత్మక రవివర్ణన ద్వారా సముచిత కవి వర్ణనా వైదగ్ధనము సుస్పష్టము.

ఈ కవి భావములు సహజ సుందరములు. భాష సరళము, సందర్భానుసారముగా క్లిష్టములను సహితము సంతరించుకొంటుంది. విశ్వజనహితకర విషయములను తన కృతులందు సంగ్రహిస్తారా. ఆనందోపదేశములలో ఉపదేశానికే వీరి రచనలు ప్రాధాన్యతనిస్తాయి. సమధికముగా సంభాషణాత్మక శైలి సంప్రయుక్తము. అని వార్య ఝురి వలే రయముగా ప్రవహిస్తుంటాయి వీర పద్యములు. పాపాసాహెబ్ శైలిని గూర్చి జోస్యము జనార్ధనశాస్త్రి గార “పాండిత్య కవిత్వములకు జాతిమత విచక్షణ పనికిరాదు. కాని ఇక్కడ మహ్మదీయుడని పేరు వలన తెలిసి కేవలసినదేకాని యాతని భావములందును భాషా సంస్కృతులయందును, కవితాశైలియందును, చిక్కని తెలుగుదనము చక్కని భారతీయ సంప్రదాయము జాలువారుచుండును.

పదజాలమును పరిశీలించినచో లోపాగమాదేశ వ్యత్యయ సమీకరణాది ధ్వనిపరిణామములు పొడచూపు తుంటాయి. అర్థ గౌరవము, అర్థాపకర్ష మృదూక్తి, సభ్యోక్తి వంటి అర్థవిపరిణామములు సహితము గోచరిస్తుం టాయి. రాయలసీమ మాండలికములుపయుక్తము. ఉర్దూ, పారసీ, అరబ్బీ మున్నగు భాషల నుండి యన్య దేశ్యములు సంగ్రహితములు. నానుడులు, నుడికార ములు ప్రకృతానుగుణంగ ప్రయుక్తము.

చరిత్రను కావ్యేతివృత్తముగా గైకొని కావ్యరచనము గావించుట కష్టసాధ్యము. జరిగినది జరిగినట్లు రచించిన చరిత్రయగును. కావ్యముకాదు. అట్లని కల్పన చేసిన చరిత్ర కాదు. అట్టి స్థితియందు చారిత్రక యదార్థ సంఘటనలకు భంగము వాటిల్లకుండా సహృదయ రంజకముగా కావ్యరచనముగావించుట కత్తిమీద సామేయగును. అట్టి దుస్సాధ్యమైన చారిత్రక కావ్య రచన మునకు బూనుకొని కృతకృత్యులైనవారిలో పాపాసాహెబ్ గారు సహితము పరిగణనీయులు. రాజాశ్రయమును బొందిన కవులు వారి మెప్పు కొరకు చరిత్రను మార్చి రచించవచ్చును. కాని ఈ కవి స్వతంత్రుడు. ఎవరెన్ని ప్రలోభములు పెట్టినను లొంగని ధీరుడు. మాట తప్పని మడమ తిప్పని ధర్మవీరుడు. ఒక సందర్భములో కవియే స్వహముగా

నేను అన్నమాట - నిలుపుకొంటాను అం
టాను ఉన్నమాట - నాకు ధర్మ
భీతి తప్ప ఎవని - భీతి లేదందుకే
తప్పలేదు జగతి - తిప్పలెపుడు ॥ 3 ॥

అని ఘంటాపథముగా నిష్కర్షగా నొక్కి వక్కాణించారు.

రాణీ సంయుక్త కావ్యము దాదాపు ప్రాచీన కావ్య లక్షణానుగుణముగా విరచితము. సన్నివేశ కల్పనము, పాత్రోచిత సంభాషణము, ఇతివృత్త నిర్వహణము, రసపుష్టి, సముచిత వర్ణనాదృష్టి ప్రభృతులందలి పాపా సాహెబ్ సృష్టి ప్రస్తవనీయము. దేశభక్తి ప్రబోధాత్మకమైన ప్రకృత కావ్యము పఠితలను ప్రతిస్పందింపజేయును. విభిన్న భాషా మత సంప్రదాయములకు నిలయమైన భారతదేశమున జాతీయ సమైక్యత సాధించుటకు దేశభక్తిని పెంపొందించుటకు స్వాతంత్ర్యమును సంరక్షించుకొనుటకు ప్రధానాదర్శము "రాణీ సంయుక్త".

**ఉపయుక్త గ్రంథసూచీ :**

1) తక్కల్లపల్లి పాపాసాహెబ్, రాణీ సంయుక్త, 3-19.
2) తక్కల్లపల్లి పాపాసాహెబ్, రాణీ సంయుక్త, 5-23.
3) తక్కల్లపల్లి పాపాసాహెబ్, పాపసాబు మాటపైడిమూట, 8

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# ప్రపంచీకరణ దుష్ఫలితాలపై ఉద్యమించిన ఉప్పలధడియం

- డి. ప్రమీల, పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, ప్రెసిడెన్సీ కళాశాల, చెన్నై, తమిళనాడు.

## కవి పరిచయం :

ఉప్పలధడియం వెంకటేశ్వర కవి పద్యాలు, కవితలు, గేయాలు మూడింటిపైన అభినివేశం గలిగిన కవి. తెలుగు ప్రాంతం నుండి తమిళనాడుకు ఉద్యోగరీత్యా తరలి వెళ్ళిన కవి. 1985వ సంవత్సరం నుండి కవిత్వం విభిన్న రూపాల్లో వెలయిస్తూ తెలుగు భాషకై తపిస్తున్న కవి. డా.పులికంటి కృష్ణారెడ్డిగారన్నట్లు "ఉప్పలధడియం ఒక భావకుడు, ఒక ప్రగతివాది, బహుముఖ ప్రజ్ఞాశాలి". ఈతని కవిత్వంలో అనేక పార్శ్వాలున్నాయి. నేటి సమకాలీన పరిస్థితులను, సంఘంలో జరుగుతున్న అన్యాయ, అకృత్యాలను నిశితంగా పరిశీలిస్తూ, కవిత్వంలో ఆవిష్కరిస్తూ, వాటికి పరిష్కారాలకై పరితపిస్తూ, తనశైలిలో అక్షరాల వెంట పరుగులు తీస్తున్న కవి.

## గత కవిత్వ పోకడలు :

ఆధునిక సాహిత్యంలో కవులు ప్రకృతిని గూర్చి, ప్రకృతిలో జీవజాలాన్ని వాటి పట్ల చూపాల్సిన భూత దయను గురించి రాశారు. ప్రకృతిని ఆరాధించాలని ప్రబోధించారు. వీరి కవిత్వంలో ప్రకృతిని చూసి మురిసి పోవడమే గానీ భవిష్యత్తులో ప్రకృతికి కలుగబోయే వినాశనాన్ని గూర్చి, పర్యావరణ పరిరక్షణ గురించి, ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను గూర్చి చెప్పినట్లు కన్పించదు. ప్రజలను ఎప్పటికప్పుడు ప్రపంచీకరణ గురించి, ఆ దుష్ఫలితాల గురించి ఉద్ధృతంగా చైతన్యపరచే కవులు బహు కొద్దిమందే! వారిలో ఉప్పలధడియం కూడా ప్రముఖంగా తన గొంతును వినిపించినవారే!

## ప్రపంచీకరణ నేపథ్యం - దుష్ఫలితాలు :

ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన ఉప్పలధడియం కవిత్వం పరిశీలించే ముందు "ప్రపంచీకరణ" అంటే ఏమిటో స్థూలంగా పునశ్చరణ చేసుకోవలసిన అవసరం ఉంది. "ప్రపంచీకరణ" (Globalisation) అనే పదం ఆర్థికవేత్తలచే 1980 నుండి ఎక్కువగా ఉపయోగించబడుతోంది. అయితే, 1990 దశాబ్దంలోగానీ దీని విధానాలు సర్వత్రా వ్యాప్తి చెందలేదు. ప్రపంచీకరణ గురించి ముందుగా రచించబడ్డ సిద్ధాంతపరమైన విధానాలు, మంత్రిగా మారిన ఒక అమెరికన్ వ్యాపారవేత్త అయిన చార్లెస్ తేజ్ రుస్సేల్ చే లిఖించబడ్డాయి. ప్రపంచీకరణను "సరిహద్దులమధ్య మారకంపై ఉన్న నిర్బంధ నిబంధనలను తగ్గించటం లేదా తొలగించటం మరియు ఫలితంగా ఉద్భవించిన అధికంగా అనుసంధానించబడ్డ మరియు సంక్లిష్టమైన ప్రపంచవ్యవస్థ యొక్క ఉత్పత్తి"గా వివరించారు. గాట్ (GATT) మరియు ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) ల ఫలితంగా కొన్ని అడుగులు చురుకుగా వెయ్యబడ్డాయి. తద్వారా, స్వేచ్ఛాయుతమైన వాణిజ్యాన్ని ప్రోత్సహించటం, పన్నుల విషయంలో వెసులుబాటు ఉన్న స్వేచ్ఛాయుత వాణిజ్య సముదాయాలను సృష్టించడం. ప్రపంచ వ్యాపార సంస్థలకు రాయితీలను సృష్టించటం. ఎక్కువ నిబంధనలతో ప్రధాన దేశాల్లో ఇంటెలెక్ట్యువల్ ప్రాపర్టీ (తెలివితేటలే ఆస్తిగా) చట్టాలను తీసుకురావటం.

ప్రపంచీకరణ అనేది సాహిత్యపరంగా చూస్తే స్థానిక లేదా ప్రాంతీయ విషయాలను ప్రపంచ విషయాలుగా మార్చివేసే ప్రక్రియ. పశ్చిమ దేశాలు ప్రభోధించే ప్రపంచీకరణ లక్ష్యం వారి పెట్టుబడులకు ప్రపంచం మొత్తం ఒక కుగ్రామంగా అందుబాటులోకి వెళ్ళిపోవడం. అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, ఆకలి పెరిగింది. పర్యావరణానికి ముప్పు తలెత్తింది. ప్రపంచీకరణ వల్ల మూడవ ప్రపంచ దేశాలు పట్టును కోల్పోతున్నాయి. సామ్రాజ్యవాద శక్తులు పల్లెల పచ్చదనాన్ని పీల్చేస్తున్నాయి. చల్లని పానీయాల పేరిట విషాన్ని పంచుతున్నాయి. యాంత్రీకరణ, వస్తు సంస్కృతి వ్యామోహం ముసుగులో

పల్లెల్ని బలహీన పరుస్తున్నాయి. దీని ఫలితంగా వ్యవసాయ రంగం, చేతి వృత్తులు దెబ్బతిని పల్లెలు పట్టణాలకు వలస పోతున్నాయి. భూమి, నీరు, అడవులు, ఖనిజ సంపద, నదులు, సముద్రాలు మొదలైన వాటిని ప్రకృతి ఇచ్చిన సహజసంపదగా పేర్కొంటాము. సహజ వనరులపై రాజ్యం, ప్రభుత్వాల ఆధిపత్యం ఉండాలని భారత రాజ్యాంగం ఆదేశిక సూత్రాలలో నిర్దిష్టంగా పేర్కొన్నారు. అనగా వీటిని ప్రజల సంక్షేమానికై వినియోగించవలసిన బాధ్యత ప్రభుత్వాలకున్నది. కానీ 1991లో ప్రారంభించిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా రాజ్యాంగ లక్ష్యాలకు విరుద్ధంగా సహజవనరులను ప్రయివేటు కంపెనీలకు కేటాయించటం ప్రారంభమైంది. అతి సహజ వనరైన మంచినీరు ఈనాడు అతిపెద్ద ''వ్యాపార వస్తువు''గా మారింది. మంచినీటిపై లక్షల కోట్ల వ్యాపారం జరుగుతున్నది.

### గళమెత్తిన కవులు :

ప్రజలను సంస్కరణలనే భ్రమల్లో ఉంచి, భారత దేశాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ఈ ప్రపంచీకరణ విధానాల స్వరూప స్వభావాలు, రంగు, రుచి, వాసనలు ఎలాంటివో సామాన్య ప్రజానీకానికి తెలియకపోవచ్చు. అధిక ధనాపేక్షతో పెట్టుబడి దారులు మాట్లాడకపోవచ్చు. స్వార్థ రాజకీయ నాయకులు నల్లధనం వెనకేసుకునే ప్రయత్నంలో ఇవన్నీ తెలిసినా తెలియనట్లే ప్రవర్తించవచ్చు. కానీ మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు ఇవన్నీ గమనిస్తూ ఉంటారన్న విషయం మనం మరచి పోకూడదు. అలాంటి కవిత్వం వినిపించి ప్రపంచీకరణ దుష్ఫలితాలపై ధ్వజమెత్తి, ప్రజలను హెచ్చరించిన కవులలో డా.అద్దేపల్లి రామమోహనరావు, ఉప్పల ధడియం, మొదలైన వారు ముందువరసలో ఉన్నారు. అలాగే జూకంటి జగన్నాథం, దర్భశయనం శ్రీనివాసాచార్య, మేళ్ళచెరువు లక్ష్మీకాంతరావు, పైడి తెరేష్ బాబు, వేదుల శ్రీరామశర్మ, ఆశారాజు, అశోక్ కుమార్, అనిసెట్టి రజిత ప్రభృతులు కూడా ప్రపంచీకరణపై ధ్వజమెత్తిన వారే!

### మృత్యుద్వీపం - దీర్ఘ కవిత :

ఉప్పలధడియం వెంకటేశ్వర "మృత్యుద్వీపం" కవితా సంపుటి పరిశీలించదగినది. ఇందులో 52 కవితలున్నాయి. వాటిల్లో అక్కడక్కడా పద్య కవిత్వం కూడా ఉంది. మినీ కవిత్వం, హైకూలు కూడా ఉన్నాయి. ఇందులోని ఒక దీర్ఘ కవిత "మృత్యుద్వీపం" డిసెంబర్ 1993లో రాయబడినది. ఈ కవిత రెండువందల పంక్తులతో సాగింది. డా.అద్దేపల్లి అన్నట్టుగా ''సమకాలీన కృత్రిమ, వంచనామయ, మనవతా రహిత జీవితానికి, హింసాత్మకతకి, విచ్చలవిడి సంస్కృతికి, ధన దాహానికి పొందిన ఆవేదన ప్రత్యక్షర అగ్నిజ్వాలగా సాగిన దీర్ఘ కవిత''యిది. ఈ దీర్ఘ కవితను గురించి విశ్లేషించడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

### దీర్ఘకవితల ఆవిర్భావం :

ఈ మృత్యుద్వీపం అనే దీర్ఘకవిత పరిశీలించే ముందుగా దీర్ఘకవిత అనే ప్రక్రియ ఆవిర్భావం గురించి చెప్పడం అవసరం అనుకుంటున్నాను. డా.పెళ్ళూరి సునీల్ ఇటీవల శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో దీర్ఘ కవితలపై పరిశోధన సాగించి ''దీర్ఘ కవితా వికాసం'' అనే సిద్ధాంత గ్రంథం వెలువరించాడు. దానిలో ''1956లో కుందుర్తి రచించిన "తెలంగాణా" తొలి దీర్ఘ కవిత" అనే నిశ్చిత అభిప్రాయం వెలిబుచ్చాడు. కాని ఆ అభిప్రాయం సరైనది కాదు. కుందుర్తి కంటే ముందు 1953లో తెలంగాణాలో ''కవిరాజమూర్తి''గా పేరొందిన సర్వదేవభట్ల నరసింహమూరి రచించిన్ద "మహైక" మొదటగా ప్రచురితమైన దీర్ఘ కవిత.

### మృత్యుద్వీపం విశ్లేషణ :

ఈ కవిత పేరే మృత్యుద్వీపం. ప్రపంచీకరణలో ప్రపంచమే కుగ్రామం అయినట్టుగా మన దేశం మొత్తాన్ని ఒక మృత్యుద్వీపంగా అభివర్ణిస్తాడు కవి. ''గతానుభవాన్ని గుండెలో దాచుకొని/ కొండంత ఆశతో చూస్తున్నాను/ కొత్త గులాబీ మొగ్గ కోసం" అంటున్నాడు. కవి గతానుభవాలన్ని నిరాశాపూరితమైనవని, అప్రయోజనమైనవని

అర్థం చేసుకోవచ్చు. ఆశ మనిషిని బ్రతికిస్తుంది. బంగారం నాణ్యత అగ్నిలో తెలిసినట్టే, మనిషి మంచితనం కష్టంలో తెలుస్తుంది. కష్టాలలో కృంగిపోకూడదు. తినడానికి భోజనంలేని స్థాయి నుంచి తినడానికి సమయమే లేని స్థాయికి ఎదగడమే విజయం. ఆలోచించే మనిషికి ఆవేశం ఉండదు.. ముందుచూపు లేని మనిషికి ఆలోచన ఉం డదు కనుక మనిషి అన్నీ కోల్పోయినప్పటికి ఆత్మవిశ్వా సాన్ని కోల్పోకూడదు. అదొక్కటి చాలు, మనం కోల్పోయిన వాటన్నింటినీ తిరిగి దక్కించుకోవచ్చు. యాంటిసిపేటరీ రియలిస్ట్‌లా మరోగులాబీ కోసం ఆహ్వానగీతం పలుకు తున్నాడు.

"సాంకేతిక విజ్ఞానం/ సంస్కార దీపాన్ని వెలిగించలేదు/ నగ్నత్వానికీ నవ నాగరికతకూ/ దేవతా వస్త్రమే తేడా!" అనడం గమనిస్తే సాంకేతికంగా మనిషి ఎంత విజ్ఞాన కాంతిని పొదివిపట్టుకున్నప్పటికీ ఎంత విజ్ఞానాన్ని స్వంతం చేసుకున్నా, సంస్కారం అనే గుణం మనిషికి లేకపోతే అంతా బూడిదలో పోసిన పన్నీరే! నవనాగరికత సమాజం అని మనం దేన్నైతే కోరుకుంటున్నామో, అదంతా ఒట్టి మిధ్య! దేవతావస్త్రం లాగే ఉన్నదని భ్రమల్లో బ్రతకడమే!

"ఛద్మ వేషధారులం / దేహమాత్ర జీవులం / ఇదమిత్థ మని తెలియని మహా విస్ఫోటనంలో / శకలాలు శక లాలుగా/ చెదిరిపోతున్నాం మనం / లోనెక్కడో సన్నగా వేదన / జనన మరణాల సరిహద్దులలో / మానవ జీవన సమాలోచన! / ఆనంద శోకాల కతీతంగా / తొలిలేని తుదిలేని/ మననధార" ఇక్కడ కవి ఆవేదన తారా స్థాయికి చేరింది. ఈ మహాప్రళయంలో మనిషి ముక్కలు ముక్కలై పోతున్నాడు. బూటకపు కపటపు వేషధారణతో మంచేదో చెడేదో తెలియని మనుగడ సాగిస్తున్నాడు.

"మనమిప్పుడు/ వ్యోమయానం గురించి/ మురిసి పోనవసరం లేదు/ ఆత్మ హననం గురించి/ విశ్లేషించు కోవాలి" అంటున్నాడు కవి. ప్రపంచీకరణ నేపథ్యంలో నాగరికత విషపుకోరలు ఏవిధంగా పల్లెల్నీ, పత్రహరితాన్ని, ప్రకృతిని మంటగలిపిందో తెలియజేసి బాధను వ్యక్తీకరిం చాడు. మనం చేస్తున్న వ్యోమయానం గురించి అట్టే మురిసిపోనవసరం లేదని, ఆత్మావలోకనం అవసరమని, మానవీయసంబంధాలు నిలుపుకోవాలని హితవు పలుకు తున్నాడు కవి. "కనుపించీ కనుపించని సంకెళ్ళు/ చుట్టు ముడుతున్నై/ జీవనాన్ని కబళిస్తుంది మృత్యుద్వీపం!" మనిషి మృత్యుద్వీపంలో సంకెళ్ళతో నిలబడ్డాడని చరమ సందేశమిస్తాడు కవి.

## ముగింపు :

రాబోయే కాలంలో సంక్షోభం మరింత తీవ్రంగా వుంటుందని హెచ్చరిక విన్పించినా ముందస్తు జాగ్రత్తలు తీసుకొనుటలో విఫలమై, మానవజీవితాలు అతలా కుతల మయ్యాయి. రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లు, కార్పొరేట్ దిగ్గజాలు, మాఫియా ముఠాల కూటములు నిస్సిగ్గుగా ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకుని లాభాల బాటల్లో పయనిస్తున్నారు. పాలనలో పారదర్శ కత, జవాబుదారీతనం లోపించడం వల్ల అవినీతి సర్వ వ్యాపితం అయ్యింది. అత్యధిక శాతం ప్రజలు వంచింప బడుచున్నారు. ప్రభుత్వ నిష్క్రియాపరత్వంవల్ల ఆకలి, పేదరికం, నిరక్షరాస్యత కొనసాగుతున్నాయి. ప్రపంచీ కరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉద్భవించటం వలన ఆనతి కాలంలోనే ఒక విరుద్ధ పోకడ మొదలయ్యింది. స్థానిక ప్రత్యేకత, వ్యక్తిత్వం మరియు గుర్తింపులకు రక్షణగా ఒక కొత్త జ్ఞాపికను ఇచ్చింది కానీ చాలా మటుకు విజయం సాధించలేకపోయిందన్న విషయాన్ని అనేక మంది కవులు తమ కవితల్లో వ్యక్త పరిచారు.

"తెలుగు భాష, సంస్కృతి, పర్యావరణాలపై ప్రపంచీ కరణ జరుపుతున్న దాడిని భాషాభిమానులు, సాహితీ వేత్తలు గుర్తించి, అప్రమత్తం కావాలి" అని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత డా.పాపినేని శివశంకర్ ఇచ్చిన సందేశంతో ముగిస్తున్నాను.

❀❀❀

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# సహజ సుందర సంబంధాలు కరుణాకర్ కథలు

– **జె. రజిత,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, తెలంగాణ విశ్వ విద్యాలయం, నిజామాబాద్, తెలంగాణ.

నిర్నిమిత్తం, డియర్, అంబాలీస్ మరియు రెల్లు కథా సంపుటాలను వెలువరించిన రచయిత బి.పి. కరుణాకర్. ఈ కథల్లో నాయకుడు రచయితే. ఈ కథల్లో ఆయన మనస్తత్వం ప్రతిబింబిస్తుంది. రచయిత కరుణాకర్ ఉన్నతోద్యోగం చేసిన వ్యక్తి. సున్నిత మనస్తత్వం కలవాడు. పైగా నెమ్మదస్తుడు. ఆయన వ్యక్తిత్వానికి, ఆత్మీయతకు మరోరూపం. ఎదుటి వ్యక్తి మంచి వాడైతే అతనికి దగ్గరవుతాడు. మృధుభాషి. వీలైనంత వరకు విభేదాలకు దూరంగా ఉంటాడు. భేషజాలను ఇష్టపడడు. ఎవరినీ నొప్పిస్తూ మాట్లాడడు. ఒంటరి తనాన్ని ఇష్ట పడుతూ ఉంటాడు. ఎక్కువ కాలం గ్రంథాలయాల్లో గడుపుతాడు. తన రచనల్లో ప్రేమ పారవశ్యం, సుందరమైన సమాజాన్ని దర్శింపచేస్తాడు. ఎందుటి వారిని ఏ విధంగానూ ఇబ్బంది పెట్టే మనస్తత్వం లేని వాడు. శ్రమపడి అంచెలంచెలుగా ఎదిగి పైకి వచ్చిన కష్టజీవి. సుందర కల్పనలు సహజ సుందరమైన అభివ్యక్తుల, సరళమైన చిత్రీకరణలు, సున్నితమైన వస్తువుల్ని ఇతివృత్తాలను చాకచక్యంగా మలచుకొని మంచి కథలను రాసారు. మనిషి. నిలువెత్తు వాస్తవిక జీవితానికి ఈ నాలుగు సంపుటాలు నాలుగు స్తంభాలుగా కనిపిసస్తాయి.

సమాజంలోని భిన్న దొంతరల్లో ఉండే వైరుధ్యాల్ని నిశితంగా పరిశీలించి చెప్పగలగడం ఈ రచయిత విలక్షణ దృష్టికి నిదర్శనం. ముఖ్యంగా మానవ సంబంధాల్లో మరీ ఎక్కువ వైరుధ్యాలు ఉన్నవి స్త్రీ పురుష సంబంధాలు. వీటిని ఎక్కువ శాతం విశ్లేషించి తన రచనను కొనసాగించాడు. కరుణాకర్ కథని చాలా ఆలోచనాత్మకంగా చిత్రీకరిస్తాడు. పాఠకులకు సూటిగా అంతుపట్టదు. దానికి తోడు కథా శీర్షికల పేర్లు కూడా ఎంతో లోతైన అర్థ స్ఫూర్తితో ఉంటాయి. కరుణాకర్ తెలుగు కథా లోకానికి సుపరిచితులు. కథకుడిగా కరుణాకర్ వివేకవంతుడు. అతను కథలు రాస్తే తెలుగు సాహిత్యం సుసంపన్నతికి మరో నగ కూర్చినట్లవుతుందనేది విమర్శకుల అభిప్రాయం.

అతి సామాన్యంగా కరుణాకర్ కథలు మొదలవుతాయి. ఏ పటాతోపం ఉండదు. కానీ ముగింపులు అద్భుతంగా ఉంటాయి. కథలు గుర్తిండి పోతాయి. ఈయన కథలు రైలులోనో, బస్సు లోనో, పొరుగురిలోనో ఎక్కువగా ప్రారంభం అవుతుంటాయి. అనూహ్య సంఘటనలు, అద్భుత సన్నివేశాలు, మలుపు తిరుగుతుంటాయి'' అని కొలకలూరి ఇనాక్ ఒక విశ్లేషణ చేస్తూ అభిప్రాయపడ్డారు. ప్రేమించి ప్రేమను చెప్పలేని యువతీ యువకులు పెళ్లి చేసుకోదగిన పరిస్థితుల్లో కూడా పెళ్లి తప్పిపోయిన సందర్భాలు, అమాయకత్వం వలన లౌకింకగా ప్రవర్తించడం, చివరకు చనిపోవటం లాంటి సంఘటల వల్ల జీవితం విషాదం అవుతున్న పాత్రలు కరుణాకర్ కథల్లో కనిపిస్తాయి. కథలు చక్కగా అమిరి కథ అంతా సుఖంగా సాగి అద్భుతంగా జీవించిన రచయిత హృదయంలో ఏ మారుమూలో భగ్నమైన కాంక్షలు, ప్రేమలు, ఆత్మీయతలు ఉన్నాయా అని పాఠకులను ఆలోచింపచేసే కథలు కరుణాకర్ రాసారు. ''ఆయన కథలకు పెట్టే పేర్లు కొత్తగా ఉంటాయి. ''మాలను కలిపి మూట కట్టినట్లనిపిస్తుంది'' అని భార్గవి తాను డియర్ కథల సంపుటికి రాసిన ముందుమాటలో చెప్పారు.

ఉదా॥ ఇరుకు వైశాల్యం, లోతైన ఎత్తు, ముళ్లనీరు, అలాగే బుడుదు, గాలికి అవతల గచ్చు పొద లాంటి వాటికి అర్థాలు కొంతమందికి దొరకక పోవచ్చు. కరుణాకర్ కథను చెప్పే పద్ధతీ, నడిపే విధానం చూస్తే పాశ్చాత్య సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేసారని అర్థం అవుతుంది. డియర్ కథా సంపుటిలో 22 కథలు ఒకే లాగా అనిపించవు. కథా శీర్షికకు, కథాంశానికి సబంధం ఉందా? అని

పాఠకునికి కుతూహలం ఏర్పడుతుంది. లోతైన ఎత్తు కథలో భార్య ప్రవర్తన హుందాగా ఉండటం విశేషం. తన భర్తకు ఇంకొకామెతో సంబంధం

ఉందని తెలిసి కూడా అతని నేమీ ప్రశ్నించకపోగా ఆ విషయాన్ని చెప్పటానికి వచ్చిన ఆమెను అవమానించి పంపించి వేస్తుంది. ఆమె ప్రవర్తన ఆమె హృదయపు లోతును, ఎత్తునీ, ప్రతిబింబింపచేస్తోందని చెప్పవచ్చు. ఇలా కరుణాకర్ తన కథలన్నీ కొనసాగిస్తూ ఉంటాడు.

## రచయిత జననం :

కరుణాకర్ గుంటూర్ జిల్లాలోని గ్రేస్ మనోరమా కిన్సింగర్, బండారు ప్రేమానందం దంపతులకు 1944 ఏప్రిల్ 22వ తేదీన జన్మించారు. అయిదుగురు అన్న దమ్ములలో కరుణాకర్ రెండవవాడు. ఒక చెల్లెలు ఉంది. వీరి తల్లి 1981లో వీరి తండ్రి 1990లో మరణిం చారు. రచయిత అన్నయ్య డా॥ బండారు సైమన్ ప్రసన్నచిత్ యం.ఎస్.సి. మరియు పిహెచ్.డి. పూర్తి చేసి, తెలుగు అకాడెమీ హైదరాబాద్‌లో రీసెర్చ్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేసారు. రచయిత తప్ప ఇంట్లో మిగతా తమ్ముళ్లు చెల్లెలు పి.జి.లు చేసి లెక్చరర్లుగా ఉద్యోగాలు చేసారు. రచయిత చదువు బిఎస్సీతో ఆగిపోయింది. చదివిన చదువుకు ఉద్యోగానికి ఎటువంటి సంబంధం లేకుండా పోయింది.

## కరుణాకర్ బాల్యం - విద్యాభ్యాసం :

రచయిత తండ్రి బాపట్లలో ఉద్యోగం చేసేవాడు. తండ్రి ఉద్యోగ రీత్యా... కరుణాకర్ బాల్యం కైకలూరు, నెల్లూరు బాపట్లలో గడిచింది. లూథరన్ మల్టీపర్పసస్ స్కూలు, గుంటూర్‌లో స్కూలు ఫైనల్ వరకు విద్యా భ్యాసం జరిగింది. రచయిత తెలివైన విద్యార్థిగా వ్యవ హరించేవాడు కాదు. తను స్కూలు ఫైనల్ వరకు వస్తాడని ఎవరూ అనుకోలేదు. రచయితకు కూడా నమ్మకమే లేదు. అలాగే తల్లిదండ్రులకు కూడా లేదు. గమ్మత్తేమిటంటే అతను ఏ క్లాసులోనూ ఫెయిల్ కాలేదు. అత్తెసరు మార్కు లతో గట్టెక్కిపోతూ ఉండేవాడు. మొత్తానికి రచయిత 1958లో స్కూల్ ఫైనల్ ముగించుకున్నారు. 1959లో ఆంధ్ర కళాశాల, గుంటూర్‌లో పి.యు.సి. చదివారు. 1962కు అదే కళాశాలలో నుంచి బి.ఎస్సీ సర్టిఫికెట్‌ను పొందారు. రచయిత పట్ట భద్రుడు అవ్వడం ఇంటిల్లి పాదిని ఆశ్చర్య పరిచింది. తనను తాను నిరూపించు కోవడానికి యం.ఎ స్సీ చదవడానికై మధ్యప్రదేశ్‌లోని షాడోల్‌కు వెళ్లి కష్టపడి కెమిస్ట్రీలో సీటు సంపాదించాడు. కాని ఆర్థిక ఇబ్బందుల వలన, అనారోగ్య కారణాల వలన చదువు కొనసాగించలేక పోయాడు. పి.జి. వదిలేసి గుంటూరు తిరిగి వచ్చాడు.

## కరుణాకర్ వివాహం :

1969 జూన్‌లో బాపట్లలో దుడ్డు హేమలతతో వివాహం జరిగింది. హేమలత ఎం.ఏ. బి.ఇడి చేసి గవర్న మెంట్ ఎయిడెడ్ పాఠశాలలో టీచర్ ఉద్యోగం చేసింది. ఆమే డిశెంబర్ 1996లో చనిపోయారు. రచయిత కుమార్తెలలో మొదటి కుమార్తె బండారు జోనా విజయ ప్రియ. ఈమె 1971లో జన్మించారు. ఈమెకు ఎం.సి.ఏ చేసిన తర్వాత 1999లో వివాహం అయింది. రెండవ కుమార్తె బండారు జయశ్రీ మనోరమ. ఈమె 1976లో జన్మించారు. బి.టెక్ చేసిన తర్వాత 2001లో ఈమెకు వివాహమైంది. భార్యా భర్తలిద్దరూ అమెరికా వర్జినీయా సస్పీట్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు.

## కరుణాకర్ ఉద్యోగం :

కరుణాకర్ 1962లో ఉద్యోగంలో చేరి 1964వరకు ఖమ్మం జిల్లా చినకోరుకొండ, నేలకొండపల్లి గ్రామాల్లో అన్‌ట్రైన్డ్ సైన్స్ అసిస్టెంట్‌గా పనిచేసారు. 1964లో కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ పూనాలో ఆడిటర్ ఉన్నతోద్యోగంలో చేరాడు. డిపార్ట్‌మెంటల్ పరీక్ష పాసైన తర్వాత 1973లో సెక్షన్ ఆఫీసర్ గా ప్రమోషన్ మీద ఆర్డినేన్స్ ఫిక్టరీ, చాందాకు బదిలీ చేసారు. అక్కడి నుండి 1979లో పే ఎకౌంట్స్‌సాఫీసు (ఇయం.ఇ) తిరుమల గిరి, సికిందరాబాద్‌కు వచ్చి బిహెచ్.ఇ.ఎల్ రామచంద్రాపురం, హైదరాబాద్‌కు డెప్యూటేషన్ మీద వెళ్లి అక్కడ ఉండి

పోయారు. 2004 ఏప్రిల్‌లో మేనేజర్‌గా పదవీ విరమణ చేసారు. కరుణాకర్ తన శేష జీవితాన్ని సాహిత్య రచనలకు ఉపయోగిస్తున్నారు.

## కరుణాకర్ రచనలు :

స్కూల్లో చదువుతుండగానే సాహిత్యం మీద అభిలాష ఏర్పడింది. రచయిత తండ్రి, అన్నయ్య ప్రోత్సాహంతో అభిరుచి మరింత ఎక్కువైంది. కాలేజీలో చదువుకుంటూనే మిత్రులతో కలసి రాగమయి అనే రాత పత్రిక ఒకే ప్రతి తయారు చేసి గుంటూరు స్టేట్ లైబ్రరీలో నెలనెలా ఉంచేవారు. ఏ కొద్ది సమయం దొరికినా లైబ్రరీలో కూర్చుని కథల పుస్తకాలు , నవలలు చదివే వారు. సన్నగా ఉండడం వలన స్కూల్లో, కాలేజీలో ఏ ఆటలలోనూ తీసుకునే వాళ్లు కాదు. ఇదే సాహిత్యం మీద ఇష్టం మేర్పడటానికి అతి పెద్ద కారణమైంది. రాయాలన్న తపన ఉండేది. రాయడం మొదలు పెట్టిన తర్వాత ఏ కథా అచ్చు అవలేదు. పంపిన రచనల్నీ తిరిగి వెనకకు వస్తూం డేవి. రచయిత మీద చలం, శరత్, త్రిపురనేని గోపిచంద్, ధనికొండ హనుమంతరావు మామ్, మాపాసా, ఎమిలీ జోల, ఓ హెన్రీ ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ విధంగా కరుణాకర్ రచనా క్రమం ప్రారంభమైంది. 1962లో మద్రాసు నుండి వెలువడిన 'చిత్రగుప్త' పత్రిలో అచ్చ యింది. ఆ తర్వాత మచిలీపట్టణం నుండి వెలువడిన 'చుక్కాని' పత్రికలో కృష్ణా పత్రికలో అచ్చు అయ్యాయి. 1965నుండి ఆంధ్ర సచిత్ర వార పత్రికకు రాయడం మొదలు పెట్టారు. 1985 తర్వాత కథలు రాయడం మానే శారు. 1996నుండి 2004 మధ్య కాలంలో ఒక కథ కూడా రాయలేదు. కానీ 2004లో మటుకు ఒక్క కథ రాసారు. 2007 నవంబరు నుండి తిరిగి కథలు రాయడం మొదలు పెట్టారు. అవి వివిధ పత్రికలలో అచ్చవు తున్నాయి. కరుణాకర్ 1985 నుండి 1996 వరకు రచిం చిన కథలన్నింటిని సేకరించి అంబాలీసస్ కథల సంపుటిగా ముద్రించారు. వివిధ పత్రికలలో అచ్చయిన కరుణాకర్ కథలు అచ్చాయ్యాయి. (2007నుండి) కంటి మందు, నిర్నమిత్తం, వేగం, నీటిమెట్లు, (వర్తా రచన ఆదివారం సంచిక) అయిపు, ఊరు చివర రాయి, నీటి బీట, మూలసత్రం, తుంగ తీరు గుప్పెడు గాలి, పట్టెడు నిప్పు, చున్ని ఏలియా (వార్తా ఆదివారం అనుబంధం), లెక్కగూడు, ఎదురు నీడ( తేజ వారపత్రిక), కత్తెర ( రచన మాస పత్రిక), ఊటబాధ, ఒంటరి, దూరం (నవ్య వార పత్రిక), మొదలగునవి ప్రఖ్యాతి చెందిన వాటిలో ఉన్నాయి. 2008లో వెలువడిన అంబాలీసస్ కథల సంపుటి వీరి మొదటి పుస్తకం. ఆ తర్వాత 2009లో అక్టోబర్‌లో నిర్నిమిత్తం, అంబాలీస్ రెండవ కథా సంపుటి వెలువడింది. డియర్ మూడవ కథల సంపుటి, రెల్లు నాలుగవ కథా సంపుటిగా ముద్రింప బడ్డాయి. సమాజం లోని ఒక్కొక్క సంఘటనను ఆదారంగా చేసుకొని రచ యిత కథలను రాసారు. రచయిత ఈ విధంగా కథలను నడిపించటం ఒక ప్రత్యేకత.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# సామాజిక సమానత్వాన్ని కాంక్షించిన అక్క మహాదేవి

- డా॥ ఎమ్.ఎమ్. వినోదిని, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

భక్తి దృక్పథంతో సాహిత్యసృజన చేసిన తొలితరం భారతీయ స్త్రీ రచయితల్లో అక్క మహాదేవి ఒకరు. కర్నాటకలో వీరశైవ ఉద్యమాన్ని నిర్మించిన బసవేశ్వరుని సమకాలికురాలైన అక్క మహాదేవి 12వ శతాబ్దంలోనే అత్యాధునిక ఆలోచనలతో స్వేచ్ఛా భావనతో కవిత్వం రాసింది. సాహిత్యంలోను, జీవితంలోను ఆధిపత్యాన్ని, కట్టుబాట్లను ధిక్కరించి ఒక విశాల సామాజిక భావనను తన సాహిత్య బోధనలో ప్రతిబింబించింది.

## అక్క మహాదేవి నేపథ్యం :

అక్క మహాదేవి కర్నాటకలోని షిమోగా (ఇప్పటి శివ మొగ్గ) సమీపాన ఉడుతడిలో క్రీ.శ. 1150 ప్రాంతంలో పుట్టింది. తల్లిదండ్రులు సుమతి, నిర్మలశెట్టి. వీరిది శైవ సంప్రదాయాన్ని ఆచరించే కుటుంబం, కాబట్టి 'మహాదేవి' అని పేరు పెట్టుకున్నారని పరిశోధకుల అభిప్రాయం. ఈమె బాల్యం శైవసాహిత్యంతో, జీవనంతో మమేకమై సాగింది. మహాదేవి పెళ్లి సాధారణ పరిస్థితులకు భిన్నంగా జరిగినట్లు పరిశోధనా రచనలు చెబుతున్నాయి. ఒకనాడు ఉడుతడిని పాలించే కౌశికుడు నగరంలో ఊరేగు తుండగా రాజును మేడలపై నుండి చూస్తున్న బాలికల్లో మహాదేవిని చూసి, ఇష్టపడి, ఆమెను వివాహం చేసు కోవాలని ఉద్దేశాన్ని తెలియజేయగా మహాదేవి తిరస్కరిం చిందని తెలుస్తుంది. కౌశికుడు తన నిర్ణయాన్ని మార్చు కోకపోవడంతో మూడు షరతులతో అంగీకరించినట్లు తెలుస్తుంది. కౌశికుడు జైన సంప్రదాయాన్ని అనుసరించే వాడు, మహాదేవి శైవభక్తిని నమ్ముకుంది. వివాహం తర్వాత కూడా తన శైవభక్తికి ఏ ఆటంకం లేకుండా కొన సాగే ఒప్పందం మీద వివాహం చేసుకుంది. ఇది మహా దేవి వ్యక్తిత్వం. వివాహం తన ఆచరణను, విశ్వాసాన్ని భగ్నం చేయకుండా వుండేలా నిలబడటం ద్వారా ఆమె తన ఉనికిని, అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంది. ఇటువంటి వ్యక్తిత్వంతో, ఆత్మగౌరవంతో తన జీవితాన్ని కొనసాగించింది. అలాంటి ఆమె వ్యక్తిత్వం, జ్ఞానం, ఔన్నత్యం ఆమె సృజించిన సాహిత్యంలో కూడా ప్రతిబిం బించాయి.

మహాదేవి ఒకానొక సందర్భంలో తమ కుటుంబ గురు వైన గురులింగ దేవుని రాక గురించి తెలిసి, దర్శించు కోబోగా ఆమె చీరను కౌశికుడు లాగి అపహాస్యం చేశాడని - నాటి నుండి ఆమె బట్టలు ధరించడం మానేసి తన పొడవైన జుట్టుతోనే శరీరం కప్పుకుందని ముందు రచనల వల్ల తెలుస్తుంది. ఆ సందర్భంలోనే ఈమె అంతఃపురం వీడి సామాజిక జీవనంలోకి ప్రయాణించింది. ప్రజాదరణ పొందింది.

అప్పటికే వీరశైవ కేంద్రంగా వున్న కళ్యాణ పట్టణం చేరుకున్నది. లింగాయత ధర్మాన్ని బోధించే బసవేశ్వ రునితో, అల్లమ ప్రభువుతో కల్సి 'అనుభవ మంటపం' కేంద్రంగా శివతత్వాన్ని ప్రచారం చేసింది. 'అనుభవ మంటపం'లో "అక్క"గా ప్రఖ్యాతి పొందింది. మహా లింగైక్యం పొందాలన్న కోర్కెను బసవేశ్వరునికి తెలిపింది. మహాదేవి తేజస్సుకు, సాహితీ చతురతకు, భక్తి తత్పరతకు ముగ్ధుడైన బసవేశ్వరుడు ఆమెను శ్రీశైలంలోని కదళీవనంలో గల జ్యోతిర్లింగంలో ఐక్యం పొందమని సూచించాడు. కాలినడకన శ్రీశైలం చేరుకొని మహాదేవి తన భక్తిని రచనల ద్వారా బోధనల ద్వారా ప్రచారం చేసింది.

కన్నడ సాహిత్యంలో అక్క మహాదేవి వచనాలకు ఎంతో పేరుంది. భక్తి సాహిత్యంలో ఆధునిక దృక్పథాన్ని బోధిం చిన అక్క మహాదేవి తన వచనాల ద్వారా సమాజానికి నూతన ఆలోచనలను అందించింది. సమాజం మన చుట్టూ కట్టుబాట్ల పేరుతో, సంప్రదాయాల పేరుతో పన్నిన కృత్రిమ ఉచ్చుల్ని తెంపుకోవాలని చెప్పింది. భక్తితత్వాన్ని,

వివాహ వ్యవస్థను, స్త్రీ దృక్పథాన్ని, వీరశైవాన్ని తన వచనాలతో సులభంగా వ్యాఖ్యానించి బోధించింది.

**వివాహవ్యవస్థ :**

అక్క మహాదేవి భౌతికంగా కౌశికుడిని పెళ్లి చేసుకున్నా మానసికంగా ఆమె తనకుతాను 'చెన్న మల్లికార్జునుడి'ని భర్తగా భావించింది. ఆమె మనసునిండా చెన్న మల్లికార్జునుడు నిండి ఉండటాన మరొకరిని భర్తగా స్వీకరించలేక పోయింది. ఈ పరిస్థితులను ఆమె కవిత్వం ప్రతిబింబించింది.

"లోపల మొగుడు
బయట విటుడు
ఇద్దరితో నెగ్గుకు రాలేవు
గుండ్రటి వెలగపండుని
పొడుగాటి వింటి బద్దని
కలిపి ఒంటి చేత్తో పట్టలేవు"

అనడం ద్వారా తనలోని ఒక మానసిక సంఘర్షణను, బయటి ప్రపంచంలో ఇమడలేని తనాన్ని స్పష్టంగా చెప్పింది.

పితృస్వామ్య వ్యవస్థలో వివాహవ్యవస్థ అత్యంత బలమైంది. ఎలాంటి స్త్రీలనైనా ఈ వివాహ వ్యవస్థ లొంగదీసుకుంటుంది. ఈనాటి చాలామంది స్త్రీలు, స్త్రీవాదులు కూడా ధిక్కరించలేకపోతున్న పటిష్టమైన వ్యవస్థ యిది.

ఈ వ్యవస్థని 12వ శతాబ్దంలోనే అక్క మహాదేవి ధిక్కరించింది. 'భార్య అంగీకారం లేకపోతే అది రేప్' అని ఈనాడు సుప్రీంకోర్టు తీర్పు. కానీ అప్పుడే అక్క మహాదేవికి ఆ విషయంలో స్పష్టత వుంది.

"మొగుడి చిత్తం ఎప్పుడూ
కులికే చానల మీద
వీడు చట్టుబండలు అవుతాడు కానీ
దేవుడు కాడు"

అని చెప్పింది.

"ఐతే ఏం? చూస్కో!
ఈ తొత్తుదానికో తప్పో ఇచ్చి
మొగుడ్ని మూలకూర్చోబెట్టి చెక్కేస్తా
హరుడితో కల్సి సరసాలాడేస్తా"

అన్నది. చెన్నకేశవుడే తన మనస్సూ, తనువూ నిండి వున్నాడని చెప్పింది. అంతేకాదు.

"అవ్వా విను!
... ఈ చచ్చు పుచ్చు మొగుళ్లని పట్టుకెళ్లి
నీ పొయిలో కట్టెలతోపాటు తగలబెట్టు"

అని పురుషాధిపత్య వివాహ వ్యవస్థ మీద వున్న అసహనాన్ని ప్రకటించింది.

**భక్తితత్వం :**

అక్క మహాదేవి బాల్యం నుంచే బలమైన భక్తి భావనకు లోనయింది. చెన్న మల్లికార్జునుడి భక్తిలో, ప్రేమలో మునిగిపోయింది. మల్లికార్జునుని ప్రేమను వెతుక్కుంటూ ఇంటిని, భర్తను విడిచి లోకసంచారిగా వెళ్లిపోయింది.

"దేవుడు తెలిశాక
దేహం, కుక్కతింటే ఏమిటి?
నీళ్లలో ఊరితే ఏమిటి" అనడం ద్వారా

అలౌకికమైన భక్తి పారవశత్వాన్ని మహాదేవి వ్యక్తపరచింది.

"ఆకలేస్తే
ఊళ్లో అడుక్కు తెచ్చుకున్న అన్నం వుంది
దప్పికేస్తే
చెరువులు, దొరువుల నిండా నీళ్లున్నవి
నిద్రవస్తే
పాడుబడ్డ గుళ్లు చాలావున్నవి
ఆత్మతో కూడి ఉండటానికి
చెన్నమల్లికార్జునా... నాకు నీవున్నావు"

'తోడు' వివాహబంధం కాదని, 'తోడు' కావలసింది శరీరానికి కాదని మహాదేవి నమ్మకం. 'ఆత్మబంధం' వివాహ బంధం కన్నా బలమైందని నమ్మింది. తన ఆత్మ నిండా చెన్న బసవేశ్వరుడు నిండి వున్నందున తాను ఒంటరిని కాదని తనకు తోడువున్నాడని చెప్పుకుంది. తన

ఆత్మీయ అవసరాలను చెన్నమల్లికార్జునుడే తీరుస్తాడని అంటుంది.

భక్తిలో కులం, మతం, ప్రాంతం వంటి అన్ని అడ్డంకులను దాటేసి ఒక పరిపూర్ణ స్వేచ్ఛాయుత దైవత్వాన్ని కలగన్నది.

"అవ్వా విను!
నేను వలచిన వాడు
బహు సుందరాకారుడు
బంధం లేని
భయం లేని
కులం అడ్డులేని, దేశం హద్దులేని
బహు సుందరాకారుడు"

అని ఒక విశ్వజనీన ప్రేమను ప్రకటించింది. అటువంటి ప్రేమలో ఏ అడ్డూ వుండదు - అలా లేకపోవడమే సౌందర్యం అని నిర్వచించింది.

"ముడి వూడిపోయి
ముఖం వాడిపోయి
తనువు డస్సిపోయి
వున్న దాన్ని
అన్నలారా, నాతో మీకు వాదులెందుకు
..........................................
"తండ్రులారా, నన్నెందుకు మీరింకా బాధపెడతారు
చెన్నమల్లికార్జునుడితో కలిసి
కులం పోగొట్టుకున్నదాన్ని కదా నేను"

అని చెప్పింది.

భక్తితత్వంలో ప్రేమనీ, సమానత్వాన్ని చాటింది. అడ్డుగోడలు లేని, ఒకరిపై ఒకరికి ఆధిపత్యం లేని ఒక సమభావనలో ఈ సమాజం సాగాలని ఆకాంక్షించింది.

## దైవం - శైవం - భక్తి :

వీరశైవం, కులవివక్షకు వ్యతిరేకంగా తీవ్రస్వరంతో ముందుకొచ్చిన శైవశాఖ. వీరశైవాన్ని నమ్మిన అక్క మహాదేవి కూడా వీరశైవ దృక్పథాన్ని ప్రకటించడంతోపాటు ఆచరణలో జీవితాన్ని అర్పించింది.

"కాయం నల్లగా కందితే ఏమి?
ఎర్రగా మెరిస్తే ఏమి?
అంతరంగం శుద్ధమైనాక
అది ఏమైతే ఏమి?"
"పిల్లలు కలగని వాళ్లకి
ప్రసవ బాధ
ఎలా తెలుస్తుంది?
గాయపడని వాళ్లకి
గాయం నొప్పి
ఎలా తెలుస్తుంది
చెన్నమల్లికార్జునా
నీ ప్రేమఖడ్గం నా గుండెల్లోకి దిగి
నడిమికి విరిగింది
ఓర్చుకోలేని ఆ బాధ
మీకెలా తెలుస్తుంది తల్లులారా"

అని సుఖశాంతులతో తమ జీవితాలని గడుపుతూ - కష్టపడుతూ తమ జీవితాన్ని గడుపుతున్న కష్టజీవులని నిందించే వారిని ప్రశ్నించింది. భక్తిలోని అంతిమ తాదాత్మ్యం ఒకటివుందంటే దానిని అక్క మహాదేవి తన కవిత్వంలో ప్రతిబింబించింది.

చెన్న మల్లికార్జునుడి ప్రేమ పరవశత్వంతో అణువణువూ నిండి పోయిన అక్క మహాదేవి తనను తాను ప్రేమతో, భక్తితో, అనురాగంతో దేవునికి సమర్పించుకుంది. తన జీవితాన్ని దేవుడి సన్నిధిలో ఉంచింది.

"ఎప్పుడూ కనబడుతూ -
కూడుతూ వుండేదాని కంటే
ఒకళ్ల కొకళ్లు చాలాకాలం దూరంగా వుండి
మళ్లీ దగ్గరైనపుడు
ఒక్కసారి కూడినా
ఆ సుఖం
అన్నింటి కంటే గొప్పది
చిక్కల్లా
నిన్ను చూడకుండా
ఒక్క క్షణం వుండలేను"

అని చెన్నమల్లికార్జునుడితో చెప్పింది. ఒక్క క్షణం కూడా దూరంగా బతకలేని తనాన్ని క్షణం కూడా భక్తిని వీడి, దేవుడ్ని వీడి వుండలేని తనాన్ని చెప్పింది.

**కులవివక్ష :**

కులాన్ని, కులాధిపత్యాన్ని బలపరిచే సాహిత్యాన్ని ఒక వర్గం బలంగా రాస్తున్న కాలంలో కులాన్ని తిరస్కార భావంతో చూడగలగడం సాహసం. అక్క మహాదేవి కుల విభజనను ప్రశ్నించింది. నిరసించింది. కులం గీతల్ని నిజమైన ప్రేమ అధిగమిస్తుందని చెప్పింది.

"నిజంగా ప్రేమ ఉన్నవాళ్లు
కులం విచారిస్తారా?
గట్టిగా ఇష్టపడేవాళ్లు
వెనుక ముందు ఆలోచిస్తారా?" - అని
ప్రశ్నించింది.

ప్రేమ, ఇష్టం అనేవి కులానికి అతీతమైనవని అంది. కులాధిపత్యాన్ని హక్కుగా భావిస్తున్న వాళ్లు కింది కులాల వారిని దేవాలయాలలోనికి రానీయకపోవడం వుంది. ఆ రోజుల్లో అంటరానితనం, వివక్ష దుర్మార్గంగా వుండగా - ఈనాటికది కొంత తగ్గు మొహం పట్టినట్టు కనబడినా వివిధ రూపాల్లో ఇంకా బలంగా పాతుకొని ఉంది.

"ముడివూడి పోయి / ముఖం వాడిపోయి / తనువు డస్సిపోయి
వున్నదాన్ని / అన్నలారా / నాతో మీకు / వాదులెందుకు?"

అని అంటుంది. ఇక్కడ ముడి వూడిపోయి - ముఖం వాడిపోయిన స్త్రీ 'లోకం కాదన్న' స్త్రీ

"చెన్న మల్లికార్జునుడితో కలిసి
కులం పోగొట్టుకొన్నదాన్ని కదా! నేను"

అని అక్క మహాదేవి చెప్పడంలో వివక్ష కంచెలను దూకేసిన కుల సంకరం వుంది.

"బంధం లేని భయం లేని
కులం అడ్డులేని దేశం హద్దులేని
బహు సుందరాకారుడు
నేను వలచినవాడు"

అంటూ అంతిమంగా ఏ హద్దులూ, ఆంక్షలూ లేని ప్రేమను ప్రకటించింది. సంకుచిత మనస్తత్వం ఉన్న చచ్చు పుచ్చు మొగుళ్లను పొయిలో కట్టెలతో పాటు తగలబెట్టమని చెప్పింది.

సంస్కర్తలు, పండితులు, మానవవాదులు, విప్లవ వాదులు, స్త్రీవాదుల కన్నా ముందే సామాజిక మార్పును సూచించింది. తిరుగుబాటును ప్రకటించింది. ధిక్కార స్వరం వినిపించింది.

"గాయపడని వాళ్లకి
గాయం నొప్పి
ఎలా తెలుస్తుంది?"

అని అస్తిత్వ స్పృహని చెప్పింది మహాదేవి. స్త్రీవాదం, దళితవాదం, ముస్లింవాదం లాంటి అస్తిత్వ చైతన్యాలు ఇవాళ మాట్లాడుతున్న ఫిలాసఫీ ఇదే!

అక్క మహాదేవి సమానత్వాన్ని, శాంతిని, ప్రేమనీ కోరుకుంది. ఈ సమాజం మానవీయ హృదయంతో, శివనామ స్మరణతో చెన్నమల్లికార్జునుని సేవలో ఉండాలని కోరుకుంది.

అక్క మహాదేవి కవిత్వంలో గొప్ప తాత్వికత దాగి వుంది. చిన్న చిన్న వాక్యాల్లో సామాజిక విషయాలను లోతుగా ప్రతిబింబించింది. పురుషాధిపత్యాన్ని, కులాధిపత్యాన్ని, అజ్ఞాన ఆచారాలను ఖండించింది. ఎగతాళి చేసింది. సున్నితమైన, చిన్న చిన్న మాటలతో కవిత్వం అల్లింది.

అక్క మహాదేవి కన్నడ వచనాలను దీవిసుబ్బారావు గారు తెలుగు అనువాదం చేశారు. దీవి సుబ్బారావు గారి తెలుగు అనువాదం ఎంతో రమ్యంగా, సరళంగా, సమకాలీనంగా వుంది.

అక్క మహాదేవి సాహిత్యం భక్తులకు భక్తిసాహిత్యం. ఇదే సాహిత్యం - సామాజిక దృక్పథంతో అర్థం చేసుకునే వారికి తొలినాటి సంస్కరణ సాహిత్యంగా కనిపిస్తుంది.

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal -
Arts & Humanities, Sl. No. 35

# పాలమూరు సాహిత్య సింధువు

**డా॥మఠపతి మాంతయ్య,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (తెలుగు)
డాక్టర్ బి.ఆర్.ఆర్.ప్రభుత్వ కళాశాల, జడ్చర్ల.

**ఉపోద్ఘాతము :** తెలంగాణ రాష్ట్రంలోని పాలమూరు జిల్లాలో ఎంతో మంది కవులు, కళాకారులు ఉన్నారు. తెలుగు సాహిత్యమును సుసంపన్నం చేసిన వారిలో డా॥బూర్గుల రామకృష్ణారావు గారొకరు. బూర్గుల వారు బహుముఖ ప్రజ్ఞాశాలి. కవి, రచయిత, పరిశోధకుడు.

తెలుగు భాషలోనే కాకుండా బూర్గుల రామకృష్ణారావుగారు సంస్కృతము, హిందీ, ఆంగ్లభాషలలో సృజనాత్మక రచనలు చేశారు. తెలుగులో పుష్పాంజలి (శతకం), తోకచుక్క (కవితలు), శ్రీవేంకటేశ్వర సుప్రభాతం, కృష్ణశతకం, కవితా మంజరి (సంస్కృత), సారస్వత ముక్తావళి హిందీలో ఆంధ్ర మహాభాగవత సమీక్ష, ఆంగ్లంలో

ఇవే కాకుండా పారశీక వాఙ్మయ చరిత్ర సౌందర్యలహరి, పండితరాజ పంచామృతం, కనకధారాస్తవం, సర్మద్ గీతములు మొదలైన అనువాదాలు చేశారు.

## సంస్కృత శ్లోకం - పారసి గజల్

"తెలుగు పద్యం వెరసి బూర్గుల అని బూర్గుల వారిని ప్రశంసించారు మహాకవి దాశరథి. బూర్గుల రామకృష్ణారావు గారి రచనలలో శిఖరాయమానమైనది. "పండితరాజ పంచామృతం" దీనిని సంస్కృతంలో జగన్నాథ పండితరాయలు రచించారు.

లక్ష్మీలహరిలోని 41 శ్లోకాలకు, కరుణాలహరిలోని 55 శ్లోకాలకు, అమృతహరిలోని 11 శ్లోకాలకు, గంగాలహరిలోని 53 శ్లోకాలకు, సుధాలహరిలోని 30 శ్లోకాలకు అనువాదం చేశారు. ఇవన్నీ తెలుగు నుడికారంతో, మూలాన్ని అనుసరించి అనువాదం జరిగినట్లు పండితులభిప్రాయ పడ్డారు. జగన్నాథ పండితరాయల శ్లోకాలకు అక్కడక్కడ బూర్గులవారు చేసిన సవరణలు, ఊహించిన పాఠాంతరాలు వీరరాఘవాచార్యుల లాంటి మహా పండితుల మన్ననలకు పాత్రం కావడం విశేషం. ఈ గ్రంథానికి వ్రాసిన పీఠికలో "సంస్కృతాంధ్ర భాషా పాండిత్యమును సంపాదించుటకు గాని, సాహిత్య పరిశ్రమనొనర్చుటకు గాని యవకాశమే లభింపక నేటికిని సాహిత్యేతర వ్యాసంగములందు వ్యగ్రుడనై యల్పజ్ఞుడనగు నేనీపనికి సాహసించుటకు నిజముగా నాయుత్సాహమే కారణముగాని నా శక్తి సామర్థ్యములు కావు" అని చెప్పుకోవడం ఇందులోని గుణములన్ని నాకు సంస్కృతం నేర్పిన గురువులవి, దోషాలన్నీ నావి, అని ప్రకటించుకోవడం బూర్గుల వారి వినయానికి నిదర్శనం.

నిండుకుండలు తొణకవు, వెలితికుండలు ఎగిరెగిరి పడతాయన్న సామెత ననుసరించి బూర్గుల రామకృష్ణారావు గారు నిండుకుండలాంటి మనిషి.

స్మరోనామం నామం త్రిజగదభిరామంతవ పదం
ప్రపేదే సిద్ధం యాంకథమివ నరస్తాం కథయతు
యయాపాతం పదకమలయో: పర్వతచరో
హరోహారోషార్ద్రా మనునయతి శైతేంద్రతనయామ్

తెలుగులో

జగదభిరామ మీ చరణ సారసయుగము మ్రొక్కిమొక్కియే
యగణిత సిద్ధినొందెనొ సుమాయుధుడయ్యది సెప్పనేర్తునే?
యగజ పదాబ్జమంటి మరియంటి యోకానొక కొండకోయ, మున్
బగ వగగొన్న యామె బతిమాలుటకుం గతమొద్దియే కదా!!

త్రిజగదభిరామమైన శైలేంద్రతనయ నామ "పదాన్ని" స్మరుడు (మన్మథుడు) స్మరించి, స్మరించి, నామ జపం చేశాడు. "పదం" శబ్దం ద్వారా పాదసేవ అనే అర్థం

కూడా వచ్చింది. దానిని తెలుగులో బూర్గుల వారు "మ్రొక్కి, మ్రొక్కి" అని చక్కని పదప్రయోగంతో తెలుగుదనాన్ని ఆపాదించారు. శ్లేషలు ఉన్నచోట తెనిగించినప్పుడే ఏదో ఒక భావానికి పరిమితం కావడం అనివార్యమవుతుంది. పద్యంలోని ధార, పద్యం యొక్క నడక సంస్కృత శ్లోకానికి అనువాదం అనిపించకుండా, స్వతంత్ర పద్యం వలె రచన సాగించడం బూర్గుల వారి పద్య రచనా నైపుణ్యానికి నిదర్శనం.

మరో సంస్కృత శ్లోకం

రమే! పద్మే! లక్ష్మీ! ప్రణత జనకల్పద్రుమలతే!!
సుధాం బోధే: పుత్రి! త్రిదశనికరో పాస్తచరణే!
వరే నిత్యం మాతర్గుణమయి! పరబ్రహ్మమహిళే!
జగన్నాథస్యాకర్ణయ మృదులవర్ణావళి మిమామ్!!

తెలుగు అనువాదం

తెలుగు అనువాదం

కమలా! లక్ష్మి! పరా! సమాశ్రిత జగత్కల్ప ద్రుమాంతర్లతా
అమృతాంభోనిధి పుత్రికా! త్రిదశలోకారాధితాంఘ్రి ద్వయా
రమ! మన్మాత! గుణాత్మికా! శివా! పరబ్రహ్మాంగనా! చారువు
ర్ణము లాలింపుము రామకృష్ణుల జగన్నాథోక్తలక్ష్మీ స్తుతిన్

1956 ఆగష్టు మాసపత్రికలో బూర్గులవారు రచించిన ఆరు శ్లోకాలు ప్రకటింపబడ్డాయి. వాటిలో ఒక శ్లోకం.

యత్రయత్ర తవపాదపంకజం
తత్రతత్ర కమలాయతేధరా
యత్రయత్ర తవ మంద స్మితం
తత్ర తత్ర శరదిందు చంద్రికా

ఇవేకాకుండా శృంగేరి వారదా స్తుతి అనే రచన కూడ సంస్కృతంలోనే రచించిన బూర్గుల తన తొలినాటి కవితల(1917-21నాటివి) ను "నివేదన" పేరుతో వెలువరించారు.

"తొలిచుక్క" అనే పేరుతో కవితా సంకలనాన్ని వెలువరించారు. వీటిలో ఆధ్యాత్మికత కల్గిన కవితలు, సమకాలీన సామాజిక స్పృహ కల్గిన కవితలున్నాయి.

ఏమి మనస్సో హరి హరి
స్వామిని బదద్రోసి స్వారి సలిపెడి గుర్రం
బేమో యనిపించు వడి
కామితముల వెంటబడుట గాంచిన కృష్ణా!!

బూర్గుల వారు కృష్ణ శతకంలో చంచలమైన మనస్సును నియంత్రించుకొనవలసిన ప్రాధాన్యతను వివరించారు.

బూర్గుల రామకృష్ణారావు గారు "సారస్వత వ్యాస ముక్తావళి''ని వెలువరించారు. ఇందులో ఏడు వ్యాసాలున్నాయి. ఈ సారస్వత వ్యాస ముక్తావళి బూర్గుల వారి విమర్శనా పరిణతికి గీటురాయి. నండూరి ఎంకిపాటలలోని నవీనతను, భావ సౌకుమార్యాన్ని, జానపద గ్రామీణ ప్రణయాలాపనాన్ని, పురోగమన శీలాన్ని అభివర్ణించారు. శ్రీశ్రీ ఈ వ్యాసాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు.

కాకునూరు అప్పకవి స్వస్థలం మహబూబ్ నగర్ జిల్లాలోని కాకునూరు గ్రామమని, అప్పకవి తన లక్షణ గ్రంథాలలో, కావ్యాలలో పేర్కొన్న లేమామిడి, నిడదవెల్లి, బదినెంపల్లి, తొమ్మిదిరేకుల మొదలైన గ్రామాలన్నీ కాకునూరు పరిసర ప్రాంతాలలోనే ఉండడంగమనించదగ్గ విషయమనీ పేర్కొంటూ, అప్పకవి పాలమూరు జిల్లా వాసి అని సాధికారికంగా నిరూపించారు బూర్గులవారు.

రెడ్డిరాజుల కాలంలోనే సంస్కృతిని, నాటి సామాజిక పరిస్థితులను ఒక సాహిత్య వ్యాసంలో వివరించారు. ఈ వ్యాసాన్ని బూర్గుల 1947 సం॥7లో వ్రాశారు. ఆనాటికి సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్ర, మల్లంపల్లి సోమశేఖర శర్మ రెడ్డిరాజుల చరిత్రగానీ, రెడ్డి సంచికగాని వెలువడలేదు. బూర్గుల వారి పాండిత్య ప్రకర్షకు "సారస్వత వ్యాసముక్తావళి" లోని వ్యాసాలు సాక్షులుగా ప్రతిబింబిస్తున్నాయి.

బూర్గులవారు అనేక గ్రంథాలకు పీఠికలు కూడా వ్రాశారు. దాశరథి మహేంద్రోద్యమానికి, గాలిబ్ గీతాలకు, ఆత్మానందస్వామి మేఘసందేశానువాదానికి మొదలగు పదా గ్రంథాలకు పీఠికలు వ్రాశారు. చిలుకూరి పాపయ్య

శాస్త్రి రచించిన "శ్రీనాథుని కవితా సమీక్ష"కు బూర్గుల వారు పీఠిక వ్రాశారు. దీనిలో కవుల పట్ల విమర్శకులు అనుసరించవలసిన విధమెట్లుండవలెనో నిర్దేశించారు.

దానిలో "తాత్వికముగా యోచించినచో కవికిని సాహిత్యకారునిగా, అతని రచనలలో ప్రతిఫలించు ప్రధాన రసభావ సామగ్రి నాధారముగా గొనియతని వ్యక్తిగత జీవితమునకు సంబంధించిన ప్రవృత్తులనంట గట్టుటయత్యంత సాహసకార్యమేగాక, సాహితీ సమీక్ష యొక్క సిద్ధాంతములకు వ్యతిరేకమైన పద్దతినను సరించుట యగును. ఈ పద్దతి ప్రతిభాశాలురగు సాహిత్యోపాసకుల రచనా శిల్పమున కపార్థములు కల్పించుట కుపకరించునే గాని, వారి జీవిత చరిత్రముల యదార్థాంశముల నిదమత్థమని నిర్ణయించుటకు సరిపోదు ఇది అందరూ గమనించవలసినదే" అని పేర్కొన్నారు.

ముగింపు: 1900 నుండి 1950 సం॥ల మధ్య తెలంగాణ ప్రాంత సాహితీవేత్తగా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన బూర్గుల రామకృష్ణారావు గారు మహబూబ్‌నగర్ జిల్లాఓని బూర్గుల గ్రామంలో నరసింగరావు, రంగనాయకమ్మ దంపతులకు జన్మించారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా సేవలందించిన బూర్గుల వారు బహుముఖ ప్రజ్ఞాశాలి.

దివాకర్ల వారు బూర్గుల వారి సాహిత్య సేవను ప్రశంసిస్తూ..."రామకృష్ణారావు గారు నిరంతర రాజకీయ కార్యవ్యగ్రులయ్యు ఈ విధముగా సారస్వత సేవ గావించుట వారి సరస హృదయమునకును, భాషా సారస్వతాభిమానమునకును తార్కాణము" అని పలికిన మాటలు బూర్గుల వారి సాహిత్య కృషికి దర్పణం పడుతున్నాయి.

**ఆధారగ్రంథాలు**

1. సారస్వత వ్యాస ముక్తావళి డా॥బూర్గుల రామకృష్ణారావు
2. తొలిచుక్క డా॥బూర్గుల రామకృష్ణారావు.
3. పండితరాజ పంచామృతం డా॥బూర్గుల రామకృష్ణారావు.

* * *

BHAVAVEENA
Vol. 17, Issue. 2, February - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# Techniques in Reading

- **B. Rohini,** Research Scholar, Department of Foreign Languages &Linguistics, S.V.University, Tirupathi.

**Introduction :**

Reading is a complex "subjective procedure" of unraveling images so as to build or infer meaning. Reading is a method for language obtaining, correspondence and of sharing data and thoughts. The reason for reading likewise decides the proper way to deal with reading appreciation. A person who has to know whether he/she can stand to eat at a specific eatery needs to fathom the valuing data gave.

An individual reading verse for pleasure needs to perceive the words the writer utilizes and the manners, in which they are assembled, however does not have to recognize primary thought and supporting details. In any case, an individual utilizing a logical article to help a sentiment has to know the vocabulary that utilization, comprehend the realities and cause-impact groupings that are exhibited, and perceive thoughts that are introduced as speculations and givens.

Read extensively, Integrate data in the content with existing knowledge, Have an adaptable understanding style, contingent upon what they are reading, Are motivated,

**Rely on various aptitudes connecting :**

Perceptual preparing, phonemic handling, recall, Read for a reason; reading serves a functional Reading as a procedure. Reading is an intuitive procedure that goes on between the reader and the content, bringing about appreciation. The content presents letters, words, sentences and passages that encode meaning. The reader utilizes information, aptitudes and techniques to figure out what that significance is. Reader information, abilities and procedures incorporate. Linguistic skill capacity to perceive the components of the composing system; knowledge of vocabulary and how words are organized into sentences. Discourse capability information on talk markers and how they connect parts of the writings to one another.

Strategic ability the capacity to utilize top-down methodologies just as information on the language. Reading understanding is consequently substantially more than interpreting. Reading perception results when the reader knows which ability unraveling. Reading cognizance results when the reader knows which aptitude and procedures are proper for the kind of writings, and see how to apply them to achieve the understanding reason.

**Objectives and Techniques for Teaching Reading :**

Reading Process—It can build up student's familiarity with the reading procedure and reading techniques by requesting that students contemplate how they read in their local language.

- Allow students to rehearse the full collection of reading systems by utilizing understanding material.
- Students work on reading techniques in class in their reading assignments. It needs students to be aware of what they are doing while they complete understanding assignments.

Coordinating Reading Strategies-Instructors can assist their students with becoming increasingly successful readers by showing them how to utilize procedures previously, during and in the wake of reading.

Prior to Reading – plan for the understanding assignment. Set a reason ahead of time what to read for. Talk about if increasingly phonetic or foundation information is required.

During and in the wake of Reading- Verify predictions and check for erroneous estimates.

- Choose what is and is not imperative to comprehend.
- Rehash to check perception
- Request to help.
- In the wake of Reading- Evaluate appreciation and system use.
- Assess appreciation in a specific assignment or zone.
- Alter techniques if important
- Utilizing Authentic Material and Approach-

For students to create informative capability in reading, house and school work reading exercises must take after genuine life reading tasks that include significant correspondence.

The reading material must be true. It must be the sort of material that students will need and need to have the option to read when voyaging, concentrating abroad, or utilizing the language in different settings outside the class room.

As opposed to rearranging a book by changing its language , make it increasingly receptive by inspiring and current information in pre-understanding discourse, evaluating new vocabulary before reading and requesting that students perform assignments that are inside their capability, for example, skimming to get the principle thought or checking for explicit data, before they start serious reading.

The reading reason must be bonafide. Students must read for reasons that bode well and importance to them.

The reading approach should likewise be real. Students should read the content so that matches the understanding reason, the kind of content, and the manner in which individuals ordinarily read.

Methodologies for creating understanding aptitudes

Methodologies that can assist students with reading all the more rapidly and successfully incorporate….

**Previewing :**

Investigating titles, segment headings, and photograph subtitles to get a feeling of the structure and substance of an understanding choice.

**Predicting :**

Utilizing information on the topic to make expectations about substance and vocabulary and check understanding; utilizing information on the content kind and reason to make forecasts about talk structure; utilizing information about the writer to make forecasts about composing, vocabulary and substance.

**Skimming and checking :**

Utilizing a brisk overview of content to get the principle thought, distinguishing content structure, acclimate or question forecasts.

**Guessing from setting :**

Utilizing earlier information regarding the matter and the thoughts in the content as pieces of information to the implications of obscure words, as opposed to halting to find them.

**Paraphrasing :**

Halting toward the finish of an area to check understanding by repeating the data and thoughts in the content. Educators can enable students to realize when and how to utilize reading procedures in a few different ways.

By demonstrating the systems resoundingly, talking through the procedures of checking on, anticipating, skimming and filtering, and rewording. This shows students how the methodologies work and the amount they can think about content before they start to read word by word.

By permitting time in class for gathering and individual seeing and anticipating exercises as groundwork for in-class or out of class reading.

By utilizing cloze (fill in the spaces) activities to survey vocabulary things. This assists student with figuring out how to figure importance from setting.

By urging students to discuss what techniques they think will assist them with moving toward an understanding task, and afterward speaking in the wake of finding out about what methodologies they really utilized.

**Reading to Learn :**

Reading is a fundamental piece of language guidance at each level since it underpins learning in numerous manners.

**Reading to gain proficiency with the language** :

Reading material is language input. By giving students an assortment of materials to read, teachers provide multiple open doors for students to ingest vocabulary, punctuation, sentence structure and talk structure as they happen in legitimate settings.

**Reading for content data :**

Reading for content data in the language class room gives students both true understanding material and a bona fide reason for reading.

**Creating Reading Activities :**

A completely created reading movement bolsters students as readers through pre-reading, while at the same time reading, and post understanding exercises. Reading exercises that are intended to increment open skill ought to be achievement arranged and develop students trust in their understanding capacity.

Build the reading movement around a reason that has critical for the students to ensure student comprehend what the reason for reading is : to get the principle thought, get explicit data, see most or the entirety of the message, appreciate a story, or choose whether or not to understand more.

Use pre-reading exercises to get ready students for reading

The movement use during pre-reading may fill in as arrangement in a few different ways. During pre-reading you may:

Assess students experience information on the subject and etymological substance of the content. Give students the foundation information essential for cognizance of the content, or initiate the current information that the students have. Clarify any social data which might be important to appreciate the entry. Make students mindful of the sort of content they will read and the reason for reading. Provide open doors for gathering or collective work and for class dialog exercises.

**Test pre-understanding exercises :**

Using the title, captions, and divisions inside the content to foresee substance and association or arrangement of data. Looking at pictures, maps, charts or graph and their inscriptions, talking about the writers experience, composing style, and common points, skimming to discover the subject or primary thought and evoking related earlier information, reviewing vocabulary or linguistic structures, reading over the understanding inquiries to concentrate consideration on finding that data while reading, constructing semantic networks, doing guided practice with speculating significance from setting or checking.

**Utilizing Textbook Reading Activities :**

Numerous language course books stress item over procedure, giving practically no relevant data about the understanding choices or their writers, and scarcely any pre-understanding exercises. You can utilize the rules for creating reading exercises given here as beginning stages for assessing and adjusting course book understanding exercises. Utilize existing, or include your own, pre-understanding exercises and reading methodology rehearse as suitable for your student. Another issue with reading choices is that they have been adjusted to a foreordained reading level through change of vocabulary, punctuation, and sentence length. This makes them all the more promptly receptive, however it additionally implies that they are less bona fide and don't need students to apply the reading methodologies that they should use outside the class.

**Reading so anyone might hear :**

A student exhibition when reading resoundingly is certifiably not a dependable pointer of that student understanding capacity. A student who is superbly equipped for understanding a given book when reading it quietly with word acknowledgment and expressing capacity in the manner that reading so anyone might hear requires. Nonetheless, reading out loud can enable an instructor to evaluate whether a student "seeing" word endings and other syntactic highlights when reading. Request that the students read a sentence quietly at least multiple times, until alright with the substance .This system enable the students to process the content, and let you see the consequences of that handling.

**References :**

1) Allington, R. L. (2001). What really matters for struggling readers. New York: Longman
2) Buehl, D. (2001). Classroom strategies for interactive learning (2nd ed.). Newark, DE:International Reading Association
3) Durkin, D. (2004). Teaching them to read (6th ed.). Boston: Pearson.
4) Harvey, S., &Goudvis, A. (2000). Strategies that work: Teaching comprehension to enhanceunderstanding. Portland, ME: Stenhouse.
5) Krashen, S. (1993). The Power of Reading: Insights from the Research. Englewood, CO:Libraries Unlimited.

6) Miller, D. (2002). Reading with meaning. Portland, ME: Stenhouse.

7) Paris, S. How to teach and assess reading comprehension. Retrieved May 16, 2007, Website: http://www.ciera.org/library/presos/2004/csi/sparis.pdf.

8) Routman, R. (2002). Reading essentials: the specifics you need to teach reading well. Heinemann.

9) Swartz, S.L., et al. (2003). Guided reading and literacy centers. Carlsbad, CA: Dominie Press.

10) Wilhelm, J. D. (2001). Improving reading comprehension with think-aloud strategies. Jefferson City, MO: Scholastic Professional Books.

11) Wilhelm, J. D., Baker, T.N., & Hackett, J.D. (2001). Strategic reading: Guiding students tolifelong literacy 6-12. Portsmouth, NH: Boynton/Cook.

12) Wisconsin Department of Public Instruction (1989).Strategic Learning in the Content Areas.Madison, WI: Wisconsin Department of Public Instruction.

✿ ✿ ✿

భావవీణ

# BHAVA VEENA

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

Journal of Literary, Culture & Language Study

సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

February 2020


నన్నయ


తిక్కన


సోమనాథుడు


ఎర్రన


పోతన


శ్రీనాథుడు


శ్రీకృష్ణదేవరాయలు


నంది తిమ్మన


మొల్ల


కందుకూరి వీరేశలింగం


గురజాడ అప్పారావు


గిడుగు రామ్మూర్తి


అన్నమయ్య


బండారు అచ్చమాంబ


గుర్రం జాషువా


బోయి భీమన్న


యోగి వేమన


భద్రిరాజు కృష్ణమూర్తి


కాళోజీ నారాయణరావు


బిరుదురాజు రామరాజు


సి. నారాయణరెడ్డి


దేవులపల్లి కృష్ణశాస్త్రి


శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ)


రావూరి భరద్వాజ్


నేదనూరి గంగాధరం


విశ్వనాధ సత్యనారాయణ


దాశరథి కృష్ణమాచారి


రాయప్రోలు సుబ్బారావు

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.